
మిసిమి / RNI Regd.No.45042/90
Postal Regd.No.HQ/SD/191/2024-26
Date of Posting: On 29th & 30th Every Month
Date of Publication: 25.9.2025
Posting at BPC IV Patrika Channel, Nampally, Hyderabad - 500 001



విరిసిన విరులు

# మిసిమి

చింతనాత్మక సారస్వతం




మాసపత్రిక, అక్టోబర్, 2025 ₹ 50/-

ISSN 2454–4329



నీటిలో ఆటలు



దోసిట చినుకులు

# మిసిమి

మాసపత్రిక

సంపుటి 36 సంచిక 10

అక్టోబరు - 2025

సంస్థాపకులు : రవీంద్రనాథ్ ఆలపాటి

సంపాదకుడు : వల్లభనేని అశ్వినీకుమార్

Published by

**BAPANNA ALAPATI**

**1-1-60/5, R.T.C. 'X' Roads,**
**Hyderabad - 500 020.**
**Ph. 040-27645536.**

Editor: V. ASWINI KUMAR
**Ph: 994 951 6567**

**చందా వివరాలు:**

₹ 600/- (సంవత్సర చందా),
₹ 1200/- (రెండు సంవత్సరాలకు),
₹ 1800/- (మూడు సంవత్సరాలకు),

కార్యదర్శి : జి. ఉమాసుందరి
040-27645536

Scan QR to Pay
Misimi A Unit of Kalajyothi

PEER REVIEWED

LIBRARY OF CONGRESS
LCCN 91-903060

ISSN INTERNATIONAL STANDARD SERIAL NUMBER INTERNATIONAL CENTRE
ISSN 2454-4329

misimi90monthly@gmail.com // misimi_monthly@kalajyothi.com
www.misimimonthly.com
YouTube Silver jubilee celebrations of MISIMI Telugu Monthly

అట్టతో కలిపి 84 పేజీలు

# మిసిమి

## అక్టోబరు నెల సూచికలు...


అయ్యల గోపాలకృష్ణ


**మిసిమి** డైరి : అశ్వినికుమార్ ... 3
మాండలిక మాంత్రికుడు : యన్. విజయరాఘవ రెడ్డి ... 5
నాగరకత : వల్లభనేని అశ్వినికుమార్ ... 9
జీవన మకరందం : ఆస్కార్ వైల్డ్ ... 12
లలితసంగీత పరిమళం : డా. ఎమ్. పురుషోత్తమాచార్య ...13
భర్తృహరి : ఆచార్య పి. ఆర్. హరినాథ్ ...17
స్పందన : డా॥ షేఖ్ మహబూబ్ బాషా...18
హెన్రీ మూర్-20వ శతాబ్దపు మేటి శిల్పి : టి.వి. ప్రసాద్ ... 19
గాంధీ క్షేత్రం-మండలి వెంకట కృష్ణారావు : డా. సుందర్ కొంపల్లి ... 25
నీటి వనరుల సంరక్షణ-కవిత్వపాత్ర : డా. వై. సుభాషిణి, కె.అశ్విని ...31
రమణీయం నార్వేదేశం : డా. నిమ్మగడ్డ శేషగిరి రావు ... 37
చినుకులలో తడిసిన సృజన! : డా. షేక్ సలీం బాబు ... 44
ఒక్కడు-పాల్కురికి సోమన : ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ...47
చిన్ననాటి ఆట-పాటలు : జూకంటి జగన్నాథం ... 52
నిరంతర నాటక బాటసారి : బి.వి. అప్పారావు ... 54
రామాయణంలో పాయసం : డా. ఎ.బి. సాయిప్రసాద్ ... 56
అరుదైన ఆంగ్ల ఆచార్యులు : ఆచార్య గుజ్జు చెన్నారెడ్డి ... 59
అధ్యాపకుల నైతిక సూత్రావళి : ఎం.జె. మాణిక్యరావు, కె.వి. కోటిలింగం ... 61
వర్షవిన్యాస హేల : గడ్డం దేవీప్రసాద్ ... 64
జాతర : ఆచార్య తంగెడ కిషన్ రావు ... 65
తాళ్లపాక వారి రచనల-సామాజిక విశ్లేషణ : డా. కె. భాను నాయక్ ... 70
కథాహృదయం-ఖాళీసీసాలు : వి. రాజారామమోహనరావు ... 73
ఆటుపోట్లతో రాటుదేలిన కావేరి : డా. సగిలి సుధారాణి... 74
కాశీ కలైడోస్కోప్ : హర్షవర్ధన్ ... 76
మంచి పది పుస్తకాలు : సి.యస్.రాంబాబు ... 77
చదవండి : **మిసిమి** ... 78



ఎమ్.జె. మాణిక్య రావు



ఆస్కార్ వైల్డ్

### అట్టమీది బొమ్మలు



ఎక్కడ శాంతి


నీటిలో ఆటలు


దోసిట చినుకులు


విరిసిన విరులు

**సా**రస్వత పరిషత్‌లో ఆ సాయంత్రం శ్రీమతి సగిలి సుధారాణి గారి పుస్తకావిష్కరణ. సుధారాణి గారు – పరిశోధకురాలు – చాలా సీరియస్ రచయిత్రి – **మిసిమి**లో చరిత్ర – సమీప చరిత్ర వ్యాసాలు చాలానే రాశారు. ఆమె ఏ విషయాన్నయినా ఎంత సీరియస్‌గా తీసుకుంటారో ఆ సాయంత్రం వచ్చిన అతిథులను చూస్తేనే తెలుస్తుంది. విశ్రాంత ఐ.ఎ.ఎస్. ఆఫీసర్ – శ్రీ రమణాచారి – తెలుగు యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ శ్రీ వెలుదండ నిత్యానందరావు – ఈనాడు సంపాదకులు శ్రీ మానుకొండ నాగేశ్వర రావు వేదికపైన ఉంటే తెలంగాణ సాహిత్య అకాదమీ కార్యదర్శి శ్రీ బాలాచారి – ఆల్ ఇండియా రేడియో పూర్వ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీ సి.ఎస్. రాంబాబు ప్రభృతులు ఆహూతుల్లో ఉన్నారు. బైట చినుకులు మల్లెపూవుల్లా పడుతున్నాయి. పుస్తకావిష్కరణ సభలన్నీ ఒకేవిధంగా ఉంటాయి. అయితే అతిథులే భిన్నంగా ఉంటారు – సభను సుసంపన్నం చేస్తారు. **ప్రాచీన తెలుగు మార్గాన్వేషణ – పరిష్కరణ** పుస్తకాన్ని భారతీయ జనతాపార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. రామచంద్రరావు ఆవిష్కరించారు. ఈనాడు దినపత్రిక సంపాదకులు మానుకొండ నాగేశ్వర రావు మాట్లాడుతూ భాషను నాశనం చేస్తే ఒక జాతిని నిర్వీర్యం చేసినట్లే. ఒక జాతిలోని అనేక అంశాలను కట్టిపడేసే శక్తి భాషకు ఉంది. భాష సంస్కృతిని సమైక్యంగా, పటిష్టంగా ఉంచుతుంది కాబట్టి భాషను కాపాడుకోవాలి. జాతి చారిత్రక మూలాలను స్పృశించే ఇలాంటి పుస్తకాలు మనదగ్గర తప్పనిసరిగా ఉండాలి అన్నారు. డా. కె.వి. రమణాచారి అధ్యక్షోపన్యాసం చేస్తూ ఒక సంస్థ ఒక విశ్వవిద్యాలయం చేయాల్సిన పనిని ఒక్కరే చేయటం గొప్ప విశేషమని ప్రసంగాలన్నీ క్రోడీకరించి తప్పులు దిద్ది, అవసరమైనచోట పాదసూచికలు ఇచ్చి, ఒక విజ్ఞాన సర్వస్వంగా మలిచిన సుధారాణి విశిష్ట కృషిని ప్రశంసించారు. సుధారాణి గారు మాట్లాడుతూ సరస్వతి మహల్‌లో సంస్కృత లిపిలో రాసిన గ్రంథాలు వేలసంఖ్యలో ఉన్నాయి. వాటిని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం వెలికితీసి నిష్ణాతులైన పండితులతో గ్రంథ పరిష్కరణ చేసి ముద్రించగలిగితే అమూల్య సాహితీ సంపదను భావితరాలకు అందించగలమని అన్నారు. డా. శ్రీ రంగాచార్య, డా. చింతపల్లి వసుంధరా రెడ్డి మాట్లాడారు. సభా ప్రారంభానికి ముందు డా. మద్దాళి ఉషాగాయత్రి దర్శకత్వంలో **మా తెలుగు తల్లికి మల్లెపూదండ** కూచిపూడి నృత్యం ప్రదర్శించారు.



శ్రీమతి సగిలి సుధారాణి, రమణాచారి, నాగేశ్వరరావు ప్రభృతులు

రాంబాబు గారితో నేను వరండాలో కాలక్షేపం చేస్తుండగా సుబ్రహ్మణ్యం గారు (మిష్టర్ సుధారాణి) మా దగ్గరకు వచ్చారు. ఆయనతో సంభాషణ నవ్వులతో నిండిపోయింది. సుధారాణి గారి పరిశోధన కోసం అహెూరాత్రుల్లు వారు పడే యాతన మాకు ఏకరువు పెట్టారు. అక్కడే వారి అమ్మాయి లక్ష్మీ జోశ్యని పరిచయం చేశారు. ఆమె మెడిసిన్ పూర్తిచేసి హౌస్‌సర్జన్ చేస్తోంది. భరతనాట్యం కూడా నేర్చింది. త్వరలో రంగప్రవేశం చేస్తుందని చెప్పారు.

**ఆ**కాశవాణి పూర్వ అసిస్టెంట్ డైరెక్టర్ సి.యస్. రాంబాబు గారికి తెలుగు యూనివర్శిటి **కీర్తి పురస్కారం** ప్రకటించింది. ఆ సభకు వెళ్లాను. మధ్యాహ్నం 2.00 గం॥లకు మొదలయిన సభ 6.00 గం॥ల వరకు నడిచింది. మామిడి హరికృష్ణ చాలా ఉద్వేగపూరితమైన ఉపన్యాసం ఇచ్చారు. ఆలస్యంగా అయినా రాష్ట్ర విద్యాశాఖ అధికారిణి శ్రీమతి దేవసేన వచ్చి చాలా ఆత్మీయంగా తెలుగు భాష గురించి ఇప్పటి యువత ఎంత దూరమైపోతున్నారో బాధపడ్డారు. ఇలాంటి సభలు కాలేజీల్లోనో, హైస్కూల్లోను నిర్వహిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. అంతసేపు తెలుగు విశ్వవిద్యాలయం వి.సి. శ్రీ నిత్యానందరావు గారు 24 మందికి కీర్తి పురస్కారాలను అందజేసి, వారి గురించి చెప్పి, వారితో మాట్లాడించి సభను ఎంతో హుందాగా నిర్వహించారు. వారికి తోడుగా రిజిస్ట్రార్ హనుమంతరావు గారు ఉన్నారు.



శ్రీమతి దేవసేన

శ్రీ నిత్యానంద రావు

**సు**ధాకర్ రెడ్డి గారు ఇటీవలే తనువు చాలించారు. వారి చివరి చూపు కోసం మగ్దూమ్ భవన్ వెళ్లాను. విశ్రాంతిగా పూలనడుమ పవళించి వున్న ఆయన్ని చూడగానే ఒక్కసారిగా ఆయనతో గడిపిన సమయాలు గుర్తుకు వచ్చాయి. ఆశ్రమంలో అన్ని సమావేశాలకు తప్పనిసరిగా వచ్చేవారు, మాట్లాడేవారు కూడా. ఒక్క పొల్లుమాట కూడా వుండేది కాదు. రా – వచ్చి కూర్చో అని ఆప్యాయంగా పిలిచేవారు. నేను **మిసిమి** చదువుతాను అని వారు అంటుంటే ఆశ్చర్యపోయేవాడిని. ఇంత పెద్దవారు – ఎన్నో పోరాటాలు సాటి మానవుల కోసం చేసి అలసిపోకుండా – ఇంకా పుస్తకాలు చదువుతున్నారని అంటే, రచయితలే సమాజానికి మార్గదర్శకులు అని నా భుజం తట్టేవారు.



సురవరం సుధాకర్ రెడ్డి

ఆశ్రమానికి వచ్చినపుడు తప్పనిసరిగా నాతో సమయం గడిపేవారు. ఆయన గుప్పిటి వెచ్చదనం ఇప్పటికీ నాకు గుర్తుంది. నన్నెంతగానో ప్రేమించేవారు. ఆయన ఎక్కడ? నేనెవర్ని? ఈ బంధం ఇప్పటిది కాదనిపించేది! మాట్లాడేటపుడు ఆయన కళ్లు మెరుస్తుండేవి. ఆరోగ్యం బాగోక గత ఆర్నెల్లుగా ఆశ్రమానికి రాలేదు. నా మొద్దు బుర్రకి వెళ్లి చూడాలని తట్టలేదు. కాని ఇప్పుడు పార్థివ దేహాన్ని చూడటానికి వచ్చాను – గుండె గొంతులోకి వచ్చింది – అక్కడే నారాయణ గారు – పల్లా వెంకట రెడ్డి గారు – చెన్నకేశవరావు పలకరింపుతో కాస్త తేరుకున్నాను.

ఆయనకి నివాళి ఏవిధంగా అర్పించాలి?

*He loved me for no reason - I feel the warmth of his grip even now - Adios*

ఎన్నో పోరాటాలు సాటి మానవాళికోసం జరిపి అలిసిన ఆయనకు విశ్రాంతి–ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆశిద్దాం.

---

## కాబ్ కల్పన?

**ఎ**ప్పటిలాగానే ఆశ్రమం నుంచి కాబ్ పిలిచాను. కొత్త డార్క్ గ్రే డిజైర్ వచ్చింది. ఎప్పటిలాగానే ముందు సీటులో కూర్చుని పిన్ చెప్పాను – నమస్కారం అశ్వినిగారు అని వినిపించింది! వెనుకసీటులో ఎవ్వరైనా వున్నారా? ఆశ్చర్యపోవటం నావంతయింది. సారథి – ఆంజనేయులు ఆప్యాయంగా ఆహ్వానించాడు! 'కారు బాగుంది' అని మాట మార్చాను! అప్పుడు – మధ్యాహ్నం పన్నెండు గంటలవుతుంది. రద్దీ పల్చగానే వుంది. ఆంజనేయులు చాలా జాగ్రత్తగా కారు పోనిస్తూ – మిమ్మల్ని చూస్తుంటే – నాకు చాలా విషయాలు తెలుసుకోవాలని వుంది – అన్నాడు. 'నా గురించి కాకపోతే అడగ'మన్నాను నవ్వుతూ. 'సార్ ట్రంప్ గొడవ ఏమిటి సార్' అని మొదలు పెట్టాడు – రష్యన్ ఆయిల్, ఇసి గాస్ – చైనా స్నేహం – పాకిస్తాన్ దివాళా – ఆపరేషన్ సింధూర్, అన్నీ ఒక్కోటి అడుగుతున్నాడు. ఓపికగా, విపులంగా వివరించాను. చివరికి సార్ బ్రిక్స్ అంటే ఏమిటి సార్? బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌత్ ఆఫ్రికా అన్ని కలిపితే బ్రిక్స్ అవుతుంది. ఇప్పుడు బ్రిక్స్‌లో చాలా దేశాలు కలవటానికి సిద్ధంగా వున్నాయి. వీరిని గ్లోబల్ సౌత్ అనికూడా అంటారు! అయితే – ప్రపంచం మారిపోతోంది, ఇప్పుడు ఏకధృవ శక్తి అంటూ లేదు – ఇప్పుడు జరుగుతోంది **డీ కలోనైజేషన్** అని ప్రపంచానికి చాటింది భారతదేశం – ఇది 'మల్టీ పోలార్' అంటున్నారు. భారతదేశం, ఇటు రష్యాతో, యూరప్‌తో, సౌత్ అమెరికాతో, జపాన్‌తో – అమెరికాతో వ్యాపార సంబంధాలు కొనసాగిస్తోంది. ప్రపంచంలో అత్యధిక జనాభాతో ఒక సూపర్‌పవర్‌గా, మూడో ఆర్థిక శక్తిగా అభివృద్ధి చెందుతోంది!. దారిద్ర్యాన్ని పారద్రోలింది. ఆకలికి, అన్నానికి ఎవరూ అలమటించడంలేదు – ఈ విషయం ప్రపంచం అంతా గుర్తించింది – మన దురదృష్టం – మన దేశంలోని ప్రతికూల శక్తులు – ప్రతిపక్ష పార్టీలు – ఈ అభివృద్ధిని సహించలేకపోతున్నాయి అని అంటుండగా – ఆవాస హొటల్ లోపలికి వచ్చి ఆగాము – ఆంజనేయులు – సార్ 'నాలెడ్జ్ ఈజ్ పవర్' అన్నాడు – కాదు – 'ఇన్ఫర్మేషన్ ఈజ్ పవర్' ఈ కాలంలో అని ఫేర్ – రేటింగ్ రెండూ ఇచ్చి పంపాను!

ఇది కల్పన కాదు జరిగిందే.

## మాండలిక మాంత్రికుడు
# పులికంటి

**– యన్. విజయరాఘవ రెడ్డి**

**జూ**లై 30. తెలుగు సాహిత్య లోకంలో, ముఖ్యంగా రాయలసీమ మాండలికానికి వన్నె తెచ్చి, దాన్ని కావ్య గౌరవానికి అర్హమైన భాషగా నిరూపించిన రచయిత, బహుముఖ ప్రజ్ఞాశాలి పులికంటి కృష్ణారెడ్డి 94వ జయంతి. ఆయన కేవలం ఒక రచయిత కాదు, కళాకారుడు, సంపాదకుడు, ప్రచురణకర్త. అన్నిటికీ మించి, రాయలసీమ ఆత్మకు అక్షరాలా జీవం పోసిన ఆదర్శమూర్తి!

1931, జూలై 30న చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం, జక్కదోన గ్రామంలో పులికంటి గోవిందరెడ్డి, పాపమ్మ దంపతులకు ఒక నిరాడంబరమైన రైతు కుటుంబంలో జన్మించాడు కృష్ణారెడ్డి. జక్కదోనలో ప్రాథమిక విద్యనభ్యసించిన తర్వాత, ఉన్నత పాఠశాల విద్య కోసం తిరుపతిలోని తిరుపతి దేవస్థానం హిందూ ఉన్నత పాఠశాలలో (నేటి ఎస్వీ ఉన్నత పాఠశాల) చేరారు. అక్కడి నుండే ఆయనకు సాహిత్య, కళాభిరుచులు అంకురించాయి. ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో ఇంటర్మీడియట్ చదువుతుండగానే భారతీయ రైల్వేలో ఉద్యోగానికి ఎంపికవడం ఒక విశేషం. అయితే, సుమారు 13 సంవత్సరాల పాటు సాగిన ఈ ప్రభుత్వ ఉద్యోగ ప్రస్థానాన్ని, నాటకాలపై తనకున్న అకుంఠిత దీక్షతో, అపరిమితమైన మక్కువతో త్యాగం చేశారు. ఈ త్యాగమే ఆయనను పూర్తిస్థాయి కళాకారునిగా, అగ్రశ్రేణి రచయితగా రూపుదిద్దుకోవడానికి గట్టి పునాది వేసింది. నాటకాలు రాయడంలో, వేయడంలో గురువు నాగేశం స్ఫూర్తిని పొందగా, కవిత్వంలో ఓనమాలు నేర్పింది చేబ్రోలు సుబ్రహ్మణ్యశర్మ. ఈ సాహిత్య, కళా నేపథ్యాల కలయిక పులికంటి సాహితీ సౌధానికి పటిష్ఠమైన పునాది వేసింది. పులికంటి కృష్ణారెడ్డి కలం పట్టాడు అంటే సీమ పల్లెలు సజీవమయ్యేవి. బీడు భూముల్లోనూ జీవం తొణికిసలాడేది. కరవు నేలల్లోనూ ఆశల పచ్చదనం పరుచుకునేది. మట్టి వాసనలు గుబాళించేవి. ఆయన కలం నుండి సుమారు 200 కథలు జాలువారాయి. ఈ కథలు రాయలసీమ ప్రజల జీవన వ్యథల్ని, కష్టాలను, ఆకలిని, ఆశలను, ఆవేదనలను, వలసల కన్నీటి గాథలను నిష్కపటంగా, అత్యంత సహజసిద్ధంగా చిత్రించాయి.


పులికంటి కృష్ణారెడ్డి

వీరి మొదటి కథ 'గూడుకోసం గువ్వలు' 1961లో వెలువడింది. ఇది రాయలసీమ కథా సాహిత్యానికి ఒక నూతన అధ్యాయాన్ని తెరిచింది. ఆ తర్వాత 'అరచేతిలో గీత', 'తీయలేని కలుపు', 'మరుపురాని మా ఊరు' లాంటి ఎన్నో గొప్ప కథలను పులికంటి అందించారు.

**ఆయన కథా సంపుటాలు :** 1.గూడుకోసం గువ్వలు 2. పులికంటి కథలు 3.పులికంటి దళితకథలు 4.పులికంటి కథావాహిని 5.కోటిగాడు స్వతంత్రుడు. ఇలా పలు సంపుటాలుగా ప్రచురితమయ్యాయి. వీటిలో 14 ఉత్తమ కథలుగా ఎంపికై పులికంటి కథాశిల్పానికి, ఆయన భావ వైశాల్యానికి నిదర్శనంగా నిలిచాయి. వీటితో పాటు, 'మొక్కితే దేవుడు' అనే ఛందోబద్ధ పద్య కావ్యం, 1958లో రచించిన 'ఆదర్శం' నాటకం ఆయనకు మంచి పేరు తెచ్చాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశానుసారం 100కుపైగా బుర్రకథలు రాశారు. వీటిలో వయోజన విద్య, సారా నిషేధం, వన మహోత్సవాలు, కుటుంబ నియంత్రణ వంటి ఎన్నో సామాజికాంశాలు మనకు కనిపిస్తాయి, ఇవి ఆయన సమాజం పట్ల కలిగిన స్పృహను, బాధ్యతను చాటుతాయి. కృష్ణారెడ్డి తన కథల్లో 'బాశాలి' పాత్ర ద్వారా కుటుంబాన్ని తీర్చిదిద్దడంలో భార్య పాత్ర ఎంత ఉదాత్తంగా ఉంటుందో సున్నితంగా, వాస్తవికంగా వివరించారు. దళితులు సామాన్య జీవన స్రవంతికి దూరంగా ఉన్నారని తీవ్రంగా బాధపడేవారు. వారిని అక్కున చేర్చుకునే విధంగా, వారి మనోభావాలను ప్రతిబింబించేలా హృద్యమైన కథలు రాశారు. 'కోటిగాడు స్వతంత్రుడు', 'పులికంటి కథలు' వంటి సంపుటాలు ఈ కోవకు చెందినవే. రాయలసీమ భాషలోని మాధుర్యాన్ని, పలుకుబడులను రంగరించి 'గోయిందా గోయిందా' అనే విశిష్ట పుస్తకాన్ని కూడా రచించి, మాండలిక సాహిత్యానికి మరింత బలాన్ని చేకూర్చారు.

శ్రీ పులికంటి కృష్ణారెడ్డిగారు తెలుగు సాహిత్య లోకానికి అందించిన రచనలు కేవలం పుస్తకాలు కావు, అవి సమాజానికి దర్పణాలు, జీవితానికి మార్గదర్శకాలు. ఆయన ట్రేడ్‌మార్క్ పుస్తకాలుగా నిలిచిన 'ఆటవెలదుల తోట', 'గోయిందా! గోయిందా!!', మరియు 'నాలుగళ్ల మండపం' వంటివి ఆయన విశిష్టమైన సాహిత్య శైలికి, దార్శనికతకు నిలువెత్తు నిదర్శనాలు. ఈ రచనల అంతర్గత విషయాలను పరిశీలిస్తే, పులికంటివారి సాహిత్య ప్రక్రియ, ఆయన సమాజం పట్ల చూపిన నిబద్ధత స్పష్టంగా గోచరిస్తాయి.

**ఆటవెలదుల తోట :** ఇది తాత్వికతతో కూడిన ఒక పద్యకృతి. పులికంటిగారి 'ఆటవెలదుల తోట' కేవలం పద్య సంకలనం కాదు, అది జీవిత సత్యాలను తేటతెల్లం చేసే ఒక దార్శనిక గ్రంథం. ఈ అభినవ పద్యకృతి సుమారు ఐదు వందలకు పైగా ఆటవెలదులతో రూపుదిద్దుకుంది. ఇందులో కొన్ని పద్యాలు గతంలో 'భారతి' పత్రికలో ప్రచురితమై, అప్పట్లోనే పాఠకుల మన్ననలను పొందాయి.

ఈ శతకానికి "కంటి నలుసుర పులికంటి మాట" అనే వినూత్న మకుటాన్ని ఎంచుకోవడం కవి ఆలోచనలకు నిదర్శనం. కంట్లో నలుసు బాధను కలిగించినా, దాన్ని తీసివేసుకున్న తర్వాత కలిగే ప్రశాంతత, స్పష్టమైన దృష్టిని కవి ఇక్కడ పోల్చారు. జీవితం సుఖదుఃఖాల సమ్మేళనం. తరచుగా కష్టాలు, బాధలే ఎక్కువ. పులికంటిగారు తమ పద్యాల ద్వారా ఈ కష్టాలను గుర్తు చేయడం ద్వారా, అవి తాత్కాలికంగా బాధ కలిగించినప్పటికీ, వాటిని ఎలా ఎదుర్కోవాలో, అధిగమించాలో సూచిస్తారు. కష్టాలను అధిగమించినప్పుడు కలిగే ఆనందం మరింత గాఢమైనది, శాశ్వతమైనది. ఈ అంతర్గత ఆనందాన్ని, ప్రశాంతతను అందించడమే 'ఆటవెలదుల తోట' పరమార్థం.

నిత్య జీవితంలో మనకు ఎదురయ్యే నగ్న సత్యాలను అత్యంత నవ్యమైన రీతిలో, అవి నగ్నం కాని విధంగా పులికంటిగారు అందిస్తారు. ఆయన కవిత్వంలో వ్యక్తమయ్యే విషయాలు కొత్తవి కావు, పదిమందికీ తెలిసినవే. అయితే, ఈ పద్యాలను చదివినప్పుడు కానీ చాలామందికి అవి తమకు తెలిసిన విషయాలని స్ఫురణకు రావు. తెలిసిన విషయాలను రక్తి కట్టించేలా చెప్పడం అంత సులభం కాదు. కానీ పులికంటిగారు 86 శీర్షికల క్రింద 516 ఆటవెలదులను కూర్చి, ఒక తోటను రూపుదిద్దారు. ఈ పద్యాలు కేవలం కాలక్షేపానికే కాకుండా, సహృదయులైన పాఠకుల్లో సాంస్కృతిక సంస్కారాన్ని, వివేకాన్ని పెంపొందించేలా తీర్చిదిద్దబడ్డాయి. ఇది కేవలం పద్యాల సంకలనం కాకుండా, జీవితాన్ని అర్థం చేసుకోవడానికి, సవాళ్లను ఎదుర్కోవడానికి ఒక మార్గదర్శిగా నిలుస్తుంది.

**గోయిందా! గోయిందా!! :** శ్రీ పులికంటి కృష్ణారెడ్డిగారి 'గోయిందా! గోయిందా!!' కేవలం వ్యాస సంకలనం కాదు, అది సమాజంలోని రుగ్మతలను నిర్భయంగా ఎత్తిచూపుతూ, మార్పును ఆకాంక్షించే ఒక శక్తివంతమైన అక్షర పోరాటం. ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేయడంలో కాలమ్ రచనలు (ఫీచర్లు) కీలక పాత్ర పోషిస్తున్న నేటి సమాజంలో, ఈ సంకలనం ఒక ప్రత్యేకమైనది.

పులికంటి గారు తమ కలాన్ని రాయలసీమ కండగల మాండలికంలో ముంచి, పాఠకులకు కలకండల్లాంటి రచనలను అందించారు. ఇది ఆయనకు భాషపై ఉన్న పట్టును, ప్రాంతీయతను గౌరవించే తత్వాన్ని సూచిస్తుంది. సామాన్యంగా కనిపించే విషయాన్ని తీసుకొని, దానిపై తన భావ లహరిని పోనిచ్చి, సాహిత్య స్థాయికి చేర్చి, ప్రతి వాక్యాన్ని ఒక రసఖండంలా తీర్చిదిద్దడం పులికంటి వారి ప్రత్యేకత. అక్రమాన్ని చూసినప్పుడు ఆగ్రహం రావడం సహజం. అయితే, సమర్థుడైన రచయిత ఆ ఆగ్రహంతో ఆగకుండా, అక్షరాన్ని ఆయుధంగా వాడతాడని ఆయన రచనలు రుజువు చేస్తాయి.

ఈ పుస్తకంలో ఆయన దేవుడి పేరు చెప్పి పబ్బం గడుపుకునే పరాన్నభుక్కుల మీదా, ధర్మ జెండా పట్టుకొని అధర్మ కార్యాలు సాగించే అధికారుల మీదా నిర్మొహమాటంగా విరుచుకుపడతారు. 'గోయిందా! గోయిందా!!' అంటూ ఆయన సంధించిన అక్షర తూణీరాల్లో కేవలం ఆగ్రహం మాత్రమే కాదు, "అయ్యో! లోకం ఇలా అయిపోతుందే" అన్న అపారమైన ఆర్తి గుండెల్లో నిండుగా కనిపిస్తుంది. ఇది ఆయనకు సమాజం పట్ల ఉన్న నిబద్ధతను, ప్రేమను తెలియజేస్తుంది. ఈ పుస్తకం చదవడం మొదలుపెడితే చివరి పేజీ వరకు లేచే పని లేదంటే, అది పాఠకులను ఎంతగానో ఆకట్టుకుంటుందని, ఆలోచింపజేస్తుందని అర్థం చేసుకోవచ్చు. ఇది కేవలం ఒక పుస్తకం కాదు, అది సమాజానికి ఒక మేల్కొలుపు.

**నాలుగ్గాళ్ళ మండపం :** మాండలిక మాంత్రికుని మరో అద్భుత సృష్టి,ఒక సరికొత్త ప్రక్రియ 'నాలుగ్గాళ్ళ మండపం'.

పులికంటి కృష్ణారెడ్డి అంటే గుర్తొచ్చేది ఆయన అద్భుతమైన మాండలిక శైలి. ఆయనకు ముందు సీమ మాండలికం అంటే కేవలం గ్రామీణుల సంభాషణలకు మాత్రమే పరిమితం అన్న అపోహను ఆయన రచనలు సమూలంగా చెరిపేశాయి. మాండలికానికి సాహితీ గౌరవం కల్పించి, దానికి ఒక విశిష్ట స్థానాన్ని కట్టబెట్టారు. పులికంటి కృష్ణారెడ్డి రాసిన 200 కథానికలు ఒక ఎత్తయితే, ఆయన 'నాలుగ్గాళ్ళ మండపం' తెలుగు కథన ప్రక్రియలో ఒక వినూత్న ప్రయోగంగా, ఒక నూతన ప్రక్రియగా నిలిచింది. ఇది కథానికకు చెందకుండా, స్కెచ్‌లకు చెందకుండా రెండింటినీ మేళవించుకున్న ఒక ప్రత్యేకమైన, సంకర కథన ప్రక్రియ. ఈ ప్రక్రియకు పులికంటి 'నాలుగ్గాళ్ళ మండపం' ద్వారా స్థిరమైన రూపాన్ని, విశ్వసనీయతను సాధించి పెట్టారు.

'నాలుగ్గాళ్ళ మండపం' తిరుపతి రైల్వే స్టేషన్ దగ్గర ఉండే ఒక ప్రముఖ స్థలం. పులికంటి ఇంటికి కూతవేటు దూరంలో ఉండే ఈ ప్రదేశం ఆయనకు సాహిత్య సృష్టికి ఒక నిత్య ప్రేరణగా నిలిచింది. ప్రతిరోజూ ఉదయాన్నే దినకూలీలంతా అక్కడ పోగయి, కూలి కుదిరేదాకా లోకం విషయాలు మాట్లాడుకొని, తమ కష్టసుఖాలను పంచుకొని, కూలి దొరగ్గానే వెళ్ళిపోతారు. ఆ ముఖ్య స్థలాన్ని కార్యస్థానంగా చేసుకుని పులికంటి వర్తమాన సమాజ పరిణామాల మీద తనవైన వ్యాఖ్యానాలు చేస్తూ, చేయిస్తూ రాసిందే ఈ విశిష్టమైన 'నాలుగ్గాళ్ళ మండపం'. ఆంధ్రప్రభ దినపత్రికలో సంవత్సరం పాటు ప్రచురితమైన ఈ కాలం, సీమ మాండలికానికి పత్రికా సాహిత్యంలో ఒక మైలురాయిగా నిలిచి, పాఠకులను అమితంగా ఆకట్టుకుని, ఆయనకు విశేష ఆదరణను సంపాదించి పెట్టింది.

ఈ కథనాలలో విషయమంతా వర్తమానానికి సంబంధించినదే కాగా, విధానం మాత్రం స్వచ్ఛమైన జానపదం. 1978 ప్రాంతాల నుంచి 1995 ప్రాంతాల దాకా మన రాష్ట్రంలో, మన దేశంలో వచ్చిన పరిణామాలు, వాటిపట్ల రచయిత అభిప్రాయాలు స్వచ్ఛమైన చిత్తూరు జిల్లా జానపద భాషలో అత్యంత సహజంగా వ్యక్తం చెయ్యబడ్డాయి. కథనం తిరుపతి పట్టణానిదైనా, అందులోని విషయం మాత్రం చిత్తూరు జిల్లా గ్రామీణ రైతాంగ జీవితానికే అద్దం పడుతుంది. రచయిత భార్య, తల్లి, స్నేహితుడు అరుణాచలం, మరో మిత్రుడు ముత్తా రెడ్డెన్న– ఈ నాలుగు పాత్రలు, నాలుగు స్తంభాలుగా నడిచిన ప్రక్రియే 'నాలుగ్గాళ్ళ మండపం'. రచయిత అన్నిటా కనిపిస్తూ, తన ఆలోచనలను, అభిప్రాయాలను పాత్రల ద్వారా, వ్యాఖ్యానాల ద్వారా వ్యక్తం చేస్తారు. ఒకటిన్నర దశాబ్ది కాలంలో వచ్చిన ఆర్థిక, రాజకీయ పరిణామాల వ్యాఖ్యానాలుగా సాగిన 'నాలుగ్గాళ్ళ మండపం'లో పులికంటి భావజాలం, ఇష్టాయిష్టాలు, ఆయనకు తెలిసిన చరిత్ర అన్నీ స్వస్వరూపాలతో దర్శనమిస్తాయి.

"అసలీ రాయలసీమలో పుట్నోళ్ళే కర్మ చేసుకోని పుట్నోళ్ళేమో! చేసేదానికి సెగితుండాది. దున్నుకుండే దానికి జానడో, బెత్తెడో కయ్యలుండాయి. అయినా నీళ్ళేదుండాయి?"– ఇదీ రాయలసీమ ముఖచిత్రం మీద ఆయన వేసిన సూటి ప్రశ్న. 'నాలుగ్గాళ్ళ మండపమంతా' ఈ అంశాన్ని ఆవరించిన ఆర్థిక, సాంఘిక, రాజకీయ అంశాలతో వ్యాఖ్యానించ బడ్డాయి. "కాంగ్రెసోళ్ళ చేతుల్లో పెత్తనం ఉన్నపుడు ఎక్స్ పార్టీలోళ్ళు రాయలసీమో అని మొత్తుకుంటే కాంగ్రెసోళ్ళకు చీమకుటినట్టనిపించిందా? లేదు. ఇప్పుడు కాంగ్రెసోళ్ళూ సీమ, అయ్యో రామా! అంటూ కాకిశోకంగా అరస్తా ఉంటే ఇప్పుడూ పెత్తనం చెలాయిస్తా ఉండే తెలుగుదేశం వాళ్ళ చెవికెక్కతా ఉండాదా? లేదు ఎవుడు పెత్తనం చేసినా మనకు మాత్రం ఇత్తనాల గింజిలకు లాఠీయే గదా!" వంటి వ్యాఖ్యలు ఈ 'నాలుగ్గాళ్ళ మండపానికి' బలం. పాఠకులకు ఆసక్తినేగాక, లోతైన ఆలోచనల్ని కూడా కలిగించే వ్యాఖ్యలివి. పులికంటి తనకు వాదాలు, ఇజాలు తెలియవని చెప్పుకున్నా, ఆయనకు ఖచ్చితమైన రాజకీయ దృష్టి, సామాజిక అవగాహన ఉందని ఈ మండపం స్పష్టంగా తెలియజేస్తుంది.

పులికంటి కృష్ణారెడ్డి కేవలం రచయితగానే కాదు, ఒక గొప్ప రంగస్థల కళాకారునిగా, నటునిగా తెలుగు ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయారు. నాటకరచయితగా రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ వంటి దిగ్గజాల మెప్పు పొందారు. తిరుపతి లలిత కళా సమితి నాటికల పోటీలలో పలుమార్లు పాల్గొని బహుమతులు సాధించి, తమ నటనకు, నాటక రచనకు గుర్తింపు తెచ్చుకున్నారు. తెలుగు సినిమా రంగ ప్రముఖులు మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి వంటివారు ఆయన్ను నటనాగ్రేసరుడు అని కొనియాడారంటే ఆయన నటనా ప్రతిభ ఎంత గొప్పదో అర్థం చేసుకోవచ్చు.

ఆయన ఒక గొప్ప బుర్రకథ కళాకారుడు కూడా. కమ్మని గానంతో, చమత్కార వ్యాఖ్యానంతో సాగే ఆయన బుర్రకథలను విని మధురాంతకం రాజారాం వంటి ప్రసిద్ధులు సైతం పరవశించి పొగడ్తలతో ముంచెత్తారు. జాతీయ కవి సమ్మేళనాలలో తన కవితాగానంతో శ్రోతలను మంత్రముగ్ధుల్ని చేసేవారు. జానపద వాఙ్మయం మీద, నాటకరంగం మీద ఆయనకు అపారమైన పట్టు ఉండేది. ఆయన గొప్ప వక్త కూడా, తమ ప్రసంగాలతో జనంలో ఆలోచనలు రేకెత్తించేవారు.

సాహిత్య సేవకు అంకితమైన పులికంటి తిరుపతి కేంద్రంగా 'కామధేను' అనే సాహిత్య పత్రికను కొన్ని సంవత్సరాలు సంపాదకత్వం వహించి, విజయవంతంగా నడిపారు. పత్రిక నిర్వహణ కోసం సొంత ముద్రణాలయాన్ని స్థాపించి, ఆర్థికంగా కూడా తన నిబద్ధతను చాటుకున్నారు. ఈ పత్రిక ద్వారా ఎందరో వర్ధమాన కవులకు, రచయితలకు ప్రోత్సాహం అందించి, తెలుగు సాహిత్య లోకానికి గొప్ప సేవ చేశారు. ఆకాశవాణి, దూరదర్శన్ లలో ఆడిషన్ కమిటీ సభ్యుడిగా, సలహాదారునిగా కొంతకాలం వ్యవహరించి, కళారంగ ప్రగతికి తమ వంతు తోడ్పాటును అందించారు. ఆయన సాహితీ కృషికి ఎన్నో అవార్డులు, రివార్డులు, బిరుదులు వరించాయి. 'అగ్గిపుల్ల' నవలకు చక్రపాణి అవార్డు లభించింది. యువకళావాహిని వారి గోపీచంద్ అవార్డు లభించింది. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం 2005లో ఆయనకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసి సమున్నతంగా సత్కరించింది. ఇంకా జానపదకోకిల, ధర్మనిధి పురస్కారాలు వంటివి ఎన్నో ఆయన ప్రతిభకు నిదర్శనాలు.

ఆయన రచనలపై పరిశోధనలు చేసి నలుగురు పీహెచ్‌డీ, ముగ్గురు ఎంఫిల్ పట్టాలు పొందారంటే ఆయన సాహిత్య కృషి ఎంత లోతైనదో, ఎంత మందికి స్ఫూర్తినిచ్చిందో తెలుస్తుంది. పులికంటి తన సాహిత్య, కళారంగాల కృషికి మాత్రమే పరిమితం కాకుండా, ఇతరులను ప్రోత్సహించాలనే సదాశయంతో 'పులికంటి సాహితీ సత్కృతి' అనే సంస్థను స్థాపించి, ఏటా సాహిత్య, కళా రంగాలలో విశేష కృషి చేసిన వారిని సత్కరించి, కొత్త తరానికి మార్గదర్శనం చేశారు. ప్రముఖులపై వివిధ సందర్భాలలో ఆయన రాసిన వ్యాసాలను 'పులికంటి హృదయ చిత్రాలు' పేరుతో పుస్తకంగా తెచ్చారు, ఇవి ఆయనలోని మానవతావాదాన్ని, పరిశీలనా దృక్పథాన్ని చాటుతాయి. పులికంటి చిత్తూరు నుండి శ్రీకాకుళం వరకు ఏ వేదిక ఎక్కినా సగర్వంగా...తనకు తాను రాయలసీమ చిన్నోడు గా సంబోధించుకుంటూ వుంటాడు.

**"రాయలసీమ చిన్నోణ్ణి**
**రాళ్ళమద్దె బతికే వాణ్ణి**
**రాగాలే ఎరుగక పోయినా**
**అనురాగానికి అందేవాణ్ణి"**

అంటూ గొంతెత్తి పాడి అందరి మన్ననలను అందుకున్న ప్రతిభామూర్తి పులికంటి కృష్ణారెడ్డి. ఆయన తనను తాను వినమ్రంగా పరిచయం చేసుకున్నప్పుడు, సీమ ప్రజలంతా ఆయన్ని తమవాడిగా, తమ ఆత్మీయుడిగా గుండెల్లో పెట్టుకున్నారు. సీనియర్ పాత్రికేయులు, సంపాదకులు పొత్తూరి వెంకటేశ్వర రావు వంటి మహానుభావులు "రాయలసీమ రా.వి.శాస్త్రి" అని కితాబిచ్చారంటే ఆయన సాహిత్య ప్రభావం, సీమ ప్రజలపై ఆయన చూపిన అదృశ్య ప్రభావం ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు.

దాదాపు ఐదు దశాబ్దాల సుదీర్ఘ సాహిత్య జీవితం గల పులికంటి సహజ కథకుడు. తిరుపతిలో 2007 నవంబరులో జరిగిన తెలుగు భాషా బ్రహ్మోత్సవాలలో సన్మాన గ్రహీతల్లో ఆయన కూడా ఉన్నారు. అయితే, ఆ సన్మానాన్ని స్వీకరించక ముందే, 2007, నవంబర్ 19న పులికంటి కన్ను మూశారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన అక్షరాల రూపంలో, సీమ ప్రజల గుండెల్లో, తెలుగు సాహిత్య చరిత్రలో ఒక సజీవ ధృవతారగా, శాశ్వతంగా నిలిచి ఉంటారు.

ఆయన రాసిన ప్రతి కథ, పద్యం, పాట రాయలసీమ చరిత్రను, సంస్కృతిని, ఆత్మను చిరస్థాయిగా ప్రతిబింబిస్తాయి. ఈ సందర్భంగా, పులికంటి కృష్ణా రెడ్డి అపారమైన సాహితీ కృషిని, ఆయన చూపిన బాటను సగౌరవంగా స్మరించుకుంటూ, ఆయన స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించాలని ఆశిద్దాం. పులికంటి వారసత్వం తెలుగు సాహిత్యంలో ఒక శాశ్వత, స్ఫూర్తిదాయక అధ్యాయం.

**యన్. విజయరాఘవ రెడ్డి**
(ఆకాశవాణి పూర్వ ప్రయోక్త)
రచయిత (ఇంగ్లీష్ మరియు తెలుగు),
హైదరాబాద్, ఫోన్ : 9441239803

# నాగరకత

నాగరకత గురించి ఎంతో చర్చ-విశ్లేషణ ఇప్పటకే జరిగింది – ఈ భూమికలో వ్యక్తి దుఃఖానికి అసంతోషానికి ఇది కారణంగా ఎలా పరిణమించింది – ఇప్పుడు పరిశీలిద్దాం. ఇక్కడే కొన్ని మౌలికమైన విషయాలను ప్రస్తావించాలి.

ఇక్కడ ఒక్క విషయం ప్రస్తావించాలి.

యాపిల్ పడటం చూసి భూమికి ఆకర్షణశక్తి ఉందని న్యూటన్ గుర్తించాడంటారు. ఇది ఆకర్షణశక్తి ఎలా? భూమి ఎంత వేగంగా తిరుగుతోంది? మరి గ్రావిటల్ ఫోర్స్ వుండదా? అంటే తనమీద వున్న పదార్థాన్ని లాగుతోంది. ఆకర్షణ అనవచ్చునా? ఇది అన్ని గ్రహాలకు వాటి స్పిన్ బట్టి వుంటుంది. దాని గ్రావిటి దానిది. ఈ భూమి తిరగటం ఆగిపోతే మనం శూన్యంలోకి పడిపోతాం. ఇది వూహించటానికే భయంకరంగా వుంది – కాని నమ్మండి.

1. ఈ ప్రపంచంలో సమాజంలో అంతా రొటీన్, ఆవృత్తమే, తరాలు పుట్టడం, పెరగడం, చదవటం మళ్ళీ జీవనపోరాటం. ఇది ఎంత రొటీనో భావ సంఘర్షణ అంత జటిలిమైంది. దీనికి వేరే మార్గం లేదా? భావితరాలను ఈ ఆవృత్త భ్రమణంలో నుంచి విముక్తి చేయలేమా? ఇదంతా పరిణామక్రమంలోని కుట్రా? అందుకు ఒక ఆలోచన, ప్రణాళిక – ఒక ప్రయోగం ప్రారంభించగలమా?
2. మనం సుస్థిరంగా వున్నామా? ఈ తిరిగే గ్రహంలో మనం స్థిరంగా ఎలా వున్నాము? ఇది స్థిరతేనా విశ్వాంతరాళంలో వ్రేలాడే గోళంలో మన అస్తిత్వానికి స్థిరత్వానికి అర్థం ఏమిటి? ప్రపంచానికి నేల కనపడుతుందా?
3. **స్వేచ్ఛ – స్వాతంత్ర్యం :** దేని నుంచి స్వేచ్ఛ? ఒక్కసారి శూన్యంలోకి వెళ్ళి చూస్తే – భూమి మీద స్వేచ్ఛకు అర్థం వుంటుందా? అంటే మన నుంచి మనకు స్వేచ్ఛా? అదెలా సాధ్యం? "నిజంగా ఈ ప్రపంచం నుండి మనం బయట పడలేం. ఎప్పటికీ అందులోనే ఉంటాము" (హోనిబెక్). "మానవ జీవితానికి అర్థం ఏమిటి?" ఈ ప్రశ్నకు ఇంతవరకూ సమాధానం లేదు! ఎప్పటికైనా సమాధానం వస్తుందని ఆశ కూడా లేదు!

ఇవన్ని మౌలికమైనవి – నాగరకత పెట్టిన ఆంక్షల వలన వ్యక్తి స్వాతంత్ర్యం, సహజవాంఛల నియంత్రణ – అణచివేత – తద్వారా వ్యక్తి సుఖసంతోషాలకు అంతరాయం కలిగి సాంఘిక జీవనం దుఃఖాన్ని – బాధల్ని నిరాశా, నిస్పృహలను, అనేక – సమస్యలను తెచ్చి పెడుతుంది.

వ్యక్తి తన జీవితం నుంచి ఆశించేదేమిటి? స్పష్టంగా చెప్పాలంటే – సుఖం కోసం ప్రయత్నము – సంతోషంగా వుండాలని. అలాగే జీవితం గడపాలని కోరుకొంటాడు. కాని – నాగరకత వలన వచ్చిన ఆంక్షల మూలంగా అవి నెరవేరవు సరికదా జీవితం దుర్భరంగా దర్శనమిస్తుంది. సరిగ్గా ఈ దశలోనే – వ్యక్తి సహజ శక్తిని సృజనకు, సాహిత్యానికి, కళలకు, పరిశోధనలకు మళ్ళిస్తాడు. ఇలాగే మత విశ్వాసాలు – హింసా ప్రవృత్తులు కూడా తప్పనిసరిగా చోటుచేసుకుంటాయి. అంటే, హాయిగా, సుఖంగా జీవించాలనుకునే వ్యక్తి – నాగరకతా బంధాలలో సంక్లిష్ట ప్రవృత్తికి మళ్ళింపబడి అనేక సంవేదనలకు లోనవుతాడు.

ప్రపంచంలోని గొప్ప కవులు, చిత్రకారులు, శిల్పులు మొదలైన వారి కావ్యాలు, కళాఖాండాలు – శిల్పాకృతులు ఈ ఘర్షణలో నుంచి ఉద్భవించినవే! ఇవన్ని అతని సంవేదన స్వేద రూపాలే! ఇక్కడే మరొక్క విషయం ప్రస్తావిస్తాను. వ్యక్తి జీవితాభిరుచులు ఏవిధంగా వున్నా, సమాజంలో నాగరకతా కారణాల వలన అతని వృత్తికి గల ప్రాముఖ్యం మూలంగా, వాస్తవికతకు, అస్తిత్వానికి, సమాజంలో విలువకు ఇతర మానవీయ బంధాలను స్పష్టంగా నిర్వర్తిస్తుంది. దీని (వృత్తి – పోషణ) మూలంగా వ్యక్తి సమయంలో సింహభాగం ఖర్చుయిపోతుంది. అంటే అతనికి కావలసిన సంతోష మార్గ అన్వేషణకు సమయం కొరవడి, పని అంటే సహజమైన విముఖత్వం ఏర్పడి, మళ్ళీ సమాజానికి సమస్యలను సృష్టిస్తుంది. మనం ఇప్పుడు ఈ వృత్తంలోనే తిరుగుతున్నాం. నాగరకత – ఆంక్షలు, వ్యక్తి సుఖాన్వేషణ, వృత్తిపరమైన శృంఖలాలు – వ్యక్తి స్వాతంత్ర్య కాంక్ష – సామాజిక సంఘర్షణలు! ఇప్పుడు – తన సుఖసాధనకు వ్యక్తి తన ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి. అందరికి అన్వయింపగల ఉమ్మడి నియమం ఏదీ ఉండదు.

ఎవరికి వారు తమను తాము రక్షించుకోవలసిన పద్ధతులను ప్రణాళికలను వెతుక్కోవాలి. ఈ ఎంపికలే అతని

వ్యక్తిత్వాన్ని - విజయాలను, కీర్తిని నిర్దేశిస్తుంటాయి. సంపదలను, అధికారాన్ని పొందటానికి తమతమ (పైన చెప్పిన ప్రణాళికలను అనుసరించి) దారుల్లో అందరూ ప్రయత్నిస్తారు. అది పొందిన వ్యక్తులను చూసి ఇతరులు గొప్పగా చెప్పుకుంటారు. ఇక్కడే జీవితానికి వున్న అసలు విలువలను విస్మరిస్తారు. ఇది కూడా వ్యక్తి దుఃఖానికి ముఖ్య కారణం అవుతుంది. అధికారాన్ని సంపదలను చేజిక్కించుకొనే వారి సంఖ్య ఎప్పుడూ అల్పంగానే వుంటుంది - అలాగే కొద్దిమంది గొప్ప వ్యక్తులూ ఉంటారు. సామాన్య జనానికి వారి ఆదర్శాలు, వనరులు అందుబాటులో వుండవు. అవికూడా వారి అసంతోషానికి కారణాలు కావచ్చు!

**వ్యక్తికి బాధ కలిగించే మౌలికమైన అంశాలు :** శక్తివంతమైన ప్రకృతి! తన శరీర బలహీనత, సమాజంలోని సంబంధాల పరిమితులు! ప్రకృతిలో భాగమైన మన శరీరం, పర్యావరణ పరిస్థితులకు సర్దుబాటు ఎప్పటికీ చేసుకోలేము సంపూర్తిగా. కొన్ని వేల సంవత్సరాలుగా ఒక దారీ తెన్ను ఏర్పడి - వ్యక్తి బాధను కొంత వరకు తగ్గించ వీలయింది - లేక అలవాటయిందేమో! ముఖ్యంగా నాగరకత మూలంగా వ్యక్తికి ఎదురవుతున్న వేదన, దుఃఖాన్ని అంగీకరించటానికి సిద్ధంగా వుండలేం! అంటే మన కోసం, మనం చేసుకొన్న నియమాలు అందరికీ ఎందుకు అంగీకారం కావో అర్థం కాదు! అంటే మనిషి ప్రవృత్తికి - చింతనకు వ్యతిరేకంగా ఈ నియమాలు వుంటున్నాయన్నమాట! మరి దీనికి మార్గమేమిటి? ఇది చాలా విచిత్రమైన పరిస్థితి - మనం నాగరకత అని దేనిని అంటున్నామో, సరిగ్గా అదే మన దుఃఖానికి కారణంగా పరిణమిస్తోంది! అలాగే నాగరకతను ఏవిధంగా నిర్వచించినా, (మతం, దేశ సరిహద్దులు, స్థానిక చట్టాలు - పేదరికం) ఇన్ని బాధలకు మూల కారణాలైన వాటి నుండి వచ్చే ప్రమాదాలకు వ్యతిరేకంగా మన రక్షణకు వేటినైతే ఆశ్రయిస్తామో అవన్ని మళ్ళీ నాగరకతలో భాగం! అంటే రక్షణ కోసం శత్రువునే ఆశ్రయించవలసిన దుస్థితి!

పేదరికం నాగరకత మానస పుత్రిక కాదా! గత రెండు శతాబ్దాలలో మానవాళి సాధించిన సాంకేతిక ప్రగతి, ఊహించని రీతిలో ప్రకృతిని లొంగదీసినట్లు(?) ఆధిపత్యాన్ని ఆవిష్కరించింది! ఇది గర్వపడవలసిన విషయమే. దేశ కాలాలపై సాధించిన విజయాలు - మానవాళి ఆకాంక్షలను నెరవేర్చాయేమో గాని, వ్యక్తిపరంగా అతనికి ఆశించిన సుఖ సంతోషాలను అందించటంలో ఎంత వరకు సఫల మయ్యాయి? వ్యక్తిని దుఃఖం నుంచి ఎంత వరకు విముక్తిణ్ణి చేశాయి? ఇప్పుడు ప్రపంచ నాగరకత - సమాజ రూపం ఏమిటి? పోటీతత్వం - పని వత్తిడి, లైంగిక జీవితానికి విఘాతం, కుటుంబ సంబంధాల విచ్ఛిత్తి వివాహ వ్యవస్థ అస్తవ్యస్తం, రాజ్య ఘర్షణ - మత సంఘర్షణలు - చికిత్స లేని రోగాలు - చెప్పుకొంటూ పోతే చిట్టాకు అంతు లేదు - కాని, సుఖసంతోషాలు కరువై జీవితం కష్టతరమై మృత్యువునే విముక్తి కారిగా ఆశ్రయింప జేయటమా నేటి నాగరకత చేసిన మేలు? "బ్రతికి యుండిన బహు సుఖములు బడయ వచ్చు" అన్నా ఇప్పుడు దీర్ఘ కాలం బ్రతికి ఏమిటి సాధించేది? ప్రకృతి వలన ప్రయోజన కరమైన ప్రభావాలకు వ్యతిరేకం - విచ్ఛిన్నకరం గత శతాబ్దాలలో మానవాళి చేసిన ప్రగతి - ఇదేనా? అంటే - ఈనాటి నాగరకతలో మనం సంతోషదాయికంగా లేమనేది వాదించ వలసిన విషయం కాదు! ప్రకృతి నుంచి రక్షణకోసం నాగరకత నిర్మించినది గృహ సముదాయం-

కాని, మహాసౌధాలు, కోటలు, ఆకాశ హర్మ్యాలు అన్ని నివాసపరంగా రక్షణ కల్పిస్తున్నా, ఇవి మనిషి అభద్రతకు మూలస్తంభాలు! తల్లి గర్భం అతని మొదటి నివాసం - అక్కడే సుఖంగా సురక్షగా నిర్భీతిగా వుండేవాడు. వ్యక్తి స్వేచ్ఛను నాగరకత చాలా వరకు హరించింది. నాగరకత లేక ముందు - అది (స్వేచ్ఛ) ఎంతగానో వున్నది కాని - అప్పుడు దానికి విలువ ఏమి వున్నది? ఇప్పుడు నాగరకత విధించిన ఆంక్షలను - న్యాయశాస్త్రం నిర్దేశిస్తున్నది కూడా! ఇప్పుడు మానవాళి జరుపుతున్న పోరాటాలు ఎక్కువ భాగం వ్యక్తి స్వేచ్ఛ కోసమే! ఆది మానవుడు శ్రమలోనే సౌభాగ్యాన్ని వెతుక్కొన్నాడు - సాటి మానవుడు అతనికి తోటి వ్యక్తిగానే వున్నాడు గాని, పోటీ మనిషిగా కాదు - ఇప్పుడున్న - పోటీ పోరాటంలో ప్రతివాడూ ప్రక్కవాడికి శత్రువే! దీనికి వేరే మార్గం లేదా? ఇది అన్ని రకాల రుగ్మతలకు దారి తీయటం లేదా? వ్యక్తి ఎంత ప్రగతి చెందినా - విద్యా - విజ్ఞాన విషయంగా - నాగరకత ప్రభావంగానూ - ఒక మౌలిక విషయంలో - ఎటువంటి మార్పు లేదు. తన మల మూత్రాలను కాకుండా ఇతరుల మల మూత్రాలను మాత్రమే అసహ్యించుకొంటాడు! అంటే పరిశుభ్రత - నాగరకతలో ప్రధానాంశం! ఇది - దేశపరంగా - సమాజపరంగా - జాతిపరంగా కూడా పరిగణలోనికి తీసుకోవలసిన అంశం!

మరొక ముఖ్య అంశం – ప్రేమ! నాగరకతకు ప్రేమ పునాది వంటిది – అది స్త్రీ ద్వారానే జరిగింది – ఇది అలా ఎందుకు జరిగింది అని – విజ్ఞులైన పాఠకులకు నేను చెప్పవలసిన పనిలేదు – కాని మానవ జాతి ప్రత్యుత్పత్తికి లైంగికత తప్ప వేరే మార్గం ఇప్పటి వరకు లేదు కాబట్టి లైంగికతను నాగరకత అంగీకరిస్తుంది. ఇక్కడే స్త్రీ ప్రాముఖ్యత అవసరం. ప్రేమ పునాదిగా నాగరకత మరో పార్శ్వం ఆవిర్భవించింది. నిర్లక్ష్యం చెయ్యకూడని, తనకు జరుగుతున్న అన్యాయాన్ని ఎదిరించే ప్రక్రియలోనే స్త్రీ వాదానికి బీజం పడింది. అది నాగరకతా వ్యతిరేక జనితమే – దీనికి ప్రత్యామ్నాయ పరిష్కారం మళ్ళీ నాగరకత పరిధిలోనే వెదుక్కోవలసి వచ్చింది. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు, వ్యభిచారం, హింస, మతోన్మాదం, మనోవైకల్యం ఇవన్నీ నాగరకత ప్రసాదించిన వరాలు – శాపాలు! తన శాసనాలు – ఆంక్షల ప్రకారం శిక్షించవలసిన అనేక అతిక్రమణలను నిశ్శబ్దంగా అంగీకరిస్తూ నాగరకత – బలవంతులను – బలహీనులను తనతో తీసుకుపోవలసిన అగత్యం (పరిస్థితి) ఏర్పడింది. వ్యక్తి స్వేచ్ఛ కోసమే ధన సంపాదన, కీర్తి కండూతి.

**ఇప్పటి పరిస్థితి :** ప్రేమ, పెళ్లిళ్ళ సంబంధాలు – అన్ని ఉపయోగం, లాభదాయక ప్రక్రియ ప్రాతిపదికనే జరుగుతున్నాయి. నాగరకత – వస్తూత్పత్తి – అవసరానికి మించి వస్తు వినియోగం – వీటి వికృతి – ఇప్పటి నాగరకత స్వరూపం. అయినా వ్యక్తి దుఃఖాన్ని, స్వేచ్ఛను ఏవిధంగానూ పరిష్కరించలేదు. స్వేచ్ఛను హరిస్తూ – చట్టాల పరిధిలో ఇరికిస్తూ సరికొత్త కుళ్ళు రాజకీయ వ్యవస్థలో – వ్యక్తిని మట్టి బొమ్మను చేసి, ఉట్టి దండలు వేసి – ఊరేగించి తమ పబ్బం గడుపుకొంటున్న ఇప్పటి రాజకీయ రాక్షసులు నవ నాగరకతకు మూల స్థంభాలు! సామాన్యులు – వీరి ప్రయోజనాలకు సోపానాలు మాత్రమే! వాడుక భాషలో వ్యర్థ పదాలు ఉండవు. కావ్య భాషలోనే ఈ గుల్ల డొల్ల పద బంధాలు. కారణం అది వ్యక్తి సంవేదన – సంఘర్షణలోనుంచి పెల్లుబికినవి. ఈ సందర్భంలో ఎన్నో పదాలకు – అర్థాలు, అనర్థాలను చెప్పుకోవలసి వస్తున్నది, అది మరోసారి చూద్దాం!

**వల్లభనేని అశ్వినికుమార్**
రచయిత, సంపాదకుడు, **Literary Curator.**
హైదరాబాద్, ఫోన్ : 9885898585

## కమ్మతెమ్మెర

'**మిసిమి**' సంపాదక మహాశయా నమస్కారం!

తమిళనాట తెలుగు వారి సంస్థానం గురించి, వందల సంవత్సరాల క్రితం తెలుగు ప్రాంతాల నుండి ముస్లిమ్‌ల దండయాత్రల నుండి తప్పించుకోవడానికి గాని, నల్లభూములు ఉన్న చోటికి వ్యవసాయం నిమిత్తం వేలాది తెలుగు ప్రజ దక్షిణ భారతానికి ఇల్లొదిలి, ఆస్తిపాస్తులు వదిలి, ఇంతకంటే మంచిగా బ్రతకాలనుకొని వెళ్లిపోయిన చరిత్ర మన కళ్లముందు ఉంది. ఇదంతా ఏడువందల సంవత్సరల క్రితం మాట. ముఖ్యంగా రాజమహేంద్రవరం ప్రాంతం నుండి ఎంతోమంది వలసవెళ్లి అక్కడ జీవితాలు కొనసాగిస్తున్న తెలుగువారి గురించి ఎన్నెన్నో విషయాలు ఎంతో ఆత్మీయంగా – ఆర్తిగా 'బోడినాయకనూర్ సంస్థానం గురించి' అనే వ్యాసంలో చెప్పుకొచ్చారు. డా. సగిలి సుధారాణి గారు. తమిళనాట ఓ ఉపాధ్యాయిని తెలుగులో ఓ లాలిపాట వినిపించిన సందర్భంలో ఒళ్లు జలదరించింది. తమ మాతృభాష మీద మనవాళ్లకంత అభిమానం. మనం వారి నుండి చాలా విషయాలే నేర్చుకోవాలి. తెలుగు భాషను చదువుకోవాలన్న అక్కడ మనవారి ఆరాటం ఈనాటి ప్రభుత్వాల తలకెక్కదు. అందుకు అనేక కారణాలుంటాయి. బయట మేము తమిళ భాషలో మాట్లాడుకున్నా ఇంటిలో తెలుగువారమందరమూ తెలుగు భాషలోనే మాట్లాడుకుంటాము అన్న విషయం వాస్తవమే. నేను అలాంటి వ్యక్తులను, ఊళ్లను చాలా చూసాను. ఈ విషయం చెబుతున్నప్పుడు వారి మాతృ భాషాభిమానానికి నాకెంతో ముచ్చటేసింది. ఈ సంస్థానం గురించి చాలా రాయవచ్చు అని కొంచెం వాళ్ల ఆలోచనలలో వారి అంతరంగాన్ని సానుభూతితో వినండని మనవి చేస్తున్నాను. తమిళనాట ఉన్న తెలుగు సంస్థానాల గురించి, తెలుగు ప్రజల జీవన విధానం గురించి మరిన్ని రచనలు రావాలి. ఆ ప్రాంతంలో ఉన్న మనవారు అక్కడ జీవన విధానం గురించి కూడా రాయాలి. అలా రాయడానికి ఇబ్బందులేమీ లేవు కదా! ప్రవాస తెలుగు వారితో సంబంధ బాంధవ్యాలు పెరగాలన్నదే నా కోరిక. అందుకే ఇంత పెద్ద ఉత్తరం.




***– గుడిపూడి సుబ్బారావు***

# జీవన మకరందం

- మంచిగా వుండటమంటే – నీతో నువ్వు సామరస్యంగా వుండటమే!
- సౌందర్యం మేధావితనం కంటే గొప్పది. సౌందర్యానికి తాత్పర్య ప్రతిపదార్థాలు అవసరం లేదు!
- మంచిగా వుండటం కంటే అందంగా వుండటం మంచిది.
  కురూపిగా కనిపించటం కంటే మంచిగా వుండటం మంచిది!
- దేనినైనా నిర్వచించటం అంటే – దానిని కుదించటమేఁ!
- రొమాన్స్ పునరావృతంలోనే వుంటుంది. పునరావృతమే కళాసృష్టి!
- నీవు ప్రేమించిన దానికి అన్యాయం చేయకుండా వుండటం చాలా కష్టం!
- వ్యక్తిత్వంలోనుంచే కళాసృష్టి జరుగుతుంది. కళ ద్వారానే వ్యక్తి బహిర్గతమవుతాడు!
- ఆకర్షణను తప్పించుకోవటం కంటే లొంగిపోవటం తేలిక!
- కళాసృష్టి ద్వారానే నువ్వు పునీతమవుతావు. కళాసృష్టి ద్వారానే నీ అస్తిత్వవేదనలు సమసిపోతాయి!
- నేను కళాకారుణ్ణి! అయినా ఈ సమాజం నన్ను శిక్షిస్తున్నది – 30 ఏళ్లు ముందుగా పుట్టినందుకు!
- నా మేధను నా జీవనానికి ఉపయోగిస్తాను. నా నైపుణ్యాన్ని నా రచనకు ఉపయోగిస్తాను.
- ఏ కళాకారునికి న్యాయ, నైతికపరమైన సానుభూతి దొరకదు.
- కళాపరిధి – నైతికవృత్తం ఎంతో భిన్నమైనవి.
- కళాకారునికి ఏదీ నిషిద్ధం కానేరదు!
- జీవితం ఒక నాటకరంగం – అని అమ్మ నేర్పింది.
  నేను జీవితాన్ని పండగలా జరుపుకున్నాను!
- కళ వుద్దేశ్యం కళ ప్రస్ఫుటంగా వ్యక్తీకరించబడాలి!
  కళాకారుడు మరుగున వుండిపోవాలి.



- యౌవనం ఒక రంగుల కళ – అనుభూతుల సమాహారం కాదు!
- యువత నవ్వటానికి కారణాలు అవసరం లేదు. అదే వారి మనోహరమైన ఆకర్షణ!
- ప్రకృతి కళాసృష్టిని వెంబడిస్తుంది.
- ఏ కళాకారుడు – అనారోగి కానేరడు – అతడు తన కళతో ఏ సంవేదననైనా చూపగలడు!
- చిత్రకారునికి ఈ ప్రపంచం ఒక ప్రదర్శన!
  కవికి ఈ ప్రపంచం సంగీతం!

Oscar Wilde

– ఆస్కార్ వైల్డ్

# లలితసంగీత పరిమళం

## ప్రసిద్ధ లలితగీత విశ్లేషణ

– డా. ఎమ్. పురుషోత్తమాచార్య

**19. రామచరణం**

రచన : దేవులపల్లి కృష్ణశాస్త్రి
సంగీతం : పాలగుమ్మి విశ్వనాథం
గానం : శేషుబాయి, శాంతాచారి



**రాగమాలిక-మిశ్రచాపు**

**గౌరీమనోహరి**

రామచరణం రామచరణం
రామచరణం మాకు శరణం
మాకు చాలును మౌని మస్తక
భూషణం,శ్రీరామచరణం ॥రామ॥

**1. శుభాళి**

రాగయై ఈ బ్రతుకు చెడి రాయైన వేళల రామచరణం
మూగయై పెను ధూళి పడి మ్రోడైన వేళల రామచరణం
ప్రాణమీయగ రామచరణం, పటిమ నీయగ రామచరణం
మాకు చాలును జరయు, మరణం రాక ప్రోచే
రామచరణం ॥రామ॥

**2. జనరంజని**

కోతియై ఈ మనసు నిలకడ కోలుపోతే రామచరణం
సేతువై భవజలధితారణహేతువైతే రామచరణం
ఏడుగడ శ్రీరామచరణం, తోడుపడ శ్రీరామచరణం
మాకు చాలును ముక్తిసౌధప్రాంగణం శ్రీరామచరణం

**3. రంజని**

నావతో తానుండి మము నట్టేట నడిపే రామచరణం
త్రోవలో,కారడవిలో తోడ్తోన నడిచే రామచరణం
నావయైతే రామచరణం, త్రోవయైతే రామచరణం
మాకు చాలు వికుంఠమందిరతోరణం శ్రీరామచరణం
॥రామ॥

**4. బిలహరి**

దారువునకును రాజధూర్వహదర్పమిచ్చే రామచరణం
భీరువునకును అరి నెదిర్చే బీరమిచ్చే రామచరణం
ప్రభుతనిచ్చే రామ చరణం,అభయమిచ్చే రామచరణం
మాకు చాలు మహేంద్రవైభవకారణం శ్రీరామచరణం
॥రామ॥

దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు (1897-1980) ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపాలెంలో జన్మించారు. వీరు "అరుణరథం, బదరిక, బహుకాల దర్శనం, ధనుర్దాసు, మంగళకాహళి, అమృతవీణ, కృష్ణపక్షం, మేఘమాల, మహతి, ఊర్వశి" మొదలైన రచనలు చేశారు. "మల్లీశ్వరి, గోరింటాకు, నాయిల్లు, బంగారుపాప, ఏకవీర, భాగ్యరేఖ, రక్తకన్నీరు, భక్తతుకారాం" మొదలైన ఎన్నో సినిమాలకు పాటలు వ్రాశారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం నుండి 'కళాప్రపూర్ణ' బిరుదును పొందారు. 1976లో 'పద్మభూషణ్' పురస్కారం దక్కింది. తెలుగువారి చేత 'ఆంధ్రాషెల్లీ' అని సగౌరవంగా పిలిపించుకున్నారు. 1978లో సాహిత్య అకాడమీ పురస్కారం పొందారు. ఈ పాట 'అమృతవీణ' అనే గ్రంథం నుండి గ్రహించబడింది. ఆ పుస్తకంలో ఇది 115 వ పాట. ఈ పాట ఇప్పటికీ ఆకాశవాణివారి 'భక్తిరంజని' కార్యక్రమంలో వినిపిస్తూనే ఉంటుంది.

శ్రీరామపాదవైశిష్ట్యాన్ని ఈ పాట చక్కగా వర్ణిస్తున్నది. 'ఓ రామా! మాకేవో పెద్ద పెద్ద కోర్కెలు లేవు. కొన్నిటిని కనీసంగా లభింపజేస్తే ఆ మాత్రమే మాకు చాలు' అని నిరాడంబరధోరణిని ప్రదర్శిస్తూనే ఆ కోర్కెల వైనమేమిటో కవి ఎంతో గడుసుగా, సొగసుగా చెబుతున్నారు. "అంతే నాకు చాలు, తమ్మలపాకు తొడిమే పదివేలు" అనే జానపదగీతంలో కనిపించే లౌకికమైన గడుసు కోర్కెల్లాంటి వాటిని తాత్త్వికంగా, ఆధ్యాత్మికంగా సాగే ఆలోచనలుగా తీర్చిదిద్ది, ఇందులో చమత్కారంగా ప్రకటిస్తున్నారు.

మొదటి చరణంలో అహల్యావృత్తాంతాన్ని సూచిస్తూ ఆ మహాసాధ్వికి శ్రీరామచరణం ఎటువంటి కైవల్యాన్ని ప్రసాదించిందో చెబుతూ చివరలో ఆమెకు లాగానే జరామరణాలు లేకుండా దర్శించే రామచరణం చాలు అని కోరుతున్నారు. రెండో చరణంలో ఆంజనేయుని భక్తితత్త్వాన్ని విశ్లేషిస్తూ ఆ స్వామికి రామచరణం ఎలా జీవనోపాధియై తోడుపడిందో నిరూపించారు. అదేవిధంగా ముక్తిసౌధం అంతా అక్కర్లేదు, కాని, దాని ప్రాంగణంలో తిరిగే వీలు చిక్కితే మాత్రం చాలంటున్నారు. మూడో చరణంలో నావలో గంగను దాటించిన గుహుని కథను ప్రస్తావించారు. అందరిని దరిజేర్చే మారాజు,అద్దరిని జేర్చమని అడుగుతున్నాడని సంబరపడిన గుహుడు చేసుకున్న పుణ్యమేమిటో అని తర్కించుకుంటూ, ఆయనకు లాగానే వైకుంఠమందిరం అంతా అక్కర్లేదు, దానికి తోరణంగా వెలుగొందే మహద్భాగ్యం చాలంటున్నారు.

నాలుగో చరణంలో రాజదండానికున్న అధికారం, శక్తి ఎటువంటిదో వివరించారు. అచేతనమైన వస్తువుకు కూడా గొప్ప విలువను ప్రసాదించిన శ్రీరాముడు మాకు 'మహేంద్రవైభవం' లాంటిది ప్రసాదిస్తే చాలంటున్నారు.

ఏ చరణంలోనూ సంబంధిత వ్యక్తుల పేర్లను చెప్పకుండా వాటి ప్రతీకలను ఉపయోగిస్తూ చెప్పడం ఒక రచనా చమత్కృతి. ఇదే ప్రయోగం అన్నమయ్య కీర్తనల్లో ఎక్కువగా కనిపిస్తుంది.

**"పొలసు మేని వాడు, బోరవీపువాడు**

**సెలసు మోరవాడు శిన్నెకా" (శిరుతనవ్వులవాడె శిన్నెకా)** అంటూ ఆ మహానుభావుడు దశావతారాలను సూచించినాడు. పాటను మాత్రాచ్ఛందస్సును అనుసరిస్తూ దేవులపల్లివారు విలక్షణంగా, లక్షణబద్ధంగా రచించారు. 7 మాత్రల కాల ఆవృత్తాలలో మిశ్రగతిని ఖచ్చితంగా అనుసరించడం వల్ల స్వరపరిచేవారికి తాళంలో తడబాటు లేకుండాపోయింది. సాధారణంగా కృష్ణశాస్త్రిగారి ఎన్నో సినిమా పాటలు లయకు దొరక్కుండా సాగిపోయే లక్షణాలు గలవి. వాటిని తాళానికి ఒదిగేట్టుగా బాణీ చేయగల దిట్టలు కె.వి. మహదేవన్, ఎస్.రాజేశ్వరరావుగారలు అని కొందరు చెప్పుకుంటూ ఉంటారు. ఇక్కడ ఈ పాట మిశ్రగతిలో సాగడం వల్ల పాలగుమ్మి విశ్వనాథంగారు నడకను మార్చకుండా ఆ సౌలభ్యాన్ని సక్రమంగా ఉపయోగించుకున్నారు.

పల్లవిలో యతిప్రాసలకన్న 'చరణం, శరణం, భూషణం' అంటూ అంత్య ప్రాసకు ఎక్కువ ప్రాముఖ్యమిచ్చారు. చరణాల్లో కొన్ని తావులలో యతిని, మరికొన్ని చోట్లలో ప్రాసను అందంగా రూపొందించారు. 'బీరము' పదాన్ని వ్యర్థాలాపం అనే అర్థంలో కాక 'వీరము' కు వికృతిగా ప్రయోగించడం ఒక భాషావిశేషం. పుస్తకంలో ఈ పాట 10 చరణాలుగా కనిపిస్తుంది. వాటిలో చివరి రెండు చరణాలు వదిలేసి మిగతా 8 చరణాలను తీసుకుని బాణీ చేశారు. అయితే, రెండు చరణాలను కలిపి ఒక్కో చరణంగా మలచి నాలుగు చరణాల పాటగా పాలగుమ్మివారు స్థిరపరచారు. దీనిలో మూలరచనను ఎందుకో చిన్న సవరణలు చేసి పాడించారు.

1. 'మాకు చాలును జరయు, మృతి రానీక ప్రోచే' అని ఉండగా "జరయు, మరణం రాక ప్రోచే" అని, అర్థం మారకుండా మార్చారు. 2. చివరి చరణంలో 'అభయమిచ్చే రామచరణం, ప్రభుతనిచ్చే రామచరణం' అని ఉండగా క్రింది పాదాన్ని పైకి, పై పాదాన్ని క్రిందికి మార్చారు. భావం మారలేదు కనుక విచారించనక్కర్లేదు.

పాలగుమ్మి విశ్వనాథంగారు (1919–2012) తూర్పుగోదావరి జిల్లా తిరుపతిపురంలో జన్మించారు. కథాప్రపంచంలో పేరెన్నిక గన్న పద్మరాజుగారు వీరికి పెద్దన్నగారు. విశ్వనాథంగారు మర్ల సూర్యనారాయణగారి వద్ద సంగీత విద్యను అభ్యసించారు. తరువాత ఈమని శంకరశాస్త్రిగారికి మొట్టమొదటి శిష్యుడై గొప్ప వీణావిద్వాంసులుగా స్థిరపడ్డారు. వీరు సుమారు 15 వేల పాటలకు బాణీలు సమకూర్చడమే కాక,స్వయంగా నూరు దాకా పాటలు కూడా వ్రాశారు. మద్రాసు, విజయవాడ, హైద్రాబాదు ఆకాశవాణి కేంద్రాలలో సుదీర్ఘకాలం పనిచేశారు. 'మల్లీశ్వరి, పెద్దమనుషులు' మొదలైన సినిమాల్లో వీణ వాయించారు. అంతేకాక, 'చంద్రలేఖ, సంసార్, అవ్వయ్యార్, మంగమ్మశపథం' మొదలైన చిత్రాల్లో చిన్నచిన్న పాత్రలను ధరించారు కూడా. తెలుగు విశ్వవిద్యాలయంలో 'లలితసంగీతం' కోర్సును క్రొత్తగా ప్రవేశపెట్టారు. ఈ పాటను గానం చేసిన శేషూబాయి, శాంతాచారిగారలు శాస్త్రీయసంగీత కచేరీ రంగంలో ఎంతో ప్రసిద్ధి పొందిన గాయనీమణులు. ఇద్దరు కలిసి పాడినా ఒక్కరు పాడుతున్న మధురానుభూతిని కలిగించడం గమనించదగినది. ఈ పాటను పాలగుమ్మి విశ్వనాథంగారు అయిదు రాగాలలో రాగమాలికగా స్వరపరచారు. తానే వీణను వాయిస్తూ బిట్‌వర్కును రూపొందించారు. అందుకే నేపథ్యసంగీతంలో వీణ, మృదంగం మాత్రమే వినిపిస్తాయి. మృదంగకళాకారులెవరో తెలియవలసి ఉన్నది.

పాట ప్రారంభంలో గౌరీమనోహరి రాగసంచారాన్ని ఉదాత్తంగా వినిపిస్తూ 8 ఆవర్తాల వీణ బిట్టును సమకూర్చారు. ఆధారషడ్జమం దగ్గర వదిలేయగా పల్లవిని సమంలో ఆ స్వరం నుంచే గాయనులు ప్రారంభించారు. మొదటి రెండు పంక్తులను ఒకసారి పాడారు. అనుపల్లవిని రెండుసార్లు ఏ మార్పూ లేకుండా పాడుతూ 'మౌనిమస్తక' ను సాభిప్రాయంగా పై స్వరాలలో వినిపించారు. అయితే, సంగతి, బాణీల కోసం 'మాస్తక' అని పలకాల్సివచ్చింది. ఇది చాలా చిన్న విషయం. అనుపల్లవి పాడాక పల్లవిని ఒకసారి పాడి 'రామచరణం' దగ్గర వదిలేశారు. పల్లవిని పాడిన ఈ పద్ధతినే అన్ని చరణాల ముగింపుల్లోనూ అనుసరించారు. అన్ని చరణాలకు ముందు ఆయా రాగాలలో బిట్టును నాలుగు ఆవర్తాలుగా వినిపించారు.

మొదటి చరణాన్ని శుభపంతువరాళిరాగంలో బాణీ చేయగా బిట్‌వర్క్ ఆధారషడ్జమంలో ముగిసింది. 'రాగమై' ను పంచమం నుండి సమంలో ప్రారంభించారు. మొదటి పంక్తిని రెండు సార్లు ఏ మార్పు లేకుండా పాడిన తరువాత

రెండో పంక్తిని ఒక మాత్ర జాగా వదిలి ఎత్తుకున్నారు. తరువాతి పంక్తులను సమం నుండి ప్రారంభించి తారాస్థాయిలో ఎలుగెత్తి పాడారు. 'మాకు' దగ్గర చక్కని సంగతిని వినిపించారు. కాని 'మరణం' దగ్గర జాగా ఇవ్వడం వలన 'మాకు జరామరణాలే చాలును' అనే వ్యతిరేకార్థం స్ఫురిస్తున్నది. 'వాటిని రాకుండా రక్షించే రామచరణం మాకు చాలు' అనేది సరిగా అన్వయించడం జరగలేదు. మూలంలో ఉన్న 'మృతి రానీక ప్రోచే' అని పాడితే పైన చెప్పిన అవరోధం తొలగిపోయేది. కాని 'జరయు, మృతి రానీక' అనేది ఒకే పంక్తిలోకి కొనసాగింపుగా వస్తేనే రామచరణం విలువ ప్రకటింపబడేది. ఈ పదాలను అనవసరంగా మార్పు చేశారు. గానసౌలభ్యాన్ని చూసుకున్నారే కాని భావం దెబ్బతింటున్నదేమోనని గమనించలేదనిపిస్తున్నది.

రెండో చరణాన్ని జనరంజని రాగంలో బాణీ చేశారు. బిట్‌వర్కును షడ్జమం దగ్గర వదిలాక పంచమం నుండి 'కోతియై' ను ప్రారంభించారు. మొదటి రెండు పంక్తులను కలిపి రెండు సార్లు ఏ మార్పు లేక సమం నుంచి తీసుకుని పాడారు. 'కోలుపోతే. హేతువైతే' దగ్గర చిన్నపాటి గమకాన్ని అందంగా పాడారు. ఈ గమకం రాగలక్షణాన్ని చక్కగా ఆవిష్కరించింది. తరువాతి పాదాన్ని ఒక అక్షరం వదిలి ఎలుగెత్తి పాడుతూ ఒకసారి పాడి, చివరి పాదాన్ని సమంలో రెండుసార్లు పాడుతూ 'మాకు' దగ్గర మంచి గమకాన్ని వినిపించారు. మూడో చరణాన్ని రంజని రాగంలో బాణీ చేశారు. బిట్‌వర్క్ దైవతం దగ్గర వదలగానే 'నావలో తానుండి' ని కొంచెం విభిన్నశైలిలో రాగమర్యాద ప్రకారం దైవతం నుండి ప్రారంభించారు. మొదటి రెండు పాదాలనూ సమంలోనే పాడారు. మొదటి పంక్తిని ఒకసారి,తరువాతి పంక్తిని రెండు మార్లు మార్పు లేకుండా పాడారు. తరువాతి పాదాన్ని ఒక మాత్ర జాగా వదిలి ఎలుగెత్తి ఒక్కసారి పాడి చివరి పంక్తిని సమంలో రెండు సార్లు ఆలపించారు. 'తోరణం' దగ్గర రాగముద్రను రమ్యంగా వినిపిస్తూ పాడి చరణాన్ని ముగించారు. చివరి చరణాన్ని బిలహరి రాగంలో బాణీ చేశారు. బిట్వర్కును షడ్జమం మీద వదిలాక 'దారువునకును' ను ఒక మాత్ర జాగా వదిలి ఎత్తుకుని అన్నిటిని అదే ఎత్తుగడతో రెండు పాదాలనూ రెండు సార్లు పాడారు. తరువాతి పాదాన్ని ఒక మాత్ర జాగా వదిలి ఎలుగెత్తి ఒకసారి పాడుతూ 'రామ' ను మంచి గమకంతో పాడారు. చివరి పాదాన్ని సమంలో ఎత్తుకుని రెండు సార్లు పాడుతూ 'కారణం' దగ్గర రాగలక్షణయుక్తసంగతిని మనోహరంగా వినిపించి చరణాన్ని ముగించారు. తరువాత పల్లవిని సాధారణధోరణిలోనే పాడి పాటను ముగించారు.

### 20. కావేరి రంగ రంగా

**రచన : దేవులపల్లి కృష్ణశాస్త్రి**
**సంగీతం : పాలగుమ్మి విశ్వనాథం**
**గానం : కె.శేషూబాయి**



<u>**పీలూ-ఖండ ఏక**</u>

**కావేరి రంగ రంగా, నాయన్న**
**కస్తూరి రంగ రంగా**
**దేవేరి యైన నీతో మా మనవి**
**తెలిపి రక్షింపలేదా ॥కావే॥**

1. సగము పోయిన ప్రాణము నా స్వామి
   తగని దారుణ బాణము
   అడుగిడగనే నేరము నా తండ్రి
   అభయమిడి కాపాడును॥
2. వైకుంఠనగరి విడిచి
   లోకాల నెల్ల గడిచి
   నా కంటినీరు తుడిచి
   చల్లగా సాకగా ఇటు వస్తివే॥
3. ఏలాటి కరుణ నీది నా యన్న
   నీలాటి దైవమేది
   నాబోటి దీన ఏది నా తండ్రి
   ఈపాటికైన రావే ॥కావే॥

జానపదులు పాడుకునే పాటకు ఇది ఒక అనుసృజన గీతం. ఎత్తుగడ ఎలా ఉన్నా ప్రక్రియ మాత్రం ఒకటే.

"కస్తూరి రంగ రంగా నా యన్న
కావేటి రంగ రంగా
శ్రీరంగ రంగ రంగా నా యన్న
చిన్నారి రంగ రంగా" (కిన్నెరమెట్లు-పుట.92)

ఈ పాటలో లీలలను ప్రదర్శించిన భాగవత కృష్ణుని వైభవాన్ని వర్ణించారు. మరో పాటలో "శ్రీరంగ రంగ రంగా నిను బాసి ఎట్టు నే మరచుందురా" అంటూ కృష్ణావతార ఘట్టాన్ని సహజసుందరంగా వర్ణించారు. కాని దేవులపల్లి వారు ఈ రెండు పోకడలనూ కాదని విభిన్నవస్తువుతో ఈ పాటను రచించినారు. ఇందులో ప్రస్తావించిన దైవం శ్రీవేంకటేశ్వరుడుగా భావించవచ్చు. పాట ఎత్తుగడను వైవిధ్యంగా మలిచారు. జానపదగీతాల పాదాలను పైకి, క్రిందికి మార్చి 'కావేరి' తో ప్రారంభించారు.

మొదటి చరణంలో రామావతారంలోని కాకాసుర వృత్తాంతాన్ని సూచించారు. కాకి మీద వేసిన బాణం బ్రహ్మాస్త్రమై పూర్తిగా చంపక సగం ప్రాణం వంటి కన్నును పోగొట్టింది. రెండో చరణంలో వైకుంఠనగరాన్ని విడిచి

వచ్చి వకుళమాలికను ఓదార్చిన శ్రీనివాసుని వైనాన్ని ధ్వనింపజేశారు. మూడో చరణంలో వేంకటేశ్వరుని వంటి దైవం కాని, తన వంటి దీనురాలు కాని లేదని ఆ భక్తురాలు స్వామితో చమత్కారంగా సరిపోల్చుకున్నది.

'నా యన్న, నా తండ్రి' పదాలు ఆప్యాయతలను పుణికిపుచ్చుకున్న ప్రయోగాలు. ఈ రకమైన రచనారీతులు, గానవిధానాలు తల్లులు పిల్లల్ని నిద్రపుచ్చడానికి ఉపయోగించబడుతున్నాయి. తల్లులు బిడ్డల్ని ఉయ్యాలలోనో, కాళ్ళమీదనో పడుకోబెట్టుకుని ఇలాంటి పాటలు పాడడం ఒక సంప్రదాయం. పాట సాహిత్యం అర్థమయినా, కాకపోయినా గానం ఎలా ఉండాలి? పసిపిల్లల మెదడును ప్రశాంతపరచి, పారవశ్యంలోకి తీసుకువెళ్ళాలి. అందుకోసం ఆ పాటకు సమకూర్చే రాగం దోహదపడాలి. మన భారతీయ సంగీతశాస్త్రంలో ఒక భాగమైన 'నాదచికిత్స' (మ్యూజిక్ థెరపీ) చేసే పని ఇదే. ఈ కిటుకు జానపదులకు బాగా తెలుసు. అందుకని ఈ పాటలకు వారు ఏ బాణీని ఎలా ప్రయోగిస్తారో బాగా తెలుసుకున్న పాలగుమ్మి విశ్వనాథంగారు అదే బాణీని ఈ పాటకు అందంగా అమర్చారు. కవిగారు కూడా ఈ బాణీనే దృష్టిలో పెట్టుకుని పాటను రచించారు. ఈ బాణీలో ప్రధానంగా 'పీలూ' రాగం వినిపిస్తున్నది. అక్కడక్కడ పోకడలో 'ఆనందభైరవి' రాగం కూడా తొంగిచూస్తున్నది. "నీలాల కన్నుల్లో మెలమెల్లగా" (నాటకాలరాయుడు) అనే సినిమాపాట ఈ రాగంలోనిదే. ఈ పాట వింటున్నపుడు పిల్లలకే కాదు, ఎటువంటి పెద్దవాళ్ళకైనా నిద్ర పట్టేస్తుంది. ఇది సంగీతంలోని మహత్తు. స్వరకర్త 'కావేరి రంగ రంగ' పాటను అతి ప్రశాంతంగా, నిరాడంబరంగా వినిపించేటట్టుగా ప్రముఖగాయని శేషూబాయిగారితో పాడించారు. శేషూబాయి గారు (1936-2022) శ్రీకాకుళంలో జన్మించారు. తాతగారైన రామదాసు పంతులుగారి దగ్గర సంగీతాభ్యాసాన్ని ప్రారంభించారు. తరువాత తల్లి సత్యవతమ్మగారి దగ్గర కొంత నేర్చుకున్నారు. తరువాత నూకల చినసత్యనారాయణగారి దగ్గర సంగీతంలోని మెలకువలను, కచ్చేరీ విధానాన్ని, గానసంప్రదాయాన్ని అభ్యసించారు. హైద్రాబాదుకు వచ్చాక నేతి శ్రీరామశర్మగారి వద్ద ఎన్నో సంగీతపు మెలకువలు తెలుసుకుని ఆకాశవాణిలో ఎన్నో సుమధురగీతాలు ఆలపించారు. భద్రాచలం, విశాఖపట్నం, విజయనగరం మొదలైన చోట్లలో సంగీతకచేరీలు చేసి రసజ్ఞుల ప్రశంసలు పొందారు.

నిద్ర చెదురుతుందేమో అన్నంత జాగ్రత్తగా ఈ పాటలో లయవాద్యాన్ని చేర్చక సూటిగా, ఉదాత్తంగా పాలగుమ్మివారు ఈ పాటను పాడించారు. వయొలిన్‌ను మాత్రమే ఉపయోగించి స్వల్పమైన బిట్‌వర్కును సమకూర్చారు. వీణను శ్రుతి, లయల సూచన కోసం సూక్ష్మంగా వినిపించారు. పల్లవికి, చరణాలకు అన్నిటికీ ఒకే రకమైన బిట్‌వర్కును రూపొందించి 8 ఆవర్తాలలో వినిపిస్తూ షడ్జమం దగ్గర వదిలేశారు. పల్లవిని రెండు సార్లు పాడుతూ గాయని 'రంగా, నీతో' పదాల దగ్గర అందమైన సంగతిని వినిపించారు.

మొదటి చరణాన్ని షడ్జమం నుంచే 'సగరి' అనే స్వరాలలో సాభిప్రాయంగా ప్రారంభించి మొత్తం రెండుసార్లు పాడుతూ 'ప్రాణము, బాణము' పదాల దగ్గర మనోహరమైన అనుస్వరసౌందర్యాన్ని ప్రదర్శించారు.

రెండవ చరణం 'వైకుంఠనగరి' ఎత్తుగడను కొద్దిగా మార్చి 'సగగాగ గామ పామా' అనే స్వరాల్లో ప్రారంభించారు. చరణం మొత్తాన్ని రెండు సార్లు పాడుతూ 'విడిచి, కడచి' దగ్గర అంతరగాంధారాన్ని కంపితగమకంతో అందంగా పాడారు. ముఖ్యంగా 'నా కంటినీరు తుడిచి' పాడుతున్నప్పుడు శ్రోతల మనస్సు వెంటనే ద్రవించే ఆర్ద్రత వినిపిస్తుంది. 'తుడిచి' దగ్గర 'పమగరిసనీ' అనే స్వరసంపుటి ముగ్ధమనోహరంగా సాగింది. గాయని అనే తల్లి ఒడిలో మనమంతా పసి పాపలమైపోతాం. 'వస్తివే' దగ్గర కూడా మంచి గమకం పాడారు. ఈ రెండు చరణాలు పాడాక కూడా పల్లవిని పాడక బిట్‌వర్కుకు వదిలేయడం చాలా మనోహరంగా ఉంది. మూడో చరణాన్ని పల్లవి ఎత్తుగడ లాగానే 'సారిగరిసాస' అంటూ ప్రారంభించారు. చరణాన్ని రెండుసార్లు సాఫీగా,ఏ గమకాలూ లేకుండా హాయిగా పాడాక పల్లవిని ఒకసారి పాడి 'మా మనవి తెలిపి' పాదాన్ని రిపీట్ చేస్తూ పాటను ముగించారు. పాట రచనలో యతిప్రాసలను ఒకటి, రెండు చోట్ల తప్ప పాట అంతా స్వేచ్ఛగా నడిపించారు. 'ప్రాణము, బాణము; విడిచి, గడిచి, తుడిచి; నీది, ఏది' అనే సందర్భాలలో అందమైన అంత్యప్రాసలను చూపారు.

కావేరీనదీమధ్యస్థ నిలయుడైన శ్రీరంగనాథుడిని 'కావేరి రంగడు' అని ప్రేమగా పిలుచుకుంటారు. సరే.... మరి 'కస్తూరి రంగడు' ఏమిటి? ఆ దేవాలయంలో నిత్యమూ జరిగే షోడశోపచారపూజావిధులలో సుగంధద్రవ్యాలు విధిగా ఉండాలి. అందులో కస్తూరి అంటే ఆయనకు ఎక్కువ ఇష్టం కనుక కస్తూరి రంగడైనాడని పెద్దలు చెబుతూ ఉంటారు.

**డా. ఎమ్. పురుషోత్తమాచార్య**
*(జాతీయ పురస్కార గ్రహీత)*
సంగీత కళాశాల, పూర్వ ప్రిన్సిపాల్
నల్లగొండ. ఫోన్ : 939 661 1905.

# తిరుగులేని శక్తి

**– ఆచార్య పి. ఆర్. హరినాథ్**

విరామాలను ఆశించని వారినే విజయాలు వరిస్తాయి. శిఖరం చేరే దాకా శ్రమించిన వారే పర్వతాలపై పతాకాలను ఎగురవేస్తారు. మహా వ్యక్తుల జీవితాలలో మాటిమాటికి ఈ నిజం నిరూపితం అవుతూనే ఉంది. నాడైనా, నేడైనా, రేపైనా, ఏనాడైనా దీనికి తిరుగులేదు. భర్తృహరి ఒక పౌరాణిక దృష్టాంతాన్నిస్తున్నాడు.

**రత్నైర్మహాబ్ధే స్తుతుషుర్నదేవాః న భేజిరే భీమ విషేణ భీతిం**
**సుధాం వినాన ప్రయయుర్విరామం న నిశ్చితార్థాద్విరమంతి ధీరాః**

పాల సముద్రాన్ని చిలికేటప్పుడు ఎంత ప్రయత్నం సాగింది! మహా బలవంతులైన రాక్షసులు ఒకవైపు, మహిమాన్వితులైన దేవతలు ఒకవైపు నిలిచి సముద్రాన్నే చిలికారు. ఒక పాలకుండను చిలకడానికే పెద్ద కవ్వం కావాలి కదా, మరి ఒక సముద్రాన్ని చిలకడానికి ఎలాంటి కవ్వం కావాలి ! వేగాన్ని భరించేదిగా ఉండాలి. ఒత్తిడికి తట్టుకునేదిగా ఉండాలి. అటూ ఇటూ చిలుకుతుంటే ముక్కలైపోకుండా నిబ్బరంతో నిలబడేదిగా ఉండాలి. ముందుగా అలాంటి కవ్వం కావాలి. ఎక్కడుంది? వెతికి సాధించారు. మందర పర్వతాన్ని కవ్వంగా నిలిపారు. అంతటి కవ్వం – చిలకాలంటే దానిని కట్టడానికి ఎంత పెద్ద తాడు కావాలి! మామూలు తాడు చాలదు. బహుశా ప్రపంచంలో దాన్ని చుట్టేతాడు ఏదీ లేదు – ఒక మహాసర్పం వాసుకి తప్ప. భీతావహమైన సర్పాన్ని కొండకు చుట్టే తాడుగా తెచ్చారు. చిలుకుతుంటే కొండ సముద్రంలోకి జారిపోతుంది. అలా జారిపోకూడదు. దానికి ఒక పీఠం కావాలి. మథనంలో అటూ ఇటూ తిరిగే కొండను భరించే పీఠం ఎక్కడుంది? మహావిష్ణువు కూర్మంగా అవతరించి పీఠమై నిలిచాడు. ఇంత సంరంభంతో మొదలైన మహా కార్యక్రమం అది. ప్రచండ శక్తివంతులైన దేవదానవులు అప్పుడు చిలకడం మొదలుపెట్టారు. ముందుగా రత్నాలు వచ్చాయి. వచ్చిన రత్నాలు చాలులే దీనితో తృప్తి పడదాం అని అనుకోలేదు. మళ్లీ కొనసాగించారు. ఎన్నో అపూర్వ వస్తువులు, శక్తులు ఉద్భవించాయి. ప్రయత్నం ఆపలేదు. లోకాలను దగ్ధం చేస్తూ పొగలు ఎగసే భీషణ విషం పుట్టుకొచ్చింది. వారు భయపడలేదు. ప్రయత్నం మానలేదు. అమృతం దొరికేదాకా ఆగకూడదు – అని ఆశించారు. చివరికి అమృతాన్ని సాధించారు. ఒక విషయాన్ని సాధించాలని భావించిన ధీరులు వదిలి పెట్టకుండా కొనసాగిస్తారు.

**తనిసిరే వేల్పులుదధి రత్నముల చేతవెరచిరేఘోర కాకోల విషముచేత**
**విడిచిరే యత్నమమృతంబు వొడము దనుకనిశ్చితార్థంబు వదలరు నిపుణమతులు**

సంస్కృతకవి నిశ్చయార్థంలో రత్నాలతో దేవతలు తృప్తి చెందలేదు అన్నాడు. తెలుగులో కవి తృప్తి పడ్డారా అని వాక్యం మొదలుపెట్టారు. అలాగే తక్కిన క్రియా పదాలన్నింటిలోనూ ఆలోచనను రేకెత్తిస్తూ పఠితను మేల్కొలిపి – మీరే ఆలోచించండి దేవతలేమైనా తృప్తి పడ్డారా? మానేశారా? భయపడ్డారా? అన్నాడు. మనసును కదిలించి 'పట్టుదల ఉంటేనే కదా గొప్పవాళ్లుగా ప్రకాశిస్తారు' అని మనలో ఒక సత్యాన్ని దీపంలా వెలిగిస్తాడు కవి.

**ప్రారభ్యతే న ఖలు విఘ్న భయేన నీచైః**
**ప్రారభ్య విఘ్న విహతా విరమంతి మధ్యాః**
**విఘ్నైర్ముహుర్ముహు రపి ప్రతిహన్యమానాః**
**ప్రారబ్ధముత్తమ గుణా న పరిత్యజంతి**

ఈ పని జరగదేమో 'అన్న భయంతో–కొందరు అసలు పని మొదలుపెట్టరు. వీళ్లు అల్పులు. మరికొందరు ఏదో ఒక అడ్డంకి ఎదురు కాగానే ఇక వద్దులే అని పని మానేస్తారు. వీరు మధ్యములు. ఇంకొందరు మాటిమాటికి అడ్డంకులు ఎదురైనా కూడా వెనుకడుగు వేయరు. మడమ తిప్పని ధైర్యంతో అడుగు ముందుకే వేస్తారు, సాధిస్తారు. వీరు ఉత్తములు .

**ఆరంభింపరు నీచమానవులురు విఘ్నాయాస సంత్రస్తులై**
**ఆరంభించి పరిత్యజింతురురు విఘ్నాయత్తులై మధ్యముల్**
**ధీరుల్ విఘ్న నిహన్య మానులగుచున్ ధృత్యున్నతోత్సాహులై**
**ప్రారబ్ధార్థములుజ్జగించరు సుమీ ప్రజ్ఞా నిధుల్ గావునన్**

కవి అంటున్నాడు – ఒక మంచి పనిని ఆరంభించినప్పుడు ఆపవద్దు. దానికి అడ్డంకులు ఎదురు కావచ్చు. కానీ భయపడవద్దు. దేవతలు అమృత సాధనలు చూసి భయపడి ఆగిపోయారా? నిజమే మరి! సముద్రాలపై తుఫానులు రేగినప్పుడు దాన్ని చీల్చుకుంటూ ఓడ ముందుకెళ్తుంది. మనిషి కూడా అంతే. మనుగడలో కలవరం రేగితే కదలని చిత్తంతో నిలవాలి. మనోబలంతో గెలవాలి.

**ఆచార్య పి. ఆర్. హరినాథ్,**
ప్రొఫెసర్ ఆఫ్ తెలుగు, రీజనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్,
మైసూర్, ఫోన్ : 9480443108

# స్పందన

**– డా॥ షేక్ మహబూబ్ బాషా**

గౌరవనీయులైన '**మిసిమి**' ఎడిటర్ గారికి, నమస్కారములు. '**మిసిమి**'లో పెద్దవాళ్ళ (వయసురీత్యా, అనుభవం రీత్యా, జ్ఞానం రీత్యా) ఇంటర్వ్యూలు వరుసగా ప్రచురిస్తున్నందుకు ధన్యవాదములు. జ్ఞానదాయకమైన ఈ ఇంటర్వ్యూలు చదువుతుంటే చాలా సంతోషం కలుగుతోంది; మనసు పులకించడంతోపాటు బుద్ధీ వికసిస్తోంది. 2025 జూలై సంచికలో "జిజ్ఞాసమూర్తి" శీర్షికన వివిన మూర్తిగారి ఇంటర్వ్యూ (పు.37-44) చాలా చక్కగా, విజ్ఞానదాయకంగా వుంది. దీనికోసం పరిశ్రమించిన మీకూ, తన అభిప్రాయాలనూ, అనుభవాల్నీ మనసు విప్పి చెప్పిన మూర్తిగారికీ కృతజ్ఞతలు. ఈ 'సంభాషణ'లో స్త్రీల పత్రికలకు సంబంధించిన కొంత సమాచారం వుంది (పు.42-43); అది నన్ను విశేషంగా ఆకర్షించింది. అయితే, అందులో కొన్ని పొరపాట్లు దొర్లాయి. పాఠకులకు ఉపయోగపడుతుందన్న ఉద్దేశంతో వాటిని సరిచేసే ప్రయత్నంగా ఈ స్పందన రాస్తున్నాను.

మొదట మూర్తిగారు ప్రముఖంగా ప్రస్తావించిన 'హిందూ సుందరి'తో మొదలు పెడదాం. తెలుగు స్త్రీల సంపాదకత్వంలో వెలువడిన మొట్టమొదటి స్త్రీల పత్రిక అయిన 'హిందూ సుందరి' 1902వ సంవత్సరం ఏప్రిల్ నెలలో ప్రారంభమైంది; 1905లో కాదు. 1903 డిసెంబరు నుండే మొసలికంటి రమాబాయమ్మ, బాలాంత్రపు శేషమ్మలు సంపాదకులయ్యారు. పత్రికను స్థాపించిన సత్తిరాజు సీతారామయ్యకు మొదటినుంచీ ఒక స్త్రీనే సంపాదకురాలుగా నియమించాలని వుండేది. అందుకే, ఆయన భండారు అచ్చమాంబ, పులుగుర్త లక్ష్మీనరసమాంబ, మొసలికంటి రమాబాయమ్మ మొదలైన వారిని అభ్యర్థించారు. అయినా వాళ్ళెవరూ ముందుకు రాలేదు. ఆంధ్ర ప్రాంతానికి దూరంగా వుండడం వలన సంపాదకత్వ బాధ్యతను చేపట్టలేనని భండారు అచ్చమాంబ ఉత్తరం రాసింది. తనే సొంతంగా స్త్రీల పత్రికను ప్రారంభించాలను కోవడం వల్ల పులుగుర్త లక్ష్మీనరసమాంబ 'హిందూ సుందరి'కి సంపాదకురాలుగా వుండలేనంది. ఇక్కడ 'సావిత్రి' గూర్చి కొంచెం చెప్పుకోవాలి. ఈ మాసపత్రిక లక్ష్మీ నరసమాంబ సంపాదకత్వంలో 1904 జనవరి నుండి వెలువడనారంభించింది; 1919లో కాదు. 'సావిత్రి'ని ప్రారంభించబోతున్నానని లక్ష్మీ నరసమాంబ ప్రకటించినప్పట్నుంచీ సీతారామయ్యకు ఆమె పట్ల చీదరం కలిగింది; భయమూ పుట్టింది; ఎందుకంటే, ఆయన కాంటాక్ట్‌లో ఉన్న స్త్రీలందరినీ ఆమె తనవైపు మళ్ళించింది; మరీ దారుణంగా ఆయా స్త్రీల అడ్రసులన్నీ అతన్నే అడిగి తీసుకుంది! పత్రిక ప్రారంభిస్తున్నానని మాట వరసకైనా చెప్పలేదు. (మరి ఎవరికైనా మండదా!) జండర్ ఐడెంటిటీ వల్ల (సీతారామయ్య మాటల్లో: "స్వజాత్యభిమానము") స్త్రీలంతా తన పత్రికను వదిలేసి, అటువైపు మళ్లుతారని భయపడ్డ సీతారామయ్య త్వరపడి 1903 డిసెంబరులోనే మొసలికంటి రమాబాయమ్మ, బాలాంత్రపు శేషమ్మలను 'హిందూ సుందరి'కి సంపాదకురాల్లుగా యేర్పాటు చేశాడు. అట్లా 'సావిత్రి'కీ, 'హిందూ సుందరి'కీ మొదటి నుంచీ బొత్తిగా పొసిగేది కాదు; ఈర్ష్యాసూయలు ఆ కాలంలో కూడా అంత పెద్దయెత్తున వుండేవి మరి!

స్త్రీల పత్రికలకు పాఠకుల్లో "స్త్రీలు తక్కువగా ఉండేవారు" (పు.42) అన్న మూర్తిగారి అభిప్రాయంతో ఏకీభవించలేను. ఎందుకంటే, స్త్రీల పత్రికలకు మహిళా పాఠకులు చాలా పెద్ద సంఖ్యలో వుండేవాళ్ళు. వినడానికి విచిత్రంగా వున్నా, యిది వాస్తవం. ఒకరింటికి పత్రిక వస్తే, అది ఆ ఇంటికి మాత్రమే పరిమితమయ్యేది కాదు; చాలా చేతులు మారేది. అంతకన్నా ముఖ్యంగా, బ్రిటిష్ కాలం నాటి ఆంధ్రలో దాదాపు ప్రతి చిన్న పట్టణంలోనూ మహిళా సంఘాలు వుండేవి. అవి మహిళా సమావేశాల్ని తరచూ యేర్పాటు చేసేవి. అక్కడ "సద్గ్రంథ కాలక్షేపము" అనే కార్యక్రమం వుండేది. వాటిల్లో ఒక స్త్రీ పత్రికను చదువుతుంటే, సమావేశమైన వాళ్ళు వినేవాళ్ళు. నిరక్షరాస్యులైన స్త్రీలు కూడా యిలా "వినడం" ద్వారా పత్రికల్ని చదివేవాళ్ళు (దీన్నే నేను "Reading with Ears" అన్నాను). చాలా మహిళా సంఘాలకు లైబ్రరీలు వుండేవి. అక్కడ స్త్రీల పత్రికల పఠన కార్యక్రమం విస్తృతంగా సాగేది. ఇలా చెప్పుకోవాలంటే యింకా కొన్ని వున్నప్పటికీ, ఒకే ఒక్కటి చెప్పి, నా స్పందనను విరమిస్తాను. "అప్పటికింకా తెలుగు కథ రాలేదు": అంటే 1905లో సత్తిరాజు సీతారామయ్య 'హిందూ సుందరి'ని ప్రారంభించే నాటికి అని మూర్తిగారి అభిప్రాయం. కానీ, పందొమ్మిదవ శతాబ్ది చివరి దశకంలోనే తొలితరం భారతీయ స్త్రీవాది అయిన బండారు అచ్చమాంబ కథలు రాసింది. 'ప్రేమా పరీక్షణము' ఆమె రాసిన మొదటి కథ. అది 1898 జూలైలో ప్రముఖ సంఘ సంస్కర్త రాయసం వెంకటశివుడి సంపాదకత్వంలో వెలువడిన "తెలుగు జనానా"లో ప్రచురితమైంది (పు. 193-198). ఈ కథ గురజాడ అప్పారావు 'దిద్దుబాటు'కు ఏమాత్రం తగ్గనిది; చరిత్రపరంగా చెప్పాలంటే నాటి సమాజాన్నీ, వలసవాద ఆధునిక సంస్కృతినీ ప్రతిఫలించడంలో యింకా మెరుగైనది. తెలుగు స్త్రీల పత్రికలకు సంబంధించిన సమాచారం *Scripting a New Gender Politic : Telugu Women's Journals, 1883-1960* (Orient Black Swan, 2025) అనే పుస్తకంలో విస్తారంగా దొరుకుతుంది. ఏది ఏమైనప్పటికీ, చక్కటి 'సంభాషణ'ను చిక్కగా మనకందించిన '**మిసిమి**' సంపాదకులకు మరొక్కమారు హృదయపూర్వక ధన్యవాదములు.

**డా॥ షేక్ మహబూబ్ బాషా**
అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ హిస్టరీ
మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్శిటీ,
హైదరాబాద్,ఫోన్ : 91605 79705

# హెన్రీ మూర్

## 20వ శతాబ్దపు మేటి శిల్పి



హెన్రీ మూర్


**– టి.వి. ప్రసాద్**

డ్రాయింగు, పెయింటింగ్‌లకన్నా ప్రాచీనమైనది శిల్పకళ. శిల్పకళను గురించి తెలుసుకోవడం అంటే శిల్పులను గురించి తెలుసుకోవడమే. ప్రాచీన శిల్పులు తను కళకే ప్రాధాన్యత నిచ్చారు కానీ పేరు కోసం ఏమాత్రం తాపత్రయపడలేదు. అందుకే మనకు శిల్పకళ దక్కింది కానీ, శిల్పులు మాత్రం అజ్ఞాతంగా మిగిలిపోయారు. మన దేవాలయలన్నీ శిల్పసంపద నిలయాలే. రామప్ప,హళిబేడు, బేలూరు లేపాక్షి, ఎల్లోరా గుహలు, కైలాస దేవాలయం, మౌంట్ అబూలోని దిల్వారా జైన దేవాలయాలు, ఖజురహో శిల్పాలు ఒకవైపు, దేనికదే ప్రత్యేకత కలిగిన భారీ శిల్పాలు, గోమతేశ్వర (శ్రావణ బెళగొళ) విగ్రహం, గయ బుద్ధుని ధ్యాన విగ్రహం, కన్యాకుమారి తరువళ్వార్ విగ్రహం, ఇటీవలి కాలంలో వెలసిన సర్దార్ పటేల్ ఐక్యతా /సమతా విగ్రహం (ప్రపంచంలోనే ఎత్తైనది) మొదలైనవి ఎన్నెన్నో. వీటికితోడు కోటలు, కొండలు పర్వతాల్లో వెలసిన శిల్పాలు, ముస్లింల చేతిలో నాశన మైన శిల్పసంపద పోగా మిగిలి పోయినవి కోకొల్లలు. ప్రపంచ ఖ్యాతి గాంచిన శిల్పాల్లో స్ఫింక్స్, గ్రీకు దేవాలయ శిల్పాలు, చైనా స్ప్రింగ్ టెంపుల్‌లోని బుద్ధ విగ్రహం, న్యూయర్క్ స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ, రియోడిజనరోలోని 'రిడీమర్ క్రైస్ట్', ఇటలీలోని డేవిడ్ శిల్పం, రష్‌మోర్ మెమోరియల్ అమెరికా అధ్యక్షుల ముఖ శిల్పాల్లాంటివి మరెన్నో.

వైవిధ్యంతో, ఎవరికి వారే ప్రత్యేకతలు కలిగి అంతర్జాతీయంగా ఖ్యాతి గడించిన 20వ శతాబ్దపు పది మంది వివిధ దేశాల శిల్పుల్లో లూయిా బోర్జ్వా ఫ్రెంచి - అమెరికన్ శిల్ప భారీ పరిమాణంలో శిల్పసృష్టికి, శిల్పప్రతిష్టకు విరివిగా పెయింటింగులు వేయడం, ప్రింట్లు తయారు చేయడంలో నేర్పరి. అల్బర్టో జియాకామెటి సాగదీసిన స్త్రీ, పురుష రూపశిల్పాల్లో అనేక ప్రయోగాలు చేసిన స్విడ్జర్లాండ్ శిల్పి, కాన్‌స్టాంటిన్ బ్రాన్ కూజి ఆధునిక అమూర్త శిల్ప కళకు మార్గదర్శి. కొయ్యచెక్కడాలంటే మరీ యిష్టపడే ఇతని శిల్పాల్లో జానపద వాసనలుంటాయి. 20వ శతాబ్దపు మరో గొప్ప శిల్పి జెఫ్ కూన్స్. అందమైన పుష్పాలతో పప్పీ (iconic) శిల్పాన్ని సృష్టించిన ఐకానిక్ శిల్పి. వివాదాస్పద బెలూన్ డాగ్ లాంటి బహిరంగ కళాసృష్టికర్త (చూ. **మిసిమి** నవంబర్ 21, బహిరంగ కళ వ్యాసం). కంచుశిల్పాలకు పేరుగాంచిన బార్బరా హెప్‌వర్త్ ప్రముఖ ఇంగ్లీష్ శిల్పి. ఈమె ఆర్ట్ స్కూల్‌లో హెన్రీమూర్‌కు సహాధ్యాయి. అలగ్జాండ్రా డా కున్హా - బ్రెజిల్ డేవిడ్ స్మిత్- ఫ్రెంచి, వుకుసోవా వెలిమి రోవిక్ - తొలి సెర్బియన్ శిల్పి, మరియా ట్రూజిలో వంటి వారు ఎందరో! వీరందరిలో హెన్రీమూర్‌ది ప్రత్యేక స్థానం.

హెన్రీమూర్ ఇంగ్లండ్ యార్క్‌షైర్‌లో 1898లో జన్మించాడు. 1986లో హెర్ట్ ఫర్ట్ షైర్‌లో 88వ యేట మరణించాడు. ప్రపంచ వ్యాప్తంగా పేరుగాంచిన ఆంగ్ల శిల్పి, సేంద్రియ రూపాల్లో రాతి, కంచు, అమూర్త శిల్పాలను చెక్కడంలో 20వ శతాబ్దపు మేటికళాకారుడు. శిల్పకళలో సాంప్రదాయాన్ని పాటిస్తూ, మానవతను ప్రదర్శిస్తూ అర్ధనగ్నంగా విశ్రాంతి తీసుకుంటున్న స్త్రీభంగిమలో శిల్పాలను సృష్టించాడు. అవి ఎప్పటికీ నిలిచిపోయే కళాఖండాలుగా ప్రపంచ వ్యాప్తంగా ప్రముఖ మ్యూజియలలో, బహిరంగ కళాశిల్పాలుగా వ్యాపించి వున్నాయి. అవి చాలావరకు సెమీ ఆబ్‌స్ట్రాక్ట్ లక్షణాలను కలిగి ఉంటాయి.

ఉత్తర ఇంగ్లండులోని బొగ్గు గనులున్న లీడ్స్‌కు సమీప పట్టణంలో జన్మించాడు. తండ్రి హెన్రీ రేమండ్ మూర్ ఐరిష్ మూలాలున్న లింకన్‌షైర్, బొగ్గు గని కార్మికుడు, తల్లి ఇంగ్లండ్ మిడ్ లాండ్స్‌కు చెందిన మేరీబెకర్‌ల ఏడవ సంతానం. తండ్రి సమాజవాది, ట్రేడ్ యూనియన్‌లో పని చేశాడు. స్వయం కృషితో విద్య నేర్చు కున్నాడు. కాసిల్ ఫర్డ్ గ్రామర్ స్కూల్‌లో (1909–1915) స్కాలర్‌షిప్ మీద చదువుతున్న దశలోనే మూర్ ఆర్ట్ టీచర్ ఏలిస్ గోస్టిక్ అతణ్ణి ప్రోత్సహిస్తుంది. శిల్పి కావాలనుకున్నది హెన్రీమూర్ కోరికఐనా, తండ్రికి ఇతడిని స్కూల్ టీచర్‌గా చూడాలని కోరిక. అందుకని కొన్ని నెలల పాటు టీచర్‌గా ట్రెయినింగ్ చేస్తాడు. కానీ మొదటి ప్రపంచ యుద్ధం వల్ల ట్రెయినింగ్ వాయిదా పడుతుంది. 1917లో మూర్ బ్రిటిష్ సైన్యంలో చేరి, ఫ్రాన్స్‌లో బాంబ్ షెల్ గేస్ (gas) పడక జబ్బుపడడంతో వైద్యం కోసం ఇంగ్లండుకు పంపించబడతాడు. 1919లో పునరావాస గ్రాంట్ పొంది, ఆ డబ్బుతో లీడ్స్ ఆర్ట్స్ స్కూల్‌లో చేరతాడు. అక్కడ గడిపిన రెండు సంవత్సరాల్లో శిల్పకళా ఉపాధ్యాయులులేక మొదటి సంవత్సరం డ్రాయింగ్ నేర్చుకుంటాడు. రెండవ సంవత్సరంలో మూర్ ఒక్కడే శిల్పకళా విద్యార్థిగా కోర్స్ ప్రారంభమవుతుంది. ఆతర్వాత బార్బరా హెప్ వర్త్ చేరుతుంది. ఆమె కూడా భవిష్యత్తులో గొప్ప శిల్పిగా పేరు తెచ్చుకుంటుంది. మూర్ మేధోపరిధి క్రమంగా విస్తరించడం మొదలౌతుంది. లీడ్స్ విశ్వవిద్యాలయ ఉపకులపతి వ్యక్తిగత సేకరణను చూసిన మూర్ ఆధునిక చిత్ర శిల్పకళలపట్ల ఆకర్షితుడౌతాడు. రెండవ సంవత్సరపు ముగింపులో శిల్పకళా పరీక్షలో ఉత్తర్ణుడైన తర్వాత రాయల్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్‌లో చదువుకోవడానికి స్కాలర్‌షిప్ పొందుతాడు. 1921లో లండన్ చేరి శిల్ప కళలో మూడు సంవత్సరాల ఉన్నత విద్యను ప్రారంభించి రెండు సంవత్సరాల తర్వాత శిల్పకళలో డిప్లమా తీసుకుంటాడు. మూడవ సంవత్సరం స్నాతకోత్తర కార్యక్రమాల్లో పాల్గొంటారు. అప్పుడే మూర్‌కు విలియం రోథర్ స్టైయిన్‌తో పరిచయం ఏర్పడుతుంది.



తల్లీ బిడ్డ శిల్పం

విలియం మంచి స్నేహితుడిగా మూర్‌కు జీవితాంతం మద్దతుదారుగా ఉండిపోతాడు. అతడు ఆధునిక కళాత్మక ధోరణుల పట్ల అయిష్టత చూపకపోయినా, సాంప్రదాయ వాదిగానే ఉండిపోతాడు. మూర్‌కు లండన్ మ్యూజియం లోని కళాకృతుల్ని అధ్యయనం చేసే అవకాశం కంటే రాయల్ కాలేజీ ఆఫ్ ఆర్ట్స్‌లో చెప్పే పాఠాలు అంత విలువైనవి కావన్న భావన ఉండేది. అందుబాటులో వున్న బ్రిటిష్ మ్యూజయంలో విస్తృత శ్రేణి పురాతన శిల్పసేకరణ, విక్టోరియా అల్బర్ట్ మ్యూజియంలోని ఆగస్టీ రాడిన్ ఉత్తమ శిల్పసేకరణలను అధ్యయనం చేస్తాడు. ఐనా మూర్ అప్పటికే యూరోపియన్ శిల్ప సాంప్రదాయానికి వ్యతిరేకంగా స్పందించి ఆదిమ, పురాతన శిల్పకళవైపు మొగ్గుచూపుతాడు. ఐరోపా, ఇట్రిస్కన్ శిల్పకళ అనంతర కాలంలో కొలంబియన్ పూర్వ, ఆఫ్రికన్ కళాశక్తిని, సౌందర్యాన్ని స్వయంగా తెలుసుకుంటాడు.

రాయల్ కాలేజీ నుండి 1924లో విజయవంతంగా డిగ్రీ తీసుకోగానే శిల్పకళాబోధకునిగా ఏడు సంవత్సరాలు పనిచేసే ఒప్పందంతో పార్ట్ టైం ఉద్యోగంలో చేరతాడు. హెన్రీమోర్ అసాధారణ ప్రతిభ, సమర్థతలు అతని సన్నిహితులకు ముందే తెలుసు. అతని ప్రతిభకు గుర్తింపుగా పర్యటనా స్కాలర్‌షిప్ పొందుతాడు. మొదటి ఆరు నెలలు ఫ్రాన్స్, ఇటలీల్లో గడిపి వివిధ రకాల శిల్పాలను అధ్యయనం చేస్తాడు. ఇంగ్లండ్ తిరిగి వచ్చిన తర్వాత 1926లో విశ్రాంతిగా పడుకుని వున్న స్త్రీ శిల్పాలు చెక్కడం మొదలు పెడ్తాడు. అనంత వైవిధ్యం కలిగిన రాతి శిల్పాలు, ముఖ్యంగా సగం కన్పించే ఆడవారి శిల్పాలు, తల్లీ బిడ్డల శిల్పాలు, మాస్కులు, కేవలం తలల్ని మాత్రమే చూపే శిల్పాలు సృష్టిస్తాడు.

కొన్ని శిల్పాల్లో క్యూబిజం ఛాయలు కన్పించినా వాటిలో ప్రాచీన మెక్సికన్ రాతిశిల్పాల ప్రభావం మిక్కిలిగా కనిపిస్తుంది. పారిస్ ట్రోకడెరో మ్యూజియంలో మేయన్ వర్ష దేవత శిల్పాన్ని చూస్తాడు. అందులో పురుషుడు మోకాళ్ళ దగ్గరగా ముడుచుకుని, పొట్ట మీద నివేదన పళ్ళెం లాంటి పాత్రను చేత్తో పట్టుకుని ఎటో చూస్తూ పడుకుని ఉండడాన్ని చూసి ఆ శిల్ప నిర్మాణ చాతుర్యానికి ముగ్ధుడౌతాడు. దానిలోని సున్నిత, శక్తివంతమైన మూడు తలాల (త్రిడి) లోతుకూ, ఇంకే శిల్పంలోనూ చూడని మౌలికతకూ, నూతనత్వానికీ ఆకర్షితుడౌతాడు. అందమైన శిల్పకళా సాంప్రదాయక ప్రమాణాలను తోసి రాజని తన

సొంత శైలీ లక్షణాలతో మెక్సికన్ పురుషుని ఆకారాన్ని స్త్రీ ఆకారంగా మార్చి వాస్తవానికి దగ్గరగా, మరిన్ని మానవతా లక్షణాలతో శిల్పం చెక్కుతాడు. అది మొదలు మూర్ శిల్పాలకు ఆ శిల్పమే, నమూనాగా మారిపోతుంది.

1928, లండన్ వారెన్ గేలరీలో మూర్ తన తొలి శిల్ప ప్రదర్శనను యిస్తాడు. లండన్, ట్రాన్స్‌పోర్ట్ బోర్డు నూతన భవనానికి ఒక శిలాన్ని ఈ తయారుచేసి యివ్వడంతో అతని బహిరంగ కళా ప్రస్థానం మొదలౌతుంది. 1929 లో రష్యన్, ఆస్ట్రియన్ మూలాలున్న దంపతుల సంతానం ఇరీనా రెడెట్ స్కీని పెండ్లి చేసుకుంటాడు. అంతకు ముందే ఇరీనా మూర్‌కు రాయల్ కాలేజిలో పెయింటింగు శిష్యురాలు. పెండ్లి తర్వాత వారు తమ నివాసాన్ని లండన్‌కు ఉత్తరాన హామ్‌స్టెడ్‌లోని పెద్ద స్టూడియోలోకి మార్చుకుంటారు. 1933లో యూనిట్ వన్ అనే యువ కళాకారుల యూనియన్‌లో చేరతాడు. ఆధునిక చిత్ర, వాస్తు, శిల్ప ఉద్యమాల పట్ల నిరాసక్తతతో వున్న ఇంగ్లండు ప్రజలకు వాటి పైన అవగాహన కల్పించడం యూనియన్ ఉద్దేశం. పెయింటర్ వాల్‌నాష్ ఈ ఉద్యమానికి స్ఫూర్తి. బార్బరాహెప్‌వర్త్, ఆమె భర్త పెయింటర్ బెనిన్ నికల్సన్‌లు ముఖ్య సభ్యులు. మరొక మిత్రుడు, ఉద్యమకర్త, కవి హెర్బర్ట్ రీడ్ కూడా ఇందులో సభ్యుడే. ఇతడే 1934లో మూర్ మీద తొలి మోనోగ్రాఫ్ (పరిచయ పుస్తకం) రచించాడు.

**హైన్రీమోర్ సాధించిన విజయాలు:** 1930 తొలి దశకంలో లండన్‌లో బాగా ఆదరణ పొందిన కళాకారులంతా అమూర్త చిత్రకళపైన అభిలాషను పెంచుకుంటారు. అమూర్త కళే అంతిమ కళారూపంగా భావిస్తారు. మూర్ కూడా మానవ రూపాలను కాదని నైరూప్య కళా రూపాలతో ప్రయోగాలు చేయడం ప్రారంభిస్తాడు. లండన్ లీస్టర్ గేలరీల్లో 1931లో ఏక వ్యక్తి ప్రదర్శనలు యిస్తాడు. శిల్పి జాకబ్ ఎప్‌స్టెయిన్ (Jacob Epstein) మూర్ శిల్పాలను ఉత్సుకతతో పరిచయం చేస్తే అది తీవ్రమైన విమర్శల పాలైమూర్ అపఖ్యాతిని మూటకట్టుకుంటాడు. రాయల్ కాలేజ్ నుండి తప్పుకోవలసిందిగా ఒత్తిడి పెరగడంతో 1932లో ఒప్పందం కూడా ఐపోవడంతో తప్పుకుని చెల్సియా ఆర్టు స్కూల్‌లో శిల్పవిభాగాన్ని ప్రారంభిస్తాడు.

మూర్‌కు పికాసో చిత్రాలంటే యిష్టం, దానిక్కారణం పికాసో చిత్రాలు శిల్ప లక్షణాలను కలిగి వుండటం, ప్రజలను ఆకర్షించాలనే తాపత్రయం లేకుండా పికాసోలాగా



స్వేచ్ఛగా, అంతకుముందు లేనివిధంగా శిల్పాకారాల్లో వక్రతను, విరూపతను చూపిస్తాడు. గులకరాళ్ళు, ఎముకలు, ఆల్చిప్పలు, శంఖాలు మొదలైన వస్తువుల్ని సేకరించి పెట్టుకుని, తనకు కావలసిన నైరూప్య శిల్పాలకు వాటి రూపాలను ఉపయోగించుకుంటాడు. ప్రకృతి సహజ సిద్ధ రూప, లయ, సూత్రాలను వాటి నుండి గ్రహిస్తాడు.

రెండవ ప్రపంచ యుద్ధ ఫలితంగా చెల్సియా స్కూలు ఖాళీ అవుతుంది. మూర్‌కు శిల్పకళను బోధించే అవసరం లేనందువల్ల కెంట్ నివాసంలో ఉండి పనిచేస్తాడు. అది సముద్ర తీరానికి చేరువలో ఉన్నందువల్ల బాంబుల భయానికి తిరిగి లండన్ చేరుకుంటాడు. హెర్ట్‌ఫర్డ్ షైర్‌లో స్థిరనివాసం ఏర్పరచుకుంటాడు. లండన్‌కు 20 మైళ్ళ దూరంలోని పల్లె ప్రాంతంలో వ్యవసాయ క్షేత్రాన్ని స్థాపించుకుని ప్రశాంత జీవితం గడుపుతాడు. యుద్ధ సమయంలో అన్ని వస్తువులకూ కరువే. శిల్పాలకు కావలసిన లోహం దొరక్క చిన్న చిన్న రాళ్ళతో శిల్పాలు చెక్కడం, పేపర్ మీద డ్రాయింగులు వేయడంతో గడుపుతాడు. జర్మనీ బాంబు దాడుల నుండి భూగర్భ రైల్వేస్టేషన్లలో తలదాచుకున్న లండన్ వాసుల జీవితాలను షెల్టర్ డ్రాయింగుల పేరుతో చిత్రించి తండ్రి పనిచేసిన కాసిల్ ఫర్డ్ బొగ్గు గని కార్మికుల బొమ్మల్ని చిత్రిస్తాడు. 1943లో నార్తాంప్టన్ సెంట్ మాథ్యూ చర్చికొరకు మడోనా శిశువు బహిరంగ శిల్పాన్ని సృజించడానికి ఒప్పుకుంటాడు.

చర్చీలు కాపాడుతూ వస్తున్న సాంప్రదాయ కళా పునరుజ్జీవనం మూర్‌కు బాగా నచ్చుతుంది. అందువల్ల నార్తాంప్టన్ చర్చికి రూపొందించిన శిల్పాల్లో ఆడంబరత లేని ఔన్నత్యం కనిపిస్తుంది. తల్లీ బిడ్డల అనురాగ భావానికి శోభను గూర్చే స్పర్శా వైభవం కన్పిస్తుంది.

**మూర్ బహిరంగ కృతులు :** 1958లో మూర్ తన 60వ పుట్టిన రోజునుండి ఆధునిక శిల్పిగా తన పాత్ర పట్ల ఎక్కువ శ్రద్ధ చూపినట్లు, వ్యక్తిగత ప్రయోజనానికే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చినట్లు తెలుస్తుంది. డబ్బుకొరకు శిల్పాలను



తయారుచేయడం, శిల్పాలసృష్టికి కమీషన్లు అంగీకరించడం మొదలు పెట్టాడు. 1963-65 మధ్య న్యూయార్క్, లింకన్ సెంటర్ కొరకు, 1964 చిగాగో విశ్వవిద్యాలయ 'న్యూక్లియర్ ఎనర్జీ' కమీషన్లు అంగీకరించాడు. (న్యూక్లియర్ ఎనర్జీ బ్రాంజి శిల్పం ప్రపంచ తొలి న్యూక్లియర్ రియాక్టర్ పైన ప్రతిష్టించబడింది). లింకన్ సెంటర్లోని బహిరంగ శిల్పం బహుళ భావాలు కలిగిన స్త్రీ శిల్పాల్లో అతిపెద్దది. ఇది కూడా విశ్రాంతి భంగిమలో చెక్కిన అమూర్త శిల్పమే. 1960 తర్వాత మూర్ కొన్ని శిల్పాలకు పాలరాతిని ఉపయోగించాడు. 1966లో మూర్ ఇటలీలోని కరారా రాతి గనుల సమీపంలో వేసవి శిబిరాన్ని నిర్వహించి అక్కడి కార్మికులతో పాలరాతి శిల్పాలను చెక్కడం ప్రారంభించాడు. అనంతరకాలంలో కళలను ప్రోత్సహించడానికి, తన కృతుల్ని, రచనల్ని ప్రదర్శించడానికి, పని నేర్పడానికి, తాను పని చేసుకోవడానికి అనువైన ప్రదేశంలో హెర్ట్‌ఫర్ట్‌షైర్ పల్లె ప్రాంతంలో 1919లో హెన్రీ మూర్ ఫౌండేషన్ స్థాపించాడు.

**హెన్రీ మూర్ చివరి దశ :** ఫౌండేషన్ స్థాపించిన తర్వాత 9 సంవత్సరాలు రకరకాల సేవలందించి చనిపోయే వరకు పనిచేశాడు. చిత్రశిల్ప కళల్ని ప్రోత్సహించడం, వాటిలో శిక్షణ నివ్వడం దీని ముఖ్య ఉద్దేశం, శిల్పాలు చెక్కడంతో పాటు ప్రింట్సు తయారుచేయడం కొనసాగించాడు. ఏనుగు పుర్రె, గొర్రె ఆల్బమ్‌ల శ్రేణిని తయారు చేశాడు. వందల కొలది ఫొటోగ్రాఫ్‌లు తీశాడు. చెక్కడాలను సృష్టించాడు. వయసు మీద పడుతున్నా లెక్కచేయకుండా సరికొత్త అంశాలతో రిక్లైనింగ్ ఫిగర్స్‌గా (విశ్రాంతి తీసుకుంటున్న శిల్పరూపాలు) 1986లో మరణించేవరకు సృజిస్తూనే వున్నాడు.

1944లో మూర్‌కు కుటుంబ సభ్యులున్న శిల్పం కొరకు పని దొరుకుతుంది. మూర్ శిల్పకళాశైలిలో అది పెను మార్పుకు దారి తీస్తుంది. 1930ల్లో ప్రయోగాలు చేసే దశ నుండి ప్రజల నాకర్షించే మానవతా దృక్పథం, వాస్తవానికి దగ్గర్లోవుండే శిల్పీకరణ శైలిలోకి మారిపోతాడు. బంకమట్టి (క్లే), టెర్రాకోట (ఎర్రమట్టి)తో డజన్ల కొద్ది తల్లీ, బిడ్డలవి, కుటుంబ సభ్యులవీ నమూనాలను, కంచు శిల్పాలను ఒక్కో శిల్పానికి 7-9 ప్రతిరూపాలను తయారుచేస్తాడు. దానితో మూర్ శిల్పాలు విశ్వవ్యాప్తంగా ప్రముఖ మ్యూజియాల్లో, కళాభిమానుల వ్యక్తిగత సేకరణల్లో చోటుచేసుకుంటాయి.

శిల్పాల్లో మూర్ ప్రదర్శించిన మానవతావాదం అతని అంతర్జాతీయ ఖ్యాతికి దృఢమైన పునాది వేస్తుంది. దీనికి మూలాలు 1946లో మోడరన్ ఆర్ట్ మ్యూజియం, న్యూయార్క్ నిర్వహించిన గొప్ప 'మూర్ రిట్రాస్పెక్టివ్ (పునః పరిశీలనా ప్రదర్శన). ఈ సందర్భంగా మూర్ తొలిసారిగా అమెరికా సందర్శిస్తాడు. అమెరికా దేశ కళా ప్రియులు మూర్ శిల్పాలను ఖరీదు చేస్తారు. అప్పటినుండి మూర్ ఆర్థిక బాధల నుండి బయిటపడి నిచ్చింతగా, స్వేచ్ఛగా తనకిష్టమైన పరిమాణంలో, పరిధిలో శిల్పాలను సృష్టిస్తాడు. వెనిస్ ద్వైవార్షిక కళోత్సవంలో శిల్పకళలో బహుమతి గెలుచుకోవడంతో శిల్పిగా మూర్ ఖ్యాతి ఐరోపా అంతటా బలపడుతుంది. తర్వాత బ్రిటన్‌లో ఎన్నో ఉన్నత స్థాయి కమీషన్లను విజయవంతంగా పూర్తి చేస్తాడు.

కొత్తగా వెలుస్తున్న పట్టణాల్లో బహిరంగ స్థలాలో స్థాపించడానికని 'కుటుంబం' శిల్పాలు తయారుచేశాడు. స్టీవనేజ్, హెర్ట్ ఫర్డ్ షైర్, హార్లో, ఎస్సెక్స్ (1948-55) పట్టణ ప్రాంతాల్లో మూర్ శిల్పాలు కన్పిస్తాయి. లండన్ బేటర్ సీ పార్కలో నిలబడి వున్న ముగ్గురు మూర్తుల రాతిశిల్పం, సెంట్ పీటర్స్ చర్చి, క్లేడన్ కొరకు మడోనా శిల్పాన్ని 1951 లండన్ ఫెస్టివల్ కొరకు విశ్రమిస్తున్న భంగిమలో పెద్ద శిల్పాన్ని సృష్టిస్తాడు. 1944లో మూర్ తల్లి మరణం, 1946లో మూర్‌ల ఒకే సంతానం మేరీ జన్మించడం రెండు సంఘటల్నీ కుటుంబం అనే అంశానికి, తల్లి బిడ్డల అనుబంధానికి ప్రతీకగా 1940-50ల మధ్య ఎన్నో శిల్పకళా రూపాలకు ముఖ్యాంశంగా ఎన్నుకున్నారు.

మూర్ శిల్పాలు అమూర్త రూపాలైనా వాటి నిర్మాణ శైలిలో పడుకుని వున్న స్త్రీ లక్షణాలు స్ఫుటంగా కన్పిస్తాయి. ప్రకృతిలో సహజంగా లభించే ఎముకలు, రాళ్ళు, ఆల్చిప్పల్లో ఉండే గుండ్రని ఆకారాల లక్షణాలను తన శిల్ప నిర్మాణంలో వాడుకున్నారు. విశ్రాంత భంగిమల్లో వాలి పడుకుని వున్న స్త్రీ శిల్పాలను చూడగానే వాటిని





మూర్ శిల్పాలుగా గుర్తించవచ్చు. మూర్ శిల్పాలను అనేక మాధ్యమాల్లో తయారుచేశాడు. అందుకు రాయి, చెక్క ప్లాస్టర్ కంచు లోహాలని వాటివాటి ప్రత్యేక లక్షణాలను, అవసరాన్నిబట్టి ఉపయోగించుకున్నాడు.

**మూర్ ఆస్తులు:** మూర్ కీర్తి ప్రతిష్టలు తారాస్థాయికి చేరుతున్న తరుణంలో వెలువడిన శిల్పాలు, మర ణించిన తర్వాత వెలుగుచూసిన శిల్పాలవల్ల 1940 నాటికి అతని ఖ్యాతి అంతర్జాతీయంగా పెరిగిపోతుంది. ప్రముఖవ్యక్తిగా, బ్రిటిష్ శిల్పానికి ఆధునిక ప్రతినిధిగా పరిగణించబడ్డాడు. ఆతణ్ణి తర్వాతి తరంతో పోల్చడంతో శిల్పిగా మూర్ స్థానం సుస్థిరమైపోతుంది. 1952 నాటి వెనిస్ ద్వైవార్షిక ప్రదర్శనలో బ్రిటిష్ ఇతర శిల్పుల శిల్పాలు ప్రదర్శించ బడినా అవి మూర్ శిల్పాలకు, అతని ఆదర్శాలకు ఏమాత్రం సాటి రావు. మూర్ అంతగా దేశీయంగా, అంతర్జాతీయంగా తన తర్వాతి తరాలపై తీవ్ర ప్రభావాన్ని చూపించాడు. సర్ ఆంథనీ కారో, ఫిలిఫ్ కింగ్, ఐజాక్ విట్కిన్‌లు మూర్ గొప్పతనాన్ని వారి శిల్పకళపై మూర్ ప్రభావాన్ని అంగీకరించారు. వీరు ముగ్గురూ మూర్‌కు సహాయకులుగా పని చేసిన వారే! వీరే కాక హెలెన్ బ్లూమన్ ఫెల్డ్, డ్రాగో మారిన్ ఛెరీనా, లిన్ చాడ్విక్ మొదలైన శిల్పులందరిపై మూర్ ప్రభావం కన్పిస్తుంది. మూర్ ఫౌండేషన్ శిల్ప సాంప్రదాయాన్ని కాపాడ్డానికి పాటు పడుతుంది. 1977 నుండి శిల్ప ప్రదర్శనలు నిర్వహించడం ద్వారా జన సామాన్యం దృశ్యకళను చూచి ఆనందించడంతో పాటు మెచ్చుకునేలా చేసే లక్ష్యంతో కొనసాగుతోంది.

**హెన్రీ మూర్ ఫౌండేషన్** : మూర్‌కు శిల్పాల ద్వారా పేరుప్రతిష్టలలో పాటు ఆదాయం కూడా పుష్కలంగా పెరిగి పోవడంలో శిల్ప కళారంగానికి మరింత సేవచేసే ఉద్దేశంతో ఏర్పడిన, గుర్తించబడిన ధార్మిక సంస్థ (ఛారిటీ). లలిత కళా విద్యను బోధించడం, లలిత కళల్ని ప్రోత్సహించడం లక్ష్యంగా 1977లో స్థాపించబడిన సంస్థ. శిల్ప ప్రదర్శనల నిర్వహణ, శిల్పాల అమ్మకం, వాటిని పరిరక్షించడమే కాకుండా విస్తృత శ్రేణిలో ప్రాజెక్టులు చేపడుతుంది. కళాకారులకు, కళాచరిత్రకారులకు ఆర్థిక సాయం చేస్తుంది. ఇతర కళా సంస్థలనూ ఆర్థికంగా ఆదుకుంటుంది. ఫౌండేషన్ కేంద్రాలు ఇంగ్లండ్‌లో రెండు చోట్ల నుండి పనిచేస్తాయి. హెన్రీ మూర్ స్టూడియోస్ మరియు గార్డెన్స్, హెర్ట్ ఫర్డ్ షైర్ వాటిలో ఒకటి. ఇది పల్లె ప్రాంతంలోని 70 ఎకరాల విశాల ప్రదేశం. రెండవది హెన్రీమూర్ ఇన్ స్టిట్యూట్. ఇది ఇంగ్లండ్ లోని లీడ్స్‌లో వున్న సంస్థ.

**హెన్రీమూర్ స్టూడియోలు, తోటలు** : మూర్ దంపతులు హాంప్‌స్టెడ్‌లో వున్న సమయంలో, రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో వీరి నివాసంపై బాంబు దాడి జరిగినందువల్ల, అప్పటికే మూర్ ఆదాయం పెరిగి పోవడంతో లండన్ సమీపంలో పల్లె ప్రాంతంలోని ఫాంహౌస్‌కు మారుతాడు. ఇది హెన్రీమూర్ ఫౌండేషన్‌కు కేంద్రకార్యస్థానం. వివిధ కార్యక్రమాల కొరకు దానిలో అనేక స్టూడియో భవనాలను నిర్మించి భారీ స్థాయిలో శిల్పాలను ఉత్పత్తి చేస్తారు. ఇరీనా (మూర్ భార్య) పుష్ప వాటికలను, ఫలవృక్షాలను, పచ్చిక బయళ్ళను పెంచి సుందరంగా తీర్చి తీర్చుతుంది. గొర్రెల పెంపక క్షేత్రం కూడా దీనిలోని ఒక భాగం.

**మూర్ గార్డెన్స్ విశేషాలు :** ఇందులోని గొప్ప స్టూడియోలు శిల్పాలు చెక్కడానికి; ఎచ్చింగ్ స్టూడియోలు, ప్రింట్ల తయారీకి; ఎల్లో బ్రిక్ స్టూడియో.. వివిధ కార్యకలాపాలకు; శిల్పాలు, ఫొటోగ్రఫీ కొరకు; ప్లాస్టిక్ స్టూడియో భారీ పరిమాణంలో, ఆరుబయట శిల్పాలు చెక్కడానికి; ఇంకా నమూనా శిల్పాలు .చెక్కడానికి, వేసవి విడిది, అనంతంగా

సేకరించిన మూర్ వస్తువులు భద్రపరచడానికి కేటాయించ బడ్డ భవనాలతో నిత్యం సందర్శకులతో సందడిగా వుంటుంది.

**హెన్రీ మూర్ ఇన్‌స్టిట్యూట్- లీడ్స్:** ఇది శిల్ప కళా అధ్యయనానికై 1993లో, లీడ్స్ ఆర్ట్ గేలరీ పక్కన స్థాపించబడింది. కళాకారులను ప్రోత్సహించడం, శిల్పకళా ప్రదర్శనలను నిర్వహించడం, పరిశోధక పత్రాలు కలిగి ఉన్న లైబ్రరీని నడపడం, ఉపన్యాసాలు, సెమినార్లు, వర్కుషాపులు నిర్వహించడం - ఇది చేపట్టే కార్యక్రమాల్లో కొన్ని. మ్యూజియాలకు, గేలరీలకు, పరిశోధకులకు ఆర్థిక సాయం చేస్తుంది.

**మూర్ శిల్పాల తస్కరణ :** 1969-70 నాటి విశ్రమస్తున్న భంగిమలో వున్న రెండు టన్నుల బరువున్న జంటశిల్పం మూడు మిలియన్ పౌండ్లకు ఇన్స్యూర్ చేయబడింది, ఫౌండేషన్ స్థలం నుండి దొంగిలించబడింది. దాని ఆచూకీ తెలియలేదు. 1965 నాటి సన్ డయల్ అనే మరొక శిల్పం వేరొక శిల్ప కంచు పీఠం దొంగిలించబడ్డాయి. 2013 లో గ్లెన్‌క్లిన్ స్కల్ప్చర్ పార్క్ నుండి మూడు మిలియన్ పౌండ్ల విలువగల శిల్పం దోచుకోబడింది.

**ప్రజాదరణ** : మూర్ ఫౌండేషన్ జాతీయ, అంతర్జాతీయ పరిశోధనా కార్యక్రమాల్లో నిమగ్నమై వుండడం, సంస్థలకు ఆర్థిక సాయం చేయడం, శిల్పులను ఆర్థికంగా ఆదుకోవడం మొదలైన విషయాల్లో ముందంజలో వుండి ప్రజాదరణను పొందగలిగింది.

**మూర్ పొందిన పురస్కారాలు :** కళారంగంతోపాటు వివిధ రంగాల్లో విశిష్ట సేవ లందించిన వారికిచ్చే అవార్డులు చాలా మూర్‌ను వరించాయి. అతని పేరు పక్కన OM, CH, FBA అని ఉండడం కన్పిస్తుంది. OM అనేది. బ్రిటన్‌లో వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన 24 మంది సజీవ వ్యక్తులకు ఇచ్చే అవార్డు. FBA : ఇది కూడా సామాజిక శాస్త్రాల్లో అత్యున్నత సేవలందించిన కళాకారులకు గుర్తింపుగా యిచ్చే పురస్కారం. (ఫెలో ఆఫ్ బ్రిటిష్ అకాడమీ), CH: ఇదీ గౌరవ పురస్కారమే. కళలు, శాస్త్ర, వైద్యరంగాల్లో ఉత్తమ సేవలందిన వారికి యిచ్చే పురస్కారం. ఇవేకాక మరెన్నో పురస్కారాలు- 1948లో వియన్నా ద్వైవార్షిక సమ్మేళనంలో అంతర్జాతీయ శిల్ప బహుమతి 1951లో నైట్‌హుడ్ పురస్కార తిరస్కరణ (తన స్థాయికి దాన్ని స్వీకరించడం చిన్నతనంగా భావించడం కారణం); 1955లో 'ఆర్డర్ ఆఫ్ కంపానియన్స్ ఆఫ్ ఆనర్, 1963లో "ఆర్డర్ ఆఫ్ మెరిట్ సభ్యత్వం, 1968లో ఇరాన్మస్ ప్రైజ్ పొందడంతో పాటు, అమెరికా, అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్, ఫిలసాఫికల్ సొసైటీ సభ్యత్వం కూడా సాధించాడు.

**హెన్రీ మూర్ అవార్డులు :** మూర్ ఫౌండేషన్ యిచ్చే అవార్డులే కాకుండా లక్ష పౌండ్ల నిధి నుండి, ఇంగ్లండ్ లోని 50 మంది వివిధ కళాకారులకు ప్రతిసంవత్సరం హెన్రీ మూర్ అవార్డులు ఇవ్వబడతాయి. సమకాలీన, ఆధునిక లేదా శిల్ప చరిత్ర మీద అత్యుత్తమ పరిశోధనా పత్రాలు సమర్పించిన BA, MA అభ్యర్థులు ఇద్దరికి మూర్ ప్రైజ్ యివ్వబడుతుంది. మూర్ శిల్పాల్లో ఒకటి 2012లో 19.1 మిలియన్ పౌండ్లకు, క్రిస్టీస్ వేలంలో అమ్ముడు పోయి 20వ శతాబ్దపు బ్రిటిష్ రికార్డు నెలకొల్పింది.

**హెన్రీ మూర్‌ను గురించిన విశేషాలు**

- చిత్ర, శిల్పకళాకారుడు ప్రకృతిలోని వస్తువుల్ని చూడడం నేర్చుకోవాలి. లేకపోతే వారు వాటికి సజీవ రూపాన్ని యివ్వలేరు- అని మూర్ అభిప్రాయం.
- మూర్ తన శిల్పాలను సహజ పరిసరాలలో ఆకాశం కింద, చుట్టూ చెట్లు, రాళ్ళ మధ్య ఎక్కువ మంది చూడటానికి యిష్టపడతాడు.
- మూర్ శిల్పాలకు సాటిగా దేశదేశాల్లోని బహిరంగ ప్రదేశాల్లో ఇంకే ఇతర శిల్పి శిల్పాలూ కన్పించవు.
- తన కుటుంబం కంటే మూర్‌కు మరేదీ ఎక్కువకాదు. అతని శిల్పాల్లో సమతౌల్య మాధుర్యం కన్పించడానికి కారణం అతని భార్య ఇరీనా. ఐతే కుటుంబ శిల్పాల భావనకు వారి ఏకైక కుమార్తె, ఆమె ముగ్గురు పిల్లలు కారణం.
- సృజనను అమితంగా అభిమానించే మూర్‌కు దేవుని సృష్టి అంటే మరీ ఇష్టం. దైవ సృష్టి శూన్యం నుండి జరుగుతుంది అంటాడు.
- మూర్ అభిమాని డేవిడ్‌ఫిన్ "మేము కొనుక్కున్న నిరాడంబరమైన ఇంటి ఖరీదూ, ఖరీదు చేసిన మూర్ శిల్పమూ రెండూ సమానం. మూర్ మంచితనం వల్ల ఆ శిల్పాన్ని వాయిదాల పద్ధతిలో సొంతం చేసుకో గలిగాము" అంటాడు.

**తంగెడ విశ్వేశ్వర ప్రసాద్**
(టి.వి.ప్రసాద్), రిటైర్డ్ ప్రిన్సిపాల్.
హైదరాబాద్, ఫోన్ నెం. 7981398250

# గాంధీ క్షేత్రం - మండలి వెంకట కృష్ణారావు

- డా. సుందర్ కొంపల్లి



మండలి వెంకట కృష్ణారావు

రాజకీయ నేతగా ఎంతో మందికి, ముఖ్యంగా తెలుగు వారికి పరిచయమున్న మండలి వెంకట కృష్ణారావు గారిలో అపరిమితమైన సంఘ సంస్కరణ ప్రియత్వముండేది. సామాజిక మార్పుకై తపన వుండేది. ఆయన తన జీవితంలో ఈ విలువలను నిలబెట్టుకున్నారు, వాటికొరకు పాటుపడ్డారు. ఇక్కడొక ప్రశ్న ఉదయిస్తుంది. ఆయన తరానికి చెందిన నాయకులందరూ, అంటే 20వ శతాబ్ది తొలి దశకాల్లో జన్మించి, రాణించిన వారు, ఇదే రకమైన వ్యక్తిత్వం కలిగి వున్నారా? దీనికి సమాధానం కాదనే వస్తుంది. కాదని చెప్పడం మిగతా నాయకులను కించపరచడమో, తక్కువచేయడమో కాదు. ఎవరి దృష్టి వారిది. ఇక్కడ మనం మూడు విషయాలను గమనించాలి.

20వ శతాబ్ది తొలినాళ్ళు స్వాతంత్రోద్యమానికి పూర్తిగా అంకితం. అధిక భాగం మహాత్మాగాంధి నాయకత్వంలో పోరాడిన వారే! మండలి కృష్ణారావుగారి వ్యక్తిత్వం గాంధేయభావాల్లో వికసించింది. మహాత్మాగాంధికి ఉద్యమం ఎంత ప్రధానమో, సంఘ నిర్మాణ కార్యక్రమం కూడా అంతే ప్రధానం. స్వాతంత్ర్యం రాకపూర్వం కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు - అందరూ రెంటిలో ఉండేవారు. కానీ 1947 తర్వాత చాలామంది అధికార కాంగ్రెస్ రాజకీయాలకు పరిమితమైనారే కాని, సంఘనిర్మాణం, సామాజికమార్పులపై దృష్టి సారించలేదు. దేశంలో 'రాజకీయ గాంధేయులు', 'నిర్మాణాత్మక గాంధేయుల'గా రెండు వర్గాలు ఉద్భవించాయి. గాంధీతత్వాన్ని నిర్మాణాత్మక సంఘదృష్టిని సమపాళ్ళలో మేళవించి, జీవితాంతం కృషిచేసిన నాయకులు రాశిలో చాలా తక్కువ. ఈ రాశివారే మండలి కృష్ణారావు. ఆయన రాజకీయం కేవలం కాంగ్రెస్ రాజకీయం కాదు. ఆయన చేపట్టి నిర్వహించిన కార్యక్రమాలు ఆయనలోని సంఘచాలతను, సంస్కరణ ప్రియత్వాన్ని, సామాజిక సమానత్వం కొరకు తపనను వెల్లడిస్తాయి. క్లుప్తంగా చెప్పాలంటే స్వాతంత్ర్యానంతర గాంధేయానికి ఆయన అసలు సిసలైన సాంఘికరూపం. ఆయన వృత్తి రాజకీయం కావచ్చుగాని, ప్రవృత్తి మాత్రం సాంఘికం. కానీ, ఆయన రాజకీయ నాయకత్వమే ఎక్కువగా ప్రకాశించింది. కారణం, అధికారం, పదవులు.

20వ శతాబ్ది తొలి దశకాల్లో తెలుగు సమాజంలో కులాల కుంపట్లు రాజుకున్నాయి. కులసంఘాలు బాగా చైతన్యంగా పనిచేశాయి. కులానికి కోటలు కట్టిన కాలమది. రాజకీయంగా జస్టిస్ పార్టీ బ్రాహ్మణేతర కులాలను కలుపుకొని, అధికారం దిశగా పయనించింది. బ్రాహ్మణేతరుల్లోని అగ్రకులాల అగ్రజులంతా జస్టిస్ పార్టీ పంచనచేరారు. వీరి ప్రభావం సమకాలీన సమాజంలో బాగా ఉండేది. దివిసీమ ప్రాంతం నుండి కూడా నాయకులు ఉద్భవించారు. (చల్లపల్లి జమిందారు ఒక ఉదాహరణ). మండలి కృష్ణారావు గారు యుక్తవయస్సులో అడుగిడేనాటికి ఆవిష్కృతమైన సాంఘిక పరిస్థితులివి. పిన్నవయస్సులోని కృష్ణారావుగారు ఈ ప్రభావాలకు సులభంగా లొంగిపోవాల్సిన అంశమిది. కానీ ఆయన విజ్ఞత ప్రదర్శించారు. గాంధేయ రాజకీయాన్ని ఎంచుకున్నారు. కులరాజకీయాన్ని విస్మరించారు. తరువాతి కాలంలో కూడా ఆయన కాపు

రాజకీయాలకు అతీతంగా ఎదిగారు. జీవితాంతం ఆయన ప్రముఖ గాంధేయులు ప్రభాకర్‌జి, గోరా, లవణం తదితరులతో కలసి అనేక సాంఘిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన సంఘదృష్టి, సంస్కరణ భావాలు ఏనాడో కులాన్ని అధిగమించాయి. రాజకీయనేతగా, మంత్రిగా తదనంతర కాలంలో ఆయన భావాలు సంస్కరణ, మార్పు, అభివృద్ధి చుట్టూ పరిభ్రమించాయేతప్ప పాక్షిక ధోరణులకు లొంగిపోలేదు.

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత దేశమంతటా కాంగ్రెస్ ప్రభుత్వాలే ఏర్పడ్డాయి. దేశంలోని సంస్థానాధీశులు, జమిందార్లు, వ్యాపారులు, కులీనులు – ఇలా చాలామంది కాంగ్రెస్ రాజకీయాల్లో ఉన్నారు. పదవులు అలంకరించారు. అనేకులు తమ రాజకీయాలతో వివిధ వ్యాపారాలు, లాభాలనార్జించే కార్యక్రమాలు కలిగి ఉండేవారు. అదే సమయంలో కొద్దిమంది ఇతర, సామాన్య కార్యకర్తలు కూడా నాయకత్వ స్థానానికి ఎదిగారు. వీరందరూ తు.చ తప్పకుండా గాంధేయవాదాన్ని పాటించే వ్యక్తులు. గాంధేయ నైతికతను వారసత్వంగా ఎంచుకున్న సామాన్య నాయకులు. సమకాలీన సంఘసంస్కర్త లవణం మాటల్లో చెప్పాలంటే దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తొలికాలం 'సక్రియాత్మక నైతికత దశ' (Age of Active Morality). గాంధీగారు ప్రవచించిన నిరాడంబరత్వం, నిజాయితి, సచ్ఛీలత, నిర్మాణ కార్యక్రమం మొ॥ వాటికి అతికొద్దిమంది కాంగ్రెస్ నాయకులు, మంత్రులు కట్టుబడి ఉన్నారు. అలాంటి వారిలో మండలి కృష్ణారావు గారు తెలుగు సమాజంలో ప్రముఖులు. ఆయనలా అలా కొద్దిమంది కాంగ్రెస్ నాయకులు మాత్రమే ఉండగలిగారు. సాధారణ రైతు కుటుంబంలో పుట్టిన ఆయనకు ఉపాధ్యాయుడైన తన తండ్రే ఆదర్శం. తన తండ్రి నుంచే ఆయన సంస్కరణ శీలతను పొందారు. తాను కార్యకర్తగావున్నా, అధికారంలో వున్నా మార్పు భావాలను కలిగివుండేవారు. తన చివరి శ్వాసవరకు ఆయన నమ్మిన సిద్ధాంతాలను వీడలేదు.

మండలి కృష్ణారావు గారి వ్యక్తిత్వంలోని సాంఘిక కోణం విమర్శకుల దృష్టిలో అనుకున్నంత స్థాయిలో పడలేదు. కృష్ణారావుగారి మానసిక దృక్పథం సాంఘిక మార్పు. ఆయన ఏ పదవిలో వున్నా తన సంస్కరణ శీలతను కోల్పోలేదు. కార్యకర్తగా నాయకునిగా, మంత్రిగా ఆయన చేపట్టి నిర్వహించిన కార్యక్రమాలే దీనికి సజీవ సాక్ష్యాలు. నేరస్తుల సంస్కరణ, వెనుకబడిన తరగతుల అభివృద్ధి కార్యక్రమాలు, దివిసీమ ఉప్పెన సమయంలో కులాతీతంగా సంఘసేవ, ప్రపంచ తెలుగు మహాసభలు మొ॥ విషయాలందు ఆయన సంఘదృష్టి ప్రస్ఫుటంగా తెలుస్తుంది.

సాంఘికాభివృద్ధి రంగంలో, ముఖ్యంగా సంఘ సంస్కరణల విషయంలో, 19వ శతాబ్దానికి, 20వ శతాబ్దానికి చాలా తేడా ఉంది. 19వ శతాబ్ది తొలినాళ్ళలో వలసవాద బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశంలోని తొలితరం సంఘసంస్కర్తల కార్యక్రమాలను చేతనైనంత సహాయం అందించింది. కానీ క్రమంగా ఈ తోడ్పాటు ఆవిరపోయింది. భారత ప్రజలందు సంఘచేతన ఎక్కువైతే వలసాధికారానికి ముప్పువాటిల్లగలదనే భయం వలన ప్రభుత్వానికుండేది. దీనివల్లనే అది వెనకడుగువేసింది. తన రాజకీయాధికారం పైనే దృష్టిని నిలిపింది. సాంఘిక మార్పుకై సంస్కర్తలు వ్యక్తిగతంగా కృషిచేసేవారు. స్థానికులు కొందరు సహకరించేవారు. క్లుప్తంగా 19వ శతాబ్ది నేపథ్యమిది. 20వ శతాబ్దానికి పరిస్థితులు మారాయి. ఉవ్వెత్తున ఎగసిన జాతీయ స్వాతంత్రోద్యమం ప్రజలను విపరీతంగా ఆకర్షించింది. అనేకమందితో కలిసి సంస్కర్తలు సైతం ఉద్యమంలో భాగమైనారు. సంస్కరణ కృషి, ఫలాలు ప్రస్తుతం స్వాతంత్రోద్యమంలో అంతర్భాగాలైనాయి.

భారతదేశానికి 1947లో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నూతన పరిస్థితి ఆవిష్కృతమైంది. సర్వసత్తాక లౌకిక ప్రస్వామ్య దేశంగా భారతదేశాన్ని ప్రకటించారు. ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పడినపుడు ప్రజలకు సంబంధించిన అంశాలన్నీ ప్రభుత్వ పరిధిలోనికే వస్తాయి. ఈ సమయంలో రెండు ప్రధానమార్పులు సంభవించాయి. ఒకటి, సంస్కరణ, అభివృద్ధి కార్యక్రమాలను ఇక ప్రజాస్వామిక ప్రభుత్వమే చేపడుతుందనే భావం విస్తరిల్లింది. దానితో సాంఘికమార్పుపై దృష్టి సన్నగిల్లింది. రెండు, ఆనాటి పరిస్థితుల ప్రభావం దృష్ట్యా ప్రభుత్వం ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలపై ప్రధానంగా దృష్టి సారించింది. సంస్కరణ, మార్పు అనేవి మందగించాయి. ఈ

కార్యక్రమాలను చేపట్టాలంటే నిబద్ధత, సహనం, సచ్ఛీలతలుండాలి. అధికారలాలస ఉండరాదు. అంటే, అభివృద్ధి కార్యక్రమాలను సంస్కరణ దృష్టితో రంగరించి ముందుకు తీసుకొని వెళ్ళాలి. అధికార రాజకీయాలకు/ అలవాటుపడితే సంఘదృష్టితో కార్యక్రమాలు నిర్వహించడం కష్టసాధ్యం. ఇచట కాంగ్రెస్ వాదులు (అంటే గాంధేయ సిద్ధాంత వారసులని అర్థంచేసుకోవాలి) కొందరు రాజకీయాల నుండి పూర్తిగా దూరం జరిగి, గాంధేయ నిర్మాణాత్మక కార్యక్రమాలను తాము స్థాపించిన స్వచ్ఛంద సంస్థల ద్వారా కొనసాగించారు. మరోవైపున, అతి కొద్దిమంది కాంగ్రెస్ వాదులు రాజకీయాధికారాన్ని, పదువులను స్వీకరించి కూడా గాంధీ తత్త్వాన్ని విడకుండా తమ కార్యక్రమాలను నిర్వహించేవారు.

రాజకీయ నాయకత్వానికి, సాంఘిక నాయకత్వానికి మధ్యన వీరు సమతుల్యతను సాధించే ప్రయత్నంచేసి, విజయం సాధించారు. ఇలాంటి నాయకులు చాలా అరుదు. అలాంటి అరుదైన జాతి వ్యక్తే మండలి కృష్ణారావు గారు. తన రాజకీయ్యాన్ని, అధికారాన్ని సంఘ నిర్మాణానికి, మార్పుకు అనుసంధానించి అవిరళ కృషిచేశారు. ఒకవేళ తన అధికార పదవికి ఏవైనా పరిమితులుంటే, ఆయన వ్యక్తిగత స్థాయిలో కార్యక్రమ సాఫల్యతకు కృషిచేశారు. దీనికి ప్రత్యక్ష ఉదాహరణే ఆయన అవనిగడ్డలో స్థాపించి, నిర్వహించిన గాంధీక్షేత్రం. నమ్మిన గాంధేయ సిద్ధాంతానికి, సంస్కరణాత్మక కార్యక్రమాలకు మధ్యన ఇంతలా అవినాభావ సంబంధాలను ఏర్పరచి, సంఘంలో కృషిచేసిన రాజకీయ నాయకులు తెలుగు సమాజంలో అత్యంత అరుదు. ఈ చారిత్రక ఘనకార్యాన్ని సాధించిన వ్యక్తి మండలి కృష్ణారావు. తమిళనాట కామరాజు గారిది ఎల్లపుడూ 'చూద్దాం' అనే దృష్టి; తెలుగునాట మండలి కృష్ణారావు గారిది అన్ని వేళలా 'చేద్దాం' అనే దృష్టి. ప్రఖ్యాత మహిళా సంఘసంస్కర్త హేమలతా లవణం మాటల్లో చెప్పాలంటే మండలి కృష్ణారావు గారిది అత్యంత సునిశితమైన సంఘదృష్టి ఆయన కార్యక్రమాలను విశ్లేషిస్తే ఆయన రాజకీయ వ్యక్తిత్వం కంటే సాంఘిక వ్యక్తిత్వమే వాసిలో విశిష్టమని మనకు తప్పకుండా అవగతమౌతుంది. ఆయన జీవితాన్ని కులంకుషంగా పరిశీలిస్తే ఆయన ఎదుగుదల, వ్యక్తిత్వ వికాసంలో మూడు ప్రధాన దశలు కనిపిస్తాయి.

1. పునరంకిత (1942 – 1957)
2. పరిపుష్ట దశ (1957 – 1977)
3. పరివ్యాపిత దశ (1977 – 1997)

మండలి కృష్ణారావు అనే యుక్తవయస్సు వ్యక్తి పూర్తిగా గాంధేయుడై, తన కార్యక్రమాలను నిర్దేశించుకున్న దశే పునరంకిత దశ (1942 – 1957). ఈ సమయంలోనే ఆయన జస్టిస్ పార్టీ కుల రాజకీయాలను విస్మరించి, జాతీయవాదిగా, మానవవాదిగా ఎదిగారు. ఈ ఎదుగుదలకు సిసలైన తాత్విక నేపథ్యం గాంధీ సిద్ధాంతం. మరి కొంత కారణం, తన తండ్రి శిక్షణ కూడా. 1942 క్విట్ ఇండియా ఉద్యమం నాటికి మండలి కృష్ణారావు పూర్తి గాంధేయునిగా మారి, స్వాతంత్ర్యోద్యమబాట పట్టారు. నిఖార్సయిన గాంధేయునిగా ఎదిగారు. గాంధి సిద్ధాంతాలను తు.చ. తప్పకుండా పాటించడం ప్రారంభించారు. గాంధి నిర్మాణాత్మక కార్యక్రమ స్ఫూర్తిని నరనరాన నింపుకున్నారు. ఈ కారణంచేతనే ఆయన గాంధేయుల్లో ప్రత్యేకంగా కనిపించేవారు. ఆయన రాజకీయానికి మూలం గాంధి. ఆయన కార్యక్రమాలకు మూలం సంగ దృష్టి. ఆయన ఆలోచనలకు మూలం సంస్కరణ – అభివృద్ధి కార్యక్రమాలు. 1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చేనాటికి మండలి కృష్ణారావు గారికి తన భవిష్య కార్యక్రమాలపై పూర్తి అవగాహన ఉంది. స్వాతంత్ర్యము వచ్చిన తర్వాత కాంగ్రెస్ రాజకీయంలో ఒక మౌలిక మార్పు వచ్చింది. దేశ పునర్నిర్మాణానికి కాంగ్రెస్ వాదులందరూ నిర్విరామ కృషి చేయాలని గాంధి సంకల్పం దేశాన్ని ప్రేమించే వారందరికీ ఆయన అదే పిలుపిచ్చాడు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ దేశమంతటా ఎన్నికల్లో గెలిచి అధికారంలోనికి వచ్చింది. క్రమంగా కాంగ్రెస్ నాయకులందరూ అధికార రాజకీయాలకు అలవాటుపడిపోసాగారు. 1948లో గాంధిజీ చనిపోయిన తర్వాత నాయకులను హెచ్చరించి, నిర్దేశంచేసే పరిస్థితిలేదు. ఈ సమయంలో గాంధి నిర్మాణ కార్యక్రమాలను ముందుకు తీసుకువెళ్ళిన వ్యక్తులు, సంస్థలు ప్రధాన స్రవంతి రాజకీయాలకు దూరంగా ఉన్నారు. వినోబాభావే, ప్రభాకర్‌జి వంటి వారు పూర్తి సర్వోదయానికి, గాంధిజీ నిర్మాణ కార్యక్రమాలకు అంకితమై పనిచేశారు. వినోబాభావే భూదాన (ఆంధ్ర),

గ్రామదాన (ఒరిస్సా) ఉద్యమాలు దీనికి నిలువెత్తు తార్కాణాలు. అదే విధంగా దేశవిదేశాల్లో స్థిరపడిన ప్రైవేటు వ్యక్తులు కూడా గాంధిజీ స్ఫూర్తితో సాంఘికాభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. కొంతమంది గ్రామ నిర్మాణం కొరకే విదేశాలను వదలి మాతృదేశానికి వచ్చారు. స్వచ్ఛంద సంస్థలను స్థాపించి గాంధిజీ స్ఫూర్తితో పనిచేశారు. ఉత్తర కోస్తాంధ్రలో ఆవిర్భవించిన భాగవతుల ఛారిటబుల్ ట్రస్ట్ దీనికొక ఉదాహరణ. ఇక చివరగా, కాంగ్రెస్ నాయకులు. అధికారంలోనికి వచ్చిన కాంగ్రెస్ నాయకల్లో అతి కొద్దిమంది మాత్రమే తమ రాజకీయాలకు అతీతంగా గాంధిజీ సంఘనిర్మాణ కృషిని కొనసాగించారు. అధికారంలో ఉంటూ కూడా వీరు గాంధేయ సిద్ధాంతాలను మరువలేదు. ప్రజాప్రతినిదులుగా, మంత్రులుగా కొనసాగుతూ కూడా నిర్మాణ కార్యక్రమాల నేపథ్యాన్ని విస్మరించలేదు. అధికారానికి అలవాటు పడిపోతున్న కాంగ్రెస్ రాజకీయంలో ఇదొక పునరంకిత కార్యక్రమం. మౌలిక కాంగ్రెస్ వాదులుగా, గాంధిజీ అనుచరులుగా అతికొద్ది మంది రాజకీయులు ఇలా స్వాతంత్ర్యానంతరం తమనుతాము మండలి కృష్ణారావు గారు ఈ విషయంలో అగ్రగణ్యులుగా కనిపిస్తారు. ఇంతకు ముందే పేర్కొన్నట్లు 1960 చివరినాటికి ఆయన 'గాంధీ క్షేత్రం' పేరిట అవనిగడ్డలో ప్రత్యేక సంస్థను ప్రారంభించి, రాజకీయాలకు అతీతంగా, ప్రధాన స్రవంతి కాంగ్రెస్ రాజకీయానికి బాహ్యంగా తన నిర్మాణ కృషిని, సంస్కరణాభిలాషను కొనసాగించారు. ఈ పునరంకిత దశలో ఆయన సాధించిన చారిత్రక విజయం దివిసీమలో పేద దళితులకు ప్రభుత్వ బంజరుభూమిని పంచడం. దీనిని ప్రభుత్వం సైనికులకు కేటాయిస్తే, మండలి కృష్ణారావుగారు దానిని వ్యతిరేకించి స్టే ఆర్డర్ తెచ్చి, ఆనాటి సంక్షేమశాఖ మంత్రి వేముల కూర్మయ్య గారితో మాట్లాడి ఆ భూమిని అనేక సంవత్సరాలుగా సాగుచేసుకుంటున్న పేద దళిత కుటుంబాలకు మంజూరు చేయించారు. గాంధిజీ నిర్మాణ కార్యక్రమ స్ఫూర్తికి పునరంకితమవడం మూలంగానే ఇది సాధ్యమైంది. ప్రఖ్యాత కవి బోయి భీమన్న గారి మాటల్లో చెప్పాలంటే మండలి కృష్ణారావు ఆశిస్తున్న ఫలసాయం సర్వమానవ సమసమాజం, సోషలిజం.

మండలి కృష్ణారావు గారి జీవితంలో రెండవ భాగమైన పరిపుష్ట దశ (1957–1977) చాలా ప్రత్యేకతలు సంతరించుకొంది. రాజకీయ నేతగా ఆయన సాధించిన విజయాలకు సాక్ష్యం ఈ దశే ! 1957వ సంవత్సరంలో మొట్టమొదటి సారిగా ఆయన మచిలీపట్నం నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా లోక్‌సభకు ఎన్నికైనారు. పంచాయితి సమితి, జిల్లా పరిషత్, శాసనసభల్లో కూడా ఆయన ఈ దశలోనే ప్రవేశించారు. అనేక పదవులు అలంకరించారు. అనేక ప్రధాన సాంఘిక కార్యక్రమాలను చేపట్టారు. ఈ రెండు దశాబ్దాల కాలంలో ఆయన సాధించిన విజయాలు నేటికీ మైలురాళ్ళుగా మిగిలి పోయాయి. ఆయన నిర్మాణాత్మక దృష్టి సంఘ సంస్కరణాభిలాష స్పష్టంగా వ్యక్తమైనతీరు మనకు కనిపిస్తుంది. ఈ క్రింది కార్యక్రమాలు, వివరాలు గమనిస్తే మన విశ్లేషణ ఇంకా సులభతరం కాగలదు.

పూలదండల స్వీకరణను విసర్జించిన కార్యక్రమం చాలా ప్రత్యేకం. విజయవాడ నాస్తిక కేంద్రంలో గోరాగారు పూలదండల బదులు కూరగాయలను ఉపయోగించడం గమనించారు. కానీ దండ ఏదైనా ఆరాధనకు సూచన, అహంభావానికి మూలం. అనవసర ఖర్చు. కావున మండలి కృష్ణారావు గారు వీటన్నింటినీ ఏకకాలంలో విసర్జించారు. అలా చేసిన ప్రప్రథమ కాంగ్రెస్ మంత్రి ఆయన. మంత్రిగా సాధారణ ప్రజారవాణాను (బస్సులను) ఉపయోగించిన ప్రథమ కాంగ్రెస్ నాయకుడు కృష్ణారావు గారు, దీనిని పొదుపు చర్యల్లో భాగంగా ఆయన చేపట్టారు. అంతేకాక తన దగ్గర సిబ్బందిని కూడా తగ్గించుకున్నారు.

సాంఘికమార్పు కృషిలో భాగంగా ఆయన ప్రభుత్వం నిర్వహించే సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చారు. వాటికి శాశ్వత గ్రాంట్లను ఏర్పాటు చేశారు. సమకాలీనంలో అత్యంత వివాదాస్పద పత్రిక, కమెండో కూడా కృష్ణారావు గారి కృషిని ప్రశంసిస్తూ ఆయన్ను శ్రేయోరాజ్యంలో సమిష్టి కృషికి విలువనిచ్చే సోషలిస్టుగా పేర్కొంది.

గాంధిజీ, వినోభాల స్ఫూర్తితో మండలి కృష్ణారావు గారు తనకున్న 71/2 ఎకరాల్లో ఐదు ఎకరాలను పేదలకు పంచారు. ఇదొక చారిత్రక సంఘటన. వ్యవసాయిక

భారతదేశంలో ఆర్థిక సంబంధాలన్నీ భూసంబంధ విషయాలే! అలాంటి చోట కృష్ణారావు గారి నిర్ణయం సాధారణ విషయం కాదు. కాంగ్రెస్ రాజకీయాల్లో ఇదొక నూతన వరవడి. దీనితోబాటుగా ఆయన తన ఆస్తి వివరాలను బహిర్గతపరచి, సమాజం ముందు ఉంచారు. ఇది ఆనాటి రాజకీయాల్లో ఒక మేలి మలుపు.

ఆయనే సంస్కరణాభిలాషకు మచ్చుతునక 1972లో నిర్వహించిన సాంఘిక సంస్కరణల సందస్సు. దీనిలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఈ సదస్సులో అనేక విషయాలపై చర్చ జరిగింది. ముఖ్యంగా సంస్కరణల ఆవశ్యకతపై సుదీర్ఘచర్చలు నిర్వహించారు. ఈ సదస్సుల సందర్భంగానే మండలి కృష్ణారావుగారు ఒక చారిత్రక ప్రకటన చేశారు. కులాంతర (మతాంతర) వివాహం చేసుకున్నవారికి వెయ్యి రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచిస్తోందని ఆయన తెలిపారు. కులాంతర వివాహాలకు, కులనిర్మూలన భావాలకు ఇది దన్నుగా నిలువగలదని అనేకమంది భావించారు. ప్రభుత్వమే సంఘసంస్కరణల సదస్సు నిర్వహించడం అదే ప్రథమం. దానికి ప్రధాన కారకులు మండలి కృష్ణారావు గారు. ఆధునిక భారత రాజకీయాల్లో ఇదొక కొత్త కార్యక్రమం. ఆయన సమకాలికుడు గులాం యాసీన్ పేర్కొన్నట్లు రాజకీయ కులంలో ఒక గుణవంతుడు మండలి. మరో సమకాలీన ప్రముఖ పత్రిక, జమీన్‌రైతు ఆయన్ను ఏకంగా లాల్‌బహదూర్ శాస్త్రిగారిలోని నీతి, నిజాయితి, నిబద్ధలతో పోల్చింది.

సమకాలీన సమాజంలో జరిగిన సాంఘిక సంస్కరణ కృషిలో ఆయన ప్రత్యక్ష భాగస్వామ్యం ఆనాటి రాజకీయ వాతావరణంలో అత్యంత నూతనం. ప్రముఖ సంఘ సంస్కర్తలు, హేమలత-లవణం దంపతులు గుంటూరు జిల్లా స్టువర్టుపురంలో చేపట్టి, విజయవంతంగా నిర్వహించిన నేరస్తజాతుల సంస్కరణ కృషిలో మండలి కృష్ణారావు చాలా ప్రముఖపాత్ర పోషించారు. నాటి ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు ప్రతినిధిగా ఆయన స్టువర్టుపురాన్ని ఎన్నోసార్లు వ్యక్తిగతంగా వచ్చి, గమనించారు. సంస్కరణ కృషి తన పూర్తి సహకారాన్ని అందించారు. హేమలతా లవణం గారి మాటల్లో చెప్పాలంటే: ....*వారిని నేరవృత్తి నుండి తప్పించడానికి, ప్రత్యామ్నాయ జీవితోపార్జన కలిగించడానికి, వారికి సామాజిక గౌరవం లభింపచేయుటకు ఆయన పూనుకొన్నారు. ....త్యాగమూ, నిరాడంబరత్వమూ, సమాజసేవకు మూలస్తంభాలు. ఇవి శ్రీ మండలిలో స్పష్టంగా కనిపిస్తాయి.* ఇది ఆయనకు, ఆయన సంస్కరణాభిలాషకు లభించిన చారిత్రక యోగ్యతా పత్రం. ప్రముఖ సంపాదకులు నార్ల వెంకటేశ్వరరావు గారు కూడా మండలి కృష్ణారావు గారి కృషిని ఎలాంటి శషభిషలు లేకుండా గుర్తించి, సంపాదకీయాలు రాశారు.

భాష - సంస్కృతులపై ఆయనకు మక్కువ ఎక్కువ, ఆయన పూనుకొని నాయకత్వం వహించి, నాటి ప్రభుత్వ సహకారంతో నిర్వహించిన మొట్టమొదటి ప్రపంచ తెలుగు మహాసభలు ఆయన సాంస్కృతిక జీవితానికి కలికితురాయి. నేటి వరకు కూడా ఆయన సృష్టించిన వారసత్వం కొనసాగుతోంది. ప్రపంచవ్యాప్తంగా తెలుగు మూలాల ప్రజలను ఆయన కదిలించారు. ఈ సభల నిర్వహణతో ఆయన దక్షత వివిధ మూలల్లోని తెలుగు వారందరికీ తెలిసింది.

మండలి కృష్ణారావు గారి నిర్మాణాత్మక కార్యక్రమాలు, మార్పుకోసం తపన తదితన విషయాలు చివరిదైన మూడవ దశలో, అంటే పరివ్యాపిత దశలో (1977-1997) స్థానిక, జాతీయ సరిహద్దులు దాటి విఖ్యాతమైనాయి. 1977వ సంవత్సరంలో దివిసీమలో ఉప్పెన - తుఫాను సంభవించింది. ప్రాణ నష్టం, ఆస్తి నష్టం ఊహకందని స్థాయిలో జరిగాయి. ఉప్పెన అనంతరం చేపట్టిన పునరావాస కార్యక్రమాలు ఆయన పేరును విశ్వవ్యాపితం చేశాయి. ఉప్పెన వచ్చిన తరువాత తక్షణం చేపట్టిన కార్యక్రమాలు, తదనంతరం చేపట్టిన పునరావాస (నిర్మాణ) కార్యక్రమాలు ఆయనలోని గాంధేయ స్ఫూర్తికి నిలువెత్తు నిదర్శనాలు. వీటిలో కూడా ఆయన తన బృందంతో కలిసి (ఉదాహరణకు ప్రభాకర్‌జీ, లవణం, హేమలతా లవణం, ప్రభుత్వాధికారులు, ఇతర స్వచ్ఛంద సంస్థలు మొ॥నవి) చేపట్టిన పనులు చాలా విలక్షణం. ఈ మొత్తం వ్యవహారంలో మూడు విషయాలు గమనార్హం.

ఉప్పెన అనంతరం గుట్టలు, గుట్టలుగా పేరుకు పోయిన మృత కళేబరాలు కార్యకర్తలకు పెద్ద సమస్యను తెచ్చాయి. ఒకవైపు వేలల్లో శవాలు. మరోవైపు పొంచివున్న

వ్యాధులు, ఈ సమస్యను అధిగమించుటకు ఆయన తన మిత్రబృందంతో కలిసి 'శవసేవ'ను ఏర్పాటు చేశారు. దీనిలోని సభ్యుల పనిశాలను, కళేబరాలను అత్యంత త్వరితంగా ప్రక్షాళన చేయడమే! దీనితో సమస్యను కొద్దిరోజుల్లోనే అధిగమించారు.

ఉప్పెన బాధితులకు సహాయం, విరాళాలు వెల్లువలా వచ్చాయి. ఈ సహాయాన్ని కులమతాల కతీతంగా అందించేందుకు ఆయన అహర్నిశలు శ్రమించారు. వచ్చిన సహాయం ఏ సంస్థ నుండి వచ్చినా (మత సంస్థ, కుల సంస్థ తదితరాలు) దానిని అందరికీ సమానంగా, సమదృష్టితో పంచడానికి ఏర్పాట్లు చేశారు. ఈ విషయంలో ఎవరు పరిమితులు విధించినా అంగీకరించలేదు. ఉప్పెన - తుఫాను అనుభవాలు ఆనాటికి అందరికీ కొత్తే! కావున, సహాయక, పునరావాస చర్యలన్నీ కూడా ఒక విధంగా ప్రయోగాలే! వీటి నుంచి అనేకులు అనేక అంశాలను నేర్చుకున్నారు. పునరావాస చర్యల్లో భాగంగా ప్రజలకు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను కల్పించాలి. దివిసీమ వంటి గ్రామీణ ప్రాంతంలో ప్రభుత్వం కాని, ఇతర ప్రైవేటు సంస్థలు కాని ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు చూపాలంటే సమయంతో, ఖర్చుతో కూడుకొన్న పని ఈ సమయంలోనే మండలి కృష్ణారావు గారు జీవితాంతం నమ్మి, ఆచరించిన గాంధీజీ సిద్ధాంతాలు, నిర్మాణాత్మక కార్యక్రమాలు ఈ సమస్యకు సమాధానం చూపాయి. దీనిలో భాగంగా గ్రామీణ సమాజంలోని వివిధ వృత్తుల వారికి వారి వృత్తుల్లో ఉపయోగపడే పనిముట్లను పంపిణీ చేశారు. ఆనాటికి ఇదొక కొత్త ప్రయోగం. దీనిని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమ సాఫల్యతను అనేకమంది వ్యక్తులు, దాతృత్వ సంస్థలు గుర్తించాయి. దివిసీమ ఉప్పెన - తుఫాను సహాయక, పునరావాస చర్యలతో మండలి కృష్ణారావు గారి కృషి పరివ్యాపితమై, ప్రపంచమంతా తెలిసింది. ముఖ్యంగా, అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టిసారించిన వారందరికీ దీని ప్రాధాన్యత తెలిసింది.

మండలి కృష్ణారావు గారు అవనిగడ్డలో తాను స్థాపించిన గాంధిక్షేత్రాన్ని ఒక గొప్ప శిక్షణాకేంద్రంగా మలచారు. గ్రామీణ నిర్మాణ కృషిలో భాగమైన కార్యకర్తలందరికీ దానిని శిక్షణనిచ్చే సంస్థగా రూపొందించారు. ఇలాంటి పనిని సాధారణంగా స్వచ్ఛంద సంస్థలో, వ్యక్తులో, దాతృత్వ సంస్థలో చేస్తాయి. ఒక రాజకీయ నేత దానిని చేపట్టడం ఇచట ప్రధానం. ఆయన తరం వరకు గాంధీజీ నిర్మాణ కార్యక్రమాల స్ఫూర్తి కొనసాగింది. దానికి మరికొంత సంస్కరణాభిలాషను రంగరించి ఒక ఉద్యమంలా కొనసాగించిన వ్యక్తి మండలి కృష్ణారావు గారు. ఆయనలోని సంఘశీలత, సంస్కరణాభిలాషలు అందరికీ తెలియవలసిన చారిత్రక అవసరం నేడు వున్నది. ఒక దార్శనికునిగా ఆయన వెలిబుచ్చిన అభిప్రాయం మనం ఇచట గమనించాలి.

మనదేశం గొడ్డుపోలేదు. ఎందరో మహానుభావులు పుట్టారు. పుడతారు కూడాను. న్యాయం కోసం, ధర్మం కోసం ప్రాణాలను త్యాగం చేసినవారూ ఉన్నారు. వెలుగులోకి రానివారెందరో వున్నారు. వీరందరినీ వెతికి బయటకు తీసుకురావడం మనవంతు. ఇది జరిగిన రోజున మనం కొనసాగిస్తున్న సాంఘిక విప్లవంలో మరొకమెట్టు ఎక్కినట్లే భావించవచ్చు.

మండలి కృష్ణారావు గారు వ్యక్తీకరించిన పై భావం సామాన్య నాయకులకు, కార్యకర్తలకు అందే విషయం కాదు. దానికి సంఘశీలత ఉండాలి. సంస్కరణపై అవగాహన ఉండాలి. మార్పుపై మక్కువుండాలి. ఇవన్నీ మండలి కృష్ణారావు గారిలో పుష్కలం. రాజకీయ వ్యక్తిత్వాన్ని మించిన ఆయన సాంఘిక వ్యక్తిత్వం, సంస్కరణ ప్రియత్వం భావితరాలకు తప్పక తెలియాలి. అప్పుడే సాంఘిక మార్పు, అభివృద్ధి ప్రాముఖ్యతను భావితరాలు సరియైన రీతిలో విశ్లేషించుకోగలరు.

**డా. సుందర్ కొంపల్లి**
చరిత్రకారుడు, విమర్శకుడు,
విజయవాడ, ఫోన్ : 9482364838

# నీటి వనరుల సంరక్షణ - కవిత్వపాత్ర

- డా. వై. సుభాషిణి, ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్
- కె. అశ్విని, కో ఇన్వెస్టిగేటర్

**1. పరిచయం :** నీరు సకల జీవరాశులకు ప్రాణాధారం. పుట్టినప్పటి నుంచి మానవుడు చేసే ప్రతికార్యానికి నీరు అవసరం. అలాంటిది ప్రపంచ వ్యాప్తంగా లభిస్తున్న నీటివనరులు, పెరుగుతున్న ప్రజాభారాన్ని మోయలేక వెనుకబడుతున్నాయి. సహజంగా లభించే స్వచ్ఛమైన నీటి వనరులను అభివృద్ధి పేరుతో మనమే కలుషితం చేయడం దురదృష్టకరం. ఈ నేపథ్యంలో తెలుగు కవిత్వం నీటిపరిరక్షణకై తన గళం వినిపిస్తోంది. చెట్లు నరికి వేయడం వలన వర్షాభావం, ఆహార సంక్షోభం, ప్రకృతి వైపరీత్యాలు తలెత్తుతున్నాయి. మరోవైపు భూగోళం వేడెక్కి, ఉష్ణోగ్రతలు పెరిగిపోవడం, వర్షాలు సకాలంలో పడకపోవడం వంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అడవులను కాపాడుకోకపోతే మానవ మనుగడకు అవరోధాలు ఏర్పడతాయి. అడవులు ఎంత సమృద్ధిగా ఉంటే వర్షాలు అంత పుష్కలంగా కురుస్తాయి. నేడు నీటి సమస్య కేవలం ఏదో ఒక ప్రాంతాన్ని కాదు యావత్ ప్రపంచాన్నే కబలిస్తోంది. దేశాలమధ్య, రాష్ట్రాల మధ్య, ప్రాంతాల మధ్య నీటికోసం కత్తియుద్ధాల స్థానంలో నీటియుద్ధాలు జరుగుతున్నాయి. నీటితో కూడా వ్యాపారం చేసే పరిస్థితులు నెలకొంటున్నాయి.

మరోవైపుఉన్న కొద్దో గొప్పో నీటిని కూడా కలుషితం చేస్తున్నారు. దానిమూలంగా నీటిలో జీవించే జీవులు, పక్షులు, జంతువులు నశించిపోతున్నాయి. దానితో జీవావరణంలో ఒకదానికొకటి ఉండే సంబంధం కొరవడుతోంది. ప్రకృతిలోఉండే ప్రతిదీ ఒకదానిపై మరొకటి ఆధారపడటం సహజం. జీవావరణంలో సమతుల్యత సాధ్యమైనప్పుడే ఋతువులు సక్రమంగా తమ విధిని నిర్వర్తిస్తాయి. అడవులు నిండుగా ఉంటే వర్షాలు సకాలంలో కురుస్తాయి. వర్షాలు కురవడం వలన వ్యవసాయం సుభిక్షంగా ఉంటుంది. పక్షులు, జంతువులు సకల జీవరాశులు తృప్తికర జీవనాన్ని అవలంభిస్తాయి.

వర్షాకాలంలో నీటిని నిల్వచేసి తర్వాత పండే పంటలకు, పశువులకు, పక్షులకు ఆధారంగా నిలిచేవి చెరువులు, బావులు మొదలగునవి. జీవరాశికి ప్రాణ సమానమైన చెరువులను, బావులను కలుషితం చేస్తున్నారు. వాటిని పూడ్చి నిర్మాణాలు చేపడుతున్నారు. దాంతో వచ్చే నష్టాలను చూసి చలించిన ఎంతోమంది కవులు చాలా ఆర్ద్రంగా తమ రచనల ద్వారా దృశ్యమానం చేశారు.

**2. నీటివనరుల వినాశనం :** చెరువుల విషాదం చెరువుల ద్వారా మన సంస్కృతీ, సంప్రదాయాలు వెల్లివిరుస్తాయి. చెరువుల ఆధారంతోనే వర్షాభావ ప్రాంతాలలో వ్యవసాయం చేస్తారు. అలాంటిది గ్రామీణ జీవితానికి ప్రాణవాయువులాంటి చెరువులు, వాగులు ఇప్పుడు వ్యర్థాల నిల్వలుగా మారాయి. "సహజవనరులు మన అవసరాల్ని తీర్చడానికే గానీ, మన అత్యాశలను తీర్చడానికి గాదు" అన్నారు జాతిపిత మహాత్మాగాంధీ. కాని నేడు మన సంస్కృతికి చిహ్నమైన చెరువులు మానవ స్వార్థంతో భవనాలుగా, కాలనీలుగా, మురికిగుంటలుగా మారాయి. రచయిత్రులు తమ కవితల్లో చెరువుతీరాన్ని కబళిస్తున్న మానవ మత్తును విమర్శించారు. పల్లె జీవనశైలిలో చెరువులు అందించిన సంతృప్తిని నెమరువేస్తూ, వాటి వినాశనంపై స్పందనను పాఠకుల హృదయాలకు చేర్చారు. "ఒకప్పుడు ఊరందరి దాహం తీర్చిన గ్రామదేవత చెరువు. నేడు అందరూ చీదరించుకొనే మురికి కూపం, చెత్త కుండీగా మారిపోయింది. స్వచ్ఛమైన నీటితో ఆకాశంలో ఎగిరే పక్షుల అందాలని మరింత అందంగా చూపించే అద్దం చెరువు. మా చిన్ననాటి జ్ఞాపకాల సుందరతీరం చెరువుగట్టు" అని కవి నందే వెంకట పద్మావతి గారు తమ ఊరి చెరువు పూర్వశోభను చిత్రించారు. ప్రస్తుతం ఆ చెరువు వ్యర్థాలతో నిండిపోయిందని చెప్తున్నారు. వెన్నెల రాత్రులతో చెరువుగట్టున జానపద కళారూపాలతో ఆప్రాంతం వెలిగిపోయేదని నేడు ఆధునికీకరణ పేరుతో సకల ప్రాణులకు ఆయువుపట్టులాంటి చెరువును అదృశ్యం చేస్తున్నారు. అదే జరిగితే ఊరు ఎడారవుతుంది. సుదూర ప్రాంతాల నుండి వలసవచ్చే పిట్టలు నేలరాలిపోతాయి. ఓ చిన్న ప్రయత్నం పెద్దమార్పుని తెస్తుంది. మనుషులు, పిట్టలు, జీవుల సమాహారం తిరిగి బ్రతికేందుకు ఊరి చెరువుని బ్రతికిద్దాం... ఊరిని బ్రతికిద్దాం! అని నందే

వెంకట పద్మావతిగారు "ఊరిచెరువు" కవితలో తమ ఊరి చెరువు పాడైపోయిన వైనాన్ని సాక్షాత్కరింపజేశారు.

ఒకప్పుడు ఊరిచివరన ఉండే చెరువులు ఊరికే శోభాయమానంగా నిలిచేవి. అంతేకాకుండా సాగునీటికి, తాగునీటికి, పక్షులకు, జంతువులకు చెరువు నీరే జీవనాధారం. కాని నేడు ఆ చెరువులు స్వచ్ఛతను కోల్పోతున్నాయి. వ్యర్థాలతో నిండిపోతున్నాయి. "ఐక్యరాజ్యసమితి 2018 సంవత్సరానికి "నీటి సమస్యకు ప్రకృతిసిద్ధమైన పరిష్కారం" అనే నినాదాన్నిచ్చింది. అంతకుముందు 2016 సంవత్సరంలో "సమ్మిళిత అభివృద్ధి కోసం జలాలు" అనే నినాదాన్ని ఇచ్చింది. ఈ నినాదంతోనే 2018 సంవత్సరంనుంచి 2028వ సంవత్సరం దాకా నీటి నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది. ప్రపంచవ్యాప్తంగా 67 కోట్లమందికి తాగడానికి, గృహావసరాలకు నీరు లభించడంలేదు. కలుషిత నీరు వాడటంవల్ల రోగాల బారిన పడుతున్నారు" (ప్రకృతిని పరిరక్షించుకుందాం!-డా. తూములూరి రాజేంద్ర ప్రసాద్, పుటః 65) అలాగే సకాలంలో వర్షాలు లేక చెరువులు ఎండిపోవడం, వాటి స్థానంలో చెత్తాచెదారాలు వేస్తున్నారు. ఇంకొన్నిచోట్ల కట్టడాలు నిర్మించటం ద్వారా చెరువులు కనుమరుగైపోతున్నాయి. ఇతర ప్రాంతాల నుండి వలస వచ్చే రకరకాల పిట్టలు ఆశ్రయం లేక కనుమరుగైపోతున్నాయని పద్మావతిగారు ఎంతో హృద్యంగా ఈ కవితను మనముందుంచారు.

ఊరికిరక్షణగా, పంటపొలాలకు ఆపద్బాంధవుడిగా, జలచరాలకు వినోదవిలాసినిగా దర్శనమిచ్చే చెరువు కలుషితమై, బీటలు వారిన దైన్యాన్ని చిత్రించే మరో కవిత సడ్లపల్లె చిదంబర రెడ్డి రాసిన "మాఊరిచెరువు". ఈ కవితలో చెరువు గొప్పతనాన్ని వివరించారు. ప్లేగులాంటి మహమ్మారి కంటే భయంకరమైన కరువుభూతం నుండి మా ఊరిని రక్షించేది, అన్ని కాలాల్లోనూ పొంగిపొర్లేది చెరువే అంటున్నారు. మా ఊరి రక్షణగోడలాంటి కొండ, ఆకాశం ప్రతినిత్యం అద్దంలా మెరిసే చెరువులో తమ ప్రతిబింబాలని చూసుకొని మెరిసిపోయేవి. నీటిపక్షులు, కప్పలు చెరువుల్లో సంగీత కచేరీలు చేసేవి. పచ్చని పొలాలు, కొంగలు చెరువు ముంగిట అందంగా ఉండేవి. మా ఊరి చెరువు కల్పతరువు. మాలో మట్టిపరిమళాలు నింపి మమ్మల్ని మనుషులుగానే ఉంచేది. అమ్మఒడికి, పొలంతల్లి ఒడికి తేడా లేకుండా బతికినోల్లం అంటూ కవి తన స్వానుభవాన్ని వ్యక్తీకరించారు. అలాంటిది నేడు కాలమే అసూయ సర్పమై కాలుష్యకోరలతో మేఘాల్ని తన్నుకుపోయి చెరువు ఎడారి అయ్యింది. ఎండి నెర్రెలు చీలిన మా చెరువు పాదె మీదుంచిన మా అవ్వ నోరులాగా ఉందని ఎండిపోయిన చెరువు దుస్థితిని విశదీకరించారు. "ప్రాథమిక విధుల్లో భాగంగా చెరువులు, నదులు, సరస్సులు, వన్యప్రాణులు, వన సంరక్షణ, జీవవైవిధ్యాన్ని కాపాడటం పౌరులవిధి (రాజ్యాంగంలో 51(A) నిబంధన). అయినా మనిషిలో ఎలాంటి మార్పు లేదని వాపోతున్నారు కవి. మరోవైపు ఒకప్పటి తమ ఊరి చెరువు వైభవాన్ని ప్రకృతిలోని ప్రతిభాగంతో మమేకం చేసి చెప్పడం విశేషంగా ఉంది. చెరువులు ఎంత సమృద్ధిగా ఉంటే పంటలు అంత పుష్కలంగా పండుతాయి. పచ్చగా పండే పొలాల్లోకి కొంగలు వచ్చి వాలటాన్ని సంక్రాంతి ముగ్గుగా అభివర్ణించారు. "పొలాలంతా చెరువు గుడి ముంగిట/ ఆకుపచ్చని కల్లాపి చల్లినట్టు ఉంటే/ కొంగల వరుసలు ముచ్చటగా/ సంక్రాంతి ముగ్గులు దిద్దినట్లుండేవి" అంటూ ప్రకృతి అందాన్ని చిత్రించారు. ఇలా ఎన్నో రకాల ప్రయోజనాలున్న చెరువు, కాలుష్యం చేత మేఘాలు కురవక పోవటం చేత ఎండిపోయి ఎడారిగా మారిపోయిందంటారు కవి. "కాలమే అసూయా సర్పమై కాటు వేసిందో/ కాలుష్యపు ఏ రెక్కల రాక్షసబల్లి/ చినుకుల మేఘాల్ని మా/ నింగి పందిరి నుండి తన్నుకు పోయిందో?/ ఆకు పురుగు కొరికి ఈ నేలే వేలాడే/ నిరాధార ఎడారి ముళ్ళకంపయ్యింది" అనడంలో కాలుష్యం తీవ్రత అవగతం అవుతుంది. నీటి విషయంలో నేటి సమాజ వైఖరిని తెలియజేస్తూనే, భవిష్యత్తులో కలిగే ఇబ్బందుల్ని కవిత్వీకరించారు. ఎండిపోయిన చెరువును 'ఖాళీగంగాళం', 'ఒట్టికుండ' వంటి ప్రతీకలతో పోల్చడం విషాదాంతానికి నిదర్శనం.

**3.పునర్నిర్మాణ అవసరం :** భూగర్భ జలాల క్షీణతః ఇప్పటి వరకు త్రాగునీటిని భూమి ఉచితంగా ఇచ్చేది. ఇప్పుడు నీటిని కొనడం అనివార్యమవుతోంది. అది వాణిజ్య వస్తువుగా మారింది. కవులు ఊరంతా రిక్తంగా మారిపోతున్న దృశ్యాలని చూపిస్తున్నారు. ఇది కాలం గడిచినా మానవుడు చేయకూడని తప్పిదాన్ని గుర్తుచేస్తుంది. నీటివృథాకి, భూగర్భ జలాలు ఎండి పోవడానికి మానవుని నిర్లక్ష్యమే కారణమంటూ, దానిమూలంగా మానవ మనుగడే అదృశ్యమైపోయే ప్రమాదం ఉందని తెలిపే కవిత డేవిడ్ విల్సన్ వ్రాసిన "ఎద్దడి". ఎక్కడో గల్ఫ్‌దేశాల్లో ఉన్న నీటిఎద్దడి ఇప్పుడు భారతదేశంలోకి ప్రవేశించింది. నీటిని

కూడా కొనుక్కోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. మనిషికి నీరే ప్రాణాధారం. చెట్లను విరివిగా నరికేయటం వలన భూమి వేడెక్కి వర్షాలు లేక భూగర్భజలాలు ఇంకిపోయి నీటిఎద్దడి ఏర్పడుతోంది. ఒకప్పుడు ఎవరి ఇంటిముందుకైనా వెళ్లి నీళ్లు అడిగితే కడుపునిండా మజ్జిగ ఇచ్చేవాళ్లు. కానీ ఇప్పుడు నీళ్లు అడిగితే అదేదో వింతవస్తువు అడిగినట్టు ముఖం చిట్లించుకుంటున్నారంటారు దేవిడ్విల్సన్. పూర్వం ప్రతి ఊరిలో మంచినీటి బావులుండేవి. ఇప్పుడు ఆ బావులు ఊరు ఉమ్మడి డస్ట్బిన్లుగా మారాయి. తరువాత హ్యాండ్బోర్లు వచ్చాయి. కొంతకాలానికి భూగర్భజలాలు ఇంకిపోయి అవి మూలనపడ్డాయి. ఇటువంటి పరిస్థితులు ఏర్పడడానికి కారణం నీటిని ఇష్టంవచ్చినట్లు వృధా చేయడమే. కుళాయిలో నీరు కారిపోతున్నా దానిని ఆపలేని సోమరితనాన్ని ఎత్తి చూపించారు. మరోవైపు మనం అడవుల్లో విధ్వంసాల్ని ఆపాలి. సామాజిక అడవుల్ని పెంచాలని ప్రోత్సహించారు. చెరువులు, బావులను పూడిక తీయించి పర్యావరణాన్ని కాపాడుకోకపోతే, కొద్దిపాటి నీటివనరుల్ని బాధ్యతగా బ్రతికించుకోకపోతే, జలంలాగే జనం కూడా అదృశ్యమై పోతారని కవి ఈ కవితలో ఆవేదన చెందుతున్నారు.

ఒకప్పుడు పల్లెటూర్లు ఎంతో శోభతో వెలిగేవి. ఊరు చెరువులు, బావులు పచ్చనిపొలాలతో అందంగా ఉండేవి. అప్పటి మనుషుల్లో స్వార్థం ఉండేది కాదు. వనరులను ఎవరికివారు బాధ్యతగా కాపాడేవారు. బావులు, చెరువులు పరిశుభ్రంగా ఉండేవి. కాలక్రమేణా పరిస్థితులకు అనుగుణంగా మనిషి స్వార్థపరుడయ్యాడు. వనరులు కలుషిత బాటపట్టాయి. చెట్లు వర్షానికి నేస్తాలు, అదే చెట్లను నరికేస్తే వర్షాలు పడవు, వర్షాలు పడలేదని ఆక్రందిస్తే ఏంలాభం ఉండదు. "జలనిష్క్రమణానికి పచ్చదనాన్ని పట్టించుకోకపోవడం/ వృక్షాల్ని నరికి నరికి పోగులు పెట్టడం/ మరో వికృత సగం అని విస్మరిస్తే ఎలా?/ కాలుష్యకారకాలని ఇష్టారాజ్యంగా/ నింగిలోకి వదిలేస్తూ/ ఏమిటోఈమేఘాలు/ ఇట్లా వట్టిపోతున్నాయని/ ఆక్రందిస్తే  నేరం ఎవరిది?/ ప్రకృతిలో వికృతులు పెరిగేందుకు/ మానవ స్వయంకృతినేకదా! కారణాలు" అని మానవ తప్పిదాలు, నిర్లక్ష్యం ప్రకృతిని ఎంత ధ్వంసం చేస్తున్నాయనే విషయాన్ని తేటతెల్లం చేశారు.

ఇప్పుడు నీరుకూడా వ్యాపార వనరు అయిపోయింది. దీంతో వ్యాపారులు నీటిని రకరకాలుగా ప్యాకింగ్‌చేసి సొమ్ము చేసుకుంటున్నారు. సహజ వనరుల్ని కూడా డబ్బుతో కొనాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి అంటే దానికి కారణం మనిషి స్వార్థమే. ఉన్న కొద్దిశాతం నీరుకూడా కలుషితమే. "ఎక్కడా నీటిచెమ్మలేదు/ చేరబిలిచే చెలమాలేదు/ కంటబడ్డ నీళ్లుత్రాగలేం/ దొరికిన జలధారలని వాడుకోలేం/ ఏ నీటిచుక్కలో ఏ విషాణువు/ పొంచి ఉంటుందోనన్న చింత/ అంతా సంశయగ్రస్త వ్యవహారం/ ఇప్పుడు మంచినీరు/ కాసులు రాల్చే గొప్ప వ్యాపారపు సరుకు/ రకరకాల సీసాల్లో నింపి/ సొగసైన లేబుళ్లతో/ రవాణాచేసే ఖరీదైన వనరు" అంటూ సహజ వనరులు నాశనమవుతున్న దౌర్భాగ్యస్థితిని కళ్ళ ముందుంచారు." పర్యావరణాన్ని కాపాడుకోకపోతే/ మిగిలిన కొద్దిపాటి నీటివనరుల్ని/ బాధ్యతగా బ్రతికించు కోకపోతే/ మనిషి కథ ఇక ముగింపుకు చేరినట్టే/ జలంతోపాటు/ జనమూ అదృశ్యమైపోయినట్టే" అంటూ మానవాళిని హెచ్చరిస్తున్నారు.

పల్లెల్లో కాకుండా పట్నంలో కురుస్తున్న వర్షాన్ని ఉద్దేశించి మనుషులకు లాగానే నీకు కూడా పట్నంపోకడ వచ్చిందా? మాతో పంతంమాని పల్లెల్లో వర్షం కురువు అంటూ మేఘానికి చెప్తున్నట్టుగా మహబూబ్ బాషా చిల్లెం రాసిన కవిత  "మేఘానికి మనవి". ఇప్పుడు మా ఊళ్లో మేఘమైతే ఉంది. ఆ మేఘానికి జాలిలేదు. వర్షం కురవదు. మా కన్నీటిని తుడవదు. రైతుల బతుకుల్ని బండచేసి వెళ్ళిపోతుంది. ఇలా వచ్చి అలా వెళ్ళిపోతావు. కరుణించి రైతుల జీవితాలను నిలబెట్టు. మా పల్లె ఒకప్పుడు పాడిపంటలతో కళకళలాడేది. ఇప్పుడు పాడెమీద చేరి పిచ్చిచూపులు చూస్తుంది. మాతో పంతం ఎందుకు ఒక్కసారి మా పల్లెను పలకరించిపోరాదు. మాకు కావాల్సింది అతివృష్టి, అనావృష్టికాదు. నిత్యం కష్టపడే రైతుకి నీరు, శ్రమ కావాలి. మా పల్లె మునుపటిలా పాడిపంటలతో పులకరించాలి. జయహో వ్యవసాయం అని మాగాణి వీధులన్నీ మారుమ్రోగాలి. అది నగరంలో వానవల్ల కాదు. నీ రాకతో మాపల్లె మట్టితో సాధ్యమౌతుంది. దానిని సుసాధ్యం చేసే దమ్ము నీకుందా అంటూ కవి మహబూబ్ బాషా చిల్లెంమేఘానికి సవాళ్ళు చేస్తూ ఈ కవితను రాశారు." నగరాన్ని నాన్పుతావ్/ పల్లెల్లో ముఖం చాటేస్తావ్ / పట్నంపోకడ నీకూ వంటబట్టిందేమో/ అట్టొచ్చి అటువెళ్లిపోతావ్/ కరుణించి కురిసి/ మా కన్నీటిని ఆపు/ మా బడుగు రైతుల జీవితాల్ని నిలుపు" అనే మాటల్లో నాగరికత పెరిగిన తీరు తెలుస్తోంది. నగరంలో కురిసే వానవల్ల ప్రయోజనం లేదు. అదే పల్లెల్లో కురిస్తే పంటలు

సుభిక్షంగా పండుతాయి. వ్యవసాయమే ఆధారంగా బ్రతికే ఎన్నో కుటుంబాలు విలవిల్లుతాయని మేఘానికి మొరపెట్టుకొంటున్నారు.

పాడిపంటలతో వర్ధిల్లిన ఒక పల్లె నేడు వర్షంలేక పంటలు పండక, వర్షంరాక కోసం ఎదురుచూస్తున్న వేదనే ఈ కవిత. మేఘావృతమైనప్పటికీ నేడు వర్షాలు పడని పరిస్థితులు ఎక్కువవుతున్నాయి. దానికి కారణం పెరిగిపోతున్న కాలుష్యం. సాంకేతికత పెరిగిపోవడం, పల్లెలు నగరరూపును దాల్చడం, అడవుల నరికివేత వంటివి ఎన్నో దానికి కారణాలుగా నిలుస్తున్నాయి. తద్వారా వర్షాలు పడకపోవడం, పంటలు పండకపోవడం, రైతు జీవితం స్తంభించిపోవటం జరుగుతుంది. "ఇప్పుడు మాఊర్లో/ మేఘమైతే ఉంది/ దానికి జాలైతే లేదు ఎందుకో....?/ తను కన్నీరు కార్చదు/ మా కన్నీటిని తుడవదు/ మా బతుకుల్ని బండకేసికొట్టి / బడాయిగా తుర్రుమంటుంది" అని కవి వర్షం పడకపోతే వ్యవసాయం లేక రైతు ఏవిధంగా నష్టపోతాడో విశదీకరించారు.

**4.సముద్రకాలుష్యం – అణువ్యర్థాలముప్పు :** నందే పద్మావతి తన కవితలో సముద్రం ఎలా వ్యర్థాల మిగులు నిల్వగా మారిందో వివరించి, మానవ జడత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. ఆమె పదాలు సముద్రపు హృదయాన్ని బాధించేలా ఉన్నాయి. సముద్ర జీవనాన్ని నాశనం చేసే వ్యర్థాల సమస్య కవిత్వంలో భయానక చిత్రంగా దర్శనమిస్తుంది. సముద్రం ఎన్నోరకాల జీవులకు, సంపదకు ఆలవాలం. అలాంటి సముద్రాన్ని కూడా మనిషి విధ్వంస చర్యలు నాశనం చేస్తున్నాయి. ప్రపంచీకరణ ప్రభావంతో అనేక కంపెనీలు రావడం వాటి వ్యర్థాలను సముద్రంలో వదలటం మూలాన కలిగే అనర్థాలను, సముద్రాన్ని రక్షించుకోవాల్సిన ఆవశ్యకతను తెలిపే మరో కవిత డేవిడ్ విల్సన్ వ్రాసిన "సముద్రాన్నిబ్రతకనిద్దాం". అమృతమూర్తి లాంటి సముద్రం మనిషి విసిరే విష వ్యర్థాలతో చచ్చిపోతోందంటారు కవి. సముద్రంలో ఎన్నో జీవులు, మొక్కలు జీవిస్తుంటాయి. కర్మాగారాలు, ఫ్యాక్టరీల నుండి వచ్చే వ్యర్థాలను సముద్రంలో వదలటం, పెట్రోలు తవ్వడం, అణ్వాయుధాలను లోపల దాచటం వంటి చర్యల వలన సముద్రం మృతమైపోతోంది. సముద్రాన్ని కాపాడటానికి తీరాన అడవులు కూడా లేవు. వాటిని కూడా మనిషి నాశనం చేసేస్తున్నాడు. ఉప్పుతో, చేపలతో సరిపెట్టుకోకుండా ఇంకా ఇంకా సముద్రాన్ని పిండి పిప్పి చేస్తున్నాడు మనిషి. సముద్రంపై ఈ భయానక దాడిని ఆపి, చల్లని సముద్రాన్ని కాపాడుకోకపోతే ఎలా? రండి సముద్రాన్ని బ్రతికిద్దాం అంటూ జాతికి పిలుపునిస్తున్నారుకవి. సముద్రం చాలా విశాలమైంది. కానీ అంతర్భాగంలో విలువైన సంపదలు దాగి ఉన్నాయి. అంతేకాకుండా ఎన్నోరకాల జలచరాలు, సముద్రపు మొక్కలు జీవిస్తుంటాయి. మానవుడు దుశ్చర్యలతోవాటికి స్వేచ్ఛ లేకుండా చేస్తున్నాడు. అంతర్భాగంలో పెట్రో పైపులైన్లు, ఇతర కేబుల్ లైన్లు వేసి, సంపదను కొల్లగొట్టడానికి డ్రిల్లింగులు పెట్టి సముద్రాన్ని కంపింప చేస్తున్నాడు. కర్మాగారాల నుండి, జనావాసాల నుండి వచ్చే వ్యర్థాలు అన్నింటినీ సముద్రంలోనే వదులుతున్నారు. దీంతో సముద్రం కలుషితమైపోయి ఎన్నోజీవులు, మొక్కలు నశించిపోతున్నాయి." సముద్ర గర్భంలో/ ఇప్పుడు ఏ క్షేమము లేదు/ దాని అంతర్ వాయువుల్ని చీలుస్తూ/ దశదిశలా పెట్రోపైపులైన్లు/ తదితర కేబుళ్ళ శతసహస్రాలు / గుండెను చిల్లులు పొడిచే/ రాక్షసపు డ్రిల్లింగులు/ సముద్రతీరాన ఇప్పుడు కాపుకాచే/ మడ అడవులు లేవు/ ఏ రక్షణ కవచాలు లేవు / కర్మాగారాల, జనావాసాల/ మురుగంతా సముద్రంపాలే" అంటూ సముద్రం కాలుష్యం పెచ్చుపెరిగి, పర్యావరణానికి ముప్పు వాటిల్లుతున్న తీరును కవిత్వీకరించారు.

సముద్రం నుండి ఉప్పును, చేపలను సహజంగా పొందడం వేరు. కానీ యంత్రాలు ఉపయోగించి మరీ సముద్రాన్ని జల్లెడపట్టి సంపదలను కొల్లగొట్టడం అరాచకం అంటున్నారు కవి. అంతేకాకుండా యుద్ధాల కోసం, అణుబాంబులను, సముద్రంలో దాచేస్తున్నారు. అనుకోని సందర్భాల్లో అవి పేలితే సముద్రంలోని జీవులకు తీరని నష్టం కలుగుతుంది."రేపటియుద్ధాల కోసం/ కపట మానవుడు దాచుకునే/ మారణాయుధాల నిల్వలు, అణుధార్మికవ్యర్థాల/ గోడౌన్లుగా మారిపోయి సముద్రం తల్లడిల్లిపోతోంది/ లోపల అంతా అసహజాలు చేరిపోతుండగా/ జలచరాలు, సముద్రపు మొక్కలు/ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతికేస్తున్నాయి" అంటూ సముద్ర ఘోషను కళ్ళకు కట్టించారు కవి. మనం మన ఆశయాలను రక్షించుకొనే సందర్భంలో ఇతరుల్ని బలి పెట్టడానికి కూడా వెనుకాడరన్నది ఈ కవిత ద్వారా తెలుస్తోంది.

"మేఘాల్ని పంపి నేలపై/ వానచినుకుల ముత్యాల్ని చల్లే/ చల్లని సముద్రాన్ని బ్రతికించుకోకపోతే ఎలా?/ భూగోళాన్ని ఆవరించిన ఈ/ నీలాల జలాశయాన్ని/

రక్షితప్రాంతంగా ప్రకటించుకోకపోతే ఎలా?/ నిర్భయంగా నీటిలో సంచరించే/ జలజీవులకు భద్రత కల్పించకపోతే ఎలా?/ కడలిని కాలుష్యం బారినుండి/ కాపాడకపోతే ఎలా?/ అని కవి ప్రశ్నిస్తున్న తీరు ప్రకృతి సంపదను రక్షించుకోవాల్సిన ఆవశ్యకతను, దానిపై ప్రతిపౌరునికి ఉండాల్సిన బాధ్యతను గుర్తుచేసినట్టయ్యింది. "శుభ్రమైన గాలి, నీరు మనందరి హక్కు మరియు మన బాధ్యత అందులో బాధ్యతగా మన పరిసరాలలో ఏదైనా కాలుష్యం జరగడానికి ఏదైనా పరిశ్రమ కారణమని తెలిస్తే సామాన్య మానవుడిగా ఈ విషయంపై సదరు అధికారికి ఫిర్యాదు చేయడం మన ప్రాథమిక బాధ్యత అని మనం ఎప్పటికీ మరువకూడదు. మానవ సమాజం వాడుతున్న అనేక పదార్థాలలో ఆరోగ్యానికి హానిచేసే విషపదార్థాలు అనేకం ఉంటున్నాయి. ఏ వస్తువులను ఏ అవసరానికి వాడుతున్నామో తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇలా చేయడం మనకు మన పర్యావరణానికి కూడా మేలు చేస్తుందం"టారు ఎన్. కౌసల్యాదేవి (మనమూ మన పరిసరాలు సామాన్యుడికి పర్యావరణ పరిచయం, పుటః 45) అది ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకొని మసలుకోవాల్సిన అవసరాన్ని ఈ కవిత చాటింది.

నది ఒక జీవనవేదం. ఒక ఆహ్లాదకర వాతావరణం. నదికి ఇసుకే ప్రాణం. అటువంటి ఇసుకను కొల్లగొట్టుకు పోతున్న మానవపోకడలను, నది శిథిలావస్థకు చేరుతున్న తీరును తెలిపే మరో కవిత సడ్లపల్లె చిదంబరరెడ్డి గారు రాసిన "నీటిబొమ్మ". పెన్నానది గొప్పదనాన్ని కవి ఈ కవితలో చాటారు. జీవనపోరాటాన్ని, ఈతను నది నేర్పిస్తుంది. గొర్రెలకు, బర్రెలకు, నీటికోళ్లకు, మనుషులకు దాహాన్ని తీరుస్తుంది. దిగాలు పైరు ముఖాల్లో చిలకపచ్చని వెలుగులద్దిన జల అని నదిని ప్రశంసించారు. రైతు బ్రతుకులకు భరోసా ఇచ్చే నది నేడు జ్ఞాపకాల నీటిబొమ్మగా మారిందని వాపోయారు. నదికి జీవమైన ఇసుకే నగరవాసుల భోగాలకు బలై, దుశ్శాసన నికృష్టానికి వలువలు పోగొట్టుకున్న ద్రౌపదికి వారసురాలైందంటున్నారు. నదిగట్టుమీదున్న పల్లెలు ప్రపంచీకరణ ప్రభావానికి చిరిగిన విస్తరాకులయ్యాయి. ఇప్పుడు పెన్నానది నిర్జీవశిథిల శకలం. కాలిబూడిదైన ఒక వసంతవనం – అంటూ నది అవస్థను కవనం చేశారు కవి. గొర్రెలకు, బర్రెలకు, కొంగలకు, నీటికోళ్లకు దాహాన్ని తీర్చే జల నేడు నిలబడితే మురిగిపోతావని/ ముందుకు సాగడం నేర్పిన జల!/ దిగాలు పైరు ముఖాల్లో/ చిలకపచ్చని వెలుగులద్దిన జల!/అంటూ ఆత్మరక్షణే కాదు, పరోపకారగుణం కూడా నదీజలానికి ఉందని వ్యక్తీకరించిన కవిత ఇది.. ఇసుక నీటిని పొదువు చేస్తుంది. నీరు ఊరేలా చేస్తుంది. ఇసుక నీటికి మిత్రునితో సమానం, అలాంటి ఇసుకను నగరాల్లో పెద్దపెద్ద భవంతుల నిర్మాణానికి కొల్లగొట్టుకు పోతున్న తీరును చెబుతూ– "నది మానాన్ని కాపాడే ఇసుక/ నగరబకాసురుల భోగాలకు బలై/ దుస్సాసన నికృష్టానికి వలువలు/ పోగొట్టుకున్న/ ద్రౌపదికి వారసురాలయ్యింది!" అంటారు. నది జవసత్వాలు కోల్పోతున్న వైనాన్ని ద్రౌపదితో పోల్చి చెప్పారు కవి సడ్లపల్లె చిదంబరరెడ్డి.

"నీరు ఎంత అమూల్య మైందో బావి ఎండిపోయే వరకు తెలియదు" అంటారు థామస్ పుల్లర్. దీనికి ప్రత్యక్ష నిదర్శనమే సడ్లపల్లె కవిత– "నదిగట్టు పల్లెతనాలు ఎండి/ ప్రపంచీకరణ గాలిదుమారానికెగిరి/ పట్టణాల్లో రాలి పోతున్న/ చిరిగిన విస్తరాకులయ్యాయి!" అన్నమాటలు నదులు ఎండిపోయి వ్యవసాయం లేక పల్లెలు ఖాళీయై పట్టణాల్లో పడుతున్న బాధలను వ్యక్తం చేస్తున్నాయి.

**5. కవిత్వం పర్యావరణానికి మేలుకొలుపు :** కవులు వారి రచనల ద్వారా మానవునికి ప్రకృతిని ప్రేమించండి, పరిరక్షించండి అని విజ్ఞప్తి చేస్తున్నారు. కొండపల్లి నీహారిణి, డేవిడ్ విల్సన్, నందె వెంకట పద్మావతి, సడ్లపల్లె చిదంబర రెడ్డి వంటి కవులు పర్యావరణ సమస్యలను వ్యక్తిగత బాధగా తీసుకొని, వాటిని సామాజిక బాధ్యతగా మార్చారు. స్వచ్ఛమైన ప్రకృతి ఆనవాళ్లను దూరం చేసుకుంటే మానవుల బ్రతుకులు యాంత్రిక బతుకులవుతాయని, చిన్న ప్రయత్నం పెద్ద మార్పును తెస్తుందని, తిరిగి మనుషుల, పిట్టల జీవన విధానాలను తిరిగి పునర్నిర్మించు కుందామన్నారు నందె పద్మావతి. "జీవం నిర్జీవమైతే, నడిచేవి యాంత్రిక బతుకులు/ కళతప్పిన జీవితాలు/ ఓ చిన్న ప్రయత్నం పెద్దమార్పును తెస్తుంది/ మనుషులు, పిట్టలు, జీవుల సమాహారం/ తిరిగి బ్రతికేందుకు, ఊరి చెరువుని బ్రతికిద్దాం.../ ఊరిని బ్రతికిద్దాం!" అని స్వచ్ఛమైన జీవనవిధానానికి అంకురార్పణ చేయాల్సిన బాధ్యత మన అందరిదీ అని పిలుపునిచ్చారు.

జనాభా పెరుగుదల కారణంగా మానవ ఆక్రమణలకు, పూడికలకు చెరువులను తిరిగి శోభాయమానంగా తీర్చిదిద్దాలని ప్రజలను జాగృతపరిచే కవిత డాక్టర్ కొండపల్లి నీహారిణి రాసిన" చెరువు మనకాదరువు".

వానాకాలంలో వాగులు వంకలు పొంగిపొర్లి చెరువు సమృద్ధిగా నిండేది. దానిద్వారా సాగు ఎక్కువై ఆ చెరువుకు సేద్యపు చెరువు అనే పేరు వచ్చేది. అలాంటి శోభతో ఉండే చెరువులు నేడు కాలుష్యానికి గురయ్యాయి, కనుమరుగవుతున్నాయి. బంకమట్టి బతుకమ్మకు మెట్టినిల్లు. చెరువు కరువునే కాదు, కష్టాలను తీరుస్తుంది. అటువంటి చెరువు బురదను తోడి, పూడిక తీసి శోభను చేకూరుద్దాం అనే మేల్కొలుపునిస్తుంది ఈ కవిత.

వానాకాలంలో వాగులు, వంకలు పారి చెరువులో చేరుతాయి. ఆ చెరువు నీరు వ్యవసాయానికి ఎంతో ఉపయోగపడుతుందంటూ చెరువును దాని ప్రయోజనాలను కవి చక్కగా వర్ణించారు. అలాగే పశు పక్ష్యాదులకు ఆ నీరు జీవనాధారం. నాగరికత పెరిగిపోయి నేడు ఆ చెరువులు అనేక రకాల వ్యర్థాలతో పూడిపోతున్నాయి. వాటిని ప్రభుత్వాలు బాగుచేయకపోగా, ప్రజలు, ప్రభుత్వాలు చెరువు ప్రాంతాలను ఆక్రమించి వాటి స్థానంలో నిర్మాణాలు చేపడుతున్నాయి. ఇలా చేయటం వలన వ్యవసాయానికే కా దు మానవ మనుగడకే ముప్పు వాటిల్లుతుందనే విషయాలను అవగతం చేశారు కవి. “తోద్దాం బురద ! తీద్దాం పూడిక ! ప్రతి ఒక్కరి ఇంగితం, పూనికొక్కటే కర్తవ్యం! సర్వజలజీవపువ్వులు నవ్వుల బుడగలు/ బంగారు బంకమట్టి బతుకమ్మల మెట్టిల్లు/ గునుగుబువ్వ తెలుపు వంటి భావభాష్పధారల చెరువు/ కరువుదీర్చు, కష్టందీర్చు, చూడొక్కతీరు చెరువు” అంటూ కవి చెరువు శోభను, ప్రయోజనాలను తెలియజేయడమే కాకుండా, చెరువును పునర్నిర్మించుకుందాం రండి అనే స్ఫూర్తిని నింపారు.

**6. పరిష్కారమార్గాలు :** మంచినీరులాంటిదే మంచిజ్ఞానం. అందుకే పెద్దలు “అభిర్గాత్రాణిశుద్ధ్యంతి” “బుద్ధిర్జ్ఞానేనశుద్ధ్యతి” అన్నారు. కనుక జలాన్ని సృష్టించ లేకపోయినా, దాన్ని సంరక్షించుకుంటే మనం రక్షించబడతామనేది ప్రతిఒక్కరూ తెలుసుకొని మసలుకోవాలి. దీనికోసం కొన్ని పరిష్కార మార్గాలను అవలంబిస్తే విజయం సాధించిన వాళ్ళమవుతాం కనుక శుద్ధి కాకుండా ఏ నీరు బయటికి పోకుండా మలినాలను శుద్ధిచేసే ప్లాంట్లు నిర్మించాలి. “నీటికొరతను నివారించడానికి 1960 సం.లో డా. కె. ఎల్. రావు 2640 కి.మీ. పొడవైన కాలువ ద్వారా గంగానదీ జలాలను కావేరీనదికి మళ్లించడానికి “గంగా- కావేరి అనుసంధానం'' ప్రక్రియను ప్రారంభించారు. 4200 కి.మీ. హిమాలయ ప్రాంత కాలువను, 9300 కి.మీ. ద్వీపకల్ప కాలువతో అనుసంధానించడానికి కెప్టెన్ దసూర్ గార్లెండ్ కాలువ పథకాన్ని రూపొందించారు. ఇవి అంతర్ రాష్ట్ర నదులు కావడం వల్ల రాష్ట్రాల మధ్య అవగాహన లేమితో ఈ ప్రణాళిక కార్యరూపం దాల్చలేదు” (ప్రకృతిని పరిరక్షించుకుందాం!- డా. తూములూరి రాజేంద్ర ప్రసాద్, పుటః 66) ఈ పథకాలు గనుక అమలైతే కొంతవరకు పరిష్కారం దొరకవచ్చు.

చెరువుల వద్ద ప్లాస్టిక్ నిషేధించాలి. వ్యవసాయంలో సేంద్రీయ పద్ధతులకు ప్రాధాన్యమివ్వాలి. నీటి విలువలను పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు నేర్పాలి. అంతేకాకుండా గ్రామసభలు, మహిళా సంఘాల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. నిబంధనలు ఉల్లంఘించే పరిశ్రమలపై భారీ జరిమానాలు, మూసివేతలు అమలు చేయాలి. ప్రభుత్వ గెజట్లలో మలినాల ప్రమాణాలను ఖచ్చితంగా స్పష్టం చేయాల్సిన అవసరమూ ఉంది. వీటన్నిటితో పాటు వర్షపు నీటిని భూగర్భ జలాలుగా నిల్వచేసేందుకు రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. గృహాల నుండి వచ్చే మురికి నీటిని తిరిగి ఉపయోగించే ‘గ్రే వాటర్ రీసైక్లింగ్’ పద్ధతులను ప్రోత్సహించాలి. అయితే ఇవన్నీ జరగాలంటే ప్రజల సహకారం కీలకమన్నది గుర్తించాలి.

**ముగింపు:** నీటి కాలుష్యం మానవుడు చేసిన అప్రతిహత చర్యల ఫలితమే. ఇది మానవాళిని ప్రమాదంలో నెట్టుతుంది. కనుక ఈ సమస్యకు పరిష్కారం ఏ ఒక్కరి వల్లనో సాధ్యంకాదు. ప్రజల భాగస్వామ్యం ద్వారానే సాధ్యం. పాలకులు, పరిశ్రమలు, ప్రజలు అందరూ తమ కర్తవ్యాన్ని నిర్వర్తించినపుడే నీటికి జీవం ఇవ్వగలం. మన భవిష్యత్తును కాపాడుకోగలం. ఈ దిశగా వ్యవస్థాపిత చొరవ చూపాలి, బాధ్యతాయుత ప్రవర్తనతో, నిరంతర అవగాహనతోనే శుభ్రమైన నీటి భవిష్యత్తు సాధ్యమవుతుంది. కనుక అందరూ కలిసికట్టుగా కృషిచేస్తే, నీటి స్వచ్ఛతను తిరిగి తెచ్చుకోవచ్చున్నది ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకొని మన జలరాశులను కాపాడుకోవాలని ఆశిద్దాం.

డా. వై. సుభాషిణి, ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్
కె. అశ్విని, కో ఇన్వెస్టిగేటర్
శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం,
తిరుపతి, ఫోన్ : 9000102394

# రమణీయం నార్వే దేశం

ఆంగ్లం - డా. నిమ్మగడ్డ శేషగిరి రావు

తెలుగు - శ్రీమతి అట్లూరి జయశ్రీ



లోఫొటెన్ దీవులు, నార్వే

ఐరోపా పటం చూసినప్పుడల్లా, దాని ఉత్తర భాగంలో ఒక గొడుగు లాంటి ఆకారం మన దృష్టిని ఆకర్షిస్తుంది. ఇదే స్కాండినేవియా ప్రాంతం. నిజానికి ఇది మూడు దేశాల కలయిక. ఇక్కడ ఉత్తరపు అంచులో ఉండే దేశమే నార్వే. భౌగోళికంగా, నైసర్గికంగా కూడా దాని ప్రత్యేకత దానిదే. ఐరోపా ప్రధాన భాగంలో కనపడే దేశాలను ఉత్తర ధృవం నుండి వీచే, ఉధృత శీత గాడ్పుల నుండి పరిరక్షించటానికి ఏర్పడిందా!! అన్నట్లుండే ఈ స్కాండినేవియా భూభాగం, యాధృచ్ఛికంగా కొంతవరకు ఈపని చేస్తుంది. కోట్ల సంవత్సరాల క్రిందట, భూ మండలం మీది పర్వతాలు, సముద్రాలు అన్నీ మంచు గడ్డగా ఏకమై ఉన్న కాలంలో ఏర్పడిన హిమనీనదాలు, కాల క్రమంలో కరుగుతూ, వాటి క్రింద కప్పబడి ఉన్న పర్వతాలను, సముద్ర గర్భం లోపలి వరకు, కొన్ని వందల మీటర్ల పాటు కోసుకుంటూ పోవటం వలన ఏర్పడిన ఈ గొడుగు అంచు వంకర టింకరగా, కుచ్చులుగా కుచ్చులుగా కత్తిరించబడినట్లు కనపడుతుంది. సముద్రపు పాయలు, పర్వతాల మధ్యగా చోటు చేసుకుంటూ, నేల మీదకు చొచ్చుకుని వచ్చి, చిక్కురొక్కురుగా పరచుకున్న సముద్రుడి జటాజూటంలా కనపడతాయి. వీటిని 'ఫియోర్డ్' అంటారు. ఆర్కిటిక్ మహాసముద్రం, నార్వేజియన్ సముద్రంగా, ఐరోపా ఖండాన్ని చేర వచ్చి, తీరంతో కొన్ని యుగాలుగా ఆడిన సయ్యాటల ఫలితమే, ఈ నైసర్గిక పరమాద్భుతం. ప్రకృతి హేల.

నార్వే, స్వీడన్, ఫిన్లాండ్ మూడూ కలసి 'స్కాండినేవియా'. వీటితో పాటు డెన్మార్క్, ఐస్లాండ్ దేశాలను కూడా కలిపి నోర్డిక్ దేశాలని పిలుస్తారు. ఈ అయిదు దేశాలను జత పరచేదే సుసంపన్న నోర్డిక్ సంస్కృతి, చరిత్ర. విశదంగా చెప్పవలసి వస్తే, గ్రీన్ లాండ్, ఫేరో ఐలాండ్ కూడా నోర్డిక్ దేశాలే. అయితే, స్కాండినేవియా దేశాల మధ్య భాషాపరమైన సారూప్యం కూడా ఎక్కువ. వాటి మానాన అవి, ప్రశాంతంగా సాగిపోయే నోర్డిక్ దేశాలు నన్నెప్పుడూ అలరిస్తూనే ఉంటాయి. శాంతి యుతంగా, శాంతి కాముకులుగా, సుసంపన్నంగా, ప్రజాస్వామికంగా, ప్రజా సంక్షేమమే ప్రధానంగా ఎంతో కాలంగా సాగిపోతున్న దేశాలు ఇవి. ప్రపంచదేశాలన్నీ ఆకాంక్షించే అత్యున్నత జీవన ప్రమాణాలు, తలసరి ఆదాయం, మానవ జీవనోన్నతి.. వీటన్నిటినీ సాధించి, ఎంతో కాలంగా నిలుపుకుంటూ వస్తున్న దేశాలివి. ఇదెలా సాధ్యపడిందో ప్రత్యక్షంగా చూడటానికి, అక్కడికి తప్పనిసరిగా వెళ్లాలని అనుకుంటూ ఉండేవాడిని. ఇకపోతే ఇక్కడి ప్రకృతి సౌందర్యాతిశయం గురించి ఎంత విన్నా, వెళ్ళి చూసింది వేరు. నిత్య జీవితాన్ని సరళం చేసే సదుపాయాలకు, రోడ్డు రవాణా సౌకర్యాలకు ఇక్కడ కొదవే లేదని కూడా నేను విని ఉన్నాను. పురాతన కాలం నుండి ఇక్కడ రాజ్యం చేసిన వైకింగ్ యోధుల వీరత్వం, మార్మిక శక్తి గురించిన కథలు బహుళ ప్రచారంలో ఉన్నాయి. వారి ప్రస్తావన రాగానే, గోధుమ వర్ణంలో మెరిసే జుట్టు, నీలి కళ్ళు, సౌష్టవమైన అంగ విశిష్టతతో భారీ కవచాన్ని మోస్తూ, కత్తులు , గొడ్డళ్ళు మొదలైన ఆయుధాలతో తిరిగే పొడవాటి ఆజానుబహులు మన కళ్ళ ముందు కనపడతారు. లోక భయంకరులైన సముద్రపు దొంగలుగా, సుదూర

ప్రాంతాలను దోచుకుపోయిన వారుగా చరిత్రలో మనకు పరిచయమవుతారు. కానీ తరచి చూస్తే వారి వలన ప్రపంచానికి కలిగిన మేలు ఈనాటికి, అంతకంతకూ ఎక్కువగా వెలుగులోకి వస్తోంది.

2012 లో స్వీడన్, డెన్మార్క్ దేశాలలో నా పర్యటన చాలా క్లుప్తంగా జరిగింది. 2015లో ఫిన్లాండ్ కూడా వెళ్ళాను. ఈ రెండు సార్లు నా అనుభవాలు నాకు మిగిల్చిన ప్రశ్న ఒక్కటే. మనం ఎంతో గొప్పవనుకునే ఫ్రాన్స్, జర్మని, యునైటెడ్ కింగ్డం లాంటి మిగతా ఐరోపా దేశాలకంటే కూడా, ఈ దేశాలు ప్రగతి పథంలో మరింత ముందుండటం ఎట్లా సాధ్యమయింది? అని. 2018 మే నెలలో 6 రోజుల పాటు, స్కాండినేవియా సరిగంచు దేశం, నార్వేలో నా అనుభవాలను ఇప్పుడు మీతో పంచుకుంటున్నాను.

వైశాల్యంలో, యునైట్ కింగ్డం కంటే నార్వే 25% పెద్దది. మన ఊహాలకు మరింత దగ్గరగా తెచ్చుకోవటానికి, మన 'మహారాష్ట్ర' అంత, లేకపోతే యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాలో 'మోంటానా' స్టేట్ అంత. జన సంఖ్య మాత్రం సుమారు 55 లక్షలు. యునైటెడ్ కింగ్డం జనాభా 6.9 కోట్లు. మరి జన సాంద్రత విషయానికి వస్తే.. ఒక చ. కి. మీటరుకు 15 మంది లెక్క. ఐరోపా మొత్తంలో, ఒక్క ఐస్లాండ్ మాత్రమే చ. కి. మీ. కు 3.5 మందితో, నార్వే కంటే తక్కువ స్థానంలో ఉంటుంది. పెద్ద గీత, చిన్న గీత లెక్క కోసం.. ప్రస్తుత భారత దేశపు జన సాంద్రత చ. కి. మీ. కు 492 మంది అని గుర్తు చేసుకోవచ్చు. యునైటెడ్ కింగ్డంలో సరాసరిన, చ. కి. మీ. కు 287 మంది నివసిస్తారు. సరిహద్దుల విషయానికొస్తే, దక్షిణాన స్వీడన్ వైపు ఉన్న సరిహద్దు రేఖ పొడవైనది. తూర్పున కొంత ఫిన్లాండ్ తోనూ, కొంత రష్యాతో కూడా సరిహద్దు ఉంది. యునైటెడ్ కింగ్డం వైపున ఉన్న నార్త్ సీ, నార్వేకు దక్షిణం వైపు ఉంది. ఉత్తరాన ఉన్న తీర ప్రాంతం, కచ్చా పిచ్చాగా ఏర్పడిన ఫియోర్డ్"లతో అద్భుతంగా కనపడితే, సరిగంచులో జత కూర్చిన రత్నాల లాగా, 239,057 ద్వీపాలు ఉన్నాయి. ఇన్ని ఉన్నా ఈ విషయంలో నార్వే ఇంకా రెండో స్థానంలోనే ఉంది. స్వీడన్ ప్రథమ స్థానంలో ఉంది. అక్కడ ఇంకా ఎక్కువ ద్వీపాలు ఉన్నాయట. నాలాంటి సందర్శకులకు వేసవి కాలంలో నార్వే 'ఫియోర్డ్'లు, శీతా కాలంలో అరోరా బొరేయలిస్ (నార్దర్న్ లైట్స్) అనబడే కాంతి పుంజాల విన్యాసం ముఖ్యమైన ఆకర్షణలు.

లండన్ నుండి నార్వే వెళ్ళటం చాలా సులభం. నేను నార్వే వెళ్ళిన రోజు, సాయంత్రం 5 గంటల వరకు పని చేశాను. ఇంటికి వెళ్ళి, తీరికగా స్నాన పానాదులు కానిచ్చి, మా వాళ్ళకు 'గుడ్ బై' చెప్పి, కారు డ్రైవ్ చేసుకుంటూ, ఒక గంట పదిహేను నిముషాలలో లండన్, గాట్విక్ విమానాశ్రయం చేరుకుని, 10 గంటలకు 'స్టావంగా' కు వెళ్ళే, నార్వేజియన్ ఎయిర్ లైన్స్ విమానం అందుకున్నాను. తూర్పుకు వెళ్ళడం వలన, ప్రయాణ కాలం మీద ఒక గంట ఎక్కువయింది. సరిహద్దు భద్రత తనిఖీ హంగామా లేకుండా అయిపోయింది. బయటకు వచ్చేసరికి అప్పుడే సూర్యాస్తమయం అవటం వలన కను చీకటిగా ఉంది. ఆ దగ్గరలో కనపడుతున్న బస్‌స్టాప్ చేరుకున్నాను. అక్కడ ఇంకెవరూ లేరు. సాధారణంగా నోర్డిక్ దేశాలలో, బస్ సర్వీస్ చాలా బాగుంటుందని తెలిసి ఉండటంతో, యాత్రికుడిగా గడించిన అనుభవంతో దానిని ఉపయోగించు కోవాలనుకున్నాను. కానీ అక్కడ ఇంకెవ్వరూ కనపడని పరిస్థితిలో, నాలోని ప్రయాణీకుడు నన్ను టాక్సీ తీసుకోమని ప్రేరేపించటమే కాకుండా, నేను ఆ రోజంతా పని చేసి, ప్రయాణం చేసి, అలసిపోయి ఉన్నానని, అంత రాత్రి వేళ అసలు బస్సులు ఉండక పోవచ్చని, ఉండెనుపో.. అవి నా హోటల్ వద్ద ఆగక పోవచ్చని, టాక్సీ అయితే ఈ గొడవ అంతా ఉండదని, పైగా రేపటి రోజున నువ్వు చేయాలను కున్నదంతా చేయాలంటే టాక్సీ తీసుకుని, హోటల్ చేరి రెస్ట్ తీసుకోవాలంటూ...రొద చేస్తున్నాడు. చివరకు టాక్సీ తీసుకోక తప్పలేదు.

ఆ ముందు రోజు నేను బుక్ చేసుకున్న హోటల్ పేరు, సెయింట్ స్విథున్. నా టాక్సీ నన్ను ఒక పెద్ద బిల్డింగ్ ముందు దింపేసి చక్కా పోయింది. తీరా దిగి చూస్తే, అది స్టావంగా హాస్పిటల్. అర్ధ రాత్రయింది. ఇదేమిటీ ఇట్లా అయింది అనుకుంటూ, రిసెప్షన్ చేరుకుని నా సమస్య చెప్పేసరికి, వాళ్ళు, నేను సరైన చోటుకే వచ్చానని, నా హోటల్ ఆ హాస్పిటల్‌కు అనుబంధమై ఉందని చెప్పారు. కొందరు అవుట్ పేషెంట్లు, వారి తాలూకు బంధువులు అక్కడ బస చేస్తుంటారని వాళ్ళు చెప్పారు. రూమ్ చేరుకుని నిద్రకు ఉపక్రమించే సరికి, ఆరోజు విచిత్రంగా తోచింది.

ఒకే రోజు పగలంతా ఒక హాస్పిటల్‌లో పని. మళ్ళీ అదే రోజు రాత్రి, ఇంకో దేశంలో మరో హాస్పిటల్‌లో నిద్ర. నాకైతే హాస్పిటల్ డ్యూటీ రూమ్‌లో నిద్ర పోబోతున్నట్లనిపించింది. కానీ తప్పేదేముంది. ఆ రాత్రి మంచి నిద్ర కున్న ప్రాముఖ్యత అంతా ఇంతా కాదు.

**మొదటి రోజు :** నార్వే చూడటం, స్టావంగాతో ప్రారంభించటానికి ప్రధాన కారణం, నార్వేజియన్ ఫియోర్డ్‌లను మున్ముందుగా చూసేయాలనే కోరికే. ఈ దిశగా సాగిన నా పరిశోధన, పల్పిట్ రాక్ (స్థానికంగా దీనిని ప్రీకెస్టోలెన్ అంటారు)ను ప్రధానంగా సూచించింది. చూపించింది. ఇదొక అనూహ్యమైన ప్రకృతి వైచిత్ర్యం. ఇక్కడి నుండి చూస్తే నార్వేజియన్ ఫియోర్డ్‌ల దృశ్యం అద్భుతంగా కనిపిస్తుందట. స్టావంగా నుండి, పల్పిట్ రాక్‌కు వెళ్ళి రావటానికి ఒక రోజుపడుతుంది. జీవితంలో ఒక్క సారైనా అక్కడకు వెళ్లాలని అనుకోవటంతో, నా ట్రిప్‌ను స్టావంగాతో మొదలుపెట్టాను. ఇక్కడి నుండి పల్పిట్ రాక్‌కు వెళ్ళాలంటే, కొంత దూరం ఫెర్రీలో, మరి కొంత దూరం బస్‌లో వెళ్ళి, నడక దారిన పర్వతారోహణ చెయ్యాలి.

మరునాడు ఉదయాన్నే, బస్‌లో ఫెర్రీ టెర్మినల్ చేరుకుని, అక్కడి నుండి పల్పిట్ రాక్‌కు వెళ్ళే దోవలో ఉన్న 'టావ్' కు టికెట్ కొనుక్కున్నాను. నా ఫెర్రీకి ఇంకా ఒక గంట టైమ్ ఉంది. సమయం వృధా చేయకుండా, ఆ ప్రక్కనే ఉన్న స్టావంగా పాతబస్తీకి వెళ్ళాను. అనుకున్నట్లే అక్కడంతా ఇరుకు వీధులు, చెక్క ఇళ్ళు. మళ్ళీ నా ఫెర్రీ ఎక్కవలసిన టైమ్‌కు వెనక్కి వచ్చేశాను. ఫెర్రీ ప్రయాణం దాదాపు 45 నిముషాలు పట్టింది. నీటి మీద తేలుతున్న మట్టిదిబ్బల మాదిరిగా కనపడుతున్న చిన్న చిన్న ద్వీపాల మధ్యగా సాగిన పడవ ప్రయాణం ఆహ్లాదంగా ఉంది.

ఈ ప్రయాణంలో నాకొక వ్యక్తి పరిచయమయ్యాడు. అతని పేరు ఫిరోజ్. ఇరాన్‌లోని హమదాన్ అనే ఊరు నుండి వచ్చాడట. యాభైయవ పడిలో ఉన్నట్లు కనపడ్డాడు. గత పదిహేనేళ్ళుగా నార్వేలో ఉంటున్నాడట. ఇరాన్‌లో 'షా' పరిపాలన మొదలయిన తరువాత కాలంలో ఇరాన్ వదిలి వచ్చేసాడట. అంటే దేశం వదిలి ముప్పై సంవత్సరాలకు పైనే అయింది. కొంత కాలం టర్కీలో గడపి, తరువాత కాందిశీకుడిగా గ్రీసు దేశం చేరాడట. అక్కడ నుండి ఇటలీ, జర్మనీ దేశాల మీదగా నార్వే చేరుకున్నాడట. ఇక్కడ అతనికి శరణార్థిగా ఆశ్రయం దొరికింది. అతను ఇప్పుడు నార్వే పౌరుడు కూడా. బస్ డ్రైవరుగా పని చేస్తూ, స్థానిక మహిళను వివాహం చేసుకున్నాడట. మరో సంగతి ఏమిటంటే, అతను తన కుటుంబాన్ని అప్పుడప్పుడూ టర్కీలో కలుస్తాడట. టర్కీ రాజకీయ తటస్థత వలన, ఇరాన్ నుండి తన కుటుంబ సభ్యులు అక్కడకు వచ్చి తనను కలవగలుగుతున్నారని అతను చెప్పాడు. మళ్ళీ ఇరాన్ వెళ్ళే ధైర్యం మాత్రం తనకు లేదన్నాడు. తన మీద కఠిన చర్యలు తీసుకుంటారనే భయం అతనికి ఇంకా ఉంది.

నేను డాక్టరునని తెలిసి, నార్వేలో చాలా మంది భారతీయ డాక్టర్లు ఉన్నారని చెప్పాడు. అతను ఇరాన్ వదిలి పెట్టే సమయానికి, హమాదాన్‌లో కూడా చాలా మంది భారత దేశపు డాక్టర్లు ఉండేవారని గుర్తు చేసుకున్నాడు. 1970, 1980లలో, భారతీయ డాక్టర్లు చాలా మందికి ఇరాన్, అల్జీరియా దేశాలకు ఎక్కువగా వెళుతుండేవారని నాకు కూడా గుర్తుకొచ్చింది.

నేను ఈ మధ్యే ఇరాన్ వెళ్లొచ్చానని తెలిసి, అతను చాలా సంతోషడ్డాడు. నేను చూసిన షిరాజ్, యాజ్డ్, ఇస్ఫహాన్ నగరాలలో నా అనుభవాలు వింటూ, తన్మయత్వం పొందిన ఫిరోజ్, నేను క్వోమ్ పేరు ఎత్తగానే 'ఆ నగరమంటే నాకు ఏ మాత్రం ఇష్టము లేదు. సనాతన పద్ధతుల్ని పట్టుకుని వేలాదుతూ, దేశాన్ని నాశనం చేసిన ముల్లాలను, భారీ సంఖ్యలో తయారు చేసే కర్మాగారం ఆ నగరం' అంటూ ఉద్విగ్నుడయ్యాడు. ఆ తరువాత చాలా సేపు మా మధ్య మాటలు సాగలేదు. అతను అంతర్ముఖుడయినట్లు నేను గమనించాను. మొత్తానికి క్వోమ్ ప్రస్తావన, అతనిలో ఏవో గతం తాలూకు భయానక జ్ఞాపకాలను రేకెత్తించిందని నాకర్థమయింది. పరిస్థితి కొంచెం సున్నితంగా అనిపించింది. నేను ఏదైనా మాట్లాడితే, అనవసరమైన ఉత్సుకత చూపించినట్లు అనిపించవచ్చు. అతని మనసు లోతులలో నుండి మరిన్ని చేదు జ్ఞాపకాలు ఉబికి రావచ్చు. నేను ఆ నిశ్శబ్దాన్ని భగ్నం చేసే ప్రయత్నం కూడా చేయలేదు. రెండు నిముషాల తరువాత అతనే సంబాళించుకుని, నార్వేలో అతని జీవితం గురించి చెప్పటం మొదలు పెట్టాడు. పుట్టి పెరిగిన ఊరు, వాడ, ఉన్న ఫళాన వదిలి కట్టుబట్టలతో పరాయి దేశం చేరి, 'దేహీ' అంటూ దేవిరించ వలసిన వారి జీవితాలు అంత తేలిక కాదు. అతి కష్టం మీద,



పల్పిట్ రాక్, నార్వే

వారి జీవితాలను పునర్నిర్మించుకుని ఉండవచ్చు. కానీ గతం తాలూకు నీలి నీడలు ఎప్పుడూ వారి వెన్నంటే ఉంటాయి. నెమ్మదిగా ఫెర్రీ, టావ్ చేరుకుంది. మేమిద్దరం పరస్పరం, శుభాకాంక్షలు, వీడ్కోలు చెప్పుకున్నాము.

మళ్ళీ టావ్ నుండి ముప్పై నిముషాల బస్ ప్రయాణం తరువాత, పల్పిట్ రాక్ ఆరోహణ మొదలయ్యే చోటుకు చేరాను. దోవంతా చిన్న చిన్న పల్లెలు. తెలుగు, గోధుమ రంగు వేసిన చెక్క ఇళ్ళు, ఎర్రని పెంకుల పైకప్పులతో, క్రమబద్ధంగా ఉన్నాయి. కార్లలో అక్కడి వరకు వచ్చిన వారికి, ఇక్కడ కార్లు నిలుపుకునే సదుపాయం ఉంది. విజిటర్లకు సదుపాయాలు, జ్ఞాపికలు, సమాచారం మొదలైనవి అందించే ఒక కేంద్రం కూడా అక్కడ ఉంది. నేను కూడా అక్కడ టిక్కెట్టు కొనుక్కున్నాను.

తెల్లని సూర్యకాంతిలో ఆరోజు కళ కళ లాడుతూ ఉంది. అయినా, నార్వేలో వాతావరణం క్షణ క్షణం మారిపోతుందని తెలుసు కాబట్టి అందరూ అన్ని రకాల వాతావరణ విపరీతాలకు సరిపోయే జాకెట్టులు వగైరాలతో సిద్ధమై వచ్చారు. స్టావంగా ఫెర్రీ పోర్ట్‌లో, ఇతరుల నుండి నేను విన్న సలహాల ప్రకారం, నేనొక సాండ్విచ్, కొంచెం త్రాగే నీటితో ట్రెక్‌కు సిద్ధమై పోయాను.

పల్పిట్ రాక్ ఎక్కటం, నార్వేలో జనాకర్షణీయమైన లక్ష్యం. ఎనిమిది కి. మీ. పాటు, కొంతదూరం దట్టమైన అటవీ ప్రాంతం, మరి కొంత సేపు గ్రానైట్ బండ రాళ్ళ మీద నడుస్తూ, ఎక్కుతూ, దోగాడుతూ ఇంకొంత దూరం... మొత్తానికి ఎప్పటికీ గుర్తుండిపోయే కఠినమైన సవాలు ఇది. ఇటువంటి సాహసాలు నాకు తెలియచెప్పిందేమిటంటే, పరిశ్రమ ఎంత కఠిన తరమైతే ఫలితం అంత అద్భుతం అని. ట్రెక్ మొదట్లోనే, నాకు రెండు భారతీయ కుటుంబాలతో పరిచయమయింది. మొదటి కుటుంబం, దశరథ అతని భార్య ఇందిర. వాళ్ళు వారిద్దరి పిల్లలతో ఇక్కడికి వచ్చారు. ఇద్దరూ స్కూల్‌కు వెళ్ళే వయసులో ఉన్న అబ్బాయిలు. దశరథ, సముద్ర గర్భం నుండి పైప్ లైన్‌ల ద్వారా చమురు నిక్షేపాల వెలికితీతకు సంబంధించిన నిపుణుడు. అతను నార్వే చమురు పరిశ్రమకు పని చేస్తాడట. ఈ పనిలో అతనికున్న నైపుణ్యాన్ని గుర్తించి, ఐ. ఐ. టి. ఖరగ్‌పూర్ సంస్థ, ఈ ప్రత్యేక వైజ్ఞానిక శాఖను బోధించటానికి అతనికి విజిటింగ్ ప్రొఫెసర్ హోదా పురస్కారం చేసిందట. సుబ్బారావు, అనిత, వారి ఇద్దరు అమ్మాయిలు ఓస్లో (నార్వే రాజధాని) లో ఉంటూ, వారాంతాన్ని దశరథ కుటుంబంతో గడపటానికి వచ్చారట. వీరి ఇద్దరు అమ్మాయిలు కూడా, దశరథ పిల్లలకు సమవయస్కులుగా కనిపించారు. సుబ్బారావు ఐ.టి. పరిశ్రమలో పనిచేస్తారట. నార్వే వచ్చి ఇరవై సంవత్సరాలకు పైనే అయిందట. వాళ్ళందరూ కలసి ఎనిమిది మంది. నాతో కలసి తొమ్మిది మందిమి, కలసి నడవటం మొదలు పెట్టాము. పిల్లల గలగలలతో వాతావరణం సందడిగా మారిపోయింది. ఏమాటకామాటగా చెప్పుకోవాలి. ఈ పిల్లల వయసుకు, వారికి పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకత గురించి ఉన్న అవగాహనకు, నేను ఆనందపడ్డాను. దోవంతా వాళ్ళు, కనిపించిన ప్లాస్టిక్ వస్తువులను, ఇతర వ్యర్థ పదార్థాలను, ఏరి, వాటికోసం ఏర్పాటు చేసిన బాగ్‌లలో వేశారు. ఈ కార్యక్రమం పైకి వెళ్ళేటప్పుడు, మళ్ళీ వచ్చేటప్పుడు కూడా వీళ్ళు మరచి పోకుండా, దీక్షగా చేశారు. నా వరకు నాకు, ఈ దోవ మరీ అంత అధ్వానంగా కనపడలేదు. ఈ పిల్లలు చెప్పిన దాని బట్టి, నార్వే స్కూళ్ళలో పర్యావరణ పరిరక్షణ ఒక పాఠ్యాంశంగా ఉందట. స్కూల్‌లో నేర్చుకున్న విషయాలను, నిత్య జీవితంలో అమలు చేయాలని ఈ పిల్లలు అనుకోవటం నాకు నచ్చింది. నా ఇద్దరు పిల్లలు ప్రాథమిక పాఠశాలలో ఉన్నప్పుడు, 'ఎకో–వారియర్' బ్యాడ్జిలను సగర్వంగా ధరించటం నాకు గుర్తొచ్చింది. అప్పట్లో వారితో పాటు, మరికొంత మంది పిల్లలకు కూడా, వాళ్ళ స్కూల్ ఆవరణలో ఎక్కడైనా వ్యర్థ పదార్థాలు కనపడితే, వాటిని

ఆ దగ్గరలో ఉంచ బడిన డబ్బాలలో వేసే పని అప్ప చెప్పారు, టీచర్లు. వాళ్ళకదో గుర్తింపు, గౌరవనీయమైన బాధ్యత.

నడచుకుంటూ ముందుకు పోతున్న కొద్దీ, లక్ష్యానికి చేరువవుతున్న ఉత్సాహం నాలో పెరిగింది. పల్పిట్ రాక్/ ప్రీకెస్టోలెన్, నార్వేలోని ప్రకృతి ప్రేమికులకు ఆరాధ్యం. అదొక జాతికే గుర్తింపు తెచ్చిన చిహ్నం. 604 మీటర్ల ఎత్తుతో, నిట్టనిలువుగా నిలచిన గ్రానైట్ ఏక శిల ఇది. పర్వతశిఖరమని మని అందామా అంటే, దానికి శిఖరాగ్రం లేదు. దాని పైభాగం బహుళ అంతస్తుల భవనం పైనుండే టెర్రేస్ మాదిరిగా, బల్లపరుపుగా ఉంది. దీని కొలతలు 25 మీ.×25 మీ. అంటే అది ఉన్న పర్వత శ్రేణి నుండి వైదొలగి, 25-30 మీటర్ల పాటు, లైసఫ్జోర్డ్ అనే ఫియోర్డ్ మీదకు జరిగినట్లుగా ఉంది. నాకైతే, ఏ గ్రహాంతర వాసులో, దేవతలో ఒక మంచి దృశ్యం కనిపించే చోటులో ఏర్పాటు చేసుకున్న బాల్కనీలానో, డాన్స్ ఫ్లోర్‌లానో, విందులూ వినోదాలు చేసుకోవటానికి ఒక మంచి విశాలమైన బహిరంగ ప్రదేశమో అనిపించింది. గ్రహాంతర వాసులకు, దేవతలకు పడిపోతామన్న భయం ఉండదు కదా!!! కొన్ని వేల సంవత్సరాలుగా, వాతావరణ వైపరీత్యాల తాకిడి తగిలిన ఈ శిల, ఒక ప్రక్క నుండి చూస్తే, మా పిల్లలు, ఐస్ క్రీమ్తో పాటు కొనుక్కునే 'కాడ్బరీ చాక్లెట్ ఫ్లేక్' లా కనిపించింది. దాని ఉపరితలం కూడా, సహజంగా చీకిపోయిన తాటి పట్టెలా, నిట్టనిలువు చీరికలతో ఉంటుంది. అక్కడక్కడా మంచు నిండిన చీరికలతో, పచ్చని వృక్ష సంపదతో నిండిన పల్పిట్ రాక్, దాని మీద నుండి దూరంగా కనిపించిన ఫియోర్డ్లు, వాటికి అద్దబడిన సాటి లేని నీల వర్ణం, చుట్టూ కొలువు తీరిన నిట్ట నిలువు సానువులు.. ఈ దృశ్యం అత్యంత రమణీయం. చిరస్మరణీయం.

సాధారణంగా ఇంత ఎత్తున, వేదికలా ఉన్న ప్రదేశం చుట్టూ, భద్రత కోసం కమ్మీలు ఏర్పాటు చేస్తారు. కానీ ఇక్కడ అటువంటివేమీ లేవు. మానవ నిర్మిత కృత్రిమ నియంత్రణ లేనిదే ప్రకృతి. నార్వేలో ప్రకృతిని నియంత్రించాలని అనుకోరు. అక్కడున్న ప్రాకృతిక సంపద మీద, కమ్మీలు, హెచ్చరికలు, కట్టడి రూపంలో మానవుల చెయ్యి పడితే ఆ సౌందర్యపు సహజత్వం పోతుందని సుబ్బారావు అన్నారు. అయినా అంతటి విస్తృతమైన అద్భుత ప్రకృతి విలాసాన్ని ఎంతని నియంత్రణ చేయగలుగుతారు? దాని బదులు మనల్ని మనమే ప్రకృతిలో భాగంగా భావించుకుని దానికి అనుగుణంగా మన జీవనాన్ని మలచుకోగలిగితే, 'నియంత్రణ' అవసరమే ఉండదు కదా?

పల్పిట్ రాక్ వరకు వాహనాలు వెళ్ళే అవకాశం లేదు. కఠినమైన దోవలో నడవవలసిందే. కానీ దీని ఫలితంగా, లక్ష్యం చేరిన వారికి లభించే అనుభూతితో పోల్చితే, ఈ కష్టమెంత? మేము పైకి చేరుకునే సరికి మధ్యాహ్న భోజన వేళ అయింది. మా గ్రూప్ అక్కడ పిక్నిక్ పరచింది. నన్ను కూడా వాళ్ళలో కలుపుకోవటం, వారి కలుపుగోలుతనానికి నిదర్శనం. రకరకాల ఆహార పదార్థాలతో పాటు, వారు నాకు బ్రునోస్ట్ అనే బ్రౌన్ ఛీజ్ ఇచ్చారు. ఇది నార్వే ప్రత్యేకత అట. నార్వేజియన్లు దేశం దాటి బయటికి వచ్చినప్పుడు, ఈ ఛీజ్ కోసం తపించడం సహజమే కదా అనిపించింది నాకు. మేము తింటూ ఉండగానే, ఆ ప్రక్కనేదో కోలాహలం వినిపించింది. గుసగుసలు, నిట్టూర్పులు, ఆశ్చర్యార్థక సంకేతాలు.. వినిపించాయి. అక్కడ ఒక ఉత్సాహవంతుడైన యువకుడు, ఒక యువతిని, తన జీవితంలోకి ఆహ్వానించాడట. పల్పిట్ రాక్ సాక్షిగా. అందుకా అమ్మాయి వెంటనే ఒప్పేసుకోవటం, వాతావరణాన్ని ఉత్సాహ పరచింది. చప్పట్లు, కేరింతలతో పల్పిట్ రాక్ మరింత జీవం పుంజుకుంది. ఏమైనా ఆ జంటకు అది రమణీయ క్షణం. ఆ క్షణం వారికి చిరస్మరణీయం.

పల్పిట్ రాక్, పర్వత శ్రేణి నుండి విడివడే చోట, ఒక సన్నని గాడి ఉంది. దాని వెడల్పు ఒకటి, ఒకటిన్నర అడుగులు ఉంటుంది. ఆ చీలిక పై నుండి క్రింది వరకు నిలువునా ఉంది. విజిటర్లందరూ దానికి అటో కాలు, ఇటో కాలు వేసి నిలుచుని ఫోటోలు తీసుకుంటున్నారు. అట్లా నిలుచున్నప్పుడు, వాళ్ళ కాళ్ళ మధ్య నుండి 600 మీటర్ల నిట్టనిలువుగా క్రిందికి కనపడే అగాధాన్ని చూసినప్పుడు నాలాంటి వారికైతే మాత్రం గుండె జారి పోవటం ఖాయం. కాని అంత దూరం వచ్చి, ఆ సాహస కార్యానికి వెరవటం సముచితం కాదు అని నా మనసు చెబుతూనే ఉంది. నా అవస్థ గమనించి, నా నార్వే మిత్రులు నా వెన్ను తట్టి, నన్ను ప్రోత్సహించక పోయినట్లైతే, నేను సాహసించే వాడిని కాదేమో. ఆ ఆశాభంగం జీవితాంతం నన్ను వెంటాడేది కాబోలు. అక్కడ కొందరు దుస్సాహసులు,

ఆ రాక్ అంచు మీద కాళ్ళు గాలిలో క్రిందికి వ్రేలాడేసి, కూర్చున్నారు. నాకైతే నరాలలో రక్తం చల్లబడి పోయేది. వాళ్ళ కాళ్ళ క్రింద, నిట్ట నిలువున 604 మీటర్ల లోతులో, అత్యద్భుతమైన లైసఫ్జోర్డ్ ఫియోర్డ్ ఉంది అనే గొప్ప భావనే వారికి కావలసిన తెగువనిచ్చిందేమో.

దశరధకు భారతీయ ఆధ్యాత్మికత అంటే ఎంతో ఆసక్తి ఉందని చెప్పాడు. కొన్ని సంస్కృత శ్లోకాలను, వాటి అంతర్భావాన్ని కూడా విడమరచి నాకు చెప్పాడు. పల్పిట్ రాక్ మీద దైవికంగా, మార్మికంగా అనిపించే ప్రకృతి వైభవం, భారతీయ ఆధ్యాత్మికత కలగ చేసిన మానసిక నేపధ్యం వలన మరింత అనుభవేక వేద్యం అయింది. దశరధ, సుబ్బారావులతో పరిచయం స్నేహంగా మారింది. ఇంగ్లండ్‌లోనూ, నార్వేలోనూ వేర్వేరుగా గడుపుతున్న మా జీవితాలను కలబోసుకున్నాము. ఇక్కడ పిల్లలు స్కూళ్ళలో ఇంగ్లీషు, నార్వేజియన్ రెండూ నేర్చుకుంటారట. రెండు భాషలలోనూ ధారాళంగా మాట్లాడగలిగితే కూడా, నార్వేజియన్ వారి ప్రధానమైన భాష అట. భోజనం తరువాత నా తదుపరి కార్యక్రమం గురించి పునరాలోచన చేయవలసి వచ్చింది. ఆ రోజు సాయంత్రం 5 గంటల తరువాత నన్ను స్టావంగా చేర్చే ఫెర్రీ లేదు. అయితే నా భారతీయ మిత్రులు, రెండు కార్లలో రావటం వలన, నన్ను స్టావంగా చేర్చి, నా హోటల్‌లో దింపుతామని సహృదయంతో చెప్పారు. దానితో, వారితో పాటు ఇంకొంచెం సేపు తీరికగా తిరిగి చూడటానికి వీలయింది. వారి సహాయానికి, సుహృద్భావానికి మనసులో ఇంకొంచెం ఎక్కువగా కృతజ్ఞతలు తెలుపుకున్నాను.

సాధారణంగా ఆరోహణ కంటే అవరోహణ తేలికని నా అభిప్రాయం. కానీ అది ఎల్లప్పుడూ నిజం కాదని, దిగి వచ్చేటప్పుడు తెలిసింది. ఎక్కటానికి కాళ్ళలో కండరాల బలం, రక్త ప్రసరణ సరిగ్గా జరగటానికి గుండె బలం కావాలి. కానీ క్రిందికి దిగేటప్పుడు, అడుగుల సమతూకం తప్పనివ్వని మానసిక శక్తి అవసరం. అడుగు తప్పితే ప్రమాదమే. ప్రతి అడుగు జాగ్రత్తగా వేయవలసిందే. పైగా శరీరపు బరువు కీళ్ళ మీద పడటం వలన, అక్కడ నొప్పి మొదలవుతుంది.

స్టావంగా చేరిన తరువాత, నన్ను హోటల్‌లో దింపకుండా, నా మిత్రులు నాకు ఇంకొక బహుమతి



(స్వోర్డ్ ఇన్ రాక్

ఇచ్చారు. నన్ను వారితో పాటు స్వర్డ్ ఐ ఫియెల్ (స్వోర్డ్స్ ఇన్ రాక్ ) అనే చోటుకు తీసుకెళ్ళారు. స్టావంగాలో ఇది చూడవలసిన విశేషం. హాఫ్ర్స్ఫ్యోర్డ్ అనే ఫియోర్డ్ సమీపంలో ఒక చిన్న కొండ మీద ఉంది. ఇక్కడ దాదాపు 10 మీటర్ల పొడవున్న మూడు రాతి కరవాలాలు, పెద్ద బండ రాళ్ళలో గుచ్చబడినట్లున్నాయి. అందులో ఒకటి పెద్దది, రెండు కొంచెం చిన్నవి. నార్వే చరిత్రలో ముఖ్యమైన ఘట్టం, హాఫ్ర్స్ఫ్యోర్డ్ యుద్ధం. క్రీ. శ. 872లో జరిగిన ఈ యుద్ధంలో విజయుడైన కింగ్ హెరాల్డ్, నార్వే అంతటినీ ఒక్క త్రాడు మీదికి తెచ్చి, పాలన సాగించాడు. మూడిటిలో ఎత్తైన కరవాలం, విజయుడైన రాజు దని, మిగిలిన రెండు ఓడిపోయిన వారివిగా గుర్తించుతారు. ఆయుధాలను రాతిలో బందీ చేయటం, నార్వే వారి శాశ్వత శాంతి కాముకతకు ప్రతీకగా అభివర్ణించుతారు. ఇంకెన్నటికీ వాటిని బయటికి తీయవలసిన అవసరం రాకూడదని వారి ఆశయం. ఇదంతా పూర్తయ్యే సరికి రాత్రి ఎనిమిది గంటలయింది. వేసవి కాలం అవటం వలన సూర్యుడు ప్రకాశిస్తూనే ఉన్నాడు. ఇంకా మిట్ట మధ్యాహ్నంలానే ఉంది. కానీ రోడ్లు నిర్మానుష్యంగా ఉన్నాయి. కాలుష్యం లేని గాలి, గుండెలను నింపుతోంది. నా మిత్రులు నన్ను హోటల్ దగ్గర దింపిన తరువాత, ఆ రోజు ఆనందంగా, ఆహ్లాదంగా, మరింత ఫలవంతంగా చేసినందుకు వారికి మనసారా కృతజ్ఞత తెలిపి సెలవు తీసుకున్నాను.

నా చేతికున్న ఫిట్ బిట్ ప్రకారం, ఆరోజు నేను 194 అంతస్థులు ఎక్కాను. 28000 అడుగులు వేశాను. 20 కి. మీ. దూరం నడిచాను. పల్పిట్ రాక్ కార్ పార్క్ నుండి, పై వరకు 8 కి. మీ. రాను పోను 16 కి. మీ. అదే ఉంది. ఇంతింత దూరాలు ఇంకెంత కాలం తిరగ

గలనో!! హోటల్‌కు అనుసంధానమైన హాస్పిటల్‌లో ఒక కెఫే ఉంది. అక్కడ ఒక ట్యూనా చేప నింపిన బ్రెడ్, సలాడ్ కొనుక్కుని రూమ్ చేరుకున్నాను. బాగా అలసిపోయాను. ఒళ్ళంతా పచ్చి పుండులా ఉంది. మంచి స్నానం, నిద్ర మాత్రమే నేను కోరుకుంటున్నది. మామూలుగా ఏ రోజుకా రోజు, ఆ రోజు జరిగిన విశేషాల గురించి నోట్స్ వ్రాసుకుంటాను. కానీ ఈ రోజు అది కుదిరే పని కాదు. డైరీ రేపటి వరకు ఆగవలసిందే.

**రెండవ రోజు** : ఉదయాన్నే హోటల్ గది ఖాళీ చేసి, 100 మీ. దూరంలో ఉన్న బస్‌స్టాప్ చేరుకున్నాను. అక్కడి నుండి బర్గెన్‌కు వెళ్ళే బస్ కోసం, ప్రధాన బస్ స్టేషన్ చేరుకోవాలి. రంగు కళ్ళద్దాలు, తల మీద చువ్వలుగా నిలబెట్టిన గోధుమ రంగు వెండి తలకట్టుతో అటుగా వెళుతున్న ఒక ఆపద్బాంధవుడి సహాయంతో, అక్కడున్న మెషిన్‌లో టికెట్ కొనుక్కోగలిగాను. మూడు మైళ్ళ దూరంలో ఉన్న బస్ స్టేషన్‌కు, మెషిన్‌లో కొంటే 350 నార్వేజియన్ క్రొనర్లు. అంటే దాదాపు 3.50 పౌండ్లు. అదే బస్‌లో డ్రైవరు దగ్గర కొంటే 5 పౌండ్లు. బస్ కోసం ఎదురు చూస్తున్న సమయంలో, అక్కడ ఒకరితో మాటలు కలిశాయి. అతని పేరు క్రిస్టియన్. నేను స్టావంగా ఎప్పుడు వచ్చాను, ఏమేమి చూశాను అని అడిగాడు. నేను పల్పిట్ రాక్ చూశానని చెప్పినప్పుడు, అతను నన్ను ఎగా దిగా చూశాడు. అతనికి ఏమీ అర్థమవలేదు. స్థానికంగా దానిని, ప్రీకెస్టోలెన్ అంటారని గుర్తొచ్చి, అదే చెప్పాను. అప్పుడు మంచి ఉత్సాహంతో మాటలు సాగించాడు. మిషన్ ఇంపాసిబుల్– ఫాల్ అవుట్ సినిమాలో టామ్ క్రూజ్, ప్రీకెస్టోలెన్ ఎక్కుతాడు చూశావా? అని అడిగాడు. నేను కూడా అతను నార్వేజియన్ టామ్ క్రూజ్‌లాగా ఉన్నాడని ప్రశంసించాను. అయితే మరెందుకు ఆలస్యం, నా ఆటోగ్రాఫ్ తీసుకోమంటూ మేలమాడాడు. ఆటోగ్రాఫ్ కాదు కానీ ఒక సెల్ఫీ? అంటూ ఫోటో తీసుకున్నాను. స్టావంగాలో పుట్టి పెరిగిన క్రిస్టియన్, ప్రపంచం తిరిగి చూసాడట. ఐస్ హాకీ ఆడే వాడట. లండన్‌లో రెండు సంవత్సరాలు ఉన్నాడట. అప్పుడు వింబుల్డన్‌కు వెళ్ళిన అనుభవాలను ఆప్యాయంగా గుర్తు చేసుకున్నాడు. మాటల్లో, అతను ఎలెక్ట్రిక్ సైకిళ్ళ మీద, సందర్శకులు స్టావంగా అంతా తిరిగి చూసే టూర్‌ను నడిపే వ్యాపారం చేయాలనుకుంటున్నానని, పెట్టుబడి పెట్టే వారి కోసం చూస్తున్నానని చెప్పాడు. దీని కోసం కనీసం 20 ఎలెక్ట్రిక్ సైకిళ్ళు కావాలట. తనకు భారతదేశంలో తిరిగి చూడాలని ఉందని చెప్పాడు. అందుకు ఉపయోగపడే సమాచారం కొంత నన్నడిగి తెలుసుకున్నాడు. ప్రయాణాలు మనుషుల మనసుల్ని విశాలం చేస్తాయని, ప్రపంచాన్ని క్షేమకరంగా మార్చుతాయని అంటూ, ప్రస్తుత పరిస్థితులలో, ప్రయాణాలు పర్యావరణ పరిరక్షణ దిశగా సాగాలని అన్నాడు. అంత కొద్ది సమయంలో, ఇన్ని విషయాలు మేమిద్దరం మాట్లాడుకోగలిగామంటే.. దానికి కారణం మా ఇద్దరికీ యాత్రల పట్ల ఉన్న ఉన్నతాభిప్రాయమేనని నా గట్టి నమ్మకం.

స్టావంగా నుండి బర్గెన్, బస్‌లో వెళ్ళటానికి 5 గంటలు పట్టింది. రెండు చోట్ల మా బస్, ఫెర్రీ మీదకు వెళ్ళవలసి వచ్చింది. ఒక సారి అరగంట పాటు. మరొక సారి ముప్పావు గంట సేపు. 2 లక్షలకు పైగా ద్వీపాలతో, ఫియోర్డ్‌లతో ఉన్న దేశంలో, ఇది తప్పదేమో. దోవంతా ఒక పక్క ఫియోర్డ్‌లు, మరొక పక్క వృక్షసంపదతో క్రిక్కిరిసిన పర్వతాలు. చాలా చోట్ల అడవి పూల సోయగం. అక్కడక్కడా గొర్రెల మందలతో, మళ్ళీ మళ్ళీ చూడాలనిపించే పల్లెటూళ్ళు. ప్రయాణం శ్రమే అనిపించ లేదు. కొండలను దాటటానికి సొరంగ మార్గాలు , ఫియోర్డ్‌లను దాటటానికి వంతెనలూ.. ప్రకృతి చుట్టూ అమర్చుకున్న జీవన విధానాలు.. ఓహ్! రమణీయం. ఎక్కడా ట్రాఫిక్ అనేదే లేదు. లండన్ నుండి బ్రిస్టల్ వెళ్ళే M4 మీద తరచుగా ట్రాఫిక్ సమస్య ఎదుర్కొనే నాకు, ఇప్పుడు నిజంగా దేవ లోకంలోకి వచ్చినట్లుగా, విషపూరిత కలుషిత వాయువు నిండిన గదులలో నుండి విడుదలై, స్వచ్ఛమైన సహజ ప్రాణ వాయువు పీల్చుకుంటున్నంత, స్వేఛ్ఛగా, సంతోషంగా అనిపించింది. నార్వే ప్రత్యేకత ఇదేనేమో.

*(బర్గెన్ విశేషాలు తరువాయి భాగంలో..)*



**ఆంగ్లం: డా. నిమ్మగడ్డ శేషగిరి రావు (ఇంగ్లాండ్)**
e-mail: srnimmagadda@googlemail.com
**అనువాదం: శ్రీమతి జయశ్రీ అట్లూరి (ఇంగ్లాండ్)**
e-mail: jayasreeatluri@hotmail.com

# చినుకులలో తడిసిన సృజన!

**– డా. షేక్ సలీం బాబు**

ఇది నా కథ! నా విద్యార్థి కథ! నా తరగతి గదిలో జన్మించిన ఓ అద్భుతమైన కథ! కొంతమంది విద్యార్థుల సంభాషణల మధ్య పుట్టిన కథ! నా విద్యార్థులు ఆంగ్లంలో రాసిన కథ! నేను ఆంగ్లం నుంచి తెలుగులోకి అనువదించిన నా తొలి కథ!

విద్యార్థుల మనసుల్లో మెరిసిన ఓ భావోద్వేగ గాథ!
ఇది కేవలం ఓ ఆడపిల్ల కథ మాత్రమే కాదు!
ప్రతి ఇంట్లో జరిగే సహజసిద్ధమైన, నిజమైన కథ!
ప్రతి పౌరుడి కథ. ప్రతి ఒక్కరి కథ!
ప్రతి తల్లి, తండ్రి తమ బిడ్డలకు చెప్పాల్సిన కథ!
ముఖ్యంగా మగ బిడ్డలకు చెప్పాల్సిన కథ!

విశేషంగా, మగ బిడ్డలందరిలో చైతన్యం కలిగించాల్సిన కథ! ఉన్నత చదువులు చదివి కొంత అజ్ఞానంలో కొట్టుమిట్టాడుతున్న ఆడబిడ్డలకు చెప్పాల్సిన కథ! విద్య మాత్రమే కాదు, విద్యతో పాటు వివేకం కావాలి, మానవత్వం కావాలి అని చాటి చెప్పే కథ. ఈ కథ సాధారణంగా ఓ ఇంటి ఆవరణలో మొదలై, సమాజం గోడల్ని దాటి వెళ్లే సత్యగాథ. ఈ కథ చదివిన ప్రతి తల్లి, తండ్రి, ఉపాధ్యాయుడు, పౌరుడు తమ మనస్సులో ఓ ప్రశ్నవేసుకోవాలి "నేను నా పిల్లలకు ఈ జీవితసత్యాన్ని చెప్పానా?" అని.

నేను రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం నూజివీడులో ఒక ఒప్పంద ఆంగ్ల అధ్యాపకుడిని. నా పేరు సలీం బాబు. రెండు దశాబ్దాలుగా అధ్యాపక వృత్తిలో ఉన్నాను. నా తరగతి గది కేవలం పాఠాలు బోధించేందుకు మాత్రమే కాకుండా సమాజంలోని కొన్ని నిజమైన సంఘటనలపై ఉత్తేజభరితమైన, ఉద్వేగభరితమైన చర్చలు, సంభాషణలు జరుపుతూ, విద్యార్థులలో వేరు వేరు అంశాల పట్ల అవగాహనను పెంచుతూ, తరగతి గదిని ప్రతిరోజూ సృజనాత్మకతతో కొత్తగా మలచడమే లక్ష్యంగా పెట్టుకుని విలువలతో కూడిన ఒక కొత్తతరాన్ని సమాజానికి అందించాలనే ఆశ.

తరగతిగది ఒక శ్మశానం లాంటిది. అక్కడ అజ్ఞానం ఖననం చేయబడుతుంది అని నేను నా బాల్యం నుంచి నా ఉపాధ్యాయుల దగ్గర నేర్చుకున్నాను. విద్యార్థికి, ఉపాద్యాయుడికి తరగతిగది ఒక దేవాలయం లాంటిది. టెంపుల్ అఫ్ లెర్నింగ్ అనేది నా ఫీలింగ్. "తరగతి గది అజ్ఞానానికి శ్మశానమైతే, విద్యార్థి జీవితానికి ఆలయం కావాలి." తరగతి గది ఓ 'లెర్నింగ్ టెంపుల్', అక్కడ ప్రతి సంభాషణ ఒక ప్రార్థన. నా తరగతిగది ఒక అందమైన ఉద్యానవనం లాంటిది. ఆ ఉద్యానవనంలో పనిచేసే నా తోటి ఉద్యోగులు, బోధన మరియు బోధనేతర సిబ్బంది తోటమాలి వంటివారు. అంతకంటే ముఖ్యంగా ఆ వనంలో అసలైన అందం రంగురంగుల సీతాకోక చిలుకలు లాంటి నా విద్యార్థులు, ఆకాశాన్ని స్పృశించాలనే ఆశయంతో ఎగిరే చిన్న పక్షులు. ఈ ఉద్యానవనంలో విద్యార్థుల ఆలోచనల హరివిల్లులతో ఎల్లప్పుడూ సృజనాత్మకతలు వికసిస్తూనే ఉంటాయి. ఇదే నా జీవితం, నా వృత్తి, నా ఆనందం.

ఒకరోజు అనుకోకుండా భారీ వర్షం కురిసింది. నేను ఇంగ్లీష్ కమ్యూనికేషన్ స్కిల్స్ ల్యాబ్‌లోకి వెళ్లాను. మధ్యాహ్నం సమయాన రెండు గంటల నుంచి ఐదు గంటల వరకు విద్యార్థులతో ల్యాబ్‌లో గడపాలి. దాదాపు మూడు గంటల సమయం. సాధారణంగా విద్యార్థులు మధ్యాహ్నం సుప్తావస్థలో ఉంటారు. ఆరోజు వర్షం కారణంగా, బయటకు వెళ్లే అవకాశం లేక కొంతమంది, హాజరు కోసం కొంతమంది, ఆసక్తితో మరికొంతమంది, తప్పని సరి పరిస్థితిలో ఇంకొంతమంది, మొత్తం మీద అరవై మంది. లేకపోతే ఇంజనీరింగ్ థర్డ్ ఇయర్ చదివే విద్యార్థులు వందకి వంద శాతం ఇంగ్లీష్ ల్యాబ్‌కి రావడమేంటి పిచ్చి కాకపోతేనూ. జీరో ఆబ్సెంట్‌తో కళకళలాడింది అనుకోండి.

విద్యార్థుల ముఖాల్లో ఉత్సాహం కనిపించింది. ఆ ఉత్సాహాన్ని మరింత రెట్టింపు చేయాలనిపించి "పుస్తకాలు సర్దేసి, బాగ్స్ క్లోజ్ చేసి పక్కన పెట్టేయండి"

అన్నాను. అదేంటో విచిత్రం రెప్పపాటులో చేసేసారు. వారి ఉత్సాహాన్ని చూసి ఒక పండుగ వాతావరణాన్ని ఏర్పాటు చేద్దామనిపించింది. ఇవాళ ల్యాబ్‌లో ఒక ఆసక్తికరమైన వర్క్ చేద్దామని చెప్పాను. ''పుస్తకాలతో పనిలేదు'' అన్నప్పుడు సరే అంటూ అంతా ఒకేసారి నవ్వారు. క్లాస్ చెబుదామంటే వినరుగాని! ఎంజాయ్‌మెంట్ అంటే తగ్గేదేలే అంటారు పిల్లలు! "సరే అయితే అందరూ కిటికీ వైపు చూసి, వర్షాన్ని గమనించండి. మీ అనుభూతిని ఒక పదంలో చెప్పండి" అని అడిగాను. ఆ తరగతి గదిలో ఉన్న అరవై మంది విద్యార్థులు, అరవై ప్రత్యేకమైన పదాలను చెప్పారు. అవన్నీ బోర్డు మీద రాశాను. అందమైన అబ్బాయిలు, అమ్మాయిలు, వర్షం, శబ్దం, గొడుగులు, పచ్చదనం, ప్రకృతి, ఓ కప్పు కాఫీ, చిన్ననాటి జ్ఞాపకాలు, నవ్వు, నిరాశ, కన్నీళ్లు, ఓదార్పు, స్నేహితుడు, తల్లి, ప్రేమ, ఆందోళన, అవగాహన, మరియు రక్తపు మరకలు ఇలా ఎన్నో భావోద్వేగాలతో నిండిన పదాలు ఉన్నాయి.

ఈ పదాల నుంచి ఇరవై పదాలను తీసుకుని, వాటిని ఉపయోగించి ఓ చిన్న కథ రాయమని వారిని ప్రేరేపించాను. చాట్‌జిపిటి, జెమిని లాంటి ఏ ఇతర ఏఐ టూల్స్ వాడకుండా స్వంతంగా ఆలోచించి రాయాలని చెప్పి, వారి మొబైల్ ఫోన్లు సేకరించి పక్కన పెట్టించాను. మేక్ యువర్ మొబైల్స్ ఇమ్మొబైల్ అండ్ మైండ్స్ యాజ్ మొబైల్స్ అని తరచూ చెప్తుంటాను. వారిని వివిధ బృందాలుగా విభజించి, పది నిమిషాలు చర్చించమని అడిగాను. పదిహేను నుండి ఇరవై వాక్యాలలో ఒక చక్కటి ఫీల్ గుడ్ కథ రాయాలని చెప్పాను. ఆ కథకి ఒక చక్కటి ఇంప్రెస్సివ్‌గా ఉండే శీర్షిక, ఉప శీర్షికను పెట్టమని చెప్పాను. ముప్పై నిముషాలు సమయం ఇచ్చాను. వెంటనే వారిలో హడావిడి, ఎలా ప్రారంభించాలి అని అయోమయం, ఒక తెలియని అలజడి. విద్యార్థులు ఆలోచనల్లో మునిగి పోయారు. సంభాషణలు, చర్చలు ప్రారంభించారు. నేను వారిని గమనిస్తూ ఏం రాస్తారో మహానుభావులు అని క్లాసు అంతా తెగ చక్కర్లు కొడుతూ ఉన్నాను. ఇవాళ వీరి పిచ్చి రాతలతో నాకు మూడిందిలే అనుకున్నాను. ప్రేమ, నేరం, ప్రతీకారం, హత్య, స్నేహం–ఇలా ఎన్నో ఇతివృత్తాలతో కథలు వచ్చాయి.

అబ్బా! చాలా వైల్డ్‌గా ఉన్నారులే అనిపించింది. కానీ ప్రతి కథలో ఒక కొత్తదనాన్ని జోడించి మెప్పించారనుకోండి. పిల్లలు కదా. అందులోనూ ఇంజినీరింగు. అప్లికేషన్ ఓరియెంటెడ్ కదా. చంపేసి చింపేసి ఉతికి ఆరేశారనుకోండి. సూపర్ అనిపించింది. ఎవడురా యంగ్‌స్టర్స్ ఆర్ యూస్ లెస్ అన్నది. దె ఆర్ యూస్డ్ లెస్ అనిపించింది. అయితే, ఆ కథలలో ఒక కథ ప్రత్యేకంగా నిలిచింది. అందరిని ఆకర్షించింది. కథ చదివిన వెంటనే చప్పట్ల వర్షం. ఆ కథ చదువుతున్నంతసేపూ ఒక నిశబ్దం. ఓ సాంఘిక మలుపు తిరిగిన కథ. ఇది ఓ సాధారణ సంఘటన, కానీ ప్రతి ఇంట్లో ప్రతిధ్వనించే కథ. చరణ్ లేచి ఆ కథ చదివాడు.

కథ ఇలా ఉంటుంది...

చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకోవడం నాకు అలవాటు. నేను ఒక కప్పు కాఫీ తాగుతూ కూర్చుని, వర్షం వైపు చూస్తూ ఉన్నప్పుడు, నాకు పన్నెండు ఏళ్ళ వయసులో జరిగిన ఒక సంఘటన గుర్తుకు వచ్చింది. నేను ఎప్పుడు ఒంటరిగా ఉండటానికి ఇష్టపడతాను. నేను ఎవరితో కలవను అందుకే అందరు నన్ను ఇంట్రావర్ట్ అంటారు. ప్రకృతిలో ఎక్కువ సమయం గడుపుతూ ప్రకృతిని ఆస్వాదిస్తూ ఉంటాను. ప్రకృతిలో గడిపే ప్రతి క్షణం నాకు అమూల్యంగా అనిపిస్తుంది. మా పాఠశాల పచ్చదనంతో నిండి, పర్వతాలతో చుట్టుముట్టి అందమైన అద్భుతమైన వాతావరణంతో ఉంటుంది. వర్షపు చినుకులు పడుతున్నప్పుడు ఆ దృశ్యం మరింత అందంగా మారుతుంది.

వర్షంలో అందమైన అబ్బాయిలు, అమ్మాయిలు కళకళలాడుతూ గొడుగులు పట్టుకుని వడి వడిగా నడుస్తున్నారు. నేను నా క్లాసులో కూర్చొని తదేకంగా అందరిని గమనిస్తూ ఉన్నాను. అప్పటికి మాకు చివరి పిరియడ్, డ్రిల్ పిరియడ్. వర్షం కారణంగా క్లాసులోనే ఉండాల్సి వచ్చింది, తరగతి గదికే పరిమితమయ్యాం. వర్షంలో పిల్లలు గొడుగులు పట్టుకుని పరుగులు తీస్తూ వస్తుండగా, నేను మా క్లాసులో కూర్చుని బయట దృశ్యాన్ని చూస్తూ ఉన్నాను. ఏదో శబ్దం వినిపించి పక్కకి తిరిగి చాశాను. మా ఇంటి ప్రక్కన, పొరుగింట్లో, ఉండే నా స్నేహితురాలు అసౌకర్యంగా కనిపించింది. తలను బెంచ్‌పై

వాల్చి ఉంది. అటుగా వెళ్లే మా క్లాస్ టీచర్ తనను గమనించి, తన దగ్గరకు వచ్చి విషయం తెలుసుకుని తనని బయటకు తీసుకెళ్లారు. తను లేవగానే బెంచ్‌పై ఎర్రటి రక్తపు మరక కనిపించింది. అది చూసిన వెంటనే కొందరు సహవిద్యార్థులు నవ్వారు. అది చూసి ఆ అమ్మాయి బాధపడి కన్నీళ్లు పెట్టుకుంది. నాకు చాలా బాధేసింది. కోపం కూడా వచ్చింది. నేను చాలా నిరాశకు గురయ్యాను. కానీ ఏం జరిగిందో తెలియదు. ఇంతలోనే నన్ను తీసుకు వెళ్ళడానికి మా అమ్మ వచ్చారు. మేము ఇరుగు పొరుగువారమని తెలుసుకున్న మా క్లాస్ టీచరు, మా అమ్మ దగ్గరకు వచ్చి, నా స్నేహితురాలిని మాతో పాటు తీసుకువెళ్లి వాళ్ళ ఇంట్లో వదిలిపెట్టమని చెప్పారు. తరువాత, మేము మా ఇంటికి తీసుకువెళ్ళాము. మా అమ్మ ఆ అమ్మాయిని ఓదార్చి, ఏమి జరిగిందో వివరించి, ఆపై తనను తన ఇంటికి తీసుకెళ్లి వదిలిపెట్టారు. వాళ్లిద్దరి మధ్య సంభాషణ ఏమి జరిగిందో నాకు ఆరోజు తెలియలేదు, కానీ ఇప్పుడు, అటువంటి క్షణాల మీద అవగాహన వచ్చింది. ఆ రోజు నాకు అర్థమైంది... ఒక్కోసారి, మౌనంగా ఉండే సంఘటనల వెనుక, ఎవరికీ చెప్పలేని బాధ ఉంటుంది. అటువంటి సందర్భాల్లో అర్థం చేసుకోవడం ముఖ్యం. తేలికగా నవ్వడం కాదు, సహాయం చేయడం అసలైన మానవత్వం అని. ఇది ప్రతి ఒక్కరికీ, ప్రతి ఇంట్లో జరిగే ఒక సహజ ప్రక్రియ. అలాంటి క్షణాల్లో అమ్మాయిల పరిస్థితిని ఎగతాళి చేయడంలో అర్థం లేదు. వారి అవసరాలను గుర్తించి, వారికి పూర్తి సహకారం అందిచడం ముఖ్యం అని తెలుసుకున్నాను. ఈ అనుభవం నా హృదయంలో నిలిచిపోయింది. నేను పెద్దవాడినయ్యాక, నా పిల్లలకూ ఇలాంటి విషయాలను నేర్పాలి అని అనుకున్నాను. ఎవరినీ అవమానించకండి, అర్థం చేసుకోండి అని.

ఈ కథ విన్న తరవాత విద్యార్థులలో ఉన్న మౌనం ఒక గమనించదగ్గ పరిణామం. చరణ్ చదివిన తరవాత, వారిలో ఓ లోతైన ఆలోచన. ఈ తరగతిలో ఓ గొప్ప పాఠం నేర్చుకున్నాం. వర్షపు చినుకులు ఒక్క భూమినే తడుపవు, హృదయాలను తడిపే సున్నితమైన బంధాలను, అవగాహనను, స్పృహను కూడా మోసుకువస్తాయి! వర్షపు చినుకులా మెరిసిన ఈ కథ కేవలం ఒక బాలిక అనుభవించిన సంఘటన మాత్రమే కాదు, ఇది ఓ సాంఘిక సందేశం. చినుకులు భూమిని తడిపి కొత్త జీవాన్ని పోసినట్లు, ఆలోచనలు, భావనలు కూడా సాహిత్యంగా, బోధనగా, కవిత్వంగా వికసిస్తాయి. ప్రతి చినుకు ఒక కొత్త భావన, ఒక కొత్త అనుభూతి, ఒక కొత్త కవిత. సృజనాత్మకత ప్రకృతిలోని చిన్న విషయాలనుంచి స్ఫూర్తి పొంది, అవి విద్యార్థులకు, పాఠకులకు మేఘాలలో వెన్నెలలాగా వెలుగునిచ్చేలా మారుతుంది. ఒక చిన్న సంఘటన, ఒక పెద్ద సందేశం. అమ్మాయిల జీవితంలో ఒక సాధారణమైన దశగా ఉండే క్షణాన్ని అవమానంగా కాకుండా, అవగాహనతో చూడమని చెప్తున్న ఈ కథ ప్రతి ఒక్కరూ చదవాల్సిన కథ, వినాల్సిన కథ, భోదించాల్సిన కథ. ఇది నా కథ! నా విద్యార్థి కథ! నా తరగతి గదిలో జన్మించిన ఓ అద్భుతమైన కథ!

**డా. షేక్ సలీం బాబు**
ఆంగ్ల అధ్యాపకులు,
రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం,
ఐఐఐటి, నూజివీడు, ఆంధ్ర ప్రదేశ్.

## కమ్మతెమ్మెర

మాన్యులు, అశ్విని కుమార్ గారికి, నమస్తే.

రాంబాబు గారితో, మీ సంపాదకుని మాటా –మంతి, బాగుంది. సంపాదకులుగా మంచి పేరు పొందిన, తెలుగు వారు వున్నారు. తొలితరం, కోటంరాజు గారు, ఖాసా గారు నుంచి సురవరం, ముట్నూరు, నార్ల వారి దాకా ఉన్నారు కదా. నా మనవి ఏమిటంటే, మీరు చాలా మందితో కాకపోయినా, కొద్దిమంది, మీ దృష్టిలో మంచి సంపాదకులతో, కలిసి పని చేశారా? చేసి ఉంటే వారితో, మీ అనుభవాలు, మీరు నేర్చుకున్నవి, నచ్చినవి, నచ్చనివి, **మిసిమి** పాఠకులకు అందిస్తే బాగుంటుంది కదా ? మీరు , చెప్పినట్లు , వార్తాపత్రిక నిర్వహణకు, మ్యాగజైన్ నిర్వహణకు చాలా వ్యత్యాసం ఉంది.

***- మనోహర్ పంత్***



**ఆశ్రమంలో ఎ.బి.కె. ప్రసాద్ గారు నేను వస్తుంటే నా చెయ్యిపట్టుకుని ఆపారు. అశ్వినీ! నీ ఆకాశవాణి ఇంటర్వ్యూ చదివానయ్యా! మేము ఎవరూ చేయలేని పని నువ్వు చేసావు. మొహమాటం లేకుండా ముక్కుసూటిగా అన్నివిషయాలు చెప్పగలిగావు. కంగ్రాట్యులేషన్స్ అన్నారు.**

***- సంపాదకులు***

# ఒక్కడు - పాల్కురికి సోమన

**- ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ**

ఒకడు నాచన సోమన - ఇది విశ్వనాథ గారి ఉక్తి. పద్యం, పద్య శిల్పం, భావం, దాని పోహళింపు, తీర్పు, కావ్యసౌందర్యం, దాని ఆస్వాదన వంటి వాటిని దృష్టిలో ఉంచుకొని పలికిన వ్యాకరణ సూత్రంలాటి మాట. అది వైశ్వనాథ మార్గం. కాని కావ్యశాస్త్ర శిల్పంతో సంబంధం లేని, ప్రజాసామాన్య ప్రియమార్గం మరొకటుంది. దాన్ని పాటించి చెబితే - 'ఒకడు పాల్కురికి సోమన' జనంలో రూఢికెక్కిన పదం, ఆట పాట కనుగుణమైన శాబ్దికలయ, దాని విన్యాసం; భావసౌందర్యం కంటె మించిన భావోత్తేజం, ఆ భావోత్తేజానికి మూలకందమైన ధార్మిక విశ్వాసం, దానిపట్ల అనురక్తి-భక్తి; ఆ భక్తిలోని పారవశ్యం, ఆవేశం; ధర్మప్రతిష్ఠాపనంలో, రక్షలో కవికి తన కర్తవ్యం పట్ల కలిగే ఆత్మబోధ, నిష్ఠ, దాన్నుంచి పెల్లుబుకివచ్చే నవనవోత్తేజ సందేశం - ఇవన్నీ ఆ కవి కర్మను - అంటే అతని సృజనను, కావ్య నిర్మాణాన్నీ నిర్దేశిస్తాయి, నియంత్రిస్తాయి.

భావ సౌందర్యం స్థానంలో భావావేశం, కావ్యశిల్పం స్థానంలో కర్తవ్యనిష్ఠ, సందేశం ప్రథమస్థాన మాక్రమించి నిలుస్తాయి. ఈ ప్రాథమ్యాలను బట్టి 'ప్రక్రియా' పర వివక్షలు మారుతాయి. వాటిని పరిగణనకు తీసుకొనని సాహిత్య వివేచన అసంపూర్ణమౌతుంది. అలాంటి అసంపూర్ణ వివేచనలకు బలైనవాడు - 'ఒకడు పాల్కురికి సోమన'.

అంతరంగ దర్శనం, ఆత్మకర్తవ్యబోధ, ధర్మ ప్రతిష్ఠాపనానిష్ఠ అనే మూడు అంశాలు, ఒక్కటిగా కలిసి, ముప్పేటలా అల్లుకొని, సాహిత్యావతరణ జరగకుంటే, ఈ దేశం ఇంత గర్వంగా చెప్పుకొనే, ప్రపంచంలోనే అత్యంత ప్రాచీన వాఙ్మయ మనబడే వైదిక సారస్వతం ఉండేదికాదు. ప్రపంచంలోనే అత్యంత సుదీర్ఘ రచన భారతం అవతరించేదికాదు, రామాయణం ఇంత పారాయణ రమ్యమై నిలిచేదికాదు, భారతీయ సాహిత్య ఆత్మే అగుపించేది కాదు. ఈ దేశ సంస్కృతి మూలతత్త్వాలను, ప్రపంచించి నిలిపిన వారు మతప్రవక్తలు కారు, కవి మహర్షులు! కవులైన ఋషులు, ఋషు ల్లాంటి కవులు. తెలుగువారి భాగ్యం కొద్దీ ఆ పరంపరకు చెందినవారే మన ప్రాచీన కవులు. అందులో ఇతరులందరి కంటె భిన్నమైన ఒకే 'ఒక్కడు పాల్కురికి సోమన్న !'



ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ

ఒక్కడు ! - అటు విశిష్టతా సూచకమూ ! ఇటు ఒంటరి తనపు సూచకమూ !! ఒంటరి వారికి చరిత్రలో న్యాయమైన స్థానం దొరకడం ఎప్పుడూ కష్టమే !!! ఆ విభిన్నతను సరిగా అంచనా వేయాలంటే, ఆయన సృజించిన సాహిత్యాన్ని మాత్రమే చూస్తే చాలదు. ఆ సాహిత్యాన్ని సృజింప చేసిన సాంస్కృతిక నేపథ్యాన్ని, నాటి సాంస్కృతిక చైతన్యాన్ని చూడాలి. సమకాలీన సాంస్కృతిక చేతన అనే కొలనులో పూసే చెంగలువే ఏ ఉత్తమ రచన అయినా సాధారణ పూలైతే సాయంకాలానికి వాడిపోతాయి. దివ్యపుష్పాలు కాలాన్ని జయించి విరాజిల్లుతాయి. సోమన్నవి కూడా దివ్యపుష్పాలే. నాటి సాంస్కృతిక నేపథ్యంలో ఆ దివ్యతను క్రమంగా చూద్దాం.

**1.** నాటి సాంస్కృతిక చేతనలో విప్లవాత్మక విద్యుత్తరంగాలను సృష్టించినది వీరశైవం. సాత్త్వికతకు ప్రాధాన్యమిచ్చే భారతీయ మతస్థులను, తురుష్కుల తాకిడి అతలాకుతలం పాలుచేసింది. ఆ కల్లోల స్థితిలో వారిలో ఆత్మస్థైర్యం, ధార్మిక నిరతి పెంపొందించడానికి, భారతీయ సమాజాన్ని బలహీన పరచిన జాతి రుగ్మతలకు తగ్గ చికిత్స చేయడానికి, స్వధర్మ రక్షణకు ఉద్యమింపచేసే వీరోత్సాహాన్ని నింపడానికి, పొరుగుననున్న కళ్యాణ బసవన్న ఒక కొత్త మతాన్ని ప్రబోధించాడు. నాటి సమాజంలో మనుష్యులందరినీ ఒక్క త్రాటి మీదకు తెచ్చి, ఐహిక-ఆముష్మిక కర్తవ్య నిర్దేశనం చేసి నడిపించగలిగే ఏకైక శక్తి మతం. ఆ మతం శివ, విష్ణు, శక్తి వంటి ప్రతీకమూర్తుల మయం. బసవన్న తన పూర్వుల సంప్రదాయ ప్రభావం వల్లనో, తన సొంత చింతనాఫలం వల్లనో శైవాన్ని ఎంచు కొన్నారు. అయితే అది పూర్వపరంపరకు చెందిన శైవం కాదు. వీరప్రబోధకమైన శైవం. అందుకే దాన్ని వీరశైవమన్నారు. పూర్వ మత విశ్వాసాలనన్నిటినీ అందులో స్వకీయతర్కంతో

లయింపచేసి, సర్వ శ్రేష్ఠమైన ఆధ్యాత్మిక – సామాజిక ధర్మంగా దాన్ని నిలిపారు. ఆయన బలిమివల్ల కన్నడనాట అది ఊపందుకొంది.

దక్షిణ భారతపీఠభూమికి ఎడమచెంప కన్నడ నాడు అవుతే, కుడిచెంప తెలుగునాడు. ఏ కారణంవల్లనో తెలుగునాట అది అంత బలంగా నిలదొక్కుకోలేదు. దానికి కారణం తెలుగునాడు సంతతినీ నాటికి లోబరచుకొన్న బ్రాహ్మణ మత ప్రభావం కాబోలు, బ్రాహ్మణమతంలోని బలవత్తరమైన శ్రేణీకృత వర్గ విధానం కాబోలు, అంతకు మునుపు తెలుగునాట అత్యధికభాగం ప్రభుత్వం నెరపిన రాజవంశాలు. ముఖ్యంగా, కొద్ది మునువున్న చాళుక్యులు బ్రాహ్మణ్యాని కిచ్చిన ప్రత్యేక ప్రాధాన్యం కాబోలు. రాజ రాజ నరేంద్రుని పిమ్మట అతని కుమారుడు తంజావూరు తమిళ సింహాసనానికి వారసుడై కుళోత్తుంగ చోళుడనే పట్టనామంతో అక్కడ పట్టాభిషిక్తుడై, తెలుగు భూమిని కూడా అక్కడనుంచే పాలిస్తూ, ఇక్కడ బ్రాహ్మణమత ఇతోధిక ప్రాచుర్యం కోసం, ద్రావిడ (తమిళ) దేశంలోని ఉద్దండ వేదపండిత కుటుంబాలను పంపి, అగ్రహారాలనిచ్చి, 'చతుర్వేద మంగళా'లను అనేకంగా నెలకొల్పాడు. శాతవాహనానంతర కాలం నుంచి, ఇక్ష్వాకు, విష్ణుకుండిన, ఆనందగోత్రికులాదిగా తెలుగునేల నేలిన రాజకుటుంబా లన్నీ సమాదరించిన బ్రాహ్మణమతాన్నే. దాని ప్రభావాన్ని తెలుగునాడు అధిగమించడం అంత సులభం కాదు. ..... "బ్రహ్మంబుతో పొత్తు బాయలేను బసవలింగ" అన్న నివేదన వెనుక వాస్తవం కూడా అదే. దాని ప్రాధాన్యాన్ని త్రోసిరాజనని నవ్యమతాలకే ఇక్కడ చోటుకాని, అథఃకరించే భావ విప్లవాలకు కాదు. బసవన్న మతానికి కొంది ముందుగా, సామాజిక సంస్కరణను, సమేకతను అభిలషించి వచ్చిన నవ్య ప్రబోధమే శ్రీమద్రామానుజుల వైష్ణవం. అందులో కూడా హరిజన–గిరిజనాది నిమ్నజాతుల సమీకరణం ఉంది. శూద్రవర్ణుల సాంస్కృతిక సమున్నతీకరణం ఉంది. తెలుగునాట దానికి లభించినంత ఆదరణ, అంతకంటె విప్లవాత్మకమైన మార్పును, మానవులందరూ శివుని సంతతేననే సర్వ సమానతా భావనను ప్రచారం చేసిన బసవన మతానికి లభించలేదు. ఎంచేతంటే ఇందులో బ్రాహ్మణ ప్రాధాన్యం లేదు. వైష్ణవంలో అది తగ్గలేదు. బ్రాహ్మణమత పరిమితుల్లోనే వచ్చిన మార్పు వైష్ణవం. ఆ పరిమితులను పూర్తిగా పక్కకు నెట్టిన మార్పు వీరశైవం. ఆ కారణంగానే తెలుగునాట వీరశైవం నిలదొక్కుకోలేదు.

**2.** లోకంలో ఒక అపప్రథ ఉంది. రెండవ ప్రతాప రుద్రుని కాలంలో కాకతీయ సామ్రాజ్యం కూలిపోవడం వెనుక వీరశైవుల పాత్ర ఉందనేమాట ప్రచారంలోకి వచ్చింది. వింధ్య దిగువ నుంచి, కంచి వరకు విస్తరించిన తొలి అఖండాంధ్ర మహా సామ్రాజ్యాన్ని కూలదోయాలంటే, వాళ్లూ అప్పటికంత బలవత్తరమైన శక్తిగా పొదుకొని ఉండాలి. అది వాస్తవమా? కాదా? అనే మాటను పరీక్షించి చూసిన వెనుక, ఆ మాటను నమ్మడమో, కాదనడమో చేయాలి ఏ చరిత్రకైనా కచ్చితమైన దాఖలాలు నాటి శాసనాలు. కాకతీయులనాటి శాసనాలన్నింటినీ తరచి తరచి చూసినా, వీరశైవుల సామాజిక సబల స్థితికి ఏ దాఖలా కూడా లేదు. ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ, వారిని ప్రస్తావించే శాసనాలే మృగ్యం. శాసనాలన్నీ ప్రాయికంగా బ్రాహ్మణ మత సూచకాలే. బ్రాహ్మణ్యం పెత్తనంలోని ఆలయాల దాన వివరణలే శాసనాలన్నమాటను అంగీకరించినా, శ్రీశైలంవంటి వీరశైవ సింహాసన ప్రాంగణంలోనైనా వారి శాసనాలేల అగుపడ్డం లేదు? శాసనమెత్తించేటంత బలవత్తర సామాజిక స్థితి వారికి లేదన్నమాటే కదా! మొత్తం నాటి శాసన సంచయంలో త్రిపురాంతక శాసనమొక్కదాంట్లో మాత్రం వారి ప్రస్తావన అగుపడుతోంది. అదీ సమకాలీనమైన ఎనిమిది, తొమ్మిది శైవ శాఖా భేదాల్లో ఆఖరిదిగా! నామమాత్ర పరోక్ష ప్రస్తావనే!.... అలాంటప్పుడు, అంతటి మహాంధ్ర సామ్రాజ్యాన్ని కూలద్రోయడంలో వారి పాత్ర ఉందనడం ఏపాటి న్యాయం?... నాటికీ, నేటికీ తెలుగునాట వీరశైవులు అల్పంపంఖ్యాకవర్గమే. అలాంటి అల్పసంఖ్యాక వర్గ చేతనకు అనల్ప కీర్తి కిరీటాలు తొడిగిన 'ఒక్కడు, పాల్కురికి సోమన్న!

**3.1** అది పూర్తి వీరశైవ చేతనేనా?.... ఇదేం ప్రశ్న అనే భావం పఠితలకు కలగడం సహజమే. వీరశైవధర్మ మూలతత్త్వాలను సోమన చిత్రించినంత ప్రౌఢంగా, భక్త్యావేశ భరితంగా తెలుగులోనే కాదు, కన్నడ సాహిత్యంలో కూడా ఎవరూ చిత్రించలేదంటే అతిశయోక్తి కాదు. కన్నడంలో వీరశైవధర్మాన్ని వివరించే సైద్ధాంతిక రచనలు విడిగా వచ్చాయి. అవికాదు; సాహిత్య రచనల విషయం ఇందాకా అన్నది. అచార్య బాణాల రామయ్య గారి పుణ్యమా అని, ఆయన మధుర కవితా శైలిలో, బసవన

వచనామృతం తెలుగులోకి అనూదితమైంది. బసవన కంటె ఎక్కువగా, బసవన దర్శనాన్ని పాల్కురికి సోమన కావ్యస్థం చేశాడంటే అతిశయోక్తికాదు. అంతేకాదు, వైదిక ఉపనిషత్సాహిత్యం ప్రతిపాదిస్తున్న మూల సూత్రాలను వేదాంత పండితులనేకులు హృద్యంగా వివరించి ఉండగా, చదివి ఉంటాము. కాని ఇంత విమర్శనాత్మకంగా ప్రస్తావించిన వారు మాత్రం అరుదు. 'పండితారాధ్య చరిత్ర'లోని ఒక్క దీక్షాప్రకరణాన్ని తీసుకొని, లేదా మరికొన్నిటిని కూడా అనుబద్ధం చేసి, తెలుగులో చక్కటి వ్యాఖ్య నెవరైనా రాయగలిగితే, కనీసపక్షంగా వివరణ రాసినాసరే, భారతీయ తాత్త్విక సాహిత్యప్రియులకు మహోపకార మవుతుంది. పాల్కురికి సోమన్నకు కూడా నిజమైన న్యాయం జరుగుతుంది. తమ ధర్మానికి చెందిన తార్కిక దృష్టినుంచి, ఖండన మండనాదులకు ఎన్ని మహావాక్యాలను ఆయన ఉదహరిస్తూ వెళ్తాడు? ఎంత ధారాపాతంగా ఆ మహావాక్యాలను అక్కడ నిబద్ధపరిచాడు? తత్త్వ సాహిత్యప్రియులెందరు తెలుగులో లేరు? వారి దృష్టి దానిపై ఎందుకు పడలేదు?... సమాధాన మొక్కటే!.... ఒక్కడు, పాల్కురికి సోమన. ఒక్కడు ! అటు విశిష్టతా సూచకమూ, ఇటు ఒంటరితనపు సూచకమూను! ఈ ఒంటరితనం ఎలా వచ్చింది?....

**3.2.1** సోమనాథాలయం మీద ఆఖరి దండయాత్రతో భారతీయ ధార్మిక వ్యవస్థ పునాదులపై ప్రచండమైన దెబ్బ తగిలింది. జాతి వివక్షత (అప్పటికింకా కులవ్యవస్థ పాదుకోలేదు), భారతజాతి నెంత నిర్వీర్యపరిచిందో, ఆలోచనాపరులందరికీ అర్థమైంది. ప్రగతికి మరోరూపు బహుళత, బహుళతకు మరో విపర్యాసం ఐక్యత లేకపోవడం. అంతదాకా భారతదేశం సాధించిన ధార్మిక ప్రగతి, ధార్మిక బహుళతగా తద్విపర్యాసమైన బలహీనతగా పరిణమించింది. ఆ బలహీనతవల్లే ఈ జాతి, ఈ దేశం మొత్తం అన్యాక్రాంతమయ్యే ప్రమాదం పొంచి ఉందని దార్శనికులకు స్పష్టమైంది. ఈ దేశవాసులలో, ధార్మికాచరణలకతీతమైన ఐక్యత బలపడితేకాని, ఈ దేశం, జాతి నిలబడదనే సత్యం స్పష్టమైంది. ఆ ఐక్యతకు తగ్గ కార్యాచరణ తక్షణావసరంగా రూపొందింది. విజాతీయులు సృష్టించిన కల్లోలంలో ఔత్తరాహం మునిగి ఉండగా ఆ ఐక్యతా స్థాపనకు దక్షిణ భారతం, పొరుగింట ప్రమాదం కలిగినప్పుడు మనయింట జాగ్రత్తపడ్డ చందంగా, ముందస్తుగా మేల్కొని సన్నద్ధమైంది. ఈ మేల్కొలుపు ఉద్యమాన్ని, ఈ ఐక్యతాభావ ప్రతిష్ఠాపన ఉద్యమాన్ని తక్షణావసరంగా భావించి మొదటగా చేపట్టినవాడు నిస్సందేహంగా శంకరుడే. ఆయన ఉద్యమ అభివ్యక్త నామమే అద్వైతం. అందుకోసమే ఆయన, ఆ చిన్న వయసుకే ఆసేతుశీతాచలపర్యంతం పర్యటించి, దేశం నాలుగుచెరగులా, అత్యంత కీలక ప్రాంతాల్లో తన సైద్ధాంతిక ప్రబోధ మఠాలను స్థాపించాడు. తాత్త్వికంగా, ఆధ్యాత్మికంగా 'అద్వైత సిద్ధాంత' ముఖం ఏదైనా సామాజికంగా దాని ముఖం ఐక్యతా స్థాపనకు సంబంధించిందే. ఆచరణ రూపంలో తలెత్తే విప్రకర్షను నివారిస్తూ, రామానుజుల వారి విశిష్టాద్వైత స్థాపన జరిగింది. నిమ్న వర్గాలను ఏకీకరణం చేయడానికి జరిగిన తొలి ఆధ్యాత్మిక సామాజిక ప్రయత్నం అది. శంకరులది సైద్ధాంతిక ప్రయత్నం కాగా, రామానుజులది తాత్త్విక–సాంస్కృతిక లేదా ఆధ్యాత్మిక–సామాజిక ప్రయత్నం. అయితే అందులో కూడా ఒక విప్రతిపత్తి ఉంది. బ్రాహ్మణ–శూద్ర వర్ణ వివక్షకు అది అవకాశం కల్పించింది. శూద్ర వర్గజుల సాంస్కృతిక ఆచరణల నిమిత్తం, ప్రత్యేకంగా అటు చాత్తాద శ్రీవైష్ణవులనే మధ్యంతర పూజారి వర్గాన్ని, దాసరులనే నిర్వహణ సేవావర్గాన్ని సృజించింది. ఆలయాంతర్గతమైన మంత్రోపేత సేవలను బ్రాహ్మణవర్గానికి ప్రత్యేకిస్తూ, అలంకారాది బాహిరసేవలను చాత్తాదులకు వేర్పరచింది. అలంకారంచేయు = సాత్తు అనేమాటనుంచే చాత్తాదులు అనేమాట రూపొందింది. (తమిళంలో పదాదిన స, శ, చ లకు ఒకే అక్షరం, 'చ'కార ధ్వనితో కూడినది). నాటి సామాజిక పరిమితులకు లోబడి, వర్ణాశ్రమ ధర్మరక్షణ ప్రథమ కర్తవ్యంగా భావించే రాజ్యవ్యవస్థను ప్రతిఘటించకుండా, ఉభయమార్గంగా, అధిక జనామోదం నిమిత్తం శ్రీ వైష్ణవం ఆ దారి తొక్కిందేమో !.... నిజానికి రామాజులవారిది గృహస్థ పర్యంతమైన తాత్త్విక–సామాజికోద్యమమే కాని, సమాజాన్ని మొత్తం ఒక్కటిగా ఉద్యమింప చేసిన అచ్చపు సామాజికోద్యమం కాదు. రామానుజ మతంలోని విప్రతిపత్తిని గుర్తించి, ఏ వర్గ వివక్ష లేకుండా సమాజాన్ని మొత్తం ఉద్యమశీలంగా మార్చడానికి ఉద్దేశించింది బసవమతం.

ప్రతి భావజాలం మార్పిడీ ఉద్యమం కాదు. ఉద్యమమంటే ఒక పెనుమార్పుకు యుద్ధశీలతతో ఉద్యమించేది. 'భక్తి'ని తరచూ ఉద్యమమని కొందరు విమర్శకులు వ్యవహరించడం కద్దు. సాత్త్విక ప్రవృత్తిలోని

'భక్తి' ఒక హృదయ వృత్తేకానీ, ఉద్యమం కాదు. మహా అవుతే, అది ఉద్యమస్ఫూర్తి నింపే ఒక నిష్ఠ, భావావేశం. అంతే !.... ఒక నిర్దిష్ట లక్ష్యం కోసం, ఆత్మ త్యాగానికి కూడా సన్నద్ధపరచినప్పుడే అదో ఉద్యమశక్తి. అందరూ అలా ఆత్మత్యాగానికి సన్నద్ధమై ఒక్కటిగా కదలినప్పుడే అదో 'ఉద్యమం' అని పిలువబడే స్థాయికి చేరుకొంటుంది. ఆ మాటకు అర్థమవుతుంది. అలాంటి ఉద్యమస్థాయి భక్తికి ప్రవక్త లేదా భక్తి పేరిటి సామాజక ఉద్యమ నిర్మాత బసవన్న. అర్థం గూర్చి, పెద్ద పట్టింపు లేని సామాన్య స్థాయిలో ఉద్యమమనే మాటనే వాడి చెప్పవలసి వస్తే – శంకరులది తాత్త్విక – సైద్ధాంతిక ఉద్యమం; రామానుజులది ఆధ్యాత్మిక–సామాజిక ఉద్యమం; బసవనది శుద్ధ సామాజిక – భక్తి ఉద్యమం. శంకరులు ధార్మికాచరణ, విశ్వాసాల విషయంలో సమన్వయ విధానం చెప్పినప్పటికీ, శైవం వైపే మొగ్గుచూపారు. వైష్ణవం వ్యూహాత్మకంగా అవతార కల్పనను అనుసరిస్తూ, అటు పౌరాణిక ప్రతీక మార్గాన్ని, ఇటు చారిత్రక–సాంస్కృతిక నాయకత్వ మార్గాన్ని, అందులో నిక్షిప్తమైన సాంప్రదాయిక వర్ణ ప్రాముఖ్య మార్గాన్ని సమన్వయించి, ప్రతిఘటనకు అవకాశంలేని సాత్త్విక ఆచరణ మార్గాన్ని ఎన్నుకొంది. అది ఉన్నత వర్గాలకు ఆమోదయోగ్యమైన ఏక సంస్కృతి సూత్రాన్నే ఆదరించింది. బసవన్న వీరందరికంటె భిన్నంగా భక్తి పేరిట, స్వధర్మం రక్షణార్థం తమ్ము తాము సమర్పించుకొనే, సుశిక్షిత ధార్మిక బలాన్ని, బలగాన్ని రూపొందిస్తూ, బహుజన సంస్కృతి ఏకతకు దారి పరిచారు. ధర్మ పరాయణత్వం అధీరమార్గం కానేరదనీ, ధర్మం పేరిట నిర్వీర్యతకు చోటివ్వరాదనీ, శుద్ధ వీర ధర్మాన్ని మతాచార విధానంలో సమున్మీల పరిచాడు. ఈ దేశంలో అలాంటి సామాజిక భక్తి ఉద్యమ నిర్మాతలలో బసవన్న మొదటివాడు. గురునానక్ ఆఖరివాడు.

3.2.2 బసవన్న నిర్మించింది ఒక అద్భుతమైన మార్గం. ధర్మవీరం దాని ఆత్మ. ఇక్కడ ధర్మమంటే మతమనే నా భావం. అద్వైత, ద్వైతాదులకు మతమనీ, శైవం, వైష్ణవం, బౌద్ధం ఇత్యాదులకు ధర్మమనీ సాంప్రదాయిక వ్యవహారం. ఈ ధర్మ వీరానికి తగ్గదే ఆయన మతానికి కేంద్రమూర్తి అయిన శివుని రూప ప్రతీక. వైదిక సంస్కృతికి భిన్నమైన నిమ్న వర్గాల భావ చేతనకంతా శివుడు గొప్ప పరంపరాగత ప్రతీక ! .... ప్రాచీన భారతీయ ధార్మిక సంస్కృతికి రెండు ప్రధాన దృక్కోణాలు; 1. చితి 2. చింత– అని సంస్కృతి వేత్తలు చెబుతారు. జీవుడి మూలాలు ఏమిటి అని ఆలోచించే వారు ఒకవర్గం; విగతులైన జీవులు ఇక్కడే వుంటారు అని విశ్వసించి వారి భౌతికదేహాలను పూడ్చి ఆ పూడ్పు గుర్తులను పూజించేవారు మరొక వర్గం. ఈ వర్గ ప్రజలు చింతన సంస్కృతిని పెంచినవారికంటె పూర్వులు. ఆ అతి ప్రాచీన వర్గాల దైవమే శివుడు. అందుకే ఆయన స్మశాన వాసి.... అతి ప్రాచీనవర్గాలంటేనే అతి నిమ్న వర్గాలని అర్థం. శివుని చర్మాంబర ధారణ, జటాజూటం, నాగాభరణం, నందివాహనం, పర్వతవాసం, కిరాతావతారం, వీరభద్రరూపం, త్రిశూలం, పినాకం – ఇత్యాదులన్నీ దిగువ వర్గాల, విభిన్న తెగల (ట్రైబ్స్) సమీకరణ ప్రతీకలే. ఇక్కడొకమాట చెప్పాలి. భారతీయ పురాణాలనేమిటి, ప్రపంచంలో ఏ పురాణాలను లేదా, పురాణగాథలను పరిశీలిస్తున్నప్పుడు, విధిగా ఆయా పౌరాణిక ప్రతీకల స్వభావాన్ని, వాటి వెనుక అడగిన సామాజిక – చారిత్రక వాస్తవాలను క్రమరీతిలో విశ్లేషించి చూడాలి పౌరాణికశాస్త్రం (మైథాలజీ) స్వయం సంపూర్ణమైన 'సంకీర్ణ సంస్కృతిశాస్త్రం' అనే భావన స్పష్టంగా ఉండాలి. లేకుంటే ఆ రూప ప్రతీకలు సంకేతించే భావాలు ఎప్పటికీ అర్థంకావు. ఈ అధ్యయనం తెలుగులో చాలా వెనకపడి ఉండడం మన దురదృష్టం. దాన్నలాగుంచితే, ఈ దేశ మత / ధర్మ సంస్కృతిని స్థూలంగా చూసినపుడు – 1. ఏకసూత్రాన్ని ఆపాదించే వైదిక బ్రాహ్మణ మత సంస్కృతి. 2. బహుళతను ప్రతిబింబించే బహుజన విశ్వాస సంస్కృతి అని రెండుగా విడదీసి చూడవలసిన అవసరం ఉంటుంది. శివుడు ఆదినుంచీ ఈ రెండవ భావధారకు సమ్యక్ ప్రతీక. మరోమాటలో చెబితే వైదిక వర్గాల వ్యాప్తికి ముందు, ఈ దేశంలో దేశీయంగా ఉన్న భిన్న జాతుల, భిన్నతెగల విశ్వాసాల సమాహారానికి శివుని మూర్తి చిరంతన ప్రతీక. ఈ సందర్భంగా ఋగ్వేదంలో శివుని పేరు పెట్టకుండా సంఘ బాహ్యునిగా, రుధిరాన్న బలినపేక్షించే రుద్రునిగా అభివర్ణించడం మరచిపోరాదు. అలాగే విష్ణువనే శబ్దం ఆదిత్యునికి విశేషణంగా వాడబడడాన్ని కూడా విస్మరించరాదు. కనుక శివుడు ఈ దేశ ఆదిమ మత ప్రతీక. ఆదిమ జాతులన్నిటికీ కేంద్ర సంకేతం. విజాతీయుల దండయాత్రలకు మొదటగా ఉపయోగపడేదీ వారే కావచ్చు. లేదా, ఆ ఆటవిక తెగల ధైర్యసాహసాలు, పురాల్లో సుఖవాసులైన వారికి, పెట్టని కోటగా ఉపయోగపడనూ వచ్చు. రాజ్యరక్షణలో పురదుర్గం కంటె

బలీయమైనవి వన, గిరి దుర్గాలు. మొదటినుంచి, వృద్ధులైన రాజప్రముఖులు తమ తరువాత తరానికి పురరక్షణను వదిలి, తాము, వన, గిరి ప్రాంతాలకు వానప్రస్థం పేరిట తరలి వెళ్లడమనేది ఈ దేశం రూపొందించుకున్న సనాతన రాజ్యతంత్రంలో భాగంగా వచ్చింది. ఆ వన, గిరి జనుల విశ్వాసాల సమేకీకరణ రూపమే శివుని మూర్తిమత్వం. దాన్ని చాలా వ్యూహాత్మకంగానే వీరశైవం తీసుకొంది. అంతకంటె అతి ముఖ్యమైంది, అది తయారుచేసిన ధార్మిక/మతపరనాయకత్వం. అచ్చమైన బహుజన శ్రామిక సంస్కృతికి ప్రతీక. **నిమ్న వర్గాలుగా అణచివేతకు గురైన వారినుంచే వీరశైవం తన ధార్మిక నాయకులను తయారుచేసుకొంది.** వివిధ సేవా వృత్తులకు సంబంధించిన శూద్రులు అతి శూద్రులు, దళితులు, స్త్రీలు వీరశైవ ధర్మానికి సంబంధించిన ధర్మవీరులయ్యారు లేదా ధార్మిక నాయకులయ్యారు.

**స్వర్గీయ ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ**
పూర్వ ఉపకులపతి, ద్రవిడ విశ్వవిద్యాలయం, కుప్పం

- - -

**తెలంగాణ సంస్కృతి తొలి ఆవిష్కర్త -పాల్కురికి సోమనాథుడు**
సంపాదకులు : **ఆచార్య అనుమాండ్ల భూమయ్య**

## పాల్కురికి తెలుగు వాల్మీకి

**– ఆచార్య అనుమాండ్ల భూమయ్య**

**1. వాల్మీకి : సోమన :** "కో స్వస్మిన్ సాంప్రతంలోకే – గుణవాన్ కశ్చ వీర్యవాన్...." అని వాల్మీకి గుణవంతుడు, పరాక్రమవంతుడు మొదలైన 16 గుణాలు కలిగిన వ్యక్తి ఇప్పుడు – ఈ కాలంలో, ఈ భూలోకంలో ఎవరున్నారయ్యా? అని వాల్మీకి ప్రశ్నించినాడు. రాముడున్నాడని నారదుడు చెప్పినాడు. రాముని కథ రామాయణం. వాల్మీకి కావ్యనాయకుడు సమకాలీకుడే. తన కాలంనాటి వ్యక్తిని గురించి వ్రాస్తేనే ప్రజలు అతణ్ణి అనుసరించటానికి వీలుటుందని వాల్మీకి భావన. సోమనది ఇదే భావన. తనకాలం నాటి బసవనను నాయకుని జేసి కావ్యం వ్రాసినాడు. బసవన్నకథ బసవపురాణం. వాల్మీకిది స్వతంత్ర కావ్యం. సోమనదీ స్వతంత్ర కావ్యమే. సమకాలీకుడైన వ్యక్తిని కథానాయకుని చేయటం, స్వతంత్రరచన కావించటం అనే రెండు అంశాల దృష్ట్యా సోమన తెలుగు సాహిత్యానికి వాల్మీకి వంటివాడు. రామాయణాన్ని వ్రాసి లవకుశులచేత వాల్మీకి ప్రచారం చేయించినాడు. బసవని చరితను ప్రచారం చేయటం కోసమే సోమ ఈ కావ్యం వ్రాసినాడు. ఇద్దరిదీ ప్రచార దృష్టియే. ప్రచార దృష్టి కలవాడు కనుకనే దానికి తగిన ఛందస్సు నెన్నుకొన్నాడు. పాడితేనే ప్రచారం. ప్రచారానికి పాటయే అనుకూలం. అందుకే తన కావ్యాన్ని పాట కనుకూలంగా ఉన్న ద్విపద నెన్నుకున్నాడు. యతిస్థానంలో ప్రాసయతిని కూడా వాడినాడు. ఇది పాడుకోవటానికి దోహదం చేస్తుంది. శ్రుతి సుభగత్వాన్ని కలిగిస్తుంది. ఈ ప్రయోజనం కోసమే సోమన ఈ ప్రయోగం చేసినాడు. పాల్కురికి ద్విపదను వ్రాయటంలో గానయోగ్యతను ప్రధానంగా దృష్టిలో ఉంచుకొన్నాడు. అదివరకు పద్యం వ్రాసినవాడే (అనుభవసారం). పద్యం వ్రాయలేక ద్విపద నెత్తుకున్నవాడు కాదు. వాల్మీకి అనుష్టుప్ ఛందస్సులో గానయోగ్యత ఉన్న విషయాన్ని గ్రహించినవాడు. తన నోట మొదట వచ్చిన –

**"మా నిషాద ప్రతిష్ఠాం త్వ మగమః శాశ్వతీః సమాః**

**యత్ క్రౌంచ మిథునాదేక మవధీం కామ మోహితం"** అనే శ్లోకాన్ని గూర్చి వాల్మీకి "పాదబద్ధోఽక్షర సమస్తన్త్రీలయ సమన్వితః" అని పేర్కొని దానికి 'శ్లోక' మని పేరుపెట్టినాడు. "శోకార్తస్య ప్రవృత్తో మే శ్లోకో భవతు నాన్యథా". శోకార్తుడనైన నానుండి వెలువడిన ఈ విధమైన వాక్యం శ్లోకమే అగుగాక అన్నాడు. "ఐహికాముష్మిక ద్విపద హేతువగుట ద్విపద నాఁగ బరగు" అని సోమన అన్నాడు. వాల్మీకి రాముని కథను గానయోగ్యమైన అనుష్టుప్ ఛందస్సులో వ్రాసినాడు. సోమన బసవని కథను గానయోగ్యమైన ద్విపదలో వ్రాసినాడు. అది సంస్కృతం. ఇది తెలుగు. సంస్కృతానికి అనుష్టుప్. తెలుగుకు ద్విపద.

వాల్మీకి రామాయణాన్ని లవకుశులు వీధుల్లో, రాజమార్గాల్లో గానం చేసినారు.

# చిన్ననాటి ఆట-పాటలు

**– జూకంటి జగన్నాథం**

సిరిసిల్ల పట్టణానికి దగ్గరగా ఉన్న మా ఊరు వాతావరణానికి పూర్తి భిన్నమైనది, విలక్షణమైనది మా అమ్మమ్మ ఊరు. సంవత్సరం పొడుగునా సాంస్కృతిక కార్యక్రమాలతో విలసిల్లుతుండేది. ఆ విధం ఎట్లనగా! శనిగరం మధ్యతరహా వ్యవసాయ నీటిపారుదల ప్రాజెక్టు కింద తంగళ్ళపల్లితో పాటు మరో ఆరు గ్రామాల వ్యవసాయ భూములు పారుతుండేవి.. ఏడాదికి రైతులు మూడు పంటలు తీసేవారు. ముఖ్యంగా వరి పంట ఎక్కువగా పండేది. రేగడి నేలలలో శనిగ, మిరప మరియు కంది పంటలు వేసేవారు. మా బడి వెనుక అట స్థలం పక్కన దొర గారి చింతల తోట ఉండేది. ఆ చింత వృక్షాలు ఊరికి సరి పడే చింతపండును సరఫరా చేసేవి. ఊరు చుట్టూరా శనిగరం ప్రాజెక్టు కాలువలు పారుతుండేవి. కానీ, ఎత్తు మీద ఉన్న ఊరులో రోజువారి వాడకం, మంచి నీటి కరువు తాండవించేది. తెల్లారి లేస్తే స్త్రీలు పిల్లలు అందరూ కలిసి ఒకరి ఇద్దరి ఇళ్లలో నీళ్లున్న బాయిల వద్దకు పోయి నీళ్ల బిందెలతో మోసుకొని ఇంటికి తెచ్చుకునేవారు. ఎద్దు ఈతతో ఊరు ప్రారంభంలో పారే జాలు కాలువ ఒకటి ఉండేది. ఆ ప్రధాన కాలువ నుంచే మిగతా ప్రాంతాలకు చిన్న చిన్న పంట పిల్ల కాలువలు ప్రవహించేవి. కాలువలు ముందుకు సాగేకొద్దీ వాటిపేర్లు రకరకాలుగా పిలువబడుతుండేవి. వెంకయ్య కాలువ, మిర్ర కాలువ, పీతిరి కాలువ, దొర గారి కాలువ, ఊర కాలువ ఇలా ఎన్నో పేర్లతో పిలవబడేది. అన్ని కాలువల కింద రైతులు పొలాలు సాగు చేసేవారు. ఊరు చుట్టూ మూడు తాటి ఈతవనాలు ఉండేవి. ఊరు అందరూ వాడికకు కల్లు తాగినా ఇంకా మిగిలిపోయేది. హైదరాబాద్ నుండి లారీలు వచ్చి పెద్ద రబ్బర్ ట్యూబ్‌లో సిలకు ఉన్న కల్లు నింపుకొని పోయేవి. చుక్క తెగి పడ్డట్టు వచ్చే లారీలు కల్లు వాసన రాగా ప్రయాణికులు ఎక్కి చుట్టాలు ఉన్న దూర ప్రాంతాలకు, సిద్దిపేటకు, శనిగరం బస్టాండుకు పోయేవారు. ఇది ఇలా ఉంటే సాంస్కృతిక రంగంలో ఆ ఊరు సంవత్సరం పొడుగునా మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతుండేది. ముదిరాజు కులస్తులు పాండవుల కతలను భాగోతాలుగా చుట్టుపక్కల దాదాపు 20 కిలోమీటర్ల పెట్టు ఊరూరు తిరుగుకుంటూ ఆడేవారు. వాళ్లను ఊరిలో పాండకతోళ్లు అని అందరూ వాళ్ళని పిలిచేవారు. వాళ్లు పొలాల నాట్లు వేసిన తర్వాత బాగోతం పరదాలు పాతే కర్రలు, తబలాలు, హార్మోనియం, పెట్రోమాక్సులు, వండుకునే బోళ్ళు ఒక బండిలో వేసుకొని పడమర వైపు ఇల్లంతకుంట మండలం దాకా, తూర్పు వైపు హుస్నాబాద్ వరకు, దక్షిణం వైపు బద్దిపడిగె దాకా, ఉత్తరం వైపు తోటపల్లి వరకూ ఇలా ఊర్లు తిరుగుతూ వరి కోతలు పట్టే సమయానికి ఇంటికి చేరేవారు. మొదటి బాగోతం ఊర్లో వేసేవారు. మంచి శకునం ఎదురు అయిన పిదప మిగతా ఊర్లకు పయనమైపోయేవారు. ఊర్లలో వేసే బాగోతాలకు ఆయా కులాల పెద్దలు కుల సంఘాలు స్పాన్సర్లుగా వీరి తిండి తిప్పలు చూసేవారు. మరియు ఆయా కులసంఘాల నుంచి చిన్న మొత్తాలు కానుకలు ఇచ్చేలా వ్యవహరించేవారు. ఇది ప్రతి సంవత్సరం పాండకతోల్లు జరిపే వ్యవహారం.

అంతేగాక, చిరుతల రామాయణం 45 రోజులు వేసేవారు. కథను చెప్పే నాయకుడు పాటగా చెప్తుంటే మిగతా వాళ్ళు చిరుతలు ధరించి లయబద్ధంగా చుట్టూ ఎగురుతూ కోరస్ అందుకునేవారు. చర్తీ పాట సాగుతున్నప్పుడు చిరుతలు వాయించడం కాకుండా చుట్టూ తిరుగుతూ దుమ్ము దుమ్ము ఎగిరేవారు. రాత్రి చిరుతల రామాయణం పల్లెటూర్లోని సబ్బండ కులాలకు ఒక చూడముచ్చటైన ఉత్సవ సంరంభం. ఇవి కాక ఎండాకాలం పగటి పూట చెప్పే పటం కథలను ఒకతను మేదరి పుల్లతో పటంలోని బొమ్మలను చూపిస్తూ కథ చెప్తుంటే వంతలు చేసే సామూహిక గానంతో ప్రజలను ఆకట్టుకునేలా చేసేవారు.

ఇవన్నీ ఒక ఎత్తు అయితే, చలికాలం ఊరిచావడిలో సుమారు మూడు నెలల పాటు రాత్రి పూట ఎక్కడి నుంచో సుదూర ప్రాంతాల నుంచి వచ్చి హరిదాసులు హరికథలు చెప్పేవారు. హరికథ చెప్పే అయ్యగారి ప్రత్యేక వేషధారణతో కథ చెప్తుంటే, వాళ్ల గ్రూప్‌లోని వారే

హార్మోనియం తబలా ఆయా సందర్భానికి అనుకూలంగా వాయించేవారు. ఆ రోజటి కథ ముగిసే ముందు ఈరోజు ఫలానా అతను మాకు వంట చేసుకోవడానికి బియ్యం ఉప్పు, పప్పు, కూరగాయలు, పాలు, పెరుగు, నెయ్యి సమకూర్చారు. రేపటి కోసం ఎవరు మా ఆహార దాతలు వారి పేరు చెప్పండి అయ్యలారా అనేవాడు. ఊరి మోతుబరి రైతులు, మిగతా కులాల వాళ్లు నేనంటే నేను అని పోటీపడేవారు. చివరికి అయ్యగారే ఒక పేరు ఖాయం చేసేవారు. బహిరంగంగా ప్రకటించిన అతను తెల్లవారి హరిదాసు ట్రూపునకు భోజన సదుపాయాలు చేసేవారు. ఇది హరికథ సాగినన్ని రోజులు ప్రతి దినం ఉదారంగా జరిగే కార్యక్రమం. అయితే నేను, మా అమ్మమ్మ రాత్రి తిని చినిగిన జోరబొంత అంటే జనుపనారతో చేసిన సంచి తీసుకొని బాగోతల దగ్గర, హరికథలు వద్ద, చిరుతల రామాయణం, పటంకతల సమీపంలో వేసి ఇద్దరం కూర్చుని వినే వారం చూసేవారు. ఆ ఊర్లో సంవత్సర కాలం పొడుగునా వివిధ సాంస్కృతిక ఉత్సవాలు కొనసాగేవి. వీటి ప్రభావం నా పసి హృదయం మీద చెరగని సంతకం చేసిందంటే ఏ మాత్రం అతిశయోక్తి కానేరదు.

ఇవి గాక, ఏడాదికి ఏడు రోజులు జరిగే కిష్ట స్వామి జాతర, ఒకరోజు పొద్దటి నుండి సాయంత్రం వరకు చుట్టుగుట్ట మధ్య తూర్పు నుంచి పడమరకు ప్రవహించే పెద్దవాగు ప్రవాహం గుండాలలో స్నానాలు చేసి వంటలు వండుకొని పెద్ద గుట్ట కింద ఉన్న సొరంగంలోని నరసింహ స్వామిని ప్రజలు దర్శించుకునేవారు. సమీపంలో ఉన్న బెజ్జంకి జాతరకు బండ్లు కట్టుకొని పోయేవారు. రాత్రిపూట రకరకాల మిఠాయిలు నాలుగుగీరెల బండ్ల మీద పెట్టుకొని తినుబండారాలు అమ్మే దుకాణాలు రాత్రికి రాత్రి ఎక్కడి నుంచి వచ్చే వారో కానీ తెల్లారే వరకు పెట్రోమాక్స్‌ల వెలుగుల కింద చూడచక్కగా చుట్టుపక్కల ఉన్న ఊర్ల నుంచి వచ్చిన జనంతో కిక్కిరిసి జాతర సాగుతుండేది. ఇలా ప్రశాంతంగా సాగుకుండగానే జాతర బెదిరిందంటూ ఒక ఆకతాయి యువకుల గుంపు దుకాణాలను కూలదోస్తూ పరుగులు పెట్టేవారు. ఇంతలో ఎవరికి అందినకాడికి వారు దుకాన్లను లూటీ చేసేవారు. ఆవారా యువకులకు అదొక వేడుక. గుట్టల మీద రాత్రిపూట జరిగే జాతర ఉత్సవాలు కాబట్టి ఆడపిల్లలను ఎవరు ఎత్తుకపోకుండా పెద్దలు కర్రలు పట్టుకొని జాగ్రత్త వహించేవారు. ఈ విషయంలో అప్పుడప్పుడు ఇరు వర్గాల మధ్య తన్నులాటలు జరిగేవి.

ఒకవైపు ఊర్లో జరిగే సాంస్కృతిక ఉత్సవాలు అనబడే భాగోతాలు, హరికతలు, బుర్రకథలు, చిరుతల రామాయణాలు మరోవైపు గొప్పసాంస్కృతిక కేంద్రాలైన ప్రత్యేకమైన రోజులలో ఏటేటా జరిగే జాతర పండుగలు, నేను ఎదుగుతున్నా కొద్దీ నా హృదయం మీద మాసిపోని ముద్ర వేసాయి. మిక్కిలి చెరిగిపోని ప్రభావం చూపాయి.

మా అమ్మమ్మ పాలి వారితో కలిపి ఆ ఊరిలో మూడు కుటుంబాలు నివసించేవి. నేను అక్కడికి పోయేసరికే ఆయా కుటుంబాలు పూర్తిగా గానుగ కట్టే కులవృత్తిని మానివేసి కేవలం భూమిని నమ్ముకునే వ్యవసాయదారులుగా బతుకుతున్నారు. మా అమ్మమ్మ కర్నాల మామిడి తోట దగ్గర ప్రవహించే పిల్లి వాగులో మబ్బుల చలికాలం చన్నీళ్ల కార్తీక స్నానం నేనూ, మా అమ్మమ్మ చేసేవారము. అనంతరం ఆ తోటలో ఉన్న ఉసిరి చెట్టు కింద మా అమ్మమ్మ శివ భక్తితో పూజలు చేసేది. మా అమ్మమ్మ బిడ్డ కొడుకునైన నామీద చూపే నెనరు జ్ఞాపకం వస్తే గుండె గూడు పట్లు కదిలిపోతాయి. బిడ్డ కొడుకు అయిన నన్ను ఒక్కనాడు అరేయ్ అని అసలు పిలిచేది కాదు. మా అమ్మమ్మ పూజ పునస్కారాలు నిష్ఠ ఉపవాసాలు సాంస్కృతిక శైవ వారసత్వాలు నా బాల్యంలో మరిచిపోలేని ఉగాది యాదులు. సాంస్కృతిక ధార అనితర సాధ్యంగా కొనసాగితే, సాహిత్య విభాగం మరో చిరు తేట నీటి ఊట పాయగా నా జీవితంలో సమాంతరంగా కొనసాగింది. ఆ రోజుల్లో శనిగరం ఉన్నత పాఠశాలలో తెలుగు పండితునిగా పనిచేసే జానకి రామయ్య సార్. సార్ ఇంటికి సిద్దిపేట నుంచి ఆంధ్రప్రభ వార పత్రిక మరియు పిల్లల మాస పత్రికలు చందమామ, బాలమిత్ర వస్తుండేవి. వాళ్లు చదివిన తర్వాత వాళ్ల చిన్న కూతురు నా క్లాస్మేట్ రాజ్యలక్ష్మి అట్టి పత్రికలు చదువుకొని ఇచ్చేవారు. అంతేగాక ఆంధ్రప్రభలో వచ్చే సీరియల్స్ పూర్తి అయిన తర్వాత చింపి నవలగా కుట్టి చదువుకునేవాళ్లం. అలా మా అమ్మమ్మ ఊరిలో బాల్యంలోనే నా ఎదలో సాహిత్య సాంస్కృతిక విత్తనాలు నాటపడ్డాయి. నా సాహిత్య జీవితం తీరం పొడుగునా ప్రేరణ కలిగించాయి. మిక్కిలి ప్రభావితం చేశాయి.

జూకంటి జగన్నాథం
కవి, రచయిత,
సిరిసిల్ల, ఫోన్ : 9441078095

## నిరంతర నాటక బాటసారి

# అయ్యలసోమయాజుల గోపాలకృష్ణ

**– బి.వి. అప్పారావు**

ఆధునిక తెలుగు నాటక రంగాభివృద్ధికోసం నిరంతరం పరిశ్రమించిన నాటకవేత్త అయ్యలసోమయాజుల గోపాలకృష్ణ కన్ను మూయడం ఆ రంగం అభిమానులను ఎంతగానో విచారానికి గురిచేసింది. బెంగాల్‌లో బాదల్ సర్కార్ ప్రత్యామ్నాయ రంగస్థలాన్ని రూపొందించే క్రమంలో ఆధునిక వీధి నాటకాన్ని ఆయన ప్రజల ముందుకు తెచ్చారు. మియర్ హోల్డ్, అగస్టోబోల్ వంటి వారి ప్రయోగాల మేరకు పీపుల్స్ థియేటర్‌గా ఐరోపా దేశాల్లో ప్రఖ్యాతి పొందిన ఈ ప్రక్రియ ప్రభావం భారతీయులైన బాదల్ సర్కార్ వంటి ప్రముఖులపై పడింది. ఈ నేపథ్యంలో బాదల్ సర్కార్ 70వ దశకం సమాజ సంక్షోభాన్ని ప్రతిబింబిస్తూ 'మిచ్చెల్' వంటి వీధి నాటకాలకు శ్రీకారం చుట్టాడు. ఈ నాటక రంగాన్ని 'థర్డ్ థియేటర్'గా ఆయన నిర్వచించాడు. ఇంతటి సామాజిక ప్రయోజనం కలిగిన నాటక ప్రక్రియ ప్రభావం ఆంధ్ర దేశంపైనా పడింది. ఈ క్రమంలో అప్పటికే రంగస్థల నాటికగా ప్రదర్శితమవుతున్న అత్తిలి కృష్ణారావు రాసిన 'యుగ సంధ్య' నాటకాన్ని ప్రయోగాత్మకంగా విశాఖపట్నంలోని సముద్ర తీరంలో ఎటువంటి తెరలు, లైటింగ్ లేకుండా ప్రదర్శించి తెలుగు వీధి నాటకానికి తెర లేపారు.



అయ్యల గోపాలకృష్ణ

అత్తిలి కృష్ణారావుకి చెందిన నాట్యభారతి సంస్థ ఎందరో నిబద్ధత కలిగిన రంగస్థల కళాకారులకు వేదికయింది. నాట్యభారతి నాటక ప్రదర్శనలకు వెన్నుదన్నుగా నిలిచినవారు గోపాలకృష్ణ. బాదల్ సర్కార్ 'జులుష్' అనుసరణంగా అత్తిలి పద్మావతీ కృష్ణారావు రాసిన ఊరేగింపు ప్రదర్శన మొదలుకొని నాట్యభారతి సంస్థ సభ్యులు వీధి నాటకాన్ని రాష్ట్రంలోని పల్లెపల్లెనా ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలకు గోపాలకృష్ణ శ్రమించిన తీరు ఆదర్శవంతం. తెలుగు వీధి నాటక రంగానికి ఆయన ఎంత అంకితమయ్యారంటే 'ఊరేగింపు', 'టామీ-టామీ-టామీ', 'జంతర్ మంతర్ మామూళ్లు', 'జనగీతం' మొదలైనవి రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల్లో దాదాపు 300 సార్లు ప్రదర్శించారు. ఒక్క విశాఖ జిల్లాలోనే 42 మండలాల్లో టామీ టామీ, ఊరేగింపు, జంతర్ మంతర్ మామూళ్లు ప్రదర్శనలను 1986 సంవత్సరంలో గ్రామగ్రామాన ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలను ప్రతి శని, ఆదివారాల్లో 45 రోజులపాటు నిర్వహించారు. ఆధునిక వీధి నాటకోత్సవాల పేరిట 1985 లో నిర్వహించి, వీధి భాగోతం, వీధి నాటకం, ఒగ్గు కథ వంటి సంప్రదాయ కళారూపాల ప్రదర్శనలను ఏర్పాటు చేశారు.

**నాటక విద్యలో కూడా అగ్రేసరుడే...** తూర్పు గోదావరి జిల్లా ముక్తేశ్వరంలో 1944, జూలై 16న పుట్టిన గోపాలకృష్ణ బి.ఎస్. చదివి, ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి యాక్టింగ్, డైరెక్షన్ విభాగాల్లో డి.టి.ఎ. పట్టా పొందారు. ప్రఖ్యాత నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా నిర్వహించిన 70 రోజుల థియేటర్ వర్క్‌షాప్ శిక్షణ పొందారు.

**అవార్డులు రివార్డులు :** ఆంధ్ర విశ్వవిద్యాలయం థియేటర్ ఆర్ట్స్ విభాగం ఎంపిక కమిటీ సభ్యునిగా, అదే విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ సభ్యునిగా గోపాలకృష్ణ ఉత్తమ సేవలందించారు. పాండిచెరీలో 1987 లో నిర్వహించిన సౌత్ జోన్ థియేటర్ ఫెస్టివల్‌కు పరిశీలకునిగా హాజరయ్యారు. గోపాలకృష్ణ పలు నాటక పరిషత్ ఉత్తమ

నటుడు, విలన్, క్యారెక్టర్ యాక్టర్, సపోర్టింగ్ యాక్టర్, హాస్య నటుడు వంటి బహుమతులతో పాటు 'కళానిధి', 'అభిజ్ఞ' వంటి అవార్డులను పొందారు.


**రేడియో – టెలివిజన్ :** గోపాలకృష్ణ రంగస్థలంతో పాటు ఎలక్ట్రానిక్ మీడియాలో కూడా తమ ప్రతిభ చాటుకున్నారు. ఆకాశవాణి 'ఏ' గ్రేడ్ ఆర్టిస్ట్‌గా విశాఖపట్నం కేంద్రం నుంచి ప్రసారమైన 100 రేడియో నాటికల్లో పాల్గొన్నారు. ఇక అధిక ప్రజామోదం కలిగిన టెలివిజన్ ద్వారా గోపాలకృష్ణ పలు సీరియల్స్, సింగిల్ ఎపిసోడ్స్‌లో కూడా నటించారు. గురజాడ అప్పారావు విరచితమైన విరచితమైన కన్యాశుల్కంలో గోపాలకృష్ణ అగ్నిహోత్రావధానులు వేషం వేశారు. మాస్టర్ వినయ్, సర్వాంతర్యామి వంటి సింగిల్ ఎపిసోడ్‌లో నటించారు. ఓ పార్వతి కథ, అమ్మ వంటి టెలివిజన్ నాటకాల్లో నటించారు.

**సినిమాలో....** బహుళ జనామోదం పొందిన సినిమాల్లో కూడా గోపాలకృష్ణ తన నటనా ప్రతిభను కనపరిచారు. విముక్తి కోసం, ఓటుకు విలువుంది, డామిట్ కథ అడ్డం తిరిగింది, పోలీస్ బ్రదర్స్, జీవన గంగ, వివాహ భోజనంబు, మౌన పోరాటం, తేజా, జడ్జిమెంట్, పీపుల్స్ ఎన్‌కౌంటర్, ప్రేమ పంజరం వంటి సినిమాల్లో ఆయన నటించారు. వీటితోపాటు ఇంగ్లీష్ 'ఆగస్ట్' అనే ఆంగ్ల చిత్రంలో కూడా గోపాలకృష్ణ నటించారు.

నాటకం కోసం నిరతరం తపించిన ఈ కళాతపస్వి తే 21-9-2007 దిన మరణించారు. ప్రతిఏటా సెప్టెంబరు 21వ తేదిన ఆయన వర్ధంతిని, "ఆత్మీయ నాటకమిత్రుల కలయిక'' వేదిక ద్వారా, అతని ఆంతరంగిక మిత్రులు, నట, దర్శకులు బొబ్బా ధవలేశ్వరరావు, చలసాని కృష్ణప్రసాద్‌లు నిర్వహిస్తారు. తద్వారా అయ్యలసోమయాజులతో తమ అనుభంధం, అనుభవాలు, జ్ఞాపకాలు అతని మిత్రులు, శ్రేయోభిలాషులు స్మరించుకుంటారు. పద్దెనిమిది సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ సంస్మరణ సభలో, విశాఖకు చెందిన సీనియర్ రంగస్థల నట దర్శకుడొకరిని సత్కరించి గౌవించుకోవడం ఏటా కొనసాగుతోంది.

**బి.వి. అప్పారావు**
జర్నలిస్టు, రచయిత
విశాఖపట్నం, సెల్ : 93470 39294

## పద్య పారిజాతాలు




దేవినేని సీతారావమ్మ ఫౌండేషన్ పేరుతో దేవినేని జయశ్రీ, దేవినేని మధుసూదనరావు దంపతులు బడిపిల్లల కోసం ఎన్నో పుస్తకాలు ముద్రించి బడి పిల్లలకు పంచిపెట్టారు. అలాంటి పుస్తకాల్లో పద్య పారిజాతాలు, బతుకు పాఠాలు. పద్యపారిజాతాలు పుస్తకంలో సుమతీ శతకంలో పద్యాలు, వేమన శతకంలో పద్యాలు ఏరి కూర్చి బడిపిల్లలకు అర్థమయ్యే రీతిన అందంగా ముద్రించి ఇస్తున్నారు. పద్యపారిజాతాలు 2012 నుంచి ఇప్పటి వరకు ఆరుసార్లు ముద్రించారు. శ్రీరాముని దయచేతను మొదలు – మాటకు ప్రాణం సత్యం.... చీటికి ప్రాణంబు వ్రాలు సిద్ధము సుమతి వరకు సుమతి శతకంలోనుంచి; చెప్పులోని రాయి చెవిలోని జూరీగ.... పట్టు పట్టరాదు, పట్టువిడరాదు వరకు వేమన పద్యాలు; పోతన పద్యాలు-చదువులలో మర్మమెల్ల చదివితి తండ్రి; కారే రాజులు రాజ్యముల్ కలుగవే; మొదలైన పోతన పద్యాలు; భోజనం పెట్టువానికి భుక్తిలేదు లాంటి జాషువా పద్యాలు; పాలమీగడ కన్నా, పాయసాన్నం కన్న తీయనైనది మన తెలుగు భాష తెలుగుతల్లి స్తుతి.. ఇలా ఎన్నో ఆసక్తి రేకెత్తించే పద్యాలు ఏరి కూర్చి ఈ పత్య పారిజాతాల్లో ముద్రించారు. పేజీలు *: 24,* వెల *: 20/–*

## బతుకు పాఠాలు




ఈ శీర్షిక క్రింద ఏరికూర్చిన కథల గురించి "ఇవి కథలు కావు, మానవుని జీవన వైచిత్రి ప్రతిబింబాలు.... ఈ కథలు కబుర్లు చెప్పే నైపుణ్యం నేర్పుతాయి.... ఇరవై అయిదు కథల్లో ప్రతికథా అద్భుతమే..... పిల్లలు ఊహాలోకంలో విహరిస్తారు... చిట్టి కథలైనా గట్టి కథలు. ఇవన్నీ నిజంగా బతుకు పాఠాలే అంటూ సుజాతాదేవి, సుబ్రహ్మణ్య భట్టు, మద్దిరాల శ్రీనివాసులు, సాకం నాగరాజు, ఎమ్. నాగేశ్వర రావు ప్రభృతులు ఎంతో ప్రశంసించారు. పుస్తకం చదివి మీ పిల్లలకు బతుకు పాఠాలు చెప్పండి.

*పేజీలు : 52, వెల : 20/–,* ***ప్రతులకు : దేవినేని సీతారావమ్మ ఫౌండేషన్, తెన్నేరు,***
***ఫోన్ : 9989051200***

# రామాయణంలో పాయసం

- డా. ఎ.బి. సాయిప్రసాద్

"ప్రపంచానికంతయు వాల్మీకి రామాయణం పరిచితమయిపోయినది. భారతీయ భాషలతో అనువదింపబడిన రామాయణములలో బహువిధములైన మార్పులు చేసినారు. తులసీదాసు తన కిష్టము వచ్చినట్లు మార్చెను. గోనబుద్ధుడు చాలా మార్పులు చేసెను. (రామాయణ విశేషములు, రెండవ భాగము, సురవరపు ప్రతాపరెడ్డి) సురవరపు ప్రతాప రెడ్డిగారు తులసీదాసు, గోనబుద్ధారెడ్డిని మాత్రం పేర్కొన్నారు. వీరిద్దరు మాత్రమే మార్పులు చేసినారు అని మనం భావించరాదు. కంబర్ (తమిళం) కు.వెం.పు (కన్నడ) ఎళుతచ్చన్ (మలయాళం) మాధవ కందలి (అస్సామి) ఎక్‌నాథ్ (మరాఠీ) జగ్ మోహన్ (ఒడియా) కృత్తివాసుడు (బెంగాలి), భాస్కర రామాయణ కర్తలు, మొల్ల, కట్టావరదరాజు, అధ్యాత్మరామాయణ కారుడు, ఆనంద రామాయణ రచయిత మొదలైన వారు వాల్మీకిని అనుసరించకుండా పాయస లేక హవిష్యాన్న విభజనలో తమదైన పద్ధతిలో రచనను చేపట్టారు.

పాయస విభజనలో తేడా రావడానికి ప్రధాన కారణం దశరథుని భార్యలలో ఎవరు రెండవ భార్య ఎవరు మూడవ భార్య అని తేల్చి చెప్పడమే. వాల్మీకి, కు. వెం. పు, తెలుగు రామాయణ కారులు తులసీదాసు, ఏక్‌నాథ్ (మరాఠీ) ఆనంద రామాయణ కారుడు కైకేయిని చిన్న భార్యగా చిత్రించారు. ఉత్తర భారతదేశపు రామాయణాలలో కృత్తివాసుడి బెంగాలీ రామాయణంలో, మాధవ కందలి అస్సామి భాష రామాయణంలో, జగ్ మోహన్ ఒడియా రామాయణంలో, కంబ రామాయణంలో, అయ్యలరాజు రామభద్రుడి రామాభ్యుదయం ప్రబంధంలో సుమిత్ర దశరథుడి చిన్న భార్య.

పుత్రకామేష్టి యజ్ఞం తరువాత వాల్మీకి రామాయణం, భాస్కర రామాయణంలో ప్రాజాపత్య పురుషుడు పాయసంతో ప్రత్యక్షమవుతాడు. అధ్యాత్మ రామాయణం ప్రకారం అగ్ని దేవుడొస్తాడు. రంగనాథ రామాయణం, తులసీ రామాయణంలో యజ్ఞ పురుషుడు, కు.వెం.పు (కన్నడ) రామాయణంలో క్రతుపురుషుడు, కృత్తివాస రామాయణంలో విష్ణువు ఆకారంలో 'చిరు' (హవిష్యాన్నం) వెలువడుతుంది. యజ్ఞ పురుషుడిని గురించి కంబ రామాయణంలో యిలా రాయబడింది, నిప్పు కణికల లాంటి కన్నులు, అగ్ని జ్వాలల వంటి కురులు కలిగిన వ్యక్తి పిండాన్ని తీసుకవస్తాడు. ఇలాంటి వర్ణననే దుష్యంత్ శ్రీధర్ తన రామాయణం -1లో అనుసరిస్తాడు. అతని ప్రకారం అగ్నిగుండం నుండి దేహమంతా మెత్తటి కురులున్న ఎఱ్ఱని దుస్తులను ధరించిన ఒక నల్లని వ్యక్తి (ఆకారం) పాయసంతో వెలువడుతాడు. అందరూ పాయసం అనే ద్రవ పదార్థాన్ని పేర్కొంటే కంబుడు (తమిళం) కృత్తివాసుడు మాత్రం అదిద్రవంకాదు ఘనం అని రాసారు.

అందరు రామాయణ కవులు పాయసం లేదా 'చిరు' లేదా పిండంలోని జ్యేష్ఠభాగం కౌసల్యకు దశరథుడు యిచ్చినట్లు తెలిపారు. ఆంద్రశేషగిరి రావుగారి ప్రకారం దక్షణ కోసల కొంత కాలము ఆంధ్రుల పాలనలో ఉంది. కౌసల్య దక్షిణ కోసల ఆడపడుచు అని ఆంధ్ర దుహిత అని పేర్కొన్నారు. కైకేయిని గురించి, కైకేయి సజాతీయ క్షత్రియ స్త్రీయగునో కాదో అనుమానముగానే యున్నది అని రాస్తూ కైకేయి ఈరానీ సుందరాంగి అయి యుండెనని ఊహించు చున్నానని సురవరపు ప్రతాపరెడ్డిగారు తమ 'రామాయణ విశేషములు' గ్రంథంలో రాసారు. అస్సామి రామాయణ కారుడు మాధవ కందలి సుమిత్రను సింహల ద్వీపానికి రాజైన సుమిత్రుడి కుమార్తెగా గుర్తించాడు.

వాల్మీకి రామాయణం, కృత్తివాస రామాయణం, భాస్కర, తులసి రామాయణం, కంబ రామాయణం, రంగనాథ రామాయణాలలో పాయసంలోని 50% కౌసల్యకు యివ్వబడింది. అదే ప్రకారం అధ్యాత్మ రామాయణం, ఒడియా రామాయణం, మొల్లరామాయణం, అయ్యలరాజు రామభద్రుడి రామాభ్యుదయంలో సుమిత్రకు 50% పాయసం దక్కింది. వాల్మీకి రామాయణం, కృత్తివాస రామాయణము, భాస్కర రామాయణం, దుష్యంత్ శ్రీధర్ రామాయణం-1లలో పాయసంలోని 37.5% సుమిత్రకు యివ్వబడింది. అధ్యాత్మ రామాయణం,

రంగనాథ రామాయణం, మొల్ల రామాయణం, అస్సామి రామాయణం, కంబరామాయణంలో కైకేయికి 25% పాయసం యివ్వబడింది. వాల్మీకి రామాయణం, మొల్లరామాయణం, దుష్యంత శ్రీధర్ రామాయణం-1లో కైకేయి పాలు 12.5% మాత్రమే.

పాయస విభజనకు సంబంధించిన సన్నివేశాన్ని తమిళ, అస్సామి, ఒడియా, బెంగాలీ, మరాఠీ రామాయణకారులు చాలా చాలా ఆసక్తికరంగా చిత్రించారు. వాల్మీకి రామాయణాన్ని ఆధారం చేసుకొని భారతీయ భాషలలో వెలువడిన తొలి రామాయణం కంబ రామాయణంలో పిండాన్ని పగలగొట్టి దశరథుడు తొలుత కౌసల్య కిచ్చాడు. మిగిలిన పిండంలోని అర్ధభాగాన్ని కైకేయికి సుమిత్రకు పంచాడు. పిండాన్ని పగలగొట్టినప్పుడు రాలిన మెతుకులను దశరథుడు సుమిత్రకే యిచ్చాడు. ఇక్కడ ఎవరికి ఎంత శాతం లభించిందని నిక్కచ్చిగా చెప్పలేము. ఉత్తర భారతదేశపు రామాయణాలలో మొట్టమొదటిది అస్సామి భాషలో వెలువడింది. ఆ తరువాత బెంగాలీ, ఒడియా, అవధి, మరాఠీ భాషలలో రామాయణాలు రచింపబడ్డాయి. అస్సామి రామాయణంలో దశరథుడు పాయసాన్ని రెండు భాగాలుగా విభజించి ఇద్దరు రాణులు కౌసల్య, కైకేయిలకు యిచ్చాడు. అప్పుడు అక్కడకు సుమిత్ర వచ్చి వారి ఎదుట నిలబడి అక్కలారా మీరు ఏమి సేవిస్తున్నారని అమాయకంగా అడిగింది. ఆమె మాటలకు కౌసల్య హృదయం ద్రవించింది. నేను నా భాగంలోని సగం భాగం సుమిత్రకు యివ్వదలచుకున్నాను. నాకు అనుమతి ఇవ్వండని దశరథుడిని కోరింది. సుమిత్రకు ఇవ్వండని దశరథుడు తన ఇద్దరు భార్యలకు ఆదేశించాడు. మంగళాచరణం తరువాత పాయసాన్ని గ్రహించండని వశిష్ఠ చెప్పగా కౌసల్యా కైకేయిలు అలాగే గ్రహించారు. తన భాగంలోని సగం సగం భాగాన్ని సుమిత్ర కిస్తూ, చెల్లీ దశరథ మహారాజు నీకు స్వయంగా పాయసం ఇవ్వలేదు. నాలాగా నీవు కూడా దశరథుడి భార్యవు అందుకే నీకు నా ప్రీతి కోసం యిస్తున్నాను అని చెబుతూ, నా భాగం వల్ల నీకు కలిగిన పుత్రుడు నా కొడుకుకు సహాయంగా ఉండగలడన్న మాట నా కివ్వు అంది కౌసల్య. అదేవిధంగా కైకేయి కూడా కోరింది. పాయసాన్ని వారిద్దరి తరువాత స్వీకరిస్తూ మీ భాగాల వల్లనాకు కలిగే యిద్దరు కుమారులు మీ యిద్దరి కుమారులకు సేవకులుగా ఉంటారని హామి ఇచ్చింది. ఈ కథను కొంత మార్చి బెంగాలీ కృత్తివాసుడు రాసుకున్నాడు. ఆయన ప్రకారం ఇద్దరు పెద్దరాణులకు పాయసం పంచి నాకు ఇవ్వలేదని సుమిత్ర రోదించింది. ఆమె రోదనను విన్న కౌసల్య దశరథునితో మహారాజా మీరు సుమిత్రకు ఎందుకు పాయసం ఇవ్వడం లేదు. ఆమెకూడా మీ భార్యే కదా అని చెబుతూ తన భాగంలోని సగం భాగంను సుమిత్రకిస్తూ నీకు కలిగే కుమారుడు నా కొడుకుకు సహాయకుడిగా వుంటాడని వాగ్దానం చేయమంటుంది.

క్రూరమతి కైకేయి, సుమిత్రను తనవద్దకు పిలిచి నీకు కలిగే రెండవ కుమారుడు నా కొడుకుకు సేవకుడిగా వుంటాడన్న మాట ఇవ్వు అని బలవంతం చేస్తుంది. సుమిత్ర, అని చెబుతుంది. అసామి అలాగే రామాయణంలో కైకేయి క్రూరురాలని స్పష్టంగా కవి చెప్పలేదు. కాని కృత్తి వాస రామాయణంలో కైకేయి క్రూరురాలని తేల్చి చెప్పడం అయింది. జగ్ మోహన్ ద్వారా ఒడియా భాషలో రచింపబడిన రామాయణంలో-దీన్ని దాండి రామాయణం అని కూడా అంటారు. ఈ సన్నివేశం మరింత రసవత్తరంగా చిత్రించబడింది. కౌసల్యా కైకేయిలు మాత్రం వ్రతాన్ని పాటించారనుకొని దశరథుడు పాయసాన్ని వారిద్దరికే పంచాడు. వారిద్దరు సంతోషంగా స్వీకరించారు. అక్కడేవున్న సుమిత్రకు ఏమి అర్థంకాలేదు. కౌసల్య దశరథుడితో మీరు సుమిత్రపై దయ చూపండని వేడుకుంటుంది అందుకు దశరథుడు సుమిత్ర వ్రతాన్ని పాటించలేదనుకున్నాను. వ్రతం పాటించిందని తెలుసుకున్న దశరథుడు సుమిత్రకు కూడా పాయసం శుద్ధమనస్సులై మీ భాగంలోని పాయసంను ఆమెకు ఇవ్వండని ఆదేశించాడు. ఆ ఆదేశం ప్రకారం కౌసల్యా, కైకేయిలు తమ భాగంలోని పాయసంలో సగం భాగం సుమిత్ర కిచ్చారు. ఇంతలో కాశీరాజు పుత్రిక లీలావతి అక్కడి కొచ్చి నేను కూడా వ్రతాన్ని పాటించాను అని విన్నవించుకుంటుంది. అప్పుడు ముగ్గురు రాణులు ఇంతసేపు నీవు ఎక్కడున్నావని లీలావతిని ప్రశ్నిస్తారు. అందుకు లీలావతి నాతో ఎవరూ పాయసం సంగతి చెప్పలేదు. ఇప్పుడే తెలిసింది. అందుకే వచ్చానంది. దశరథుడికి దిక్కు తోచలేదు. వెంటనే ఋష్యశృంగుడి వద్దకు పోయి జరిగిన విషయం చెప్పాడు. అంతేకాదు మీరు ఈ సమస్యను పరిష్కరించండని వేడుకున్నాడు. అందుకు ఋష్యశృంగుడు ఇది భగవంతుని లీల. మన మేమి చేయలేము. కౌసల్య, కైకేయి ఇద్దరూ మగశిశులను కంటారు. సుమిత్ర ఇద్దరిని కంటుంది. ఆ

యిద్దరు శిశువులను చూడడానికి లీలావతి వస్తుంది. ఏ శిశువును చూసిన తరువాత ఆమె స్తనాలలో పాలు వుప్పొంగుతుందో ఆ శిశువుకు ఆమెతల్లి అవుతుంది. ఆమె చనుపాలుతాగి ఆశిశువు తృప్తిపడతాడు అని ఋష్యశృంగుడు చెప్పడం జరుగుతుంది. శత్రుఘ్నుడుని చూసినప్పుడు లీలావతి స్తనాలుపాలుతో వుప్పొంగుతాయి లీలావతి చనుపాలు తాగి శిశువు శత్రుఘ్నుడు తృప్తి చెందుతాడు. శత్రుఘ్నుడు ఆమె కొడుకు అవుతాడు. ఈ కల్పన మనకు ఏ రామాయణంలోను కనపడదు. ఈ రామాయణంలో మనకు దశరథుడికి కౌసల్యా, కైకేయి, సుమిత్రలు కాకుండా అనేక మంది భార్యలుండే వారన్న సంగతి తెలిసి వస్తుంది.

పాయస విభజన వరకు సంత్ ఎక్‌నాథ్ ద్వారా మరాఠీ భాషలో రచింపబడిన భావార్థ రామాయణం ఆనంద రామాయణం నుండీ ప్రేరణను గ్రహించింది. దశరథుడు తన ముగ్గురు భార్యలకు పాయసాన్ని సమంగా పంచుతాడు. కైకేయి తన భాగాన్ని విసిరి పారేయగా అది అంజనాద్రిపై పడింది. ఆకారణంగా సువర్చల అను అప్సరకు శాప విమోచనం కలిగింది. ఈ సంఘటనకు బాగా పొడిగించి సంత్ ఏక్‌నాథ్ తన భావార్థ రామాయణంలో రాశాడు. యజ్ఞపురుషుడు ఏమాత్రం ఆలస్యం చేయకుండా రాణులకు ఇవ్వండని చెబుతూ ఆపాత్రను ఋష్యశృంగుడి చేతిలో పెట్టి అదృశ్యమవుతాడు. పంపకం ఆలస్యం అయితే విఘ్నం వాటిల్లుతుందని యజ్ఞపురుషుడు హెచ్చరిస్తాడు. అక్కడున్న వశిష్ఠునితో కౌసల్య నేను జ్యేష్ఠ పత్నిని కాబట్టి పాయసంలోని జ్యేష్ఠ భాగం నాకే దక్కాలని విన్నవించుకుటుంది. నేను దశరథుడి ప్రియపత్నిని. ఆకారణంగా పాయసపు జ్యేష్ఠ భాగానికి నేను అర్హురాలని వశిష్ఠుడికి నచ్చ చెబుతుంది. కైకేయి మాటలను ఖాతరు చేయకుండా ముగ్గురు రాణులకు సమంగా దశరథుడు పంచాడు. తనకు జ్యేష్ఠ భాగం రానందువల్ల తన భాగపు పాయసాన్ని చేత పట్టుకొని కైక దశరథుడివైపు చూస్తుంది. కౌసల్యా, సుమిత్రలు శుద్ధాచమనం చేసి పాయసంను గ్రహించడానికి సిద్ధమవుతారు. ఆలస్యం అయిన కారణంగా విఘ్నం ఏర్పడుతుంది. అప్పుడు ఎక్కడినుండో ఒక గద్దవచ్చిదాన్ని తన్నుకపోయి సేవిస్తుంది. ఈగద్ద పూర్వాశ్రమంలో సువర్చసా అనే ఒక నర్తకి. ఒకసారి మధుపానం చేసి బ్రహ్మ దర్బారులో నృత్యం చేయడానికి పోయింది. మత్తువలన లయతాళం తప్పుతుంది. కోపంతో బ్రహ్మ సువర్చసను శపిస్తాడు. ఆ శాపం కారణంగా ఆ నర్తకి గద్ద అవుతుంది. బ్రహ్మను ప్రార్థించగా దశరథుడు పుత్రకామేష్టి యజ్ఞం చేస్తాడు. తన ముగ్గురు భార్యలకు సమంగా పాయసం పంచుతాడు. నీవు కైక భాగాన్ని వేగంగా వచ్చి తన్నుకుపోయి గ్రహించు. అప్పుడు నీకు శాప విముక్తి కలుగుతుందని తెలుపుతాడు. ఆకారణంగా కైకేయి భాగాన్ని గద్ద తీసుకు వెళుతుంది. కౌసల్యా సుమిత్రలు తమతమ భాగం నుండి కొంత భాగం కైకేయికి యిస్తారు. ఆకారణంగా సుమిత్రకు కాదు కైకేయికు యిద్దరు పుత్రులు కలుగుతారు. వారు భరత శత్రుఘ్నులు. సుమిత్రకు ఒకే ఒక కొడుకు పుడతాడు. ఆ కొడుకే లక్ష్మణుడు. ఆనందరామాయణం ప్రభావం వల్లే కావచ్చు తులసీదాసు భరత శత్రుఘ్నుల నామకరణం తరువాత లక్ష్మణుని నామకరణం జరిగినట్లు రాసాడు. అంతేకాదు లక్ష్మణుడు మూర్ఛపోయినప్పుడు విలపిస్తూ నిజ జననీకే ఏక కుమార (మీ తల్లికి నీవు ఏకైక కుమారుడవు) అంటాడు. ఈ వొక్క రామాయణంలోనే శత్రుఘ్నుడు కైక కుమారుడుగా పేర్కొనబడ్డాడు. బీహారు, బెంగాలు ప్రాంతంలో నివసించే సంథాల్ ఆదివాసులలో ప్రచారంలో ఉన్న రామాయణకు సంబంధించిన కథలో భరత, శత్రుఘ్నులు కైకేయి కొడుకులు. కౌసల్యా, కైకేయిలు తమ భాగంలోని కొంత భాగం (సగం బాగం) సుమిత్రకు ఇచ్చినట్లు అన్ని రామాయణలలో చెప్పబడింది. కౌసల్య తన భాగంలో సుమిత్రకు ఇచ్చినందువల్ల లక్ష్మణుడు రాముడికి దగ్గరయ్యాడు. అదేవిధంగా కైక భాగంను స్వీకరించి గర్భం దాల్చిన కారణంగా శత్రుఘ్నుడు భరతుడి చెంత చేరినాడు. మరాఠీ భావార్థ రామాయణం ప్రకారం కౌసల్య, సుమిత్రలు తమ వంతు పాయసంను కైకతో పంచుకుంటారు. ఆకారణంగా కైక ఇద్దరు కొడుకులను భరతుడు, శత్రుఘ్నుడులను కంటుంది.

హిమాచల్ ప్రదేశ్ కిన్నౌర్ జిల్లాలో జానపదులు పాడే పాటల ప్రకారం పాయసం సేవించిన దశరథుడి ముగ్గురు భార్యలకు ముగ్గురు కొడుకులు పుట్టుతారు. కౌసల్య రాముడికి జన్మ ఇస్తుంది. సుమిత్రకు లక్ష్మణుడు పుడతాడు. కైకేయి భరతుడిని ప్రసవిస్తుంది. ఇక్కడ శత్రుఘ్నుడి ప్రసక్తిలేదు. అంతేకాదు భరతుడు లక్ష్మణుడి కంటే చిన్నవాడు. కథ ఒకటే. దశరథుడి భార్యల పేరు ఒకటే. దశరథుడి కొడుకుల పేర్లు ఒక్కటే. పాయస విభజన కారణంగా తల్లుల పేర్లు అన్ని రామాయణాలలో కాకున్న భావార్థ రామాయణంలో మారిపోయాయి.

**డా. ఎ.బి. సాయిప్రసాద్**
విశ్రాంత హిందీ ఆచార్యులు,
బెంగళూరు, ఫోన్: 9980567541

# అరుదైన ఆంగ్ల ఆచార్యులు

**– ఆచార్య గుజ్జు చెన్నారెడ్డి**

విజ్ఞానం, వివేకం మూర్తీభవించిన వ్యక్తి మాత్రమే ఆచార్యుడు కాగలడు. తమ విభాగాలలో అపారజ్ఞానం కలిగిన ఆచార్యులు అరుదుగా కనిపిస్తారు. అటువంటి ఆచార్యులే ఆచార్య పెదరాజుగారు. నాలుగు దశాబ్దాల పాటు ఆంధ్రా విశ్వవిద్యాలయంలో ఆంగ్లవిభాగంలో ఆచార్యునిగా సేవలందించారు పెదరాజు. చక్కెరవ్యాధి కాటుకు ఏడాదిక్రితం బలైనా అతని జ్ఞాపకాలు చెరిపివేయలేనివి. పెదరాజు విజయవాడలోని ఆంధ్రా లయోల కళాశాలలో బి.ఏ చదువుతున్నప్పుడు అతనికి ఆంగ్ల సాహిత్యం మీద మక్కువ కలిగింది. ప్రబంధాలు రాయడానికి గ్రీకు, లాటిన్ భాషలకే అర్హత ఉందని భావించే రోజుల్లో జాన్‌మిల్టన్ 'ప్యారడైస్‌లాస్ట్' అనే ప్రబంధం ఆంగ్లంలో రాసి ఆ జాబితాలో ఆంగ్లభాషను చేర్చడం పెదరాజుగారికి ఎంతో నచ్చింది. అపారవిజ్ఞానం ఉందని భావించే సంస్కృత గ్రంథాలు భారతీయ వాడుక భాషలోకి విరివిగా రావాలని వారు కోరుకునేవారు. గ్రీకు తత్వవేత్త ఆరిస్టాటిల్ ఆనాడే (రెండువేల సంవత్సరాల క్రితం) సాహిత్యం ఎలా రాయాలో అతని గ్రంథం 'ద పొయిటిక్స్'లో వివరించాడు. అలనాటి ఆ గ్రంథం పెదరాజుగారి మదిలో మెదులుతుండేది. గ్రీకు తత్వవేత్తలు, ప్లేటో, ఆరిస్టాటిల్ మొదలుకొని లాటిన్ రచయితలు వర్జిల్, సిసిరో, ఇటాలియన్ రచయిత డాంటే వరకు, నాటి క్లాసిక్ రచయితలను పెదరాజుగారు ఔపోసన పట్టారు. ఆంగ్ల సాహిత్యం పుట్టుపూర్వోత్తరాలు తెలుసుకోవాలంటే ఆయా రచనలు చదవాలని శిష్యులకు చెబుతుండేవారు.

పెదరాజు గారి ఆంగ్ల సాహిత్యం విన్నప్పుడు అతని గ్రీకు, లాటిన్ రచనలు మిళితం చేసిన బోధనలు సామాన్య విద్యార్థులు అందుకోలేకపోయేవారు. ఆంగ్లసాహిత్యానికి ఆయువుపట్టు గ్రీకు, లాటిన్ సాహిత్యాలే. రెండువేల సంవత్సరాలకు పూర్వమే దేదీప్యంగా వెలిగిన గ్రీకు రచయితలు, దేశాల రాజకీయ సమీకరణలతో కాలక్రమేణ బలమైన రోమన్ సామ్రాజ్యంవైపు మొగ్గి ఉండాలి. లాటిన్ భాషలో ప్రచురితమైన అపార గ్రంథాలు, గ్రీకు గ్రంథాలతో కలిపి నాలుగువందల ఏళ్ళ క్రితం ఎలిజిబెత్ మహారాణి పరిపాలనలో అక్కడ ఆంగ్ల విద్యార్థులకు పాఠ్యాంశాలుగా నిలబడ్డాయి. షేక్స్‌పియర్, సమకాలికుడు, స్నేహితుడు, గొప్పరచయిత బెన్ జాన్సన్ "Shakespeare knew little Latin and less Greek" అన్నాడు. జాన్సన్ వ్యాఖ్యలకు పెదరాజు గారు సమర్థించలేదు. షేక్స్‌పియర్ గ్రీకు ప్రబంధాలను ఎంతో చాకచక్యంగా తన నాటకాలలో వాడాడు అంటారాయన. సాహిత్యం అన్నది గ్రీకు నుండి లాటిన్, లాటిన్ నుండి ఇటాలియన్, ఇటాలియన్ నుండి ఆంగ్లానికి అందింది.

అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ మనదేశంలో సేవలందించిన మొదటిరోజుల్లో లండన్‌లో ఏదైనా గ్రంథం ప్రచురితం అయ్యిందంటే నెలరోజుల్లో పెదరాజుగారి స్వీయ గ్రంథాలయంలో కనిపించేది. అతని జీతం సొమ్మంతా గ్రంథాలు కొనుగోలుకే ఉపయోగించేవారు. అతని అనుంగు శిష్యులలో నాది ఒకస్థానం. ఆ చొరవతో ఒకనాడు "సార్ మీరెందుకు పెండ్లి చేసుకోలేదు?" అని అడిగాను. "చెన్నా, పెండ్లి చేసుకుంటే ఆ సంసార సాగరంలో ఇన్ని పుస్తకాలు చదివి ఉండేవాడినా?" అన్నారు. అతని అధ్యయనం శ్రీరామునిపట్ల ఆంజనేయుని భక్తి వంటిది. అతని స్వీయ గ్రంథాలయంలో ఇరవైవేలకు పైగా పుస్తకాలు ఉండేవి. ఒక గ్రంథాలయం అతని గృహం కాగా, రెండవది ఆంగ్లవిభాగంలో అతని గది. ఎప్పుడు చూసినా లెక్కలేనన్ని పుస్తకాల మధ్య గూడులో సాలీడులా కనిపించి అధ్యయనం చేస్తుండేవారు. ఆజానుబాహుడు, ఆజన్మబ్రహ్మచారి, మచ్చుకైన కానరాని అహం, గర్వం, కోపం, స్వార్థం అతని ఆభరణాలు. షేక్స్‌పియర్ రాసిన 37 నాటకాలలో ప్రతి అంకంలో ప్రతిపాత్ర పలికిన పలుకులు ఆయన పలకగలరు. "సార్, మరియ" అంటే, "ఔను ఆమెను "ఇండియన్ జమ్" అన్నాడు షేక్స్‌పియర్ "ట్వెల్ఫ్‌నైట్" నాటకంలో'' అంటారు. అప్పటికే వాస్కోడిగామా ఇండియాకు సముద్రమార్గం కనిపెట్టడం, ఆ తరువాత కాలంలో బ్రిటీష్‌వారు ఇండియాలో ఈస్ట్‌ఇండియా కంపెనీ

స్థాపించడం ఇండియా పేరు ఇంగ్లాడ్‌లో నలిగి ఇరుదేశాల వర్తకవ్యాపారం షేక్స్‌పియర్ చెవినపడి ఉండాలి. "షేక్స్‌పియర్ తరగతిగదిలో థియరీ చదవలేదుకదా. అతని చదువంతా ప్రత్యక్షంగా సమాజం నుంచి నేర్చుకున్నదే కదా" అంటారు. రాణి ఎలిజిబెత్ తరువాత తరంలో చక్రవర్తి చార్లెస్–II ఇంగ్లాండ్‌కు ఫ్రెంచ్‌భాషను పరిచయం చేయడంవల్లే ఆంగ్ల నిఘంటువు పరిపూర్ణత సంతరించుకుంది అంటారు ఆయన. విక్టోరియన్ నవలాసాహిత్యం అంటే అతనికి మక్కువ. చార్లెస్ డికెన్స్, బ్రాంటే సోదరీమణులు, థాకరే, జార్జ్ ఇలియట్, థామస్ హార్డీ రచనలు ఔపోసన పట్టారు. హార్డీ రచనలో 'టెస్' పాత్ర అతనికి ఎంతో నచ్చేది. ఆమెపడే బాధలకు కళ్ళు చెమర్చుతాయి. అటువంటి పాత్రలు భారతీయ ఆంగ్ల సాహిత్యంలో రావాలంటారు. ఒకనాడు థామస్ హార్డీ, ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం సందర్శించి ప్రసంగం ముగించుకుని గదినుండి బయటకు వస్తున్నప్పుడు అతనిని టెస్ అభిమానులు చుట్టుముట్టి "టెస్‌ను ఎందుకు అలా చంపేసారు" అని నిలదీసారు. అందుకు అతను "నేనేం చేయగలను. ఆమె జీవితంతో భగవంతుడు ఆడుకున్నాడు" అన్నారు. నిజానికి ఎక్కువ సంఘటనలు, వందలపుటల విక్టోరియన్ నవలా సాహిత్యం, అమెరికన్ రచయితల చేతిలో నాజూకుతనం సంతరించుకుంది. ఒకే అంశం చుట్టూ అల్లిన కథకు పరిమిత పుటల్లో నవలలు రాసాగాయి. ఎర్నెస్ట్ హెమింగ్వే ఒక జాలరి ప్రధాన మూడురోజుల కథ 'ద ఓల్డ్ మన్ అండ్ సీ' అనే నవలగా మలచి నోబెల్ సాహిత్య బహుమతి అందుకున్నాడు.

భారతీయ ఆంగ్ల సాహిత్యంలో పెదరాజుగారు సృజించని రచన లేదంటె అతిశయోక్తికాదు. ముప్పయి ఏళ్ళ క్రితం నేను పిహెచ్.డి టాపిక్ గురించి అతన్ని సంప్రదించినపుడు 'నీ తత్వానికి గాంధియన్ సాహిత్యం సరిపోతుంది పరిశోధన చెయ్యి' అని సలహా ఇచ్చారు. నేను అదేపని చేసాను. ఇండియన్ 'ట్రియో' ఆనంద్, నారాయణ్, రాజారావు నుండి అమితావ్‌ఘోష్, కిరణ్‌దేశాయ్, అరవింద అడిగా వరకు అందరి రచనలు అతని గ్రంథాలయంలో పదిలం. ఒకవిధంగా అతను చదవడానికి రచయితలే రచనలు అందించలేక పోయేవారు. కథకు నెరేషన్ (కథనం) అందించడంలో భారతీయ ఆంగ్లరచయితలు ఇంకా ఎదగాలి అన్నది అతని అభిప్రాయం. తెలుగుసాహిత్యం మీద కూడా అతనికి మక్కువ ఉండేది. జాషువా, చలం రచనలు అతని టేబుల్‌మీద కనిపించేవి.

పెదరాజు గారి శిష్యరికంలో ఎదిగిన వారెందరో, దేశవిదేశాలలో అనేక విశ్వవిద్యాలయాల్లో ఆచార్యులుగా స్థిరపడ్డారు. అతను పిహెచ్.డి పూర్తి చేయకపోయినా వందల మంది శిష్యులకు పరిశోధక సలహాలు ఇచ్చేవారు. అతని పలకరింపులో ప్రేమ ఉట్టిపడేది. ప్రేమతోనే ఒక శిష్యుని 'డెవిల్' అని పిలిచేవారు. అతనెప్పుడు గురువుని అంటిపెట్టుకుని ఉండేవాడు. రెండేళ్ళ క్రితం ప్రచురితమైన ఆంధ్ర విశ్వవిద్యాలయం క్యాంపస్ నవల 'మరోమహాత్మ'లో వేదరాజుగా పెదరాజుగారి పాత్ర సందర్భోచితంగా ఉంది. తెలుగు రాష్ట్రాల విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో ఆంగ్ల ఉపన్యాసకులకు అతను సుపరిచితులు. అతని మరణంతో ఆంగ్లశాఖ ఒక శిఖరాన్ని కోల్పోయింది. పెదరాజు గారి గురించి రాయడానికి పుటలు కాదు, పుస్తకాలు సరిపోవు.


**ఆచార్య గుజ్జు చెన్నారెడ్డి**
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,
గుంటూరు, ఫోన్ : 9849254826


## కమ్మతెమ్మెర

సార్ నమస్కారం! ఆల్ ఇండియా రేడియోలో ప్రసారమైన ఇంటర్వ్యూలోని ముఖ్య విషయాలను "సంపాదకుని బాధ్యతలు" ఆగష్టు **మిసిమి**లో ప్రచురించారు. చాలా బాగుంది. అభినందనలు! సంపాదకుని బాధ్యత కథనాలను సేకరించినంత సులభం కాదని, ముళ్ళ కిరీటం వంటిదని, అందులోని సాధకబాధకాలను విడమరచి చెప్పారు. కథ, సినిమా, కవితలు లేకుండా పత్రికను సమర్థవంతంగా నడుపుతున్నారు. పాతతరం వారి రచనలను నేటి తరాలవారికి అందిస్తూనే, మాలాంటి కొత్తతరం పరిశోధకులకు కూడా అవకాశం ఇస్తూ ప్రోత్సహిస్తున్నందుకు ధన్యవాదాలు! మరీ ముఖ్యంగా **ప్రాచీన తెలుగు మార్గాన్వేషణ పుస్తకావిష్కరణ** కార్యక్రమానికి రాంబాబు గారితో పాటు వచ్చి మీ దీవెనలు అందించిన మీ పెద్దమనసుకు మరొక్కసారి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.





**– డా. సగిలి సుధారాణి**

# అధ్యాపకుల నైతిక సూత్రావళి

*– ఆంగ్లం: ఎం.జె. మాణిక్యరావు*

*– తెలుగు : కె.వి. కోటిలింగం*

**యం.జె.యం. గారి పరిచయం :** భారత దేశంలో అనాదికాలం నుండి అధ్యాపకులను విశేషంగా గౌరవించటం సంప్రదాయంగా వస్తున్నది. వారిని **'ఆచార్యదేవోభవ'** అని సన్మానించడం పరిపాటి. ఆధునిక కాలంలో శ్రీ జ్యోతిరావు పూలే, శ్రీమతి సావిత్రిబాయి పూలే, డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్, శ్రీ రఘుపతి వెంకటరత్నం నాయుడు మొదలగువారు ఇట్లాంటి గురువులే. అయితే కాలక్రమంలో గురువుల ప్రభ కొడిగట్టుతూ వచ్చింది. చివరకు 'ఆచార్యదేవోభవ' స్థానంలో **'బతకలేని వాడే బడిపంతులు'** అనే నానుడి ప్రసిద్ధమైంది. ఈ స్థానం నుండి మరలా గురువులను ఉన్నత స్థానానికి తీసుకువెళ్ళే మహానుభావుల అవసరం ఏర్పడింది. అందుకోసం అవతరించిన వారిలో శ్రీ యం.జె. మాణిక్యరావుగారు ప్రముఖులు, ప్రాతఃస్మరణీయులు. మాణిక్యరావు గారి సేవా కార్యక్రమాలకు రోజుకు 24 గంటలు సరిపోయేవి కావు. గణితశాస్త్ర శాఖాధిపతిగా, ఆక్టా జనరల్ సెక్రటరీగా, ఆక్టా సలహాదారుగా, ఎ.ఐ.ఎఫ్.యు.సి.టి.ఓ.అధ్యక్షులుగా, ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యునిగా వారు నిత్య, నిరంతర సేవలందించారు. మాణిక్యరావుగారు అధ్యాపకులను బతకలేనివర్గం నుండి బతుకుదిద్దేవర్గంగా రూపొందించడానికి ఉద్దిష్టమైనారు. బహుశః వారు జీవితమంతా అధ్యాపకుల విషయాలనే శ్వాసిస్తూ ఉండేవారు. యం.జె.యం. గారి ఫాలభాగం వెనుక అధ్యాపకుల శ్రేయస్సుకు సంబంధించిన ఆలోచనలే. వారు ఏ జీ.ఓ.ను అయినా నంబరు, తేదీలతో సహా పొల్లుపోకుండా ప్రస్తావించి, సమస్యను నిగ్గుతేల్చగల నాయకుడు, సామాజిక స్పృహ కలిగిన వామపక్ష భావజాలకుడు, సైద్ధాంతిక నిబద్ధతగల అభ్యుదయవాది. ముఖ్యంగా కళాశాల అధ్యాపకులకు యం.జె.యం.గారు చేసిన సేవ అపూర్వం, అనన్యం. సేవాభావం వారి శక్తి అయింది, ఆక్టా వారి ఆయుధమైంది. ఆక్టా వారు నడిపిన **'కాలేజి వ్యూ'** అనే మాసపత్రిక యం.జె.యం.గారికి, ఎయిడెడ్ అధ్యాపకులకు, ప్రభుత్వానికి మధ్య ఒక వారధి అయింది. మాణిక్యరావుగారు జవహర్ భారతి కళాశాల, కావలిలో



ఎమ్.జె. మాణిక్య రావు

1959లో గణితశాస్త్ర అధ్యాపకులుగా నియమితులైనారు. రెండున్నర దశాబ్దాల పాటు పనిచేసి, 1983లో గణితశాస్త్ర శాఖాధిపతిగా ఉద్యోగ విరమణ చేశారు. విశ్వోదయ విద్యాసంస్థల అధిపతిగా డా॥ దొడ్ల రామచంద్రారెడ్డిగారి నేతృత్వంలో జవహర్ భారతి కళాశాల అనేక రకాల అభివృద్ధి సాధిస్తూ, భిన్న సైద్ధాంతిక, రాజకీయ దృక్పథాలకు కేంద్రస్థానంగా ఎదుగుతున్న రోజులవి. వామపక్షభావాలు కలవారికి స్నేహపూర్వక వాతావరణం ఉండేది. డి.ఆర్.గారికి ఆర్థిక, సాంఘిక, రాజకీయ, కుల, మత, వర్గ, ప్రాంతీయ విభేదాలలో నమ్మకం లేదు. వారి మానవతావాదం ముందు ఏ తిరోగామి శక్తులు నిలబడగలిగేవి కావు. ఇటువంటి మానవతావాద దృక్పథం గల డి.ఆర్.గారు యం.జె.యం. వంటి వారి ప్రగతిశీల కార్యక్రమాలకు శ్రేయోభిలాషులుగా ఉండేవారు. డి.ఆర్.గారు తన గుండెల్లో శాశ్వతంగా పదిలపరచుకొన్న జ్ఞాపకమే శ్రీ మాణిక్యరావుగారు. వారి సేవాజీవితానికి గుర్తుగా, వారి బహుముఖీనమైన కార్యక్రమాలకు గుర్తింపుగా డి.ఆర్.గారు 1995లో మాణిక్యరావు గారిని విశ్వోదయ గౌరవ జీవితసభ్యత్వంతో సత్కరించారు. డి.ఆర్.గారి ప్రోత్సాహంతో మాణిక్యరావుగారు, మాధవరావుగారు యం.యల్.సి.లుగా పోటీచేసి, గెలిచి, శాసనమండలిలో రాష్ట్రస్థాయిలో తమ వాణిని వినిపించడం జరిగింది. అధ్యాపకులకు పూర్వవైభవం పునరుద్ధరించే కార్యక్రమంలో మాణిక్యరావుగారు ద్వివిధ మార్గాలు ఎంచుకొన్నారు.

1. ఆకలి కడుపుతో, అర్థాకలితో అధ్యాపక వృత్తి సార్థకం కాలేదని మాణిక్యరావుగారు మనో వాక్కాయ కర్మణా నమ్మారు. ముందు అధ్యాపకుల ఆర్థిక స్థితిగతులను, ఉద్యోగ భద్రతను మెరుగుపరచడానికి అహర్నిశలు కృషి చేశారు. ముఖ్యంగా ఎయిడెడ్ అధ్యాపకుల సమస్యలను క్రోడీకరించి ప్రభుత్వం దృష్టికి తేవడంలో సఫలమైనారు. ఈ సందర్భంగా వారు ఎన్ని ప్రదేశాలకు వెళ్ళారో, ఎన్ని వేల మైళ్ళు ప్రయాణించారో, ఎంతమంది శాసనసభ్యులను, మంత్రులను, అధికారులను కలిశారో, ఎన్ని నిదురలేని రాత్రులు గడిపారో వారి అంతరంగానికే తెలుసు, వారి

ఆంతరంగికులకే తెలుసు. పైకి మాత్రం వారు పెదవులపై స్వచ్ఛమైన నవ్వును పూయిస్తూ, ఆపన్నులకు అభయహస్తం ఇస్తూ, ధైర్యం నూరిపోస్తూ ఉండే ఆజానుబాహులు! అందుకే వారు ఎక్కడున్నా, ఎంతమందిలో ఉన్నా సమున్నతంగా కనపడే శిఖరాగ్ర సమానులు.

మాణిక్యరావుగారికి అధ్యాపకులకు సంబంధించిన విషయాలపై మంచి పట్టు ఉంది, సమస్యలను పరిష్కరించే చాతుర్యం ఉంది, ఆంగ్లంలో అమోఘమైన వాగ్ధాటి ఉంది, అలా వారు యం.ఎల్.సి.గా శాసనమండలిలో అధ్యాపకుల విషయాలను తెలియజేస్తుంటే, ప్రశ్నిస్తుంటే మంత్రులు, శాసనసభ్యులు, ఇతర అధికారులు చెవులు రిక్కించి వినేవారు. యం.జె.యం.గారు తన కార్యక్రమ సాఫల్యతకు వినతిపత్రాలు, అర్జీలు, ధర్నాలు, సమ్మెలు మొదలగు సామ దాన దండోపాయాలను బహు చాకచక్యంగా ఉపయోగించారు. ఆ విధంగానే వారు ఎయిడెడ్ అధ్యాపకులకు యు.జి.సి. వేతనాలు సాధించడంలో సఫలీకృతులైనారు. కొన్ని విద్యా సంస్థలను గ్రాంట్ ఇన్ ఎయిడ్‌లోకి వచ్చేలా ప్రోత్సహించడం, జూనియర్ లెక్చరర్‌లకు డిగ్రీ కళాశాల లెక్చరర్లుగా ఉద్యోగ ఉన్నతి సాధించడం, జీతభత్యాలలో వ్యత్యాసాల సవరింపులు, పెన్షన్‌లు మొదలగు అనేక జటిల సమస్యలను పరిష్కరించడంలో వారు కృతకృత్యులైనారు. అంతేకాదు, ప్రభుత్వం ఇచ్చే జీతాలు మధ్యవర్తుల చేతుల్లో పడకుండా అధ్యాపకులకే నేరుగా బ్యాంకుల ద్వారా అందే ఏర్పాటు చేశారు. అధ్యాపకుడి గుండె వేగంగా కొట్టుకుంటే వెనుదిరిగి చూస్తే వారికి మాణిక్యరావుగారు కనపడేవారు! అధ్యాపకుడు ఏ సమస్యతో వచ్చినా, ముందు వారు దానిని స్వీకరించేవారు, తరువాత వారి వెన్నుతట్టేవారు, ధైర్యాన్ని నూరిపోసేవారు. స్థూలంగా చెప్పాలంటే, మాణిక్యరావుగారు అధ్యాపకుల పాలిట ఒక గొప్ప వరం అయినారు.

2. ప్రతి వృత్తికీ కొన్ని నీతినియమాలుంటాయి. వాటిని పాటించినప్పుడే వృత్తికి సార్థకత చేకూరుతుంది, వృత్తి ధర్మం కాపాడినట్లవుతుంది. అటువంటి నైతిక సూత్రావళి కళాశాల అధ్యాపకులకూ ఉంది. మాణిక్యరావు గారు వాటిని క్రోడీకరించి, టీకాతాత్పర్యాలతోసహా అధ్యాపకుల ముందుంచారు. జీతాలు సరిగ్గా లేనప్పుడు అధ్యాపకులకు సమ్మె చేసే హక్కు ఎట్లా ఉంటుందో, వృత్తికి నిబద్ధతగా ప్రవర్తించే బాధ్యత కూడా అట్లాగే ఉంటుంది అని వారు వక్కాణించి చెపుతూ ఉండేవారు. అధ్యాపకులు తమ వృత్తికి న్యాయం చేయగలిగితే అది రెండు విధాల శుభప్రదమౌతుంది. ఒక వైపు, అది ఉత్తమ విద్యార్థులను తయారు చేస్తుంది. ఇంకొక వైపు, అది అధ్యాపకులలో అనన్యమైన వృత్తి సంతృప్తిని కలుగజేస్తుంది. ఏ వృత్తికైనా ఇది నికషోపలం కదా!

యం.జె.యం.గారి సేవలను, చేరిన మైలురాళ్ళను, సాధించిన విజయాలను, ఎవరెంత పొగిడినా, ఆయనలో గర్వం మచ్చుకైనా కనపడేదికాదు. వారు ఎప్పుడూ ఇతరులు చేసిన సేవలను ప్రశంసించేవారుగాని ఏ ఒక్క దానికీ స్వీయకర్తృత్వం ఆపాదించుకోలేదు. నమ్రతతో, సేవాభావంతో శ్రీ యం.జె.యం.గారు జీవితాంతం పోరాడుతూనే ఉన్నారు. వయస్సు మీద పడుతున్నా, అనారోగ్యం వేధిస్తున్నా ఇంకా ఇంకా, ఏదేదో, ఎంతెంతో అధ్యాపక లోకానికి చేయాలనేది వారి తపన. రాబర్ట్ ఫ్రాస్ట్ చెప్పిన మాటలు యం.జె.యం.గారికి పూర్తిగా వర్తిస్తాయి. అవి "లాంగ్ మైల్స్ టు గో బిఫోర్ ఐ స్లీప్".... నిరంతరం సేవాజీవితం గడిపిన యం.జె.యం.గారు 2008 నవంబర్ 16వ తేదీన మన నుండి శాశ్వతంగా సెలవు తీసుకొని అమరులైనా, నల్లని బోర్డు మీద వారి తెల్లని చిరునవ్వు అక్షరాలలో చిరకాలం ప్రకాశిస్తూనే ఉంటుంది. ఈ వ్యాసంలో శ్రీ మాణిక్యరావుగారు కళాశాల అధ్యాపకుల వృత్తిపరమైన నైతిక సూత్రావళిని వివరించారు. అధ్యాపకుల జ్ఞానసముపార్జనను, దానిని విద్యార్థులకు అందించే బోధనా పటిమను, పరిశోధనలోని సత్యాన్వేషణను, సహోద్యోగుల పట్ల సర్దుబాటు ధోరణిని, యాజమాన్యం, ప్రభుత్వం పట్ల అనుసరించవలసిన దృక్పథాన్ని, సామాజికంగా అధ్యాపకుడి ధర్మాన్ని పేర్కొన్నారు.

**యం.జె.యం.గారి వ్యాసాంశము :** ఆధునిక కాలంలో విజ్ఞానం తామర తంపరగా పెరుగుతూ ఉన్నది. అంతేకాదు దాని అవసరం, వినియోగం, విలువ, గౌరవం కూడ అదే మోతాదులో పెరుగుతున్నాయి. అందువలన కళాశాల అధ్యాపకుడు వీటిని బాగా ఆకళింపు చేసుకొని, తాను నివసిస్తున్న సమాజంలో తన బాధ్యత తాను గుర్తించాలి. తను బోధించవలసిన శాస్త్రానికి సంబంధించిన సూక్ష్మాలను, సత్యాలను, నైపుణ్యాలను గ్రహించి, వాటిని వివరించడం అతడి ప్రధాన బాధ్యత. దీనికోసం అతడు తన శక్తి యుక్తులను ఉపయోగించి, తన శాస్త్రీయ అనుభవాన్ని పెంపొందించుకోవాలి. అతడు తన జ్ఞాన పరిధిని వృద్ధిచేసుకుంటూ, దాన్ని ఇతరులకు, ముఖ్యంగా విద్యార్థులకు అందజేసే బాధ్యతను స్వీకరించాలి. ఈ విషయంలో అతడు మేధోపరమైన నిజాయితీ కలవాడిగా

ఉండాలి. అతడికి ఇతరత్రా ప్రయోజనకర కార్య కలాపాలున్నా, అవి అతడి ప్రధాన కర్తవ్యాలను, స్వేచ్ఛను, పరిశోధనా తత్త్వాన్ని, సత్యాన్వేషణను మరుగుపరచకూడదు. కళాశాల అధ్యాపకుడు తన విద్యార్థులలో స్వేచ్ఛగా జ్ఞానసముపార్జన చేసే తత్త్వాన్ని ప్రోత్సహించాలి. విద్యార్థులకు తన శాస్త్రానికి సంబంధించిన ఉన్నత ప్రమాణాలను అందజేయాలి. అతడు ఒకవైపు తన విద్యార్థులను వ్యక్తులుగా గౌరవించాలి, ఇంకొకవైపు వారి మేధోపరమైన గురువుగా, హితబోధకుడుగా వ్యవహరించాలి. అతడు వారిలో నిజాయితీపరమైన అధ్యయన వ్యక్తిత్వం పెంపొందించాలి. అంతేకాదు, అధ్యాపకుడు వారిలో నిద్రాణంగా ఉండే ప్రావీణ్యతను గుర్తించి వెలికి తీయాలి. అధ్యాపకుడు, విద్యార్థుల అధ్యయన స్వేచ్ఛను ప్రోత్సహించాలి, కాపాడాలి. అధ్యాపకుల, విద్యార్థుల మధ్య ఉండవలసిన సత్సంబంధాలను అతడు తన వ్యక్తిగత ప్రయోజనాలకు వినియోగించుకో కూడదు. విద్యార్థులను దోచుకోకూడదు, అంతే కాదు, విద్యార్థులు చేసే సహాయం ఎంత చిన్నదైనా దానికి సముచితస్థానం ఇవ్వాలి. కళాశాల అధ్యాపకుడు ఒక మేధో సమాజంలో సభ్యుడు కాబట్టి అతడికి తన సహోద్యోగులపట్ల కొన్ని బాధ్యతలుంటాయి. అతడు తన సహోద్యోగుల స్వేచ్ఛా భావాలను గౌరవించాలి, సమర్థించాలి, విమర్శించేటప్పుడు కూడా ఇతరుల భావాలను గౌరవించాలి. ఒక విద్యాసంస్థలో భాగంగా కళాశాల అధ్యాపకుడు తన విషయ పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు వృద్ధి చేసుకొంటూ ఉండాలి, మంచి అధ్యాపకుడిగా బోధన చేయాలి. సంస్థ నియమావళిని గౌరవిస్తూనే విమర్శించడంలో తన హక్కుని నిలబెట్టుకోవాలి. అతడు ఒక సంస్థలో వృత్తిపరంగా పనిచేస్తూ, ప్రవృత్తి పరంగా ఎంపిక చేసుకొనే కార్యక్రమాలలో బహు జాగ్రత్తగా ఉండాలి. తన ప్రధాన ఉద్యోగంపై ఇవి ఎంతవరకు ప్రభావం కలిగి ఉంటాయో ఉజ్జాయింపు చేసుకోవాలి. సమాజంలోని ఇతర పౌరులవలెనే, ఒక కళాశాల అధ్యాపకుడికీ హక్కులు, బాధ్యతలు ఉంటాయి. వీటిని నిర్వర్తించడంలో అధ్యాపకుడు తన విద్యార్థుల పట్ల, వృత్తిపట్ల, సంస్థపట్ల గల బాధ్యతలను విస్మరించకూడదు. అయితే అతడు ప్రైవేటు వ్యక్తిగా మాట్లాడేటప్పుడు ఒక సంస్థ తరపున ప్రతినిధిగా ఉన్నట్లు ప్రవర్తించకూడదు, అందరికీ వర్తించే స్వేచ్ఛను ప్రభావితం చేయకూడదు, నిష్పక్షపాతంగా ఉండాలి. విద్యాసంస్థలనేవి ఉమ్మడి ప్రయోజనాల కొరకు స్థాపించబడాలి. ప్రైవేట్ వ్యక్తుల కొరకు గాని, ఏదైన ఒక సంస్థ వ్యక్తిగత ప్రయోజనాల కొరకు గాని స్థాపించరాదు. విద్యాసంస్థలకు సంబంధించి స్వేచ్ఛాయుత వాతావరణం ఉంటేనే సామాజిక ప్రయోజనాలకి దోహదం చేస్తుంది.

**విద్యాపరమైన స్వేచ్ఛ :** విద్యాపరమైన స్వేచ్ఛకు సంబంధించి కొన్ని ముఖ్యమైన సూత్రాలు ఉన్నాయి. అవి:

1. అధ్యాపకుల విషయంలో స్వేచ్ఛ అంటే కులము, మతము, జాతి, రాజకీయాలు మొదలగు విషయాలలో నిష్పక్షపాతంగా ఉండాలి. 2. కళాశాల అధ్యాపకుడు పరిశోధనలో ఎలాంటి ద్రవ్యఫలాపేక్ష లేకుండా సత్యాన్వేషణ గావించాలి. 3. కళాశాల అధ్యాపకుడు విద్యాబోధనలో తాను నమ్మిన సత్యాలను నిస్సంకోచంగా, నిర్భయంగా ప్రకటించాలి. అతడు మూఢనమ్మకాలను వ్యతిరేకిస్తూ బోధన సాగించాలి. అది శాస్త్రీయంగాను, సత్యయుతం గాను ఉండాలి. కళాశాల అధ్యాపకుడు అనేక బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలి. అతడు ఒక పౌరుడు, మేధోపరమైన వృత్తిలో సభ్యుడు, ఒక సంస్థ నిర్వహణలో బాధ్యుడు. అతడు వీటిని ఏ విధంగా నిర్వహిస్తున్నాడు అనే దానిని బట్టి సమాజం అతడిని అంచనావేస్తుంది. కాబట్టి అతడు ఎప్పుడూ నిరంతర విద్యార్థిగా తెలుసుకుంటూ ఉండాలి. సుబోధకుడిగా ఉండాలి, నిగ్రహం పాటించాలి, ఇతరుల భావాలను గౌరవించేవాడిగా ఉండాలి.

ఈ విధంగా శ్రీ మాణిక్యరావుగారు సూచించిన వృత్తిపరమైన నైతిక సూత్రావళిని అమలు చేస్తే విద్యా ప్రాంగణాలు ప్రకాశవంతమౌతాయి, యాజమాన్యాలవారు ఉదారులుగా ఉంటారు, అధ్యాపకులు తమ శాస్త్రంలో నిష్ణాతులౌతారు, విద్యార్థులు ఉన్నత ప్రమాణాలు గలవారిగా రూపొందుతారు, పరిశోధన సత్యయుతంగా ఉంటుంది. విద్యా ప్రమాణాలకు, అభివృద్ధికి, నాణ్యతకు సంబంధించి శ్రీ మాణిక్యరావుగారిది అధ్యాపకుని హృదయంపై ఒక చెరగని సంతకం!

**ఆంగ్లం : ఎం.జె. మాణిక్యరావు**
ఫార్మర్ యం.యల్.సి., ఫార్మర్ జనరల్ సెక్రటరి,
ఆక్టా ఫార్మర్ ప్రెసిడెంట్, ఎ.ఐ.ఎఫ్.యు.సి.టి.ఓ.
**తెలుగు : కె.వి. కోటిలింగం**
ఫార్మర్ వైస్ ప్రిన్సిపాల్, జవహర్ భారతి డిగ్రీ కళాశాల,
ఫార్మర్ కరస్పాండెంట్, జవహర్ భారతి జూనియర్ కళాశాల
కావలి, ఫోన్ : 916281996234

# వర్షవిన్యాస హేల

*– గడ్డం దేవీప్రసాద్*



ఉదయంనుండి నిప్పుల కుంపటిని తలపింపచేసిన భానుణ్ణి వడివడిగా దట్టమైన కరిమబ్బులు వచ్చి కప్పేసి తమ నల్లదనంతో నింగికి కాటుక దిద్దుతూ నిలిచాయి. యామినిని వెంట తెచ్చుకున్నాయేమో అన్నట్టు మసకచీకట్లను వెదజల్లుతూ నేలమ్మకు విశాలమైన గొడుగులు పడుతున్నాయి. భేరీశబ్దాల్లాంటి ఉరుములు, వయ్యారాల మెరుపు తీగలజాడలేదు. కరువుకాలాన కురవడానికొచ్చిన మబ్బుల్ని చెల్లాచెదరుచేసి వినోదిస్తూ, అతివృష్టి వేళలో జతజేరి అలజడి సృష్టించే వవనుడు స్థబ్ధంగా ఉండిపోయాడు. మేఘాలు మెల్లమెల్లగా చక్కని లయతో మొదట కళ్ళాపివాన కురిపించాయి. తొలిచినుకు ముద్దులతో పులకరించిన నేలమ్మ కమ్మటి మట్టి వాసనను తన్మయత్వంతో వెదజల్లింది. వెనువెంటనే మేఘమాల బూడిదవర్ణంలోకి మారి గాంధారివానగా రూపు దిద్దుకొని దట్టమైన జలధారలను జారవిడువసాగాయి.

తమమీద దాడిచేసి రెమ్మల్ని, కొమ్మల్ని విరిచేసి ఇబ్బందులకు గురిచేసే అనిలుని జాడలేకపోవడంతో తరువులన్నీ నిశ్చింతగా నిశ్చలంగా కురుస్తున్న కుండపోత వర్షపుధారల్లో తనివితీరా తలస్నానాలు చేస్తున్నాయి. స్నానించిన నీళ్ళు పాయలుగా చెట్లబోదెల మీదుగా జారి మొదళ్ళలో మడుగులు కడుతున్నాయి. చెట్లలో ముడుక్కొని కూర్చున్న విహంగాలు వానజాణ పోకడలను గమనిస్తూ తడిసిపోతున్న తమ శరీరాలను పదేపదే విదిలించు కొంటున్నాయి. కాల్చే ఎండల్లో ఆపసోపానాలు పడుతూ నడిచే పాదాచారులు వానలో తడిస్తే తామెక్కడ మొలకలెత్తు తామేమోనని చాటును వెదుక్కుంటూ గాభరాగా పరుగెత్తారు. వాహన చోదకులు బెంబేలెత్తి నిబంధనలు పాటింపక వేగంపెంచి అడ్డగోలుగా నడపడంతో ఎక్కడికక్కడ వాహనాలన్నీ నదులుగా మారిన గతుకుల దారుల్లో నిలిచిపోయాయి.

వానరాకడ ఆలస్యమైతే, కలతపడుతూ, వర్షమొస్తే బెంగపడే వింతమనస్తత్వపు మనుషులను పట్టించుకోక మబ్బులు లేత శ్వేతవర్ణంలోకి మారుతూ ఏనుగులు తొండాలతో బలంగా నీళ్లను విరజిమ్మినట్టు జలఖడ్గాలతో విరుచుకుపడ్డాయి. అడ్డదిడ్డంగా ఉన్న తీగలపై పడ్డ చినుకులు తెల్లటి ముత్యాలవరుసల్లా మారి కనువిందుచేస్తూ జారిపోతున్నాయి. ఈల వేస్తూ తిరిగే వాయువు జాడ లేక పోవడంతో వానమ్మ తనకు అందుబాటులోని వస్తువులపై పడుతూ రకరకాల ధ్వనులను సృష్టిస్తూ వినోదిస్తోంది.

పెంకుల, రేకుకప్పుల ఇళ్లపై దరువులేస్తూ తాను సృజిస్తున్న సంగీతాన్ని మైమరచి వింటూ మరిన్ని మేఘపు కొప్పుల్ని విప్పదీసి విదిలిస్తూ చిందులు వేస్తోంది. పెంకుటిళ్ళ చూరుల మీదుగా జారిపడుతూ నేలమ్మ బుగ్గలపై అందమైన సొట్టలు సృష్టిస్తూ సంతసిస్తోంది.

వర్షపునీరు ఉరకలేస్తూ నిలువ ఉండడానికి తన ఆవాసాలను వెదకుతూ గబగబా సాగిపోయింది. వాటికోసం వెదకివెదకి వేసారి తిరుగుముఖం పట్టి దారి లేక నిలిచిపోయింది. వాననీటి అవస్థను ఇందాకటినుంచి గమనిస్తున్న మురుగునీరు వచ్చి కలిసి చెరువులను, కుంటలను, కాలువలను దుర్బుద్ధితో మనిషి మాయంచేసిన వైనాన్ని వివరించి ఓదార్చింది. నింగినసాగిపోయే మేఘాల ఒడినుండి జీవకోటి అవసరాలకు భూదేవి ఒడిలోకి జారిన తనకు నిలువచోటులేకుండా చేసిన వాడిని నిగ్గుతీసి ప్రశ్నించదలచింది. అనుకున్నదే తడవుగా తన తావును ఆక్రమించి కులుకుతున్నవాని ఇంటిని ముంచెత్తి లోపల నక్కిన నక్కజిత్తులవాడిని కంపునీళ్ళతో కలసి నిలదీస్తూ తన దుస్థితికి కన్నీటిపర్యంతమై వగచి చెత్తాచెదారాన్ని మోసుకొని సాగరునివైపు బేలగా సాగిపోయే వర్షపునీరు.

**గడ్డం దేవీప్రసాద్**
రచయిత
బెంగుళూరు, ఫోన్ : 8971830473

# జాతర

– ఆచార్య తంగెడ కిషన్ రావు



**జా**తర 'యాత్ర' శబ్దం నుండి పుట్టింది (యాత్ర – జాత్ర – జాతర). యాత్ర అంటే ప్రయాణం. జాతరను తెలంగాణ జిల్లాల్లో 'తీర్థం' అని పిలవడం ప్రముఖంగా వినిపిస్తుంది. తీర్థానికి–పుణ్యక్షేత్రం, నది, ఏరు అనే అర్థాలు కూడా ఉన్నాయి. సామాన్యంగా జాతరలు, నది లేదా ఏటి ఒడ్డున ఉండే దేవతా సంబంధమైన క్షేత్రాలనే ఆలంబనగా చేసుకొంటాయి. భగవంతుని దర్శనం కోసం గుడికి వెళ్ళినప్పుడు పూజారి భక్తునికి – తులసీదళాలతో నానిన జలాన్ని ఇస్తాడు. దాన్ని కూడా తీర్థం అనే అంటారు. ఈ విధంగా 'తీర్థం' జల సంబంధమై, నది లేదా ఏటి ఒడ్డున ఉన్న పుణ్యక్షేత్రాలకు సంబంధించి, జాతరలకు తొలుత మారు రూపంగా విలసిల్లింది. తర్వాత కాలంలో జల సంబంధం లేని జాతరలు కూడా తీర్థం అనే పిలవబడుతూ ఒక పలుకుబడిగా రూపాంతరీకరణను పొందగలిగినాయి.

పిల్లాజెల్లా, ముల్లే మూటా సర్దుకొని కుటుంబాలకు కుటుంబాలే సామూహికంగా, సంతోషంతో జాతరకు ప్రయాణాన్ని కొనసాగిస్తాయి. ఈ జాతర కాలినడకన తర్వాత ఎడ్లబండి పైన పూర్వం కొనసాగేది. దూరం, ప్రాంతం, ప్రాముఖ్యాన్ని బట్టి జాతరలు ఇప్పుడు ఏదో ఒక రవాణా సౌకర్యాన్ని కలిగి ఉంటున్నాయి. ఒక బాలిక తన భుజాలపై తన చెల్లెలినో మరెవరినో కూర్చుండ బెట్టుకొని నడుస్తూ 'తీర్థం బోతాన్న తిమ్మక్కా' అంటూ, పాట పాడుతున్నట్లుగా దీర్ఘం తీస్తూ పలుకుతుంది. 'నేనొత్తా దమ్మక్కా' అని భుజాలపై కూర్చున్న బాలిక సమాధానంగా బదులు పలుకుతుంది. వారికి అదొక ఆట. అందులో జాతరకు నిజంగానే పోతూ ఉన్న అనుభూతి. కాలినడకన జాతరకు ప్రయాణమైనప్పుడు ఒక తల్లి తన బిడ్డను జాతరకు మోసుకుపోయే దృశ్యాన్ని ఆ ఆట జ్ఞాపకం చేస్తుంది. ఆ దృశ్యాన్ని అనుకరించిన పిల్లలు దాన్ని ఒక ఆటగా చేసుకొని తమ పెద్దలు తమను జాతరకు తీసుకుపోయిన దృశ్యాన్ని అలా సంతోషంతో నెమరు వేసుకుంటారు. ఇది కాలినడకన కుటుంబ సభ్యులంతా కలిసి జాతరకు పోయే స్థితిని తెలియజేస్తుంది.

పిల్లల స్థితి ఇలా ఉంటే –

**"చీకటి మబ్బూనా చీకటి మబ్బూనా / సిరి వేంకటేశ్వరుల తిరణాల జూ సొస్తమా / నారసింహా నిలువు దోపిడీ లిస్తామా/ పున్ను వెన్నెల్లోన పున్ను వెన్నెల్లోన / పెన్నోబలేసుని తలబాలు జూసొస్తామా/ నరసింహ తేరెక్కి స్వారెల్లదామా"** అని, ఒక జానపద యువతి తెల్లవారగట్లనే వెంకటేశ్వరుని తిరుణాలను దర్శించి నిలువు దోపిడి ఇద్దామనీ , పండు వెన్నెల్లో పెన్న అహోబిల నరసింహుని కళ్యాణాన్ని చూద్దామనీ తన కోరికను భర్త ముందు ఉంచుతుంది. స్వగ్రామాన్ని వృత్తి పనులను విడిచి బయటకు వెళ్లేందుకు ఇష్టపడని జానపదులు ఈ విధంగా తమ మొక్కుబడుల పేరుతో జాతరలను సందర్శించడం గ్రామాల్లో అత్యంత సహజమైన విషయమే. ఈ విధంగా జాతరలు – తీర్థం, తిరుణాల, మేలా, సంబరం మొదలైన పేర్లతో మతాన్ని ఆలంబనగా కలిగి ఉంటాయి. ఏదో ఒక దేవతాపరంగా ఒక గ్రామంలోనో లేక ఒక క్షేత్రంలోనో సుమారు సంవత్సరానికి ఒకసారి కొద్ది రోజులపాటు కొనసాగుతాయి. వీటిలో కొన్ని పురాణ సంబంధాలు, మరికొన్ని స్థల పురాణాలను అంశంగా చేసుకొన్నట్టివి. అంశం ఏదైనా వీటిలో పాల్గొనే వారిలో కొందరు మొక్కులు చెల్లించుకునేందుకు వెళ్తారు. మరికొందరు ఉత్సాహం ముప్పిరిగొనగా దైనందిన జీవితం నుండి మార్పు కోరి తమ వాళ్లతో కలిసి సరదాగా వెళ్తారు. ఇంకొందరు భక్తి

ఆవేశంతో తన్మయత్వం ఎక్కువై జాతరలో తామే ఒక భాగంగా మారుతారు. ఈ విధంగా జనజీవన ప్రవంతిలో ప్రవహిస్తున్న జాతరలు ఈనాడు నిర్దిష్టమైన దినాల్లోనే జరుపబడుతున్నా పూర్వకాలంలో మాత్రం ప్రత్యేక సందర్భాల్లో పెద్దల సామూహిక నిర్ణయం మీద ఆధారపడి కొనసాగేవి.-"చిగురు విలుకాని జాతర సేయబూని / కొలము సాముల నందఱ కూడా బెట్టి" అని, పారిజాతాపహరణ కావ్యం (2-49)లో ముక్కుతిమ్మన (క్రీ. శ. 16 వ శతాబ్దం) ప్రయోగించిన మాట ఈ అర్థాన్నే విశదీకరిస్తోంది.

**1. చాటింపు :** ద్వారకానగరం ఆపదకు గురి కాబోతున్నదని శ్రీకృష్ణుడు భావిస్తాడు. జాతర జరపాలని నిశ్చయించు కొంటాడు. నగరంలోని వారందరికీ చాటింపు వేయిస్తాడు. చాటింపు చేసేవాడు ఆ విషయాన్ని,**"ఘంటికా స్వనో / పేతముగాగ.. పెద్ద యెలుంగున జాటె యెల్లెడన్"** అంటూ, తిక్కన కవి (క్రీ.శ.1210-90) తన మహాభారతం మౌసల పర్వం (1-24)లో చాటింపును గూర్చి పేర్కొన్నాడు. గ్రామానికి సంబంధించిన ఒక ముఖ్యమైన విషయాన్ని తెలిపే సందర్భంలో డప్పు ద్వారా చాటింపు చేయడం వాడుకలో ఉంది. ఈ చాటింపు చేసేవాడు గ్రామంలోని వీధుల్లో వివిధ దరువులతో డప్పును వాయిస్తూ, జన సమీకరణ జరిగిన తర్వాత డప్పు కొట్టడాన్ని ఆపివేస్తాడు. తర్వాత పెద్ద గొంతుతో "..... **ఇన్నే లెవలో ఇననోల్లెవలో కనీ.."** అంటూ విషయాన్ని వినకుతూహలంగా వివరిస్తాడు. ఈ విధమైన డప్పు చాటింపు నేటికీ, గ్రామాల్లో ఒక ప్రచార సాధనంగా ఉపయోగపడుతోంది. ఆ తర్వాత ప్రజలు ఆనందపు వెల్లువలతో జాతర సన్నాహాలు జరుపుకుంటారు. కాలినడకన పోయేవారు కొందరైతే , ఏమాత్రం అవకాశం ఉన్నా ఎడ్లబండ్లను కట్టే వారే అధిక సంఖ్యలో కనిపిస్తారు.

**2. ఎడ్లబండ్లు :** జాతరకు ప్రయాణం అంటే ఒక రోజుతోనో కొన్ని గంటలతోనో సరిపోయేది కాదు. కనీసం వారం రోజుల యాత్ర చేయాల్సిన జాతరలు కూడా ఉంటాయి. దూరాన్నీ, యాత్ర ప్రాధాన్యాన్ని తెలియజేసేవి కనుకనే వీటికి జాతరలు (యాత్రలు) అనే పేరు సార్థకమయింది. జాతరలను సమిష్టిగానే జరుపుకునేందుకు జానపదులు ఇష్టపడతారు. కాబట్టి వారికి జాతర సందర్భాల్లో బండి ప్రయాణం తప్పనిసరి అయింది. **"..... బండ్లను వలయు భంగినిడి/ యథోచిత జనము లింపెసగనడువ/ జాతర యొప్పు మిగిలే"** అని, ఎఱ్ఱన కవి (క్రీ.శ.14వ శతాబ్దం పూర్వార్ధం) హరివంశ కావ్యం (పూర్వభాగం-7.145) జాతరలో ఎడ్లబండ్ల ప్రాధాన్యాన్ని అందుకే వర్ణించింది.

బండ్లు - పిల్లాపాపలతో కూడిన కుటుంబ సభ్యులను, తినేందుకు చిరుతిండ్లను, వంటకు సామాన్లనే కాక ఎద్దులకు గ్రాసాన్ని కూడా అమర్చుకుంటాయి. అందువల్ల అవి నడుస్తున్న ఇండ్లుగా (మొబైల్ హౌసెస్) భ్రమింప చేస్తాయి. ఈ విధంగా బండెనుక బండి చొప్పున వందలాది బండ్లు సామాన్లను, జనాన్నే కాకుండా జాతర ఉత్సాహాన్ని కూడా మోసుకొనొస్తూ ప్రయాణం చేస్తాయి- **".... బలుగావళులును/ దలమోపులును బండ్లు దమతోడ నొప్పారి/ చనుదేర.."** (మౌసలపర్వం-1-29) అంటూ, ఇదే అంశాన్ని తిక్కన కవి వర్ణించాడు. తమ వాళ్ళతో కలిసి ఎన్నో మైళ్ళు బాట వెంట ప్రయాణం చేస్తూ ఏటి ఒడ్డునో, పంట పొలాల గట్టునో, తోటల నీడనో విశ్రాంతి తీసుకుంటూ జాతరకు పోయే జనం ప్రయాణం చేస్తారు. విశ్రాంత సమయంలో ఎడ్లకు తమ వెంట తెచ్చిన ఎండు గడ్డిని వేసి, అదే గడ్డిని తాము కొంత నేలపై పరచుకొని కబుర్లు చెప్పుకుంటూ, తాము వెంట తెచ్చుకున్న తినుబండారాలు తింటూ - కాలక్షేపం చేస్తారు. భోజనాల సమయం కాగానే అప్పటికప్పుడే పొయ్యిరాళ్లు అమర్చుకొని అక్కడికక్కడే వంట చేసుకుని తింటారు. ఇవన్నీ జానపదాల్లో అత్యంత సామాన్యమే.

కేవలం పుణ్యక్షేత్రాలకే అయితే అది వ్యక్తి ప్రయాణం లేదా ఏదో ఒక కుటుంబం తమకు తాముగా చేసే ప్రయాణం. కానీ, ఇది జాతర. కుటుంబ సభ్యులూ, బంధువులూ, స్నేహితులూ తమ ఊరి వాళ్ళు ఇలా ఎందరితోనో కలయికగా చేసే ప్రయాణం. అందుకే అంత ఉత్సాహం. జాతరకు చేరిం తర్వాత కలిగే అనుభవాలు మాత్రమే కాదు, చేరే ముందు తమ వారందరితో కలసి చేసే బండ్ల ప్రయాణం కూడా ఎంతో ఉత్సాహాన్ని పంచి ఇస్తుంది. ఈ సంతోష సంభ్రమాలు నేటికీ గ్రామాల్లో జరిగే జాతర సందర్భాల్లో కనిపిస్తూనే ఉంటాయి- **"..నందాదులైన గోపకులాంబికా వనంబునకు శకటంబులెక్కి జాతరకుంజని.."** అని, పోతన కవి (క్రీ.శ.1400-50)భాగవత కావ్యం

(దశమ స్కంధం, పూర్వ భాగం- 1110) కూడా జాతర బండ్లను గూర్చి పేర్కొన్నది.

ఈ విధంగా జాతరకు బండ్ల మీద ప్రయాణం చేయడమే ఒక అపూర్వమైన అనుభవం అయితే, జాతరలో బండితో ప్రదక్షిణలు చేయడం అనే మొక్కుబడులు కూడా ప్రాచీన కాలంగా అమల్లో ఉండడాన్ని ఒక విశేషంగానే భావించాలి-ఇందుకు ఉదాహరణగా వరంగల్ సమీపంలోని 'కొత్తకొండ వీరన్న' జాతరను ప్రముఖంగా పేర్కొనవచ్చు. కొత్తకొండ అనే గ్రామంలో ప్రతి ఏటా సంక్రాంతి పర్వదినాల్లో వీరభద్రేశ్వరుని జాతర జరుగుతుంది. మొక్కుబడులకు సంబంధించిన కారణం ఏదైనా ఇక్కడ స్వామి వెలసిన గుడి చుట్టూ మూడు లేదా ఐదు మార్లు బండిని ప్రదక్షిణ చేయించడం అనేది ఒక ఆచారంగా పూర్వకాలం నుండీ ప్రచారంలో ఉంది. పాల్కురికి సోమనాథుని ( క్రీ.శ.13వ శతాబ్దం పూర్వార్ధం) బసవ పురాణం కావ్యం మూడవ ఆశ్వాసంలో **"వీరభద్రుని జాత్ర వేల నిన్నుండి /యేరొప్ప బనిచెద నీ పాలు ద్రావు"** అని, పాలు త్రాగని శిశువు రూపంలోని శివుని, గొడగూచి బతిమాలుతుంది. శివుడు పాలు తాగకపోవడం అనేది మారాం చేతనో లేదా ఇతరుల దృష్టి తగలడం వల్లనో అయి ఉంటుంది. కారణమేదైనా **'వీరభద్రుని జాతర వేల బండి పై పంపిస్తాను'** అని గొడగూచి పలికే విషయం మాత్రం నేటి కొత్తకొండ జాతర ఆచారాన్ని స్ఫురణకు తెస్తుంది. ఈ కొత్తకొండ ప్రాంతం కాకతీయుల ఏలుబడిలోని ప్రాంతమే. ఇది వరంగల్ సరిహద్దుల్లోనే ఉండి, పాల్కురికి సోమన నివాసమైన పాలకుర్తి గ్రామానికి కూడా సమీపంలోనే ఉండడం గమనించతగ్గ అంశం. ఇలా ఎడ్లబండి ప్రయాణం జాతరకే ఒక అలంకారం. యువతీ యువకులు - అందునా ప్రేయసీ ప్రియులు బండిపై చేసే జాతరకు సంబంధించిన అంశాలు జానపద గేయ సాహిత్యంలో కొల్లలుగా లభిస్తాయి-

**"కట్టు కట్టు బండి /కాడెడ్లా బండి /జోడెడ్లా బండి / గుంజు గుంజావోయ్ / రెండెడ్లా బండి/ వస్తవా పిల్లా -ఓ రాములమ్మా/సీరె గట్టిన దాకా/ సింగులు పోసినదాకా/ బండి ఆపర పిల్లగా -ఓ రాములయ్యా.."** అంటూ, ఈ విధంగా కొనసాగే బండ్ల పాటలు అరమరికలు లేని జానపదుల ఉత్సాహానికి ప్రతీకలుగా నిలిచి, జాతర ప్రాధాన్యాన్ని పరోక్షంగా తెలియజేస్తాయి .

**3. జాతరలు - వైవిధ్యాలు:** వేలాది జనానికి భక్తినీ ఉత్సాహాన్నీ పంచి ఇచ్చే జాతరను గూర్చి శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువు 'దేవత- తీర్థము- పర్వతము-సముద్రము మొదలగు వానిని గూర్చి చేసే ప్రయాణం' అనే అర్థాలను ఇచ్చింది.

**3.1 దేవతా సంబంధాలు :** శైవ వైష్ణవ మతాలకు అతీతంగా నిలిచి, మతసామరస్యాన్ని పాటించిన కాకతీయులు తమ పాలనలో దేవాలయాలను అత్యధికంగా నిర్మించారు. కేవలం వరంగల్ జిల్లాలోనే వీటి సంఖ్య 13,600. వీటిలో మైలార దేవుని పేరిట ఉన్నవాటి సంఖ్య 2400 (ఈ గణాంకం 1977 సంవత్సరం నాటిది). ఈ మైలారు దేవాలయాలన్నీ జానపదులకు ప్రత్యేకమై, వారి ఆదరాభిమానాలను అధికంగా దోచుకున్నట్టివే - వీటిలో నేటికీ తన ఉనికిని స్థిరపరచుకొని, ప్రాచీన కవుల కావ్యాల్లోనూ, చారిత్రక పరిశోధకుల రచనల్లోనూ చోటుచేసుకుని, జానపదుల జాతర స్థలంగా ప్రసిద్ధి పొందింది- అయినవోలు మల్లన్న జాతర.

**మైలారు దేవుడు - అయినవోలు మల్లన్న: "...ఓరుగంటి దక్షిణాన అ/య్యనవ్రోలి తీర్థన్ స్వామియైన శ్రీ మైలా/ర దేవరను దరిశిన్ చి.."** (హైదరాబాదు ఆర్కియలాజికల్ సిరీస్ నెంబర్ 19-వరంగల్-1) అని, రాచకొండ పద్మనాయక ప్రభువు అనపోత నాయకుని (క్రీ.శ.1361-84) జైత్రయాత్రను అయినవోలు శాసనం పేర్కొన్నది. ఇందులో అతడు అయినవోలు తీర్థ స్వామి అయిన మైలార దేవరను దర్శించిన విషయం తెలుపబడింది. 'తీర్థం' అనేది తెలంగాణాలో 'జాతర'కు మారుగా ప్రయోగింపబడే పదం.

వరంగల్ పట్టణానికి 22 కిలోమీటర్ల దూరంలో ఈ 'అయినవోలు' గ్రామం ఉంది. పూర్వం నుండీ ప్రతి సంవత్సరం, సంక్రాంతి నుండి ఉగాది వరకు ఇక్కడ జాతర జరుగుతోంది. కాకతీయ సామ్రాజ్యంలో 11 వ శతాబ్దం మొదట్లో మంత్రిగా ఉన్న 'అయ్యన్నదేవుడు' ఈ దేవాలయాన్ని నిర్మించాడని చరిత్రకారుల నిర్ధారణ. ఆయన పేరు మీద వెలసిన ఈ అయ్యనప్రోలు దేవాలయంలోని మల్లికార్జున స్వామి ఆరడుగుల ఎత్తు ఆకారంలో ఉంటాడు. కుడి చేతిలో పొడవైన కత్తి, ఎడమ చేతిలో త్రిశూలం, మెడలో నాగు పాముతో పాటు వజ్రాలు పొదిగిన ఆభరణాలు అతనికి అలంకారాలుగా ఉంటాయి. వెడల్పాటి కళ్లు, గడ్డం, అర్ధచంద్రా కృతిలో వంకీలు తిరిగిన మీసాలతో దుష్ట

శక్తులకు అతి భీకరంగా కనిపిస్తాడు. ఓరుగల్లు కాకతీయ రాజులు, రాచకొండ పద్మనాయక ప్రభువులు ఇతన్ని పూజించారు. శ్రీనాథకవి సార్వభౌముడు (క్రీ.శ.1370-1450) కూడా **"భైరవుని తోడి జోడు మైలార దేవు/ ఓరుగంటి నివాసి మేలొసగుగాక!"** అని, సర్వ జనావళికి తన క్రీడాభిరామ కావ్యం ద్వారా ఈ దేవుని ఆశీస్సులను ఇప్పించాడు. సామాన్య జానపదులవే కాక, సామ్రాజ్య నిర్మాతలైన ప్రభువుల పూజలను కూడా ఈ మైలార దేవుడు అందుకోవడంలో ఓ విశేషం ఉంది.

'పూర్వ యుగంలో స్కందుడు లేక కుమారస్వామి యుద్ధ వీరులకు ముఖ్య దైవంగా ఉన్నట్లు, క్రీ. శ. 11వ శతాబ్దం తర్వాత మైలారదేవుడు శివుని అవతారంగా వీరులచే ఆరాధింపబడినాడు. కాకతీయులకు ఓరుగల్లు సమీపంలో కొండపర్తిలో మల్యాల సామంతుల కింద ఒక సైనిక శిబిరం ఉండేది. వారి కొరకు ఆ సమయంలోనే అయ్యనప్రోలులో మైలార దేవుడు, శివుని అవతారంగా ప్రసిద్ధి పొంది వీరులచే ఆరాధింపబడుట విశేషంగా కనిపిస్తుంది'. (డా పి.వి. పరబ్రహ్మ శాస్త్రి- విజ్ఞాన సర్వస్వం- మొదటి సంపుటం). **'అయిలోని మల్లన్న మైలార దేవా- పాపాల నెడబాపి మమ్ము కాపాడు'** అని, అయిలోని క్షేత్రంలో మల్లన్న స్వామి భక్తులు పారవశ్యంతో చేసే నినాదం, ఎన్నో ఏళ్లుగా ఈ గుడి ఆవరణలో మారు మ్రోగుతోంది.' అయిలోని' అని జనులు పిలుచుకునే ఈ గ్రామం అసలు రూపం 'అయినవోలు'. ఇది 'అయ్యనప్రోలు'కు అపభ్రంశ రూపం. ఇక్కడి స్వామిని 'మల్లన్న దేవుడు, మైలార దేవుడు' అని స్థానికులు పిలుస్తారు. ఇవి 'మల్లికార్జున స్వామి'కి 'మలహరుడు' అయిన శివునికి వ్యావహారిక రూపాలు కురుమ కులస్తురాలైన 'మేడలమ్మ', గొల్ల కులానికి చెందిన' కేతమ్మ' అనే స్త్రీ మూర్తులు ఇరుపక్కలా ఉండటం వల్ల, ఇతడు కులాతీత దైవంగా నేడు అశేష జానపదులను ఆకర్షిస్తున్నాడు. నుదుట పసుపు, చేతిలో త్రిశూలంతో భక్తి పారవశ్యం ముప్పిరిగొన్న భక్తులు -ఢమరుకం, బాకాలు, కాళ్ళగజ్జెల ధ్వనులతో ఇతని గుళ్లోకి ప్రవేశిస్తారు. శివసత్తులు (శివశక్తులు) ఒంటికి పసుపు, చేతిలో కొరడా, గజ్జెలు కుట్టిన అంగి, నెక్కరుతో గుడి ప్రాంగణంలో కలియ తిరుగుతారు. మేకలను కట్టిన చిన్న రథంలో దేవుని ప్రతిష్టించి, గుడి చుట్టూ రథాన్ని తిప్పుతారు. పిల్లలు పుట్టాలని కోరుకునే స్త్రీలు తడి బట్టలతో గుడి గోడలకు ఆనుకొని దేవున్ని ప్రార్థిస్తారు. దీనినే పంబతి (పబ్బతి) పట్టడం అంటారు. ఇది ఒక ఆచారం. గొల్లలకు వారి సంప్రదాయానుసారంగా పసుపుతో పూజా కార్యక్రమాలను నిర్వహించేందుకు, ఒగ్గు పూజారులు ప్రత్యేకంగా ఉంటారు. వీరు భక్తుల కోరిక మేరకు రంగురంగుల పట్నాలతో దేవుణ్ణి ప్రతిష్టిస్తారు- **"గొరగయై మైలారు కొనియాడు వేల/ నొసలి పై బండారు పసుపు దాల్చి"** అని, మహానందుడు అనే బ్రాహ్మణుని గూర్చి శ్రీనాథుడు, తన కాశీఖండం (7-233)లో పేర్కొన్నాడు. ఈ వర్ణనలో శ్రీనాథునికి అయిలోని మైలారుని యొక్క గొల్ల పూజారుల ఆచారాలే స్ఫురణకు వచ్చి ఉంటాయి. ఈ విధంగా - ప్రాచీనమైన మైలారుగుళ్ళు కాకతీయుల ఏలుబడిలో వేలకొద్దీ ఉన్నట్లు చరిత్ర చెప్పింది. వాటిలో నేటికీ అశేష ప్రజానీకాన్ని ఆకర్షిస్తూ మైలారు జాతరలుగా పేరుపొందిన వాటిలో ఈ అయినవోలు పేర్కొన తగింది .

**3.2 తీర్థ సంబంధాలు :** 'తీర్థం' అనే మాట 'జాతర'కు మారు రూపమే కాదు, పుణ్యక్షేత్రానికి, పుణ్య నదికి కూడా సమానార్థాలను ఇస్తుంది. 'నది' శబ్దం స్త్రీవాచక సంబంధమై, శక్తి స్వరూపాలైన గ్రామదేవతల పరంగా కూడా నిలుస్తుంది. కాబట్టి జాతరల్లో తీర్థ సంబంధాలు 'జల' సూచకాలైన 'గంగమ్మ జాతర'లకు దగ్గరగా ఉంటాయి. గంగ దేవత ఆగ్రహ, అనుగ్రహ సమర్థురాలు. ఈమెను శాంతింప చేస్తూ ఉత్సవాల ద్వారా సత్కరించడం జానపదులు పనిగా పెట్టుకుంటారు. అందువల్ల ఈమెకు పూజలు మెండుగా జరుగుతాయి. పశుపంటల అభివృద్ధి, కుటుంబీకుల ఆరోగ్య పరిరక్షణ ఈమె పూజలకు సంబంధించిన ఫలితాలుగా జానపదులు భావిస్తారు.

శ్రీకాకుళం, రాయలసీమ ప్రాంతాల్లో ఈ గంగ జాతరల ప్రాచుర్యం ఎక్కువ. తిరుపతి క్షేత్రంలోని గంగ జాతర జగత్ ప్రసిద్ధం - తెలంగాణా ప్రాంతంలో సూర్యాపేట జిల్లా, నూతనకల్ మండలం, చిక్కమల్ల గ్రామంలోని గంగదేవమ్మ ఆలయంలో ఉగాది పండుగ రోజు జాతర జరుగుతుంది. **"ఆతతి తన్నగరీ పతి /జాతర సాటించె పశువిసరమనితర సా/ధ్యా తతవాతామయ నిర్ఘాతాహతి తూలగాలి గంగలకెల్లన్"** అని, గంగ దేవతకు జాతర చాటించడాన్ని తెనాలి రామకృష్ణ కవి (క్రీ. శ. 16వ శతాబ్దం) తన, పాండురంగ మాహాత్మ్యం కావ్యంలో పేర్కొన్నాడు. గంగమ్మ జాతర - గ్రామ జనాభా

సామూహికంగా జరుపుకునే ఉత్సవం కాబట్టి, గ్రామ పెద్దలు ఒక సమావేశం ద్వారా జాతర దినాన్ని నిర్ణయిస్తారు. చాటింపు ద్వారా జనానికి తెలియపరుస్తారు. ఈ చాటింపు అనేది– ఉత్సవాన్ని సూచించడమే కాదు, ఉత్సవాన్ని దిగ్విజయంగా జరుపుకునేందుకు తగిన ఉత్సాహాన్ని కూడా ప్రేరేపిస్తుంది– గృహాలు, పరిసరాల అలంకరణతో గ్రామానికి గ్రామమే పారిశుద్ధ్యంతో అలరారుతుంది.

ఇక, ఈ జాతర జరుపుకునే విషయాన్ని పరిశీలిద్దాం –మంగళవారం రోజున కుమ్మరి 7 గంగమ్మలను బంకమట్టితో తయారు చేస్తాడు. ఒక్కొక్క గంగమ్మకు 14 ఉప గంగమ్మలను త్రిభుజాకారంలో నిర్మిస్తాడు. దృష్టి దోషం తగలకుండా 'దిష్టి చుక్క'ను తీర్చిదిద్దుతాడు. వెండితో చేసిన కన్ను, ముక్కు, చెవులను చాకలి అమరుస్తాడు. తర్వాత వాటిని గంగమట్టి వద్దకు తీసుకువెళ్తారు. అక్కడ పంబలవాడు గంగమ్మ కథ చెప్తాడు. తర్వాత గంగమ్మకు కోడిని ఆహారంగా ఇస్తారు. ఏడు గంగమ్మలకు ఏడుగురు చాకళ్లు కుంభాలు పెడతారు. కుంభపు కూడుపై మునగాకు కూర, వంకాయ కూర, ఎండు చేపల పులుసు పెడతారు. ప్రతీ కుంభంపై పిండి దీపాన్ని వెలిగించి గొర్రెలను, మేకలను బలి ఇస్తారు. గంగ మిట్ట వద్ద గంగమ్మలకు కుంభం పెట్టే ఆచారం పూర్తవగానే తిరిగి వాటిని గ్రామంలోనికి తీసుకువచ్చి ప్రతిష్టిస్తారు. ఇది చాలా పెద్ద తతంగంతో కూడుకొని ఉంటుంది .

గంగమ్మ కొరకు ప్రతివీధిలో గుడిని నిర్మిస్తారు. ఈ గుడిని మాలవారు వేపాకులతో గాని, తడికలతో గాని నిర్మిస్తారు. నేలను అలికి ముగ్గులతో తీర్చిదిద్దుతారు. దీని వల్ల పరిశుభ్రతను పాటించడంతోపాటు, దేవత ఉండే చోటు గనుక స్థలానికి పవిత్రతను ఆపాదింప చేయడం జరుగుతుంది. ఏడుగురు చాకళ్లు ఏడు దాగెర్లలో గంగమ్మలను, ఉపగంగలను మేళ తాళాలతో గ్రామంలోకి తీసుకువస్తారు. గ్రామంలోని వీధి వీధిలో గంగమ్మలను ప్రతిష్ఠించటం, ఆ సందర్భంలో పంబలవాడు నిమ్మకాయలు కోసి, కోడి మెడను విరవటం, చాకలివాడు జంతువులను బలికి గురి చేయడం సర్వసాధారణమైన విషయం. ముత్యాలమ్మ గుడి ఉన్న వీధిలో ప్రతిష్టింపబడే గంగమ్మకు అన్ని విధాల ప్రాముఖ్యతను గ్రామస్తులు ఆరోపింప చేస్తారు. ప్రాచీనమైన గంగ జాతరను అత్యంత భయభక్తులతో జానపదులు జరుపుకునే విధానమిది. (డాక్టర్ యం. అండమ్మ జానపద సాహిత్యం– శక్తి పూజ అనే సిద్ధాంత గ్రంథం ఆధారంగా).

నీటిని దేవతగా భావించే జానపదులు నీటి అడుగులోని గంగమట్టినే గ్రామ దేవత గంగమ్మ స్వరూపం తయారు చేయడంలో ఉపయోగిస్తారు. ఈ విధంగా – గంగమ్మ జల సంబంధమై జలదేవతగా ఆకృతిని దాల్చింది. వ్యవసాయానికి, నిత్య జీవితానికి ఉపయోగపడే జలానికి ఈ విధంగా దేవతా స్వరూపం ఏతెంచి 'తీర్థం' అనే పవిత్ర నామం ఆపాదింప బడింది. నీరు మనిషికి ఆహారాన్ని ఇవ్వడమే కాదు, మనిషి ఆరోగ్యాన్ని కూడా పరిరక్షిస్తుంది, అని జానపదుల నమ్మకం. అందుకే తీర్థక్షేత్రాలలోని జల ప్రవాహాల్లో, మడుగుల్లో, కోనేరులలో స్నానం చేయడాన్ని జానపదులు విధిగా పాటిస్తారు. జాతర సందర్భనలో ఒక భాగంగానే భావిస్తారు. ఇదే విషయం– **"శరీరంలో గల జాడ్యమూలెల్ల – పరిహారమూ చేయు నామడుగు జలము"** అని, 'కాళింగమడుగు' అనే జానపద గేయంలో ప్రస్తుతింపబడింది. "ఏ ఏ దేశములను చరించితిరి మీరే గిరులు చూసినా/రే తీర్థములందు క్రుంకిడితిరి .." **"పోయి సేవింప లేకున్న పుణ్య తీర్థ / మహిమ వినుటయు నఖిల కల్మషహారంబు"** అని, అల్లసాని పెద్దన (క్రీ.శ. 15 –16 శతాబ్దాల నడిమి కాలం) మన చరిత్రలో తీర్థ సంబంధమైన ఉత్సవాలను కీర్తించి, వీటికి గల విశేష ప్రాధాన్యాన్ని వివరించాడు .

ఈ పుణ్యతీర్థాలలోని జలానికి ఈ విధంగా స్వరూపాన్ని దిద్దిన జానపదులు, వారి వారి ప్రాంతీయ నామాలతో వాటిని మాతృదేవతలుగా కొలిచి జాతరలు జరిపారు. అందులో–గంగమ్మ జాతర ఒకటి. ఈ గంగమ్మ పంచభూతాలలోని నీటికి ప్రతిరూపం, అంతేకాదు– మాతృస్వామ్య వ్యవస్థకు ప్రతీక. అందుకే– **"అమ్మా రావమ్మా ఆరి గంగమ్మ/ అపరంజి కుందనమే బంగారు బొమ్మ/ నీ బిడ్డలమమ్మా నీ పాపలమమ్మాత మమ్ము రక్షింపవే సురలోకమాతా"** అంటూ, జానపదులు ఆమెను కీర్తిస్తూ తమ జన్మను సార్థకం చేసుకుంటారు .

*(ఇంకా ఉంది)*

**ఆచార్య తంగెడ కిషన్ రావు**
పూర్వ వైస్ ఛాన్సలర్, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం,
హైద్రాబాద్, ఫోన్ : 7702414100

# తాళ్లపాక వారి రచనలు - సామాజిక విశ్లేషణ

– డా. కె. భాను నాయక్



తాళ్లపాక అన్నమాచార్య

**ఉపోద్ఘాతం :** తెలుగు సాహిత్యంలో పదసాహిత్యానికి మూలపురుషుడు అన్నమయ్య, తాళ్ళపాక వంశస్తులు 15వ శతాబ్ది ప్రారంభం నుంచి దాదాపుగా 16 శతాబ్దం వరుకు తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామికి సంగీత సాహిత్య సుకృతులతో కీర్తించి అర్చించారు. అన్నమాచార్యుల సంకీర్తన భాంఢారంలోని రాగిరేకుల పరిశోధన ద్వారా తెలుస్తుంది. 1992 సం నాటికి 32 సంపుటలు ముద్రించారు. అన్నమాచార్యులు వేంకటాచలపతి భక్తుడు. స్వామి వారికి భాగవత సంప్రదాయాలకు ధూపదీపాలంకార నైవేద్యోపచారములకు, పవళింపు సేవ, దివ్యనామ కీర్తనలకు ఇతడే మార్గదర్శని పేర్కొంటారు.

అన్నమయ్య రచనలు జీవితంపై పరిశోధనలు చేసి చాగంటి శేషయ్య, వేటూరి ప్రభాకర శాస్త్రి గార్లు పరిశోధలు చేసి 1408 నుంచి 1502 మధ్య వాడుగా కాల నిర్ణయం చేశారు. అన్నమయ్య తాతలనాడు కాపురం ఉన్నది తాళ్ళపాకలో అందుచేత తాళ్ళపాక వారి ఇంటి పేరు అయింది. నందవరీక బ్రాహ్మణులు భారద్వాజ గోత్రులు, విష్ణు భక్తులు.

**ఈ పత్రసమర్పణ ఉద్దేశం :** తాళ్ళపాక వారి రచనలలో సామాజికాంశాలను పరిశీలించడం. వారు రచించిన గ్రంథాలలో ఆయా సమకాలీన సాంఘిక పరిస్థితులు వాడుక భాషా ప్రయోగాలు, నుడికారాలు, పలుకుబడులు, సామెతలు, జాతీయాలు, సర్వసాధారణంగా ప్రతిఫలిస్తాయి. తాళ్ళపాకవారు మార్గదేశి ద్విపదలో రచనలు చేయడంతో దేశీయ పదాలకు ప్రాధాన్యత యిచ్చారు. వాగ్గేయకారుడు అన్నమయ్య పద సాహిత్యాన్ని ప్రజలలోకి తీసుకెళ్ళాడు. తాళ్ళపాకవారి కులదైవం శ్రీ వెంకటేశ్వర స్వామి. ఆయన మీద ఉన్న అపారమైన భక్తి శ్రద్దలతో స్వామిని కీర్తిస్తూ అనేక రచనలు చేశారు. ఆయా రచనలలో సామాజిక, రాజకీయ, అంశాలకు ప్రాధాన్యత యిచ్చారు.

**తాళ్ళపాక వారి మూల పురుషుడు అన్నమయ్య వారి వంశావళి పరిశీలిద్దాం :** 1 తిమ్మక్క– అన్నమాచార్య భార్య, 2. పెదతిరుమలయ్య అన్నమయ్య రెండో భార్య కొడుకు 3. చినతిరుమలయ్య అన్నమయ్య మనవడు, పెద తిరుమలయ్య పెద్దకొడుడు. 4. పెదతిరువెంగళాచార్యులు పెదతిరుమలయ్య మూడో మనవడు. 5. చినతిరు వెంగళనాథుడు, పెదతిరుమలయ్య నాలుగో కొడుకు. 6. తిరువెంగళప్ప చినతిరుమలయ్య కొడుకు 7. శ్రీనివాసుడు అన్నమయ్య మూడోతరం మనవడు. వీరికి వెంకటాచలపతి అంకితం చేశాడు.

**తాళ్ళపాకవారి రచనలు ముద్రణతో అందుబాటులోనికి వచ్చినవి :** ఆధ్యాత్మిక శృంగార సంకీకర్తనలు ద్విపద – చిన్నన్న 2. అన్నమాచార్యుల చరిత్ర చిన్నన్న 3. అష్టమాహిషి కళ్యాణం ద్విపద చిన్నన్న 4 . పరమయోగి విలాపం ద్విపద– చిన్నన్న 5. సుభద్రాకళ్యాణం –ద్విపద– తిమ్మక్క, **2 లఘుకృతులు :** 1 శృంగారమంజరి 2 చక్రవాకమంజరి 3.నీతిశతకం 4. వెంకటేశోదాహరణం 5. సుదర్శన రగడ 6. రేఫఱకారములు 7.శృంగార దండకం 8.వైరాగ్య వచన మాలికా గీతములు 9. శృంగార వృత్తపద్యాల శతకం 10. సంకీర్తన లక్షణములు 11. అష్టభాషాదండకం. మొదలైన రచనలు చేశారు.

తాళ్ళపాక వారు ద్విపద పద్య, అనేక రచనలు చేశారు. పాల్కురికి సోమనాథుని తరువాత ద్విపద సాహిత్యంలో ఎక్కువగా రచనలు చేసింది తాళ్ళపాక కవులు. ద్విపద కావ్యాలు, పద్యాలు, శతకాలు, కృతులు, లఘు కృతులు, సంకీర్తనలు, రచనలు చేసి తెలుగు సాహిత్యానికి ఎనలేని

సేవ చేశారు. తాళ్ళపాక వారు రచనలు అముద్రగా ఉన్నాయి. తామ్ర శాసనాలు మీద ఉన్న పదాలు కొన్ని పరిష్కారం కాలేదు. సుప్రసిద్ధ పరిశోధకులు వేటూరి ప్రభాకర శాస్త్రి, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, వాటిని పరిష్కరించారు. బాలంతరపు రజనీకాంతం గారు అన్నమయ్య కీర్తనలకు బాణీలు సమకూర్చారు. అన్నమయ్య పదసాహిత్యం సామాన్య జనజీవనంలోకి వెళ్లిపోయింది. తాళ్ళపాక వారి పదప్రయోగాలు గ్రామ్యాలు, పదబంధాలు, పలుకుబడులు, నుడికారాలు జాతీయాలు, సామెతలు, సమకాలిన పదాలు, సామాజికాంశాలు వీరి రచనలలో ప్రతిఫలిస్తాయి.

**తాళ్ళపాకవారి రచనలలో ప్రతిఫలించిన సామెతలు, జాతీయాలును పరిశీలిద్దాం.**

**సామాజికాంశాలు-విశ్లేషణ –**

- **అందని మాను ఫలంబలు –** వైకుంఠుని నుతియించని వినుతులు వననిధిఁ గురిసిన వానలు ఆ కమలోదరుఁ గోరని కోరికలందని మాని ఫలంబులు (1-7)
- **అడవి గాసిన రిత్తవెన్నల–**యీ తలనిదిమాని మరెన్ని పుణ్యాలు సేసినా రీతి నడవిఁగాసిన రిత్తవెన్నల నుండి (8-169)
- **అరచేతిమణి–**అట్టెతొల్లిటివారి అరచేతి నిమ్మపండు (14-79)
- **అరచేతి మోక్షము–** గరిమ మా పుట్టుగు నీ గర్భ వాసము లోనే అరయ మా మోక్షము నీ అరచేతిదే (17-512
- **ఆటలో బ్రహ్మణుడు–**అన్ని కర్మములుఁజేసి ఆటలో బ్రహ్మణుఁడైతి నన్ని వేదములనేటి అంగడివీది. (6-6)
- **ఆవుకొంటే ఆవువెంటదూడ–** ఆకడ నావుఁగొంటే నావు వెంట దూడయును జోకలఁగోన్నట్టి వారి సొమ్మేకదా (17-126)
- **ఈల కూరకు ఉప్పుచాలదు –** అయ్యరో నీవేకాదు ఆలినొల్లనివారు వొయ్యనే యీలకూరకు ఉప్పు చాలదందురు (6-50)
- **కంచము లోపలికూడు –** ముంచిన వేడుక తోడ మెక్కుట గాక కంచములోపలి కూడు కాలఁదన్న నేఁటికే (5-322)
- **కన్ను మూయ ప్రొద్దు లేదు కాలుచాచ ఇమ్ము లేదు(5-67)**
- **గతిలేనికూటికి కన్నదే కూడు–**పతిలేని భూమికి బలవంతుడే రాజు (6-63)
- **చేసిన కూలికి జీతము సరి–పూసిన కర్మభోగము సరి (9-277)**

**పలుకుబడులు పద ప్రయోగాలు :**

- **అంగడిపడు –** ఆవల భయపడ్డవా రంగడిఁబడితూ దొర (15-231)
- **అంటుముట్టు –** దంటనై నేఁజలపట్టి దగ్గర కుందాననా అంటుముట్టు గలదాన నాడనుంటి నేను (15-125)
- **ఇంటిలోన పంట –** అరుదై తూరుపుఁ గొండనారఁగ బండిన పంట (11-47)
- **ఇంటివేలుపు –** కంటిమి నేఁడిదే గరుడాచలపతి యింటివేలుపగు యీశ్వరుఁడితడు (11-209)
- **ఊదుచు –** అభయ మభయము శ్రీ యాదినారాయణ ఉభయకర్మము నాకు నూదుచుట కొరకు (11-121)
- **ఎసపెట్టు –** కపురు, మొకదాకిరి గడించ నీకు వచ్చునా (17-577)
- **కడజన్మ –** కడలేని నీభక్తి గలిగితేనే చాలు కడజన్మ మయినా నిక్కపు విప్రకులమే (10-128)
- **కీలుబొమ్మ–**పరమాత్ముని నాత్మభావములో కీలుబొమ్మ(14-8)
- **కోమటిమేనరికము –** వోలిసీ నొల్లనిఁవాడ వూరకే ఆసియ్య నేల పొలసి అప్పుడే నన్నుఁబొమ్మనరాదా కులికి నేఁ గొసరఁగఁగోమటి మేనరికమా (17-305)
- **గడి దొంగ–**దొంగను నాతోడి దొంగలు మీరు (14-230)
- **గాలిచాప–**కడుఁజంచలములనే గాలి చాప లెత్తినాఁడా (4-156)
- **చయ్యాట–**చయ్యాట లిన్నియు మాని చవిసేసుక పొదిగి (17-77)
- **చిల్లరైనయిల్లు–**చిల్లరైనయిల్ల మా యింటఁజేసిన (6-60)
- **చేవసంసారము–**మోవరాని మోపయిములుగనియ్యదు మమ్ము (9-63)
- **జనవేషము–**జవేషమేడ పారిజాతము దెచ్చినదేడ (7-195)
- **నాగేటి వేగిలి –** రాసికెక్కె మునులకు రచ్చెన పొలము (10-520)
- **నవ్వులుచేయు–**ఎవ్వరికైనను యీ వ్రాతఁ నను నవ్వులు సేసెఁబో నా వ్రాంత (5-136)
- **నిండునిదానము–**దండితోడ నీ మాయదాఁటే యందు కుపాయము (7-100)
- **పతివాది–**యెదుట మాకల్లా నిజమేరుపరచఁగ వచ్చి అదె పతివాది వయ్యే వప్పటి నీవు (17-237)
- **బారివిద్యలు –** పాపపుణ్యములు రెండు బారివిద్య లుఁడగాను (10-190)
- **మట్టులేని మంత్రము –** పుట్టిన జన్మము పావనమైతే మట్టులేని తిరుమంత్రము దొరకు (9-389).

తాళ్ళపాక వారి పద సాహిత్యంలో జానపదుల వెన్నెల పదాలు, తుమ్మెద పదాలు, గొబ్బెమ్మ పదాలు ప్రతిఫలిస్తాయి. అద్యాత్మిక పదాలతోపాటు తోక వ్యవహారంలో ఉన్న పదాలు వీరి రచనలలో తారసపడతాయి.

**అన్నమయ్య..కీర్తన : బ్రహ్మ ఒక్కడే పరబ్రహ్మ ఒక్కడే / తందనానా పురి తందనానాపురె.../ నిండార రాజునిద్రించు నిద్రయు నొక్కటే / అండనే బంటు నిద్ర అదియునొక్కటే / మెండైన బ్రహ్మణుడు మెట్టు భూమి యొక్కటే......**

రాజు పేద , ఛండాలుడు , బ్రహ్మణుడు భగవంతుణ్ణి దృష్టిలో బేధం లేదని దేవుని దృష్టిలో అందరూ సమానులే అనే భావమును ప్రచారం చేశారు.

**తాళ్ళపాక అన్నమాచార్య సంకీర్తన :**

**పల్లవి : తలగరో లోకులు తడవకురో మమ్ము / కలిగిన దిది మా కాపురము**

**చ॥ నరహరి కీర్తన నానిన జిహ్వ/వోరుల నుతింప వొప్పదు జిహ్వ/ మురహరు పదముల మొక్కిన శిఖరము/ తలగకురో లోకులు తడవకురో మమ్ము/ కలిగిన దిది మా కాపురము.......**

**శ్రీరాగం. అన్నమాచార్య కీర్తన.**

**తలమేల కులమేల తపమే కారణము/ యెలమి హరిదాసులు ఏ జాతియైన నేమి...../వియె తొల్లిటి వారు యెంచి నడచినదే శాంతి / వివరించి కొలిచితే విష్ణుడే శాంతి గుణాతీతుండౌట శాంతి.**

సామాజిక అసమానతలు-మనుషుల మధ్యే ఈ విబేధాలు. ఏ కులమైతే ఏమి? భగవంతుణ్ణి సేవించడానికి అని ప్రశ్నించాడు. భక్తి చైతన్యమునకు ఒక స్ఫూర్తినిచ్చాడు.

**భూపాళ: పోయిన బంధమటు పోవుగాక ఛీ యని రోసి యెంగిలి చేకొనేదా.... విధమయ్యేదా.** మొదలైన వాటిలో సామాజిక అంశాలు కనిపిస్తాయి.

తాళ్ళపాక వారి రచనలలో అనేక సామాజిక అంశాలు ప్రతిఫలిస్తాయి. పలుకుబడులు నుడికారాలు, సామెతలు, జాతీయాలు, పదబంధాలు, అధ్యాత్మిక పదాలు, సామాన్యుల పదజాలం వారి రచనలలో ప్రతిఫలిస్తాయి. ఈ పరిశోధన పత్రంలో కొన్నింటి మాత్రమే పరిచయం చేశాను. తాళ్ళపాక వారి రచనల మీద అనేక పరిశోధనలు జరుగుతునే ఉన్నాయ. తెలుగు సాహిత్యంలో తమదైన ముద్ర వేశారు. వీరికి వెంకట చలపతి ఆరాధ్య దైవం. స్వామి వారి మీద రచనలు చేసి స్వామికే అంకితం చేశారు.

**డాక్టర్ కె. భాను నాయక్,**
తెలుగు అధ్యాపకులు,
ఎస్.ఎస్&ఎన్. కళాశాల, నరసరావుపేట,
పల్నాడు జిల్లా. ఫోన్ : 91821 46646

## కమ్మతెమ్మెర

**జూ**లై '**మిసిమి**' సరికొత్త శీర్షిక ద్వారా ప్రతిభావంతులైన మహనీయులను స్వయంగా వెళ్ళి వారి వారి రంగాలలో చేసిన - చేస్తున్న కృషిని పాఠకులకు అందించి యింతంత గొప్పవాళ్ళున్నారా! అంటూ ఆశ్చర్యచకితుల్ని చేస్తున్నారు. తత్త్వమసి రామకృష్ణగారు, కథా, నవలా సాహితీమూర్తి శ్రీ వివినమూర్తి, ఆకాశవాణి కందుకూరి సూర్యనారాయణ గార్ల గురించి చదువుతూ ముగ్ధుణ్ని అయ్యాను. వారు ప్రతిభతో జాతికి సేవలందించి ధన్యత పొందారు. **మిసిమి** ద్వారా పాఠకులలో చైతన్యమే కల్గిస్తున్నారు. కురువృద్ధులు పతివాడ సూర్యనారాయణ గారి గురించి ఐ.వి. రామరాజు గారు అద్భుతమైన భావ పదంపదలో ముంచెత్తారు. శ్రీ సూర్యనారాయణ గారితో మీ యింటర్వ్యూ చదవాలని మనసు తహతహలాడుతున్నది.



శ్రీ రామవరపువారు 'రాణి చంద్రాయమ్మ' చరిత్ర విజయనగరం, పెద్దాపురం సంస్థానాలను శత్రువులను ఎదిరించి - అవసరమైన సందర్భాల్లో రాజీపడటం - రాణి నిశిత మేధాశక్తి చదువుతూంటే పాఠకులు ఉత్తేజితులవుతారు. రామవరపువారు గత చరిత్రను తవ్వి తలకెత్తుతున్నారు. శతకకర్త తప్పులెన్నువారు తమ తప్పులెరుగలేరయా! అన్నాడు. తప్పులెన్నువారు చాలా ముచ్చటైన రచన. నిమ్మగడ్డ వారు ప్రపంచ యాత్రికుడు. ఏ దేశం వెళ్లినా అక్కడ వాతావరణం, అందమైన ప్రాంతాలు, బస చేసిన హొటల్సు, ఆహారవిహారాలు, చరిత్రా వివరిస్తూ పాఠకుణ్ని కూడా తనచేత్తో పట్టుకుని చూపిస్తుంటారు. గొప్ప రచన. ప్రతి రచనా గుండెను పట్టుకుంటుంది. ఆలోచింపజేస్తుంది. మనసులో అనిర్వచనీయమైన శాంతి కల్గిస్తుంది. భారతి కదలాడుతుంది మనసులో.

*- చెరుకువాడ వెంకటరామయ్య, విస్సాకోడేరు, ఫోన్ : 9542118184*

# ఖాళీసీసాలు

**– స్మైల్**

నేను 1960, ఏలూరులో ఎస్.ఎస్.ఎల్.సి చదువుతున్నప్పుడు నాకు మూడేళ్ళు సీనియర్ స్మైల్. స్మైల్ కలం పేరు. అసలు పేరు ఇస్మాయిల్. నా క్లాస్‌మేట్ శేషాచల శాస్త్రి అన్నయ్య దీక్షితులకి క్లాస్‌మేట్ ఇస్మాయిల్. వాళ్ళింటికి తరచూ వచ్చేవాడు. అప్పటికే, ఇలస్ట్రేటెడ్ వీక్లీ, ఇతర ఇంగ్లీషు పత్రికలు, ప్రపంచవ్యాప్త వార్తల గురించి మాట్లాడుతుండేవాడు. జీవితంపట్ల తన అమిత ఆసక్తి ఆ మాటల్లో ఉండేది. నేను అప్పటికి రాసే కుతూహలం ఉన్నవాణ్ణే తప్ప, రచయితను కాలేదు. నాకప్పుడు పద్నాలుగేళ్ళు. అప్పట్నించీ నలభై ఏళ్ళ పైగా స్మైల్‌తో స్నేహం నాకు. చాలా కొద్దిగానే రచనలు చేశాడు స్మైల్. కథలు ఇంకా తక్కువ. తను రాసిన కథే ఖాళీ సీసాలు. ఆ రోజుల్లో ఆ కథ పెద్ద సెన్సేషన్. ఆ తర్వాత అంతా స్మైల్ అనగానే ఖాళీసీసాలు కథ అని ముద్ర పడిపోయిన కథ.


ఖాళీసీసాలు కథ చిన్నదే, కాని అందులోని జీవితం అనంతం. ఏ జబ్బుతో తీసుకుంటోందో తెలియని తల్లి గవర్నమెంట్ హాస్పిటల్‌లో. ఆవిడకి మందు పోయించటానికి ఖాళీసీసా కావాలి. అది అతని దగ్గర లేదు. పాతికేళ్ళ అతను పేదరికంతో నలభై ఏళ్ళ వాడిలా ఉన్నాడు అన్న ఒక్క వాక్యంతో పరిస్థితినంతా చెప్పగలిగేడు స్మైల్. అతని దగ్గర పదిహేను పైసలే వున్నాయి. హాస్పిటల్ బైట మురిక్కాలవ పక్కన ఖాళీ సీసాలు అమ్ముతున్నారు పైడి, నూకాలమ్మ. ఆరణాలు చెప్పి పావలాకిస్తానంది పైడి. అటు తిరిగిన అతన్ని పిలిచి బేడకే ఖాళీ సీసా అంది నూకాలు. లాభం ఉండి కాదు. పొద్దున్నుంచీ టీ నీళ్ళక్కూడా గతిలేని పిరిస్థితివల్ల. పదిహేను పైసల అతను బేదేవేపే మొగ్గాడు. ఖాళీ బతుకుల ఖాళీ సీసాల పోటీ. అంతటితో ఆగలేదు. నాబేరం పోగొట్టావ్ నంజ అని చిరతపులిలా నూకాలమ్మ మీదకి దూకింది పైడి. నువ్వే నంజవని హుంకరించింది నూకాలు. మాటా మాటా పెరిగింది. చేతులు లేచాయి. కలబడ్డారు. కొప్పు బాధ తట్టుకోలేక పైడి నూకాలు చీర లాగేసింది. దాంతో నూకాలు పైడి చీర గుంజేసింది. ఇద్దరు వొంటిమీద గుడ్డల్లేని ఆడాళ్ళు. యుద్ధం అయ్యాక గెలిచిందాన్లా, మురిక్కాలవ పక్కన పడిన పైడి చీర లంకించుకుని పారిపోయింది నూకాలు. ఎంతటి హీనాతిహీనమైన స్థితిలో వున్నా పైడి ఆడతనం ఆగలేకపోయింది. సిటీబస్ ముందు టైర్ల కిందపడి చచ్చిపోయింది.

పేదతనం, అందులోని కచ్చి, పశుబలం ఇద్దరాడాళ్ళని వాళ్ళ ఆడతనం దాటేలా చేశాయి. నగ్నంగా నడివీధిలో నిలబెట్టాయి. పేదపోటీకి సిగ్గుని దాటి, ఒంటి స్పృహను మరిపింప చేసే శక్తి వుందని స్మైల్ నిరూపించిన కథ ఖాళీ సీసాలు. పేదరికమే కాదు, సరైన వైద్యం అందని రోగులు, మురిక్కాలవ పక్కన బేదాలు, పడుపు బ్రతుకులు ఇలా ఎన్నెన్నో, ఎన్నోరకాల జీవితాలున్న కథ. తీసుకున్న వస్తువు, ఎత్తి చూపిన సంఘటన, రాసిన శైలి అప్పటికే కాదు, ఇప్పటికీ యునీక్. ఈ కథలో ఫస్ట్‌పెర్సన్, థర్డ్‌పర్సన్, చైతన్య స్రవంతీ.... ఇలా పలు రీతులున్నాయి. అయినా ఏమాత్రం గందరగోళం లేదు. ఏ వాక్యానికి ఆ వాక్యం సుస్పష్టం. నేటితరం రచయితలు ఈ విషయం కోసమేనా ఈ కథ చదవాలి.

తోటి జీవితాల దైన్యం, వెలుగులోకి రావాలి అని ఒక ఉద్యమంలా కథలు వచ్చిన ఆ కాలానికి మకుటం లాంటి కథ. ఈ కథలోని కొన్ని మాటలు, వివరణలు కొన్నివేల జీవనసమం. అక్షరం కూడా వదలకుండా చదవాల్సిన కథ.

వి. రాజారామమోహనరావు
ఫోన్ : 9394738805

**పెద్దకొడుకు - వారణాసి భానుమూర్తి :** ఇది కథల సంపుటి. రచయిత వ్యక్తిత్వం సృజనాత్మకత, తాత్త్వికత, ప్రతిభ చాలా కథల్లో ప్రతిబింబిస్తుంది. మనుషుల్లోని కపట విలువలు, కులమత తత్త్వాలు, అహంకార అవినీతి వీటన్నింటిని ఆయన అద్దంలో చూపినట్లు చూపుతారు. మనం కూడా ఒకసారి చదివి తెలుసుకుందాం. ఇందులో 19 కథలున్నాయి. ఒక్కో కథ మానవ సంబంధాల మాధుర్యం, పల్లె స్నేహాలు, పండుగలు, బంధుత్వాలు.. ఇలా అనేక దృశ్యాలను మన ముందుంచుతారు రచయిత. వీరి రచనాశైలి చాలా సహజంగా ఉంటుంది.




***పేజీలు : 173, వెల : 250, ప్రతులకు : వారణాసి భానుమూర్తి రావు, ఫోన్ : 9989073105 & అన్ని పుస్తక కేంద్రాలలో లభించును.***


# ఆటుపోట్లతో రాటుదేలిన కావేరి

– డా. సగిలి సుధారాణి

**ఆ**త్మవిశ్వాసం అనేది మనిషికి అత్యంత ముఖ్యమైంది! అదిలేకుంటే గడ్డిపరక కూడా నిన్నుచూసి వెక్కిరిస్తుంది! ఆత్మస్థైర్యంతో ఉంటే ఆ గడ్డిపరకే నీకు ఆయుధం అవుతుంది! ఆత్మ విశ్వాసంతో ముందుకెళ్తే మృత్యువుకూడా నీ దరికి చేరాలంటే భయపడ్తుంది!

ఒకస్త్రీ విద్యావంతురాలైతే తన కుటుంబాన్నే కాదు, సమాజాన్నే వెలిగిస్తుంది అన్నమాట కాబే(వే)రి చటోపాద్యాయ విషయంలో అక్షరసత్యం. కాల్పనికత, దాపరికాలు లేకుండా నిర్మొహమాటంగా, నిజాయితీగా కొండంత తన జీవితాన్ని ఆంగ్లంలో చిన్న పుస్తకం Peeping Through my WINDOW ద్వారా అద్దంలా చూపింది రచయిత్రి. నిజంగానే ఆమె జ్ఞాపకశక్తి అమోఘం! చిన్నప్పటి సంగతులు మొదలు, మొన్న మొన్న జరిగిన సంగతుల వరకు దొంతరులుగా పేర్చి కూర్చింది. చిన్న చిన్న విషయాలకే క్షణికావేశంతో తమ జీవితాలను అంతం చేసుకొనే యువతరానికి కాబే(వే)రి జీవితం స్ఫూర్తిదాయకం! ఈ పుస్తకం మానసికస్థైర్యాన్ని అందించే ఒకదివ్య ఔషధం.

అక్షరాలా నాలుగువేల పుటలతో ఏడురాయల్ సైజ్ సంపుటాల్లో తమ సమగ్ర సాహిత్యాన్ని వెలువరించిన నిత్యపరిశోధకులు, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వెలుదండ నిత్యానందరావు గారు శ్రీమతి కావేరీచటోపాధ్యాయ ఆంగ్లపుస్తకాన్ని చక్కటి తెలుగులో 'ఆటుపోట్ల కావేరి'గా అనువదించారు. ఇది వారి మొట్టమొదటి తెలుగు అనువాద రచన కావడం విశేషం! తెలంగాణలో నిత్యానందరావు గారు, అస్సాంలో కావేరి గారు నాలుగేళ్ళ తేడాతో పుట్టారు. నెల, రోజు, సమయం వీరి ఇరువురివి ఒక్కటే కావడం విశేషం! కావేరి గారి వివాహ దినోత్సవంనాడు ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని తన స్వగృహంలో ఏర్పాటు చేసి మిత్రులకు విందుభోజనాలు పెట్టి వెలుదండ తన ఆత్మీయ సోదర ప్రేమను చాటుకొన్నారు.




వంగదేశ సాంప్రదాయకుటుంబంలో పుట్టిన కావేరి తాను పసిబిడ్డగా ఉన్నప్పుడు కుటుంబంలోని వారు ఏవిధంగా మురిసిపోయారో చెబుతూ, అమ్మనోటి వెంబడి రవీంద్రనాథుని మధుర గీతాల ఆలాపనలతో.... ఎన్నో నీతి, సందేశాత్మక కథలు వింటూ...పెరిగిన తనకు బెంగాలీ సాహిత్యం పట్ల చిన్ననాటినుండే ఆసక్తి కలిగింది. పాఠశాలలో చదివే రోజులలో తల్లి సాన్నిహిత్యంలో ఆడపిల్ల సమాజంలో ఎంతభద్రంగా మసలుకోవాలో చెప్పిన తల్లి అనారోగ్యం పాలుకావడంతో, కొంత గందరగోళానికి గురిచేసినా, మలవిసర్జన, పక్కబట్టలు మారుస్తూ తానే అమ్మకు అమ్మైంది. తండ్రి తన జీవితంలో కథానాయకుడని, వృత్తిరీత్యా ఆచార్యులు కావడం మూలంగా ఉన్నత స్థానంలో ఉండే ఆయనచేసే ప్రసంగాలు వింటూ.... తాను స్ఫూర్తిని పొందింది. అమ్మనాన్నలు పాటించే జీవితపు విలువలు, హితబోధలు తనకు దారిచూపాయి. కావేరి జీవితంలో కష్టాలు, కల్లోలాలు, ఆటుపోట్లు ఏవిధంగా ఎదుర్కొని రాటుదేలి తన జీవిత నావను నైపుణ్యంగా ఎలా నడుపుతూ సాగిపోయిందో.... తెలియజేసింది.

వేసవి సెలవులలో నాన్నమ్మ ఊరిలో గడిపిన మధురమైన జ్ఞాపకాలు....ఆనాటి సమాజంలోని పల్లెల్లో అనుసరించే ఆచారవ్యవహారాలు.... మోసకారితనానికి తావులేకుండా శ్రమైకజీవనాన్ని గడిపే పల్లీయుల జీవితాలు ఉత్తమమైనవి అంటారు కావేరి. అయితే అదే సమయంలో చిన్నతనంలోనే వైధవ్యం ప్రాప్తించినవారి దయనీయ స్థితిని కళ్ళకు కట్టింది. మూఢాచారాల మూలంగా అనారోగ్యం

పాలైన తమ్ముడికి అక్కగా అక్కున చేర్చుకొని ప్రేమానురాగాలు కురిపించి మామూలు స్థితికి తీసుకొనిరావడానికి అహర్నిశలు పాటుపడింది కావేరి. తాను ప్రేమించే వ్యక్తికన్నా తనని ప్రేమించే వ్యక్తి దొరకడం అదృష్టం! దీపక్ కుమార్ చటోపాధ్యాయ గారు చేసుకొంటే ఇటువంటి అమ్మాయినే చేసుకోవాలని కావేరిని ఏరికోరి పెండ్లి చేసుకొన్నారు. వివాహానంతరం విద్యను కొనసాగించడం ఆకాలంలో గొప్పవిషయం! అటువంటిది అధ్యాపకవృత్తిలో ఆనందంగా సాగిపోతున్న తన జీవిత నావను ఒక్క కుదుపుకుదిపింది క్యాన్సర్ భూతం. తాను సుడిగుండంలో చిక్కుకొంటున్నానని ఒక్క క్షణం అన్పించినా ఆమె జడవలేదు! అంధకారం అవుతున్న జీవితనౌకకు తన భర్త దారిదీపమై నిలిచారు. "ఏం బాధ పడకు! అంతా సవ్యంగా జరుగుతుంద"ని భరోసా ఇచ్చారు. ఈ మాటలే కాంతిరేఖలై తనకు బలాన్ని, శక్తిని ఇచ్చాయి. సాధారణ జీవితానికి స్వస్తి పలికి, తనను తాను మానసికంగా సిద్ధ పరచుకొంది. కుటుంబం అండదండలతో పాటు తాను పనిచేసే పాఠశాలలోని అధ్యాపకులు, విద్యార్థుల సానుకూల స్పందనలు మెండుగా చేకూరాయి కావేరికి. రేడియేషన్, కీమోథెరఫీలకు రంగురంగుల చీరలు కట్టుకొని చక్కగా ముస్తాబై ఆత్మవిశ్వాసంతో వెళ్ళేవారట! కావేరిని చూసి, రోగికి తోడుగా వచ్చిన వారని భ్రమపడి తనను లోపలికి నర్సులు అనుమతించక పోవడంతో తన గుర్తింపు కార్డు చూపి లోపలికి వెళ్ళవలసి వచ్చేదట! శస్త్రచికిత్సలతో తన శరీరాన్ని కుళ్ళబొడిచినా ధైర్యం, నిర్భయత్వం ఆయుధాలుగా, ఆత్మవిశ్వాసమే బలంగా దిగ్విజయంగా కేన్సర్ కోరల నుండి బయటపడింది. నిండైన కురులు ఆస్తిగా ఏ భారతీయ స్త్రీ అయినా భావిస్తుంది! ఆ మహమ్మారిని ఎదుర్కోవాలంటే కొన్ని దుష్పరిమాణాలు ఎదుర్కోక తప్పదు! రేడియేషన్ ప్రభావంతో జుట్టు ఊడిపోయి తలబోడైనా, తన తలపులు బోడికావనుకొంది! తన తలను చూసి అమాయకపు బాలిక ముఖంలా ఉందని మురిసిపోయిందట! ఆశావహ దృక్పథానికి మించిన శక్తివంతమైన ఆయుధం మరొకటి లేదంటుంది కావేరి. ఇక్కడ చెప్ప వలసిన మరో ముఖ్య విషయం ఇతరులను చూసి తాను స్ఫూర్తి పొందడంతోపాటు తన తోటి రోగుల్లో కూడా జీవితం విస్తారమైనదని, వైవిధ్యభరితమైనదని కావేరి ఆత్మస్థైర్యాన్ని నింపింది. రామకృష్ణ పరమహంసలాంటివారు కూడా క్యాన్సర్ బారినపడి బయటపడినవారే! ఏ వ్యాధైనా మనిషిని పూర్తిగా చంపలేందు! మనస్సును భయంతో దెయ్యాల కొంపలా కాకుండా, ప్రశాంతమైన దేవాలయంగా ఉంచుకోవాలి అంటుంది కావేరి గారు.

సాధారణంగా ఎవరికైనా కేన్సర్ ఉందని తెలియగానే మానసికంగా సగం చచ్చిపోతారు. ఎందుకు ఆ భగవంతుడు నా తలరాత ఇలా రాశాడో అని.... తన జీవితానికి తీరని అన్యాయం చేశాడని..... కృంగిపోతారు. దీనికి ప్రధాన కారణం చలన చిత్రాలలో 'కేన్సర్' అంటే గోరంతలు కొండంతలుగా చూపిస్తూ, అటువంటి జబ్బు బారినపడిన వారు జీవిత చరమాంకంలో ఉన్నట్లు చిత్రీకరిస్తారు. దానితో చూసే ప్రేక్షకుల బుర్రల్లో 'క్యాన్సర్' అంటే ఒక భూతంగా ముద్ర పడిపోయింది. నేటి ప్రపంచీకరణ నేపథ్యంలో వైద్యరంగంలో కూడా ఎన్నో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. అత్యాధునిక వైద్య విధానాలయిన ఇమ్మినోథెరఫీ, రోబోటిక్ సర్జరీ, లేజర్ సర్జరీలు కనుగొన్నాక కేన్సర్ చికిత్స మరింత సులభతరమైంది. సానుకూల దృక్పథంతో క్యాన్సర్‌ను ఎదుర్కోవచ్చు! "నేను చెయ్యగలను నాకే సాధ్యం!" అనేవి ఆమెలో స్ఫూర్తిని కలిగించే మాటలు. కావేరి తన ఆత్మానుభవ కథనంతో కూర్చిన Peeping Through my WINDOW ఆంగ్ల పుస్తకాన్ని 'ఆటుపోట్లకావేరి'గా తెలుగులోనికి అనువదించి తెలుగుపాఠకలోకానికి పరిచయం చేసిన ఆచార్య వెలుదండ నిత్యానందరావు గారు అభినందనీయులు. ఈ పుస్తకం ఎంతోమందికి స్ఫూర్తిని కలిగిస్తుంది అనడంలో ఎటువంటి సందేహంలేదు.

*పుటలు-109-వెల-300, ప్రతులకు-విరాసత్ ఆర్ట్ పబ్లికేషన్స్- కలకత్తా, పార్థో ప్రతిమ్ రాయ్ మేనేజర్ ఫోన్ నెం. 9339826158 917003634823, నవోదయ బుక్ హౌస్, హైదరాబాదు, ఫోన్.నెం.9247471362*


**డా. సగిలి సుధారాణి**
పరిశోధకురాలు, రచయిత్రి
హైదరాబాద్, సెల్:94904 28825

# కాశీ కలైడోస్కోప్

గత రెండేళ్లుగా '**మిసిమి**' మాసపత్రికలో ప్రచురిత మవుతున్న ఆత్మీయ మిత్రులు కిల్లాడ సత్యనారాయణ గారి వ్యాసాలు చదివాను. ఇవన్నీ ఒక పుస్తకంగా వస్తే బాగుండు అనుకునేలోపే వారు ఫోన్‌చేసి 'బహుముఖ బనారస్' పుస్తకం వస్తోందని చెప్పారు. శివునాజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు, శివానుగ్రహం లేనిదే బహుముఖ బనారస్ పుట్టదు. బహుశః హరిహరతత్త్వాన్ని మరోసారి ఎరిగింప చేయడానికేమో శివుడు ఈ కార్యాచరణకు సత్యనారాయణ గారిని ఆదేశించారు. ఇటీవల మాన్యులు మాజీ ఉపరాష్ట్రపతి శ్రీ వెంకయ్య నాయుడుగారు ఆ పుస్తకాన్ని హైదరాబాద్ దసపల్లా హోటల్లో ఆవిష్కరించిన సందర్భాన రచయిత చేవ్రాలుతో ఒక కాపీ సంపాదించి చదివాను. ఆయన పుస్తకాన్ని అంకితమిస్తూ...

**'జననమరణాల మధ్య ప్రవహిస్తున్న చైతన్యాన్ని అనుభవంగా ప్రసాదించిన ..కాశీవిశ్వనాథునికి'**

అని అనడంతో ఫిదా అయిపోయా. సత్యనారాయణ గారు చిన్నప్పుడు నర్సీపట్నం బయోస్కోపులో 'కాశీపట్నం చూడర బాబు' ఎన్నిసార్లు చూసారో గానీ ఈ పుస్తకంలో కాశీనగరాన్ని కలైడోస్కోప్‌లో తిప్పితిప్పి చూపించారు. ముందుమాటలో పుస్తక రచనకు ప్రేరణను తెలియజేస్తూ రచయిత కాశీని ఆసక్తితో చూడాలని ఎంచుకున్నారు అని, కాశీనగర వైశిష్ట్యాన్ని ఎలా తెలియ చేయబోతున్నారో అన్న ఉత్కంఠను రేకెత్తించారు. క్షీరసాగర మథనంలో ఒక్కొక్క దశలో ఒక్కొక్కటి ఉద్భవించినట్లు ఆసక్తికర కాశీనగర మేధోమథనంతో లౌకిక, చారిత్రక, సామాజిక, ఆధ్యాత్మికమైన బహుముఖీన పార్శ్వాలను పాఠకులకు సీట్‌బెల్ట్ బిగించి మరీ రోలర్ కోస్టర్ రైడ్ చేయించారు. ప్రథమాంకంలో కాశీనగర ప్రాబల్యంతో మమేకమైన ఆదిశంకరుల వాదనలతో శ్రీకారం చుట్టి ప్రారంభించి శంకర కృపకు పాత్రులయ్యారు. 'కాశీజ్ఞాన యోగులు' చాప్టర్‌ను ఆరంభిస్తూ, 'మేఘాల్లో రథం మీద ప్రయాణిస్తున్న చంద్రుడిలా, గంగానదిపైన బ్రిడ్జి మీద వెళు తున్న రైలు. ఈ బ్రిడ్జి మీద మరో బ్రిడ్జి, దానిపైన చంద్రుడి వెనుక కదులుతున్న నక్షత్రాల్లా వేగంగా పరుగెడుతున్న వాహనాలు. రైల్లోనుంచి గంగవైపు తొంగి చూస్తున్న వాహనదీపాలు ... మొత్తం దృశ్యం ఆకాశం గంగ మీదుగా వాలినట్లుగా ఉంది.' అని గంగాప్రవాహంలా సాగిపోతుంది. ఇది చదివిన ఎవరికైనా రచయితలోని కవే ఎక్కువగా కనిపిస్తాడు. కబీరు, రవి దాసుల ప్రతిభను స్తుతిస్తూ "కబీరు, రవి దాసుల కవిత్వం సమాజ పునాదుల మీద నిలబడితే, తులసీ కవిత్వం సంస్కృతి పునాదుల మీద పెరిగింది." అని వారికి సరళంగా ఘన నీరాజనాలనిచ్చారు. 'అంతరించిపోతున్న అగ్నిహోత్రులు' అన్న చాప్టర్ ఆరంభంలో "బనారస్ హిందూ యూనివర్సిటీకి దగ్గరలో ఆకుపచ్చ చీరతో నేలను కప్పినట్లు లాన్, చిరునవ్వుతో పలకరిస్తున్న పూలచెట్లు.




కళాహృదయంతో కట్టిన భవనాలు. జ్ఞానంలాగా ప్రవహించాలని చెబుతున్న గంగా" అని కవితావేశంతో మనల్ని లాక్కెళతారు. ఔరంగజేబు కుమారుడు దారాషికో సంస్కృతం నేర్చుకోవడానికి కాశీ చేరుకున్నాడన్న సంగతి చదివి సంభ్రమాశ్చర్యానికి గురయ్యాను. ఈస్టిండియా కంపెనీ రెసిడెంట్ ఓనాథన్ డంకన్ కాశీలో సంస్కృత కళాశాలను 1791లో ప్రారంభించాడన్న విషయం చదివి ముగ్ధుడనయ్యాను. సంస్కృతభాషలో క్రికెట్ ఆడుతూ, సంస్కృత కామెంట్రీనిస్తున్న ఏకైక నగరం కాశీనే అని తెలుసుకొని మురిసిపోయాను. కాశీ సంగీత విద్వాంసుల జీవితచిత్రాలను పరిచయం చేస్తూ రచయిత 'టీ' అమ్ముతూ ఠుమ్రీలు పాడే రసూలన్‌బాయి గొప్పదనాన్ని గుర్తుచేస్తారు. ఠుమ్రీని విశ్వసంగీత ప్రపంచానికి చేర్చిన సిద్దేశ్వరీదేవి దగ్గర భారతరత్న ఎమ్.ఎస్ సుబ్బలక్ష్మి భజనలు పాడటం నేర్చుకున్నారన్న విషయం అబ్బురం. దక్షిణ భారత సంప్రదాయంలోని దేవదాసీల్లా ఉత్తర భారతదేశంలో తవైఫ్‌లు సంగీత ప్రపంచాన్ని అత్యంత సారవంతం చేసారు. సంగీతంతో పాటు సభ్యత కూడా నేర్చుకునేందుకు సంపన్నులు సైతం వారి పిల్లల్ని వీరి వద్దకు పంపేవారని తెలుసుకుని మనకు ఆశ్చర్యం కలగక మానదు. తవైఫ్‌లు స్వాతంత్ర పోరాటంలో పాల్గొనేందుకు తమ ఆస్తులను, ప్రాణాలను పణంగా పెట్టడం కంటనీరు తెప్పిస్తుంది.

కాశీకి ప్రత్యేకమైన ఠలువా (హాస్య) కబ్‌ల సభ్యులను గురించి ప్రస్తావిస్తూ 'ఏ ఇజానికీ లొంగని నిజాలు వీరు. ఠలువా ఆకలికి లొంగడు. అవసరం ముందు వంగడు. ఆత్మాభిమానాన్ని అమ్మడు... వాళ్ళు బైరాగి మనసు కలవాళ్ళు' అని రచయిత వారి హృదయావిష్కరణ చేస్తారు. ఠలువాక్లబ్‌ల మీద చేసిన పరిశోధనకు రెండు డాక్టరేట్ల ప్రదానం జరిగిందంటే వాటికి అప్పట్లో ఎంత గొప్ప రేటింగ్ ఉందో అర్థమవుతుంది. రచయిత బనారస్ టాంగా వాలాల మూలాలనూ వెలికితీసారు. ఆ రోజుల్లో కాశీలో జరిగే గుర్రపు బండి పోటీల గురించి ఎన్నో ఆసక్తికరమైన విషయాలు ప్రస్తావించారు. బెనారస్ విశ్వవిద్యాలయ స్థలసేకరణ, స్థాపన, అభివృద్ధిని ఆయన ఎంతో ఆసక్తిగా మన కళ్ళకు కట్టినట్లు చూపించారు. పండిట్ మదన్‌మోహన్ మాలవ్యా అకుంఠిత దీక్ష, కృషి, పట్టుదలతో బెనారస్ విశ్వవిద్యాలయం ప్రపంచ ప్రసిద్ధి నొందింది. అక్కడి హైదరాబాద్ నిజాం కాలనీ పుట్టుపూర్వోత్తరాలు ఎంతో థ్రిల్లింగ్‌గా అనిపిస్తాయి. కవి గాలిబ్‌కు, కాశీ నగరం పట్ల ఉన్న అవ్యాజ ప్రేమను రచయిత వర్ణించిన తీరు అద్భుతం. గాలిబ్, కాశీ పర్యాయపదాలే అనిపిస్తుంది.

**హర్షవర్ధన్**
పూర్వ రాష్ట్ర కమర్షియల్ అధికారి
హైదరాబాద్, సెల్: : 9949992880

## మంచి పది పుస్తకాలు

**ఇ**టీవలే మంచి పుస్తకం –తానా ప్రచురణలు సంయుక్తంగా పది పుస్తకాలను పిల్లల కోసం విడుదల చేశారు. ఇవి వారు నిర్వహించిన పోటీలో ఎంపికైన రచయితల పుస్తకాలు.. ఇందులో ఐదు పుస్తకాలు పిల్లల బొమ్మల కథలు, మరో ఐదు పుస్తకాలు పది సంవత్సరాలు దాటిన పిల్లల కోసం రాసినవి. ఇవి కాకుండా ఇంకో రెండు పుస్తకాలు మంచి పుస్తకం వారు ప్రచురించారు. మొత్తం పన్నెండు పుస్తకాలు పిల్లల బొమ్మల కథల పుస్తకాలు.




**<u>నేను –నా సైకిల్:</u>** ముంజులూరి కృష్ణకుమారి గారి రచన.పి.ఎస్.బాబు బొమ్మలు వేశారు.సైకిల్ తొక్కడం నేర్చుకున్న ప్రతిఒక్కరికీ ఒక కథ ఉంటుందంటారు రచయిత్రి.. అలాంటి అనుభవాన్ని అనన్య అనే చిన్నపిల్ల ద్వారా చెప్పిస్తారు..

**<u>నాకు నిద్ర రావటం లేదు:</u>** పిల్లలకు చదువొక్కటే చాలదు, చుట్టూ ఉన్న ప్రపంచం గురించి నేర్పాలంటారు ఈ పుస్తక రచయిత రవితేజ బొప్పూడి. రచయితే చిన్నపిల్లగాను, ఆ పిల్లతండ్రి గాను రెండు పాత్రలు పోషించి చెబుతారు. శ్రీకాంత్ వేసిన బొమ్మల్లో బాల్యం తొంగి చూస్తుంటుంది

**<u>దొంగ భడవ:</u>** డా.జాస్తి శివరామకృష్ణ రచన..ఆరేళ్ల రోహిత్ ప్రపంచంలో మనల్ని తిప్పి తీసుకొస్తారు రచయిత. దుంద్రపల్లి బాబు ఆ ప్రపంచానికి చక్కటి రంగులద్దారు.

**<u>అమ్మ ఏమీ అనలేదు:</u>** పిల్లల ఆలోచనలు చిత్రవిచిత్రంగా ఉంటాయి. వాటిని రచయితలే పట్టుకోగలుగుతారు.అలాంటి ఒక ఆలోచనకు సున్నితమైన కథను సృజించారు రచయిత్రి జె.వి.ఎస్.లక్ష్మి. వారికి బొమ్మలతో తోడుగా నిలిచారు బొడ్డు సాయి మౌనిక.

**<u>ఇదే నిజం:</u>** అవ్వా తాతలతో సమయాన్ని గడిపే పిల్లలు, జీవితాన్ని ఎదుర్కోవటం కూడా నేర్చుకుంటారు అంటారు రచయిత శాఖమూరి శ్రీనివాస్ ఈ పుస్తకంలో షయోని గీసిన బొమ్మలు బాల్యపు అడుగుల్లా అలరిస్తాయి..

**పదేళ్లు దాటిన పిల్లల కోసం ఐదు పుస్తకాలు విడుదల చేశారు..అవేమిటంటే**

**<u>మునికిష్టడి మాణిక్యం:</u>** ఆర్.సి.కృష్ణస్వామి రాజు గారి రచన. పిల్లలకో ప్రపంచం ఉంటుంది. ఆ ప్రపంచంలో వారీడువారే ఉంటారు. ఒకసారి ఆ ప్రపంచంలో ప్రవేశించి చూడండంటారు వారు.తిరుపతి యాసతో పాటు, ఆ పరిసరాలను పరిచయం చేస్తారు మనకు గోపాలకృష్ణ వేసిన బొమ్మలు ఆకతాయి పిల్లల అన్వేషణలా ఉంటాయి.

**<u>అలీబాబా, ఐదుగురు స్నేహితులు:</u>** డా.ఎం. సుగుణారావ గారి రచన పెద్దలు వృద్ధాప్యంలో చిన్నపిల్లలై పోతారంటారు. అలాంటిదే ఈ రచన. ఒక అడ్వెంచర్ సృష్టిస్తారు కథాక్రమంలో. సందర్భోచితంగా జి.శ్రీనివాస్ బొమ్మలు పలకరిస్తాయి.




**<u>జాను అనే నేను,నా స్నేహితురాళ్ళు:</u>** పేట యుగంధర్ రచన. ఆడపిల్లంటే కాస్త వివక్ష ఉన్న కుటుంబంలో పుట్టిన జాను చదువులో ముందుంటూనే స్నేహితురాళ్ళతో చేసే సందడిలోనే సమస్యలను ఎదుర్కోవడం గమనిస్తాం. కాస్త పెద్ద నవల ఈ పుస్తకం.కధనానికి సరిపోయేట్టుగా శ్రీరాగ బొమ్మలు ఉన్నాయి.

**<u>చతుర్ముఖం:</u>** కొంత వైజ్ఞానిక కల్పన, కొంత పరిశోధన, కొంత పిల్లల ముందు చూపు,మరికొంత పల్లెల్లో వ్యవసాయం కలగలిపి చతుర్ముఖం నవలగా అందించారు రచయిత శాఖమూరి శ్రీనివాస్.పిల్లలకు థ్రిల్లర్ నవల అనుభూతి కల్పించారు.చందు గీసిన బొమ్మలు అదనపు ఆకర్షణగా నిలిచాయి.

**<u>మనకు మనుషులు కావాలి:</u>** ఇప్పటి పిల్లలకు కూడా కృత్రిమ మేథ అంటే అర్థమయిపోతోందని రచయిత పాణ్యం దత్తశర్మ బలంగా నమ్మి సహజ అనే అమ్మాయికున్న సందేహాలను కథగా మలిచారు.అబ్దుల్లా గీసిన బొమ్మలు బాగున్నాయి.

*పై పుస్తకాలను మంచి పుస్తకం –తానాప్రచురణలు సంయుక్తంగా నిర్వహించిన పోటీలో బహుమతులు పొందిన పుస్తకాలు. ఈ పుస్తకాలన్నింటికి ఒకటే ధర నిర్ణయించటం విశేషం..ఒక్కో పుస్తకం యాభై రూపాయలు..*


***పుస్తకాలు కావలసినవారు : మంచి పుస్తకం ప్రచురణ, ఫోన్ : 9490746614 సంప్రదించవచ్చు..***

*- **సి.యస్.రాంబాబు,** (అసిస్టెంట్ డైరెక్టర్, ఆకాశవాణి ; రిటైర్డ్)*

# చదవండి...


– మిసిమి

📖 **చిట్టి కథలు - చోడా సాంబశివరావు :** కథలు చెప్పుకోవటం నలుగురు స్నేహితులు కూర్చుని నవ్వుకోవటానికి, అదే పంతులు గారు చెబితే ఏదో నీతిని బోధించటానికి, అదే పెద్దలు చెబితే రామాయణ భాగవతాల్లోని నైతికతను, అదే గురువులు చెబితే అర్ధ, కామ, మోక్షాల గురించి వివరించటం ఉంటుంది. మనకు నీతికథలు మిత్రలాభం, మిత్రభేదం పేరుతో జంతువులు, పిట్టలు పాత్రలుగా ఎప్పట్నుంచో ఉన్నాయి. ఏవిషయమైనా కథ రూపంలో చెబితే వింటారు, ఎంతోకొంత వంట పట్టించుకుంటారు. ఈ చిట్టికథలు కూడా పెరిగే పిల్లల కోసం, పెరగని పెద్దల కోసం చెప్పినవే.




పేజీలు : 116, వెల : 140, ప్రతులకు : చోడా సాంబశివ రావు, ఫోన్ : 9848021382

📖 **గీతా సూక్తులు - తెలుగు, ఆంగ్లము - హిందీ - బాలస్వామి, బాలనారాయణ, రాజలింగం:** "గీ అనగా వాక్కు, త అనగా నిశ్చయం. కనుక గీత శబ్దానికి నిశ్చయాత్మకమైన వాక్యం అని అర్థం. మనకేదైనా సందేహం కలిగినపుడు పెద్దవారు అందుకు పరిష్కారంగా చెప్పే మాటలనే గీతలంటారు. ఈనాడు మనకు గీతావాఙ్మయం అపారంగా ఉంది కాబట్టి, ఈ తాత్పర్యాన్నే మనం చెప్పుకోవలసి ఉంటుంది" అంటారు కపిలవాయి లింగమూర్తి. ఎప్పుడో అయిదువేల ఏండ్ల పూర్వం శ్రీకృష్ణపరమాత్మ అర్జునునికి చేసిన కర్తవ్యబోధ ఈ భగవద్గీత. అది ఆనాటి నుండి ఈనాటి వరకూ అన్నితరాలను ఆకర్షిస్తూనే ఉంది. ఈ పుస్తకం ముగ్గురు లబ్ధప్రతిష్టులు మనకు మూడు భాషలలో అందించారు.





పేజీలు : 208, వెల : 300, ప్రతులకు : డా. బి. బాల్‌నారాయణ, ఫోన్ : 9440834632

📖 **పగిలిన జీవ కలలు - ఎస్.ఆర్. పృథ్వి:** వీరు అయిదు దశాబ్దాల నుంచి సాహిత్యసేవ చేస్తూనే ఉన్నారు. ఎన్నో పురస్కారాలు పొందారు. సాహిత్యంతోపాటు సాంఘిక సేవలోనూ ఉన్నారు. ఇప్పుడు ఈ దీర్ఘ కవిత రాసి ఆయన బాధను మనకందించారు. "...మనిషిగా పుట్టాక జీవితం ఎక్కడో ఒకచోట ఆగిపోవల్సిందే కదా!...."





పేజీలు : 24, వెల : 50, ప్రతులకు : శ్రీమతి పి. ఉషారాణి, ఫోన్ : 9989223245.

📖 **మదనాగమము - అజ్ఞాత కర్తృకము - సంపాదక అనువాదం - భాగవత రామారావు :** మానవ జననమునకు ముందు వెనుకలు చర్చించి అనుశాసించేది కామశాస్త్రము. కామమనగా విషయాశక్తమానసులగు స్త్రీ, పురుషులకు పెంపు మీరిన ఇంపొసగెడు ఒకానొక రాపిడి. తొలి కళాప్రపూర్ణ వేదం వెంకటరాయశాస్త్రి గారు ఇచ్చిన వివరణ.





*పేజీలు : 78, వెల : 150, ప్రతులకు : బి.వి.ఎస్. మూర్తి, ఫోన్ : 9440915210*

📖 **కళ్యాణ గీతికలు - డా. కపిలవాయి లింగమూర్తి:** ఈ పద్యాలన్నీ రచయిత మిత్రులు, సన్నిహితుల పిల్లల వివాహ వేడుకలకు వెళ్లినప్పుడు ఆశీఃపూర్వకంగా రాసినవి. ఈ సంకలనాన్ని ముద్రింప ఉద్దేశ్యం ఆయా భార్యాభర్తలకు తమ వివాహ వేడుకలు మరొక్కసారి మధుర జ్ఞాపకాలుగా గుర్తుచేసేందుకే. అనురాగముతో, ఆనందముతో/ మనసులు కలిసిన మార్గముతో/ వినముతో వివేకముతో/ ఆనందము చెదరని అణుకువతో/ప్రణయం పండుగ పరువంతో/గుణగణములనిడి కూర్మలతో... సంతోషముగా జీవించాలని ఆశీర్వదించారు.





*పేజీలు : 96, వెల : 100, ప్రతులకు : కపిలవాయి అశోక్‌బాబు, ఫోన్ : 8790727772,*

**వ్యాస మందారం - డా. బొడ్డుపల్లి కాళిదాసు :** ఈ పుస్తకం బొడ్డపల్లి కాళిదాసు గారి కుటుంబం ఎంతో శ్రమకోర్చి మనకందిస్తున్నారు. బొడ్డుపల్లి వారి వంశ చరిత్ర కూడా క్లుప్తంగా ఇచ్చారు. ముఖ్యంగా వీరు ఆధ్యాత్మిక జగత్తులో వికసించిన ధృవతార. మాతాపితరుల సేవలో తరించిన ముద్దుబిడ్డ. ధార్మిక సమాజసేవా నిరతిలో నిరంత కృషీవలుడు. దైవచింతనలో తపస్వి. మానవసేవే మాధవసేవగా యెంచిన సేవాదురంధురుడు. పేదల పాలిటి పెన్నిధి. ఇన్ని మంచి గుణములు ఉన్న వ్యక్తి రాసిన వ్యాసాలు కూడా మంచిగానే ఉంటాయి. ఈ వ్యాస మందారాన్ని ఒక్కసారి ఆఘ్రాణించి చూడండి.





*పేజీలు : 166, వెల : 100, ప్రతులకు : డా. బి. కాళిదాసు, ఫోన్ : 9652808040, అన్ని పుస్తక కేంద్రాలలో లభిస్తాయి.*

**యద్భావం తద్భవతి - ఆధ్యాత్మిక కథలు - ఆర్.సి. కృష్ణస్వామి రాజు :** జీవన తాత్త్వికత సత్యాలను మనిషి జరిపే సత్యశోధనను ఎంత సంపద ఉన్నా హారతి కర్పూరంలా కరిగి పోవడంలాంటి పచ్చినిజాలను, నీతి నియమాలను, మనిషి యోగక్షేమాలను అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్లు ఈ కథల ద్వారా కృష్ణస్వామి తెలియజేస్తారు.





*పేజీలు : 136, వెల : 160, ప్రతులకు : ఆర్.సి. కృష్ణస్వామి రాజు, ఫోన్ : 9393662821*

**వెన్నెల గింజలు - కవితా సంపుటి - చిట్టిప్రోలు సుబ్బారావు :** ఇందులో అధికభాగం రచయిత లోనైన పరిస్థితులు, చూసిన సన్నివేశాలు, ప్రదేశాలు, ఆయన చదివిన పుస్తకాల్లో పాత్రల వలన కలిగిన కదలికలు ఇలా చెప్పుకుంటూ పోతే చాలా ఉన్నాయి – ఆ విధంగా రచయిత ఈ వచన కవితలు రాసి ప్రపంచం మీదకి వదిలారు. అయితే ఎవరనుభవం వారిది. ఇవి చదివితే ఆయన చెందిన అనుభూతిని మనం పొందాలని, పొందుతామని గ్యారంటీ ఏమీ లేదు.





*పేజీలు : 270, వెల : 200, ప్రతులకు : చిట్టిప్రోలు సుబ్బారావు, ఫోన్ : 9701049000*

**ఋగ్వేదానికి రాహుల్ గ్రహణం - రచన - డా. చిల్లావూరి శివరామకృష్ణ శర్మ:** ఈ పుస్తకానికి పుష్పగిరి మహాసంస్థాన పీఠాధిపతి జగద్గురు శ్రీశ్రీశ్రీ విద్యానృసింహ భారతీస్వామి వారు ముందుమాట రాసారు. దీనినిబట్టే ఈ పుస్తకం యొక్క ప్రాముఖ్యతను మనం గ్రహించవచ్చు. ఇది ముఖ్యంగా రాహుల్ సాంకృత్యాయన్ రాసిన దివోదాసు పరిశీలన, ఋగ్వేద రిఫరెన్స్ అంతా తప్పులతడకని, వేదాలకు కాలనిర్ణయం చేయటం ఆయనవల్ల కాలేదని విశదపరచటమే శివరామకృష్ణ శర్మ గారి ఉద్దేశ్యం.




*పేజీలు : 72, వెల :100/-, ప్రతులకు : డా. సి హెచ్. శివసాయి సుబ్రహ్మణ్యం, ఫోన్ : 9963455584, నవోదయ బుక్ హౌస్, ఫోన్ : 9848787284*

**శిలాక్షరాలు - సంపాదకత్వం - శీలా సుభద్రాదేవి:** శీలా వీర్రాజు ఫాంట్‌తో తొలి కవితా సంకలనం. రెండువందల యాభై కవితలను ఎంపిక చేసి ఈ సంకలనంలో ముద్రించారు. అయిదు తరాల కవుల్ని ఇందులో పొందుపరిచారు. తెలుగు కవిత్వం సామాజిక జీవితాన్ని స్పృశించడం ప్రారంభించాకే తెలుగు కవికి కాలస్పృహ పట్ల శ్రద్ధ పెరిగింది. నిజానికి కాలానికి, కవిత్వానికి దగ్గర సంబంధం ఉంది. కవిత్వానికి, సమాజానికి అలాంటి సంబంధమే ఉంది. వచన కవిత్వానికి ప్రోత్సాహం, ప్రచారం కల్పించినవాడు కుందుర్తి. ఆ కవిత్వంవైపు ఆకర్షించిన వాడు శ్రీశ్రీ. ఇలాంటివన్నీ ప్రస్తావించి ఇందులోని కవితలను ఎంపికచేసి ఎంతో శ్రమపడిన శీలా సుభద్రాదేవిగారిని ప్రశంసించాలి.




*పేజీలు : 269, వెల :300/-, ప్రతులకు : శ్రీమతి శీలా సుభద్రాదేవి, ఫోన్ : 8106883099*

# మిసిమి
మాసపత్రిక

**మీరు చందాదారులుగా చేరండి    బహుమతిగా పంపండి**

ప్రియమైన పాఠకులకు ఒక సూచన : **మిసిమి** మాస పత్రికను పంపిణీ చేస్తున్న కొందరు పుస్తక విక్రేతలు సొమ్ము పంపని కారణంగా వారికి పత్రికను పంపడం ఆపేస్తున్నాము. విజ్ఞులైన పాఠకులు **మిసిమి** ని వార్షిక చందాలు పంపి పొందవలసిందిగా మనవి.
మీ చిరునామా వివరాలు మాకు ఫోన్ (994 951 6567) లేదా ఇ-మెయిల్ (misimi90monthly@gmail.com) ద్వారా తెలియజేయండి. మీరు ఇచ్చిన చిరునామాకు నెలనెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం.


**A/C Name : Misimi  A Unit of Kalajyothi Process P Ltd.**
**HDFC Current Account No. 50200091136242**
**IFSC Code : HDFC0000472**

**చందా వివరాలు:**
₹ 600/- (సంవత్సర చందా),
₹1200/- (రెండు సంవత్సరాలకు),
₹1800/- (మూడు సంవత్సరాలకు),
**Scan QR to Pay**
Misimi A Unit of Kalajyothi

## మిసిమి ప్రచురణలు



నోబెల్ వ్యాసాలు | మిసిమి పార్థసారథి వ్యాసాలు | చిత్రకళా నీరాజనం | దూరతీరాలలో... | బహుముఖ బనారస్ | ఐరోపా శిల్ప - చిత్రకళావైభవం



పురస్కార సాహిత్యం | వ్యాస మంజూష | సారస్వత వ్యాసాలు | చార్లీ చాప్లిన్ | రజ్జు సర్ప భ్రాంతి | బైరన్ | యాత్రా కథనాలు



షెల్లీ జీవిత కథ | దోసిట చినుకులు | నృత్యభారతి | పారిజాతం | సిద్ధార్థ | సప్తపర్ణి | ప్రవాస సాహిత్యం

**ప్రతులకు: మిసిమి కార్యాలయాన్ని సంప్రదించండి. ఫోన్: 994 951 6567.**

Printed & Published by **BAPANNA ALAPATI**
Printed at **Kala Jyothi Process Pvt. Ltd.,** Plot No. CFC-1&2, Survey No. 18, E-City, SEZ, General Industrial Park, Raviryal and Srinagar, Maheswaram, Ranga Reddy District, **Telangana - 501 359.**